శుక్రవారం 15-12-2023

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 16 సంచిక: 90

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | DELHI | VIJAYAWADA | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'సంక్షేమ పథకాల అమలే సర్కారు పని తీరుకు కొలమానం'




సూర్య సూపర్ సెంచరీ

చివరి టి20లో దక్షిణాఫ్రికాపై భారత్ విజయం.. సిరీస్ 1–1తో సమం - 13లో



మార్కెట్‌కు జోష్


సరికొత్త శిఖరాలకు సెన్సెక్స్, నిఫ్టీ.. ఆల్‌టైం హైకి ఇన్వెస్టర్ల సంపద - 13లో



సభలో గందరగోళం

పార్లమెంట్‌లో భద్రతా వైఫల్యంపై ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా వివరణ ఇవ్వాలని ప్రతిపక్షాలు కేంద్రాన్ని నిలదీశాయి.

వివరాలు 6లో ▸



జూలైలోనే రెక్కీ

పార్లమెంటులో పొగగొట్టాలతో కలకలం రేపిన నిందితులు.. దీని కోసం జూలైలోనే ప్రణాళిక రచించినట్లు దర్యాప్తులో వెల్లడైంది.

వివరాలు 6లో ▸



నెలసరి లీవ్ అవసరం లేదు

నెలసరి వైకల్యం కాదని.. మహిళా ఉద్యోగులకు వేతనంతో కూడిన సెలవు అవసరం లేదని కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ అన్నారు.

వివరాలు 6లో ▸



షాహీ ఈద్గాలో సర్వే

మథురలో ఉన్న షాహీ ఈద్గాలో శ్రీకృష్ణ జన్మస్థలి ఆనవాళ్ల గురించి శాస్త్రీయ సర్వే చేపట్టాలని అలహాబాద్ హైకోర్టు ఉత్తర్వులిచ్చింది.

వివరాలు 6లో ▸

ఫ్యాక్ట్‌చెక్

పేదల చదువులపై పిచ్చి ప్రేలాపనలు

- పేద విద్యార్థులకిచ్చే ట్యాబ్‌లపై విషం చిమ్మిన ఈనాడు
- పిల్లలకు ఏవేవో అపాదిస్తూ తప్పుడు కథనం
- పేద పిల్లలు ఉన్నతంగా రాణించాలన్న లక్ష్యంతో ట్యాబ్‌లు ఇస్తున్న సీఎం జగన్
- అందులో ఉండేవి పాఠ్యాంశాలు, విద్యావసరమైన కంటెంటే..
- వీటికి లాకింగ్ వ్యవస్థ, నిరంతర పర్యవేక్షణ ఉంటాయి

14 లో

పేద పిల్లల భవిష్యత్తుపై దెబ్బ కొట్టే రాతలు సహించం



- ప్రభుత్వంపై పగ ఉంటే మరో విధంగా చూపించండి
- ప్రభుత్వ విద్యార్థులకు ట్యాబ్స్ ఇవ్వొద్దని ఎవరు చెప్పారు?
- రామోజీ ఇంట్లో పిల్లలు ట్యాబ్స్, ల్యాప్‌టాప్స్ లేకుండానే చదివారా?
- విద్యా శాఖ మంత్రి బొత్స

14 లో





శ్రీకాకుళం జిల్లా మకరాపురంలో నిర్మించిన వైఎస్సార్ సుజలధారను ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్.. వైఎస్సార్ సుజలధార ప్రాజెక్టు స్వరూపాన్ని పరిశీలిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి

ఆరోగ్య ఉద్యానం..!

రూ.700 కోట్లతో ఉద్దానం ప్రాంతానికి సురక్షిత మంచి నీరు

వైఎస్సార్ సుజలధారను ప్రారంభించిన సీఎం వైఎస్ జగన్

పలాస 'వైఎస్సార్ కిడ్నీ రీసెర్చ్ ఆస్పత్రి'లో అత్యున్నత వైద్య సేవలు

ఉచితంగా మందులు, పెంచిన పింఛన్లతో కిడ్నీ బాధితులకు చేయూత

2 లో

ఇదీ జగన్‌కు ఉన్న కమిట్‌మెంట్..

ఉద్దానం కిడ్నీ సమస్యలపై గత పాలకులు తీవ్ర నిర్లక్ష్యం

పాదయాత్ర హామీని నెరవేర్చి నేడు మీ బిడ్డ మాట నిలబెట్టుకుంటున్నాడు

మంచి చేసినా ఏడుపే

పక్క రాష్ట్రంలో ఉంటూ మనపై నాన్ లోకల్స్ ఏడుపులు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్

చంద్రబాబుకు, దత్తపుత్రుడికి మాటపై నిలబడ్డ చరిత్ర లేదు

తెలంగాణలో పుట్టనందుకు నాన్ లోకల్ ప్యాకేజీ స్టార్‌కు బాధగా ఉందట.. ఆయన కంటే బర్రెలక్క ఎంతో బెటర్

2లో

శ్రీకాకుళం జిల్లా ఉద్దానం ప్రాంతంలో దశాబ్దాలుగా వేధిస్తున్న కిడ్నీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తూ సీఎం వైఎస్ జగన్ ప్రారంభించిన వైఎస్సార్ సుజలధార ప్రాజెక్టు స్వరూపమిదే..

ప్రాజెక్టు వ్యయం
రూ.700 కోట్లు

నీటి సరఫరా
హిరమండలం నుంచి ఉద్దానానికి

పైపులైన్ ఏర్పాటు చేసినది
126 కిలోమీటర్లు

లబ్ధి పొందే మండలాలు, గ్రామాలు
7 మండలాల్లో 807 గ్రామాలకు

లబ్ధి పొందే జనాభా
6.78 లక్షలు

ప్రస్తుతం నీటి సరఫరా
613 గ్రామాలకు
(ఈ నెలాఖరుకల్లా మిగతా గ్రామాలకు)

ఒక్కొక్కరికి రోజుకు వంద లీటర్ల చొప్పున ఉచితంగా తాగునీరు

తెలంగాణ స్పీకర్‌గా ఎన్నికైన ప్రసాద్‌ను అభినందిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి



తెలంగాణ స్పీకర్‌గా గడ్డం ప్రసాద్‌కుమార్

- ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించిన ప్రొటెం స్పీకర్ అక్బరుద్దీన్ ఒవైసీ
- గడ్డంను స్పీకర్ స్థానంలో కూర్చోబెట్టిన సీఎం, డిప్యూటీ సీఎం, ప్రతిపక్ష సభ్యులు
- బీఆర్ఎస్, ఎంఐఎం, సీపీఐ సభ్యులకు సీఎం ధన్యవాదాలు

5 లో

ఇంటర్, పది పరీక్షల షెడ్యూల్ విడుదల

మార్చి 1 నుంచి 20 వరకు ఇంటర్ పరీక్షలు

ఫిబ్రవరి 5 నుంచి 20 వరకు ప్రాక్టికల్స్ నిర్వహణ

మార్చి 18 నుంచి 30 వరకు పదో తరగతి పరీక్షలు

పదిలో 6.20 లక్షల మంది, ఇంటర్‌లో 10 లక్షల మంది విద్యార్థులు



సాక్షి, అమరావతి: ఇంటర్మీడియెట్, పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు షెడ్యూల్ విడుదలైంది. మార్చి ఒకటి నుంచి 20వ తేదీ వరకు ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సర పరీక్షలు.. మార్చి 18 నుంచి 30 వరకు పదో తరగతి పరీక్షలు నిర్వహించనున్నట్టు విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ప్రకటించారు. గురువారం విజయవాడలోని సమగ్ర శిక్ష రాష్ట్ర కార్యాలయంలో పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్, కమిషనర్ సురేష్ కుమార్, ఇంటర్మీడియెట్ కార్యదర్శి సౌరభ్ గౌర్‌తో కలిసి మంత్రి వివరాలు వెల్లడించారు. ఈ ఏడాది ఇంటర్మీడియెట్ రెండేళ్లలోను దాదాపు 10 లక్షల మంది విద్యార్థులు ఉన్నారని, పదో తరగతిలో 6.20 లక్షల మంది విద్యార్థులు మొత్తం 16.20 లక్షల మంది

మిగతా 10వ పేజీలో ▶

నాడు 'సేవామిత్ర'.. నేడు 'మై టీడీపీ'..

ఓట్ల నమోదుకు యాప్‌లతో తెలుగుదేశం అడ్డదారులు

ఓట్ల గల్లంతు, దొంగ ఓట్లు చేర్చే ప్రక్రియకు చంద్రబాబు బీజం

ఓటరు కులమేమిటని అడగడం పీపుల్స్ రిప్రెజెంటేషన్ యాక్ట్‌కు విరుద్ధం

ఓటరు పొలిటికల్ ప్రిఫరెన్స్ ఏమిటని అడిగే హక్కు ఆయనకెవరిచ్చారు?

టీడీపీ అక్రమాలు, ఓటర్ ప్రొఫైల్ సర్వే పేరిట అభ్యంతరకర ప్రశ్నలపై సీఈసీకి ఫిర్యాదు ఇచ్చాం.. తెలంగాణలో ఓటువేసి మంగళగిరిలో దరఖాస్తు చేసుకున్న పవన్ సోదరుడు నాగబాబు, కుటుంబ సభ్యులు

మీడియాతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి



మీడియాతో మాట్లాడుతున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: ఏపీలో ఓటర్ల జాబితా అవకతవకలకు టీడీపీ చేపట్టిన పలు కార్యక్రమాలను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర ఎన్నికల సంఘం దృష్టికి తీసికెళ్లింది. అప్పట్లో సేవామిత్ర, ఇప్పుడు మై టీడీపీ యాప్‌లతో దొంగ ఓట్లు చేర్చడం, ఓట్ల గల్లంతుకు ఆ పార్టీ పాల్పడుతోందని ఆరోపించింది. ఓటర్లను కులం పేరు చెప్పాలంటూ ప్రజాప్రాతినిధ్య చట్టానికి విరుద్ధంగా ఆ పార్టీ పనిచేస్తోందని ఫిర్యాదు చేసింది. మై పార్టీ డ్యాష్ బోర్డు డాట్ కాం పేరుతో

మిగతా 5వ పేజీలో ▶



ఏపీలో 40% పెరిగిన ఉపాధి అవకాశాలు

- 'ఏపీలో నాలుగేళ్లలో ఉపాధి అవకాశాలు గణనీయంగా పెరిగాయి. 2019లో 4.05 లక్షల చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఉంటే 2023 నాటికి 5.61 లక్షలకు చేరాయి. తద్వారా 40 శాతం ఉపాధి అవకాశాలు పెరిగాయి. దక్షిణ భారత్‌లో వ్యాపార విస్తరణకు ఏపీ అనుకూలంగా ఉంది' అని టాలీ సొల్యూషన్ సౌత్ ఇండియన్ హెడ్ భువన్ రంజన్ చెప్పారు. గురువారం టాలీ ప్రైమ్ 4.0 సాఫ్ట్‌వేర్‌ను విశాఖలో ఆవిష్కరించారు.

- వివరాలు 10లో

ఇలాంటప్పుడు



మరోకసారి కూటమి పేరు మార్చుకుందామంటారా..?

అవ్వాతాతల పింఛను రూ.3వేలకు పెంపు

తుది ఆమోదం కోసం నేటి కేబినెట్ సమావేశం ముందుకు..

పెరిగిన పింఛను జనవరి నుంచి ఇస్తామని గతంలోనే సీఎం జగన్ ప్రకటన

ఇప్పుడు ప్రతినెలా 65.33 లక్షల మందికి రూ.1,800 కోట్లు పంపిణీ

పెంపు తర్వాత పింఛన్ల వ్యయం రూ.2 వేల కోట్లకు పెరుగుదల

చంద్రబాబు హయాంలో నెలనెలా పెట్టిన ఖర్చు రూ.400 కోట్లే..

గ్రామాల్లో ఇంటింటికీ మంచినీటి కుళాయిల ఏర్పాటు పనులు పొదుపు మహిళలకు..

మంత్రివర్గ భేటీలో చర్చ జరిగే అవకాశం



సాక్షి, అమరావతి: అవ్వాతాతలతో పాటు వితంతు, ఒంటరి మహిళ, వివిధ రకాల చేతి వృత్తిదారులకు రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు అందించనుంది. వీరికి ప్రతినెలా ఇచ్చే సామాజిక పింఛను మొత్తాన్ని రూ.2,750 నుంచి రూ.3,000కు పెంచనుంది. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనల తుది ఆమోదం ఫైలు శుక్రవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన జరగనున్న రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ముందుకు రానుంది. నిజానికి.. 2024 జనవరి నుంచి పింఛన్ మొత్తాన్ని రూ.3,000కు పెంచనున్నట్లు ముఖ్యమంత్రి నెలన్నర క్రితమే ప్రకటించిన విషయం తెలిసిందే. ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెలా పింఛన్ల పంపిణీ కోసం రూ.1,800 కోట్లకు పైగా ఖర్చుచేస్తుండగా.. జనవరి నుంచి జరిగే పెంపు అనంతరం అది దాదాపు రూ.2,000 కోట్లకు పెరిగే అవకాశముందని అధికార వర్గాలు తెలిపాయి. ఈ డిసెంబరులో రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 65,33,781 మంది

మిగతా 10వ పేజీలో ▶



20 ఏళ్లకు విముక్తి

- కన్నబిడ్డల మృతి కేసులో 20 ఏళ్ల పాటు కారాగారంలో మగ్గిన ఆస్ట్రేలియా మహిళకు ఎట్టకేలకు విముక్తి లభించింది. కాథ్లీన్ ఫాల్బిగ్‌కు జన్మించిన నలుగురు సంతానం 1989–1999 సంవత్సరాల మధ్య వివిధ కారణాలతో చనిపోయారు. వారి మరణాలకు తల్లి కాథ్లీనే కారణమంటూ పోలీసులు 2003లో హత్య కేసు నమోదు చేసి, జైలు శిక్ష విధించారు. తాజా విచారణలో ఆమెపై వచ్చిన ఆరోపణలను న్యూ సౌత్ వేల్స్ కోర్టు కొట్టివేస్తూ జైలు నుంచి విడుదల చేసింది.

- వివరాలు 6లో


సభా ప్రాంగణంలో చోటు లేకపోవడంతో బయటే వేచి ఉన్న ప్రజలు


కిడ్నీ ఆసుపత్రిలో రోగితో మాట్లాడుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి


పలు అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన శిలాఫలకాల వద్ద ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

ఆరోగ్య ఉద్యానం..!

పలాస 'వైఎస్సార్ కిడ్నీ రీసెర్చ్ ఆస్పత్రి'లో అత్యున్నత వైద్య సేవలు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్


ప్రసంగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి


శ్రీకాకుళం జిల్లా పలాసలో జరిగిన బహిరంగ సభకు హాజరైన భారీ జనసందోహంలో ఓ భాగం

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: ఉత్తరాంధ్రలో కిడ్నీ వ్యాధుల బాధితులకు అత్యున్నత ప్రమాణాలతో కూడిన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా పలాసలో కొత్తగా నెలకొల్పిన డాక్టర్ వైఎస్సార్ కిడ్నీ రీసెర్చ్ సెంటర్, 200 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి జాతీయ, అంతర్జాతీయ సంస్థలతో కలసి పని చేస్తాయని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. శ్రీకాకుళం జిల్లా ఉద్దానం ప్రాంతాన్ని దశాబ్దాలుగా వేధిస్తున్న కిడ్నీ సమస్యలకు శాశ్వత పరిష్కారాన్ని చూపిస్తూ రూ.700 కోట్లతో నిర్మించిన వైఎస్సార్ సుజలధార ప్రాజెక్టును కంచిలి మండలం మకరాంపురంలో సీఎం జగన్ గురువారం తొలుత ప్రారంభించి జాతికి అంకితం చేశారు. అనంతరం రూ.85 కోట్లతో పలాసలో నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ కిడ్నీ రీసెర్చ్ సెంటర్, 200 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని ప్రారంభించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ బాలుర వసతి గృహాన్ని వర్చ్యువల్‌గా ఆరంభించారు. నూతన పారిశ్రామికవాడ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పలాస రైల్వే గ్రౌండ్‌లో నిర్వహించిన బహిరంగ సభలో సీఎం జగన్ మాట్లాడారు.

నేను విన్నాను.. నేను చేశాను

2018 డిసెంబర్ 30న ఇదే పలాసలో పాదయాత్రలో మాటిచ్చా. నేను చూశాను.. నేను విన్నాను.. నేను ఉన్నాను అని ఆ రోజు చెప్పా. మన ప్రభుత్వం ఏర్పడ్డాక ఇక్కడే 200 పడకలతో కిడ్నీ రీసెర్చ్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని తెస్తామని చెప్పా. 2019 సెప్టెంబర్‌లో రూ.85 కోట్లతో కిడ్నీ రీసెర్చ్ సెంటర్, 200 పడకల ఆస్పత్రిని మంజూరు చేశాం. పనులకు శంకుస్థాపన చేసి ఎక్కడా ఆలస్యం లేకుండా పూర్తి చేశాం. ఉద్దానం ప్రాంతానికి సురక్షిత మంచి నీటిని తెచ్చేందుకు హిర మండలం రిజర్వాయర్ నుంచి పైపులైన్లు వేసి ఇంటింటికి తాగునీరు అందించేందుకు 2020 సెప్టెంబర్‌లో సుజలధార పథకం మంజూరు చేశాం. ఈ రెండు పథకాలు ఈ రోజు పూర్తి చేసి జిల్లా ప్రజలకు అంకితం చేస్తూ మీ బిడ్డ మీ కళ్ల ఎదుట నిలబడ్డాడు.

ఫిబ్రవరిలో కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్

కిడ్నీ వ్యాధిగ్రస్తులకు అత్యున్నత ప్రమాణాలతో వైద్య సేవలు అందించేలా జాతీయ, అంతర్జాతీయ సంస్థలతో కలిసి ఇక్కడి కిడ్నీ రీసెర్చ్, సూపర్ స్పెషాలటీ ఆస్పత్రి పని చేస్తుంది. ఈ ఆస్పత్రిలో డయాలసిస్ బెడ్లు, నెఫ్రాలజీ, యూరాలజీ విభాగంలో ఐసీయూ బెడ్లు కూడా అందుబాటులోకి వచ్చాయి. కాసేపటి క్రితం హెల్త్ సెక్రటరీ కృష్ణబాబుతో మాట్లాడా. ఈ ఫిబ్రవరిలోనే ఇక్కడ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ (మూత్రపిండాల మార్పిడి చికిత్స) కూడా చేసి కిడ్నీ రీసెర్చ్ హాస్పిటల్ ఎంత గొప్పగా పనిచేస్తోందో రాష్ట్రానికి, దేశానికి చూపించాలని చెప్పా. కచ్చితంగా ఈ ఫిబ్రవరిలో కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ కార్యక్రమం జరుగుతుంది.

మన ప్రాంతంలోనే బ్రహ్మాండమైన వైద్యం

ఆస్పత్రిలో క్యాజువాలిటీ బ్లాక్, సెంట్రల్ ల్యాబ్ ఉంది. రేడియో డయోగ్నోసిస్, ఓటీ కాంప్లెక్స్, నెఫ్రాలజీ డయాలసిస్, యూరాలజీ వార్డులతో పాటు రీసెర్చ్ ల్యాబ్‌లు కూడా అందుబాటులో ఉన్నాయి. అత్యాధునిక సీటీ స్కాన్, డిజిటల్ ఎక్స్‌రే, యూరాలజీకి అవసరమైన హోల్మియం లేజర్, యూరో డైనమిక్ మిషన్ లాంటి నదుపాయాలన్నీ ఆస్పత్రిలో అందుబాటులో ఉన్నాయి. ఎక్కడికో పరుగెత్తాల్సిన అవసరం లేకుండా మన ప్రాంతంలోనే బ్రహ్మాండమైన వైద్యం అందుబాటులోకి వచ్చే పరిస్థితి ఈ రోజు పలాసలో ఉంది. ఇదే కిడ్నీ ఆస్పత్రిలో 42 మంది వైద్యులు, 154 మంది పారామెడికల్ సిబ్బందితో పాటు సెక్యూరిటీ, శానిటేషన్, పెస్ట్ కంట్రోల్ పోస్టుల్లో మరో 220 మంది పని చేస్తున్నారు. మొత్తంగా 375 మంది సేవలందించేందుకు ఈ రోజుమీ అందరికీ అందుబాటులో ఉన్నారు.

7 మండలాల్లో స్క్రీనింగ్

ఉద్దానం ప్రాంతంలో ప్రాథమిక దశలోనే వ్యాధిని గుర్తించగలిగితే వెంటనే మెరుగైన వైద్యం పేద ప్రజలకు అందించగలుగుతామనే తపన, తాపత్రయంతో కిడ్నీ ప్రభావిత మండలాల్లో స్క్రీనింగ్ కార్యక్రమం ఇప్పటికే చేపట్టాం. ఇచ్ఛాపురం, కవిటి, సోంపేట, కంచిలి, మందస, వజ్రపుకొత్తూరు, పలాసలో క్రమం తప్పకుండా స్క్రీనింగ్ చేయిస్తున్నాం. 25 ఏళ్ల పైబడిన వారిలో 2,32,898 మందిని స్క్రీనింగ్ చేయగా 19,532 మందికి సాధారణం కంటే సీరం క్రియాటిన్ స్థాయి ఎక్కువగా ఉన్నట్లు తేలింది. వీరిని గుర్తించి వైద్యం అందిస్తున్నాం. ఉద్దానంలో 10 పీహెచ్‌సీలు, 5 అర్బన్ పీహెచ్‌సీలు, 6 కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో సెమీ ఆటో ఎనలైజర్లు అందుబాటులోకి తెచ్చాం.

> ఉద్యానవనం లాంటి ఉద్దానం ప్రాంతంలో కిడ్నీ సమస్యలున్నాయని తెలిసినా గత పాలకులు పట్టించుకోలేదు. కనీసం ఊహల్లో కూడా సాహసించలేదు. మీ బిడ్డ అధికారంలోకి వచ్చాక చేసి చూపించాడు. కిడ్నీ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం రూ.700 కోట్లతో 'వైఎస్సార్ సుజల ధార' ప్రాజెక్టును నిర్మించాడు. కిడ్నీ వ్యాధిపై పరిశోధనలు, వ్యాధి నయం చేయడానికి రూ.85 కోట్లతో 'వైఎస్సార్ కిడ్నీ రీసెర్చ్ హాస్పిటల్'ను నెలకొల్పాడు. దేవుడి దయతో ఇవాళ ఆ రెండు మంచి కార్యక్రమాలను ప్రారంభించి జాతికి అంకితం చేస్తున్నాం. అంబేడ్కర్ యూనివర్సిటీ హాస్టల్ భవనాన్ని ప్రారంభించడంతోపాటు ఇండస్ట్రియల్ పార్కుకు కూడా శంకుస్థాపన చేస్తున్నాం.
>
> – పలాస బహిరంగ సభలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్

ఉచితంగా 37 రకాల మందులు

కిడ్నీ వ్యాధుల చికిత్స కోసం నెఫ్రాలజిస్టులు, యూరాలజిస్టులు నిర్ధారించిన 37 రకాల ఔషధాలను అన్ని పీహెచ్‌సీలలో అందుబాటులోకి తెచ్చాం. వీటిని వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లకు అనుసంధానం చేస్తున్నాం. ఈ మందులన్నీ ప్రతి పేదవాడికీ గడప ముంగిటికే ఉచితంగా ఇచ్చేందుకు శ్రీకారం చుడుతున్నాం. ఇప్పటికే కవిటి, సోంపేట, పలాస, హరిపురం కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో, టెక్కలి జిల్లా ఆస్పత్రిలో 69 డయాలసిస్ యంత్రాలను విస్తరించాం. బారువ, ఇచ్ఛాపురం, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, కంచిలి పీహెచ్‌సీలో కూడా ఏర్పాటు చేయబోతున్నాం.

రోగులకు రూ.10 వేల పెన్షన్

కిడ్నీ వ్యాధిగ్రస్తులకు రూ.2,500 మాత్రమే ఉన్న పెన్షన్‌ను మీ బిడ్డ అధికారంలోకి వచ్చిన వెంటనే ఏకంగా రూ.10 వేలకు పెంచాడు. నాన్ డయాలసిస్ పేషెంట్లు, తీవ్ర కిడ్నీ వ్యాధులతో సీకేడీ డిసీజ్‌తో బాధపడుతున్న వారిని కూడా గుర్తించి వారికి రూ.5 వేల పింఛన్ ఇచ్చేలా చేసింది మనందరి ప్రభుత్వమే. గత సర్కారు హయాంలో కిడ్నీ పేషెంట్ల కింద డయాలసిస్ చేసుకుంటున్న వారు, పింఛన్లు పొందుతున్న వారు కేవలం 3,076 మంది మాత్రమే ఉన్నారు. వారి కోసం ఖర్చు చేసింది అప్పట్లో కేవలం నెలకు రూ.76 లక్షలు. మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏకంగా 13,140 పింఛన్లు పెంచాం. నెలా నెలా ఇందుకు ఖర్చవుతున్న సొమ్ము రూ.12.54 కోట్లు. ఇలా 55 నెలలుగా ప్రతీ నెలా ఖర్చు చేస్తున్నాం.

శాశ్వత పరిష్కారం దిశగా..

ఉద్దానం ప్రాంతంలో కిడ్నీ సమస్యలకు కారణాలను అన్వేషించేందుకు కేంద్ర ప్రభుత్వ సంస్థ ఐసీఎంఆర్‌తో పాటు జార్జ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్లోబల్ హెల్త్‌తో కలిసి రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర అధ్యయనం చేపట్టింది. నాలుగు దశల అధ్యయనంలో ఇప్పటికే మూడు దశలు పూర్తయ్యాయి. ప్రపంచంలో అత్యుత్తమ వైద్యసంస్థగా పేరు పొందిన హార్వర్డ్ మెడికల్ స్కూల్‌తో పాటు నార్త్ కరోలినా యూనివర్సిటీతో కలసి పనిచేసేలా మనందరి ప్రభుత్వం ఎంవోయూ చేసుకుంటోంది. ఈ కిడ్నీ రీసెర్చ్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఒక నోడల్ సెంటర్‌గా వ్యవహరించనుంది. ప్రకాశం జిల్లా మార్కాపురంలోనూ ఇలాంటి సమస్య ఉందని గుర్తించడంతో తాగునీటికి ఉపరితల జలాలను అందించేందుకు వెలుగొండ టన్నెళ్లను పరుగెత్తించాం. మార్కాపురంలో మెడికల్ కాలేజీ, కిడ్నీ సేవల కోసం నెఫ్రాలజీ, యూరాలజీ డివిజన్ కూడా ఏర్పాటు చేశాం.

చిత్తశుద్ధితో శాశ్వత పరిష్కారం

ఉద్దానంలో ఒక్క కిడ్నీ ఆస్పత్రితోనే సరిపుచ్చకుండా సమస్య శాశ్వత పరిష్కారం కోసం ఎవరి ఊహకూ అందని విధంగా రూ.700 కోట్లు ఖర్చు చేసి మరీ హిరమండలం నుంచి పైపుల ద్వారా నీళ్లు తెచ్చి ఈ ప్రాంతానికి మంచి చేసేలా అడుగులు వేశాం. ఇదీ మీపట్ల మీ జగన్‌కు ఉన్న కమిట్‌మెంట్. ఈ కమిట్‌మెంటే గత పాలకులకు, మనకు మధ్య తేడాను తెలియచేస్తుంది. మొత్తం 807 గ్రామాలకుగానూ ఈ నెలాఖరుకల్లా ప్రతి గ్రామం పూర్తిగా కనెక్ట్ అవుతుంది. 1.98 లక్షల కుటుంబాలు, 6.78 లక్షల జనాభాకు సురక్షిత తాగునీటిని అందించే ఒక గొప్ప పథకం ఈరోజు ప్రారంభమైంది. ఈ పథకాన్ని ఫేజ్ 2 కింద ఇంకా విస్తరించబోతున్నాం. రూ.265 కోట్లతో పాతపట్నం నియోజకవర్గంలో 448 గ్రామాలకు కూడా ఈ ప్రాజెక్టు ద్వారా మేలు చేసేలా అడుగులు ముందుకు వేస్తున్నాం. దీనికి టెండర్లు, అగ్రిమెంట్లు, సర్వే పూర్తైంది. సంక్రాంతి తర్వాత ఆ పనులు మొదలుపెడతారు.



వైఎస్సార్ సుజలధార పథకంలో భాగంగా ఏర్పాటు చేసిన మోటార్లు.. వైఎస్సార్ సుజలధార పథకం ద్వారా వస్తోన్న నీటిని చూస్తోన్న సీఎం జగన్

పలాస పరవశం


సభకు వెళుతున్న సీఎం జగన్‌పై పువ్వులు జల్లుతూ స్వాగతం పలుకుతున్న ప్రజలు

వంశధార, బాహుదా, మహేంద్ర తనయ నదులు మూడు పాయలుగా ఉప్పొంగి సాగరంలో కలసినట్లుగా పలాసలో ముఖ్యమంత్రి జగన్ సభకు జనసందోహం తరలి వచ్చింది. మూడు దశాబ్దాలుగా ఉద్దానం ప్రాంత ప్రజలు మూత్రపిండాల వ్యాధులతో తీవ్ర అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. వారి చిరకాల కోరిక ఇన్నాళ్లకు ఫలించడంతో ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియచేసేందుకు పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి స్వచ్ఛందంగా పెద్ద ఎత్తున తరలివచ్చారు. సుమారు మూడు కి.మీ. పొడవున రోడ్డుకు ఇరువైపులా నిలుచుని ముఖ్యమంత్రికి స్వాగతం పలికారు. పలాస రైల్వే గ్రౌండ్స్‌లోని సభా స్థలి వద్దకు సీఎం చేరుకోగానే ప్రాంగణం ఒక్కసారిగా జగన్ రావాలి.. జగన్ కావాలి నినాదాలతో హోరెత్తింది. రైల్వే మైదానం బయట రహదారులు కిక్కిరిసిపోయాయి.

కొత్త ఆస్పత్రే ఆశా రేఖ



నేను ఆర్ఎంపీ వైద్యుడిని. 40 ఏళ్లుగా ఉద్దానంలో తిరుగుతూ వైద్య సేవలు అందిస్తున్నాను. నేనూ కిడ్నీ వ్యాధి బాధితుడినే. ఇక్కడ కిడ్నీ బాధితుల కష్టాలు స్వయానా చూశాను, అనుభవించాను కూడా. ఎందరో చనిపోయారు. ఎన్నో కుటుంబాలు చితికిపోయాయి. ఏ ప్రభుత్వమూ మమ్మల్ని పట్టించుకోలేదు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే హామీ ఇచ్చి నిలబెట్టుకున్నారు. నాకు కిడ్నీ వ్యాధి సోకి ముదిరి పోయి డయాలసిస్ వరకు వెళ్లిపోయింది. విశాఖ, శ్రీకాకుళం అంటూ ఎన్నో ప్రాంతాలు తిరిగి బతుకుపై ఆశ వదిలేసుకున్నాను. వైఎస్ జగన్ సీఎం అయ్యాక అంత దూరం వెళ్లాల్సిన పని తప్పింది. పలాసలోనే డయాలసిస్ చేస్తున్నారు. 15 రోజులుగా కొత్తగా కట్టిన ఆస్పత్రిలో డయాలసిస్ చేయించుకుంటున్నాను. ఈ ఆస్పత్రి మాబోటి వారికి ఆశా రేఖ. రూ.10 వేల పింఛన్‌తో మమ్మల్ని ఆదుకున్న సీఎం వైఎస్ జగన్ ఈ ఆస్పత్రి నిర్మాణంతో ఉద్దానంకు ఆరోగ్య ప్రదాతగా మారారు. ఆయన రుణం తీర్చుకోలేనిది.

– గేదెల రామారావు, బొడ్డపాడు, పలాస మండలం

అపర భగీరథుడు జగన్



సాధ్యం కాదన్న పనిని సాధించి, వందల కిలోమీటర్ల దూరం నుంచి ఉద్దానానికి తాగు నీరు అందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అపర భగీరథుడు. దశాబ్దాలుగా ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాల ప్రజలు కిడ్నీ వ్యాధులతో చనిపోయారు. ఇప్పటికీ నాలాంటి వందలాది మంది ఈ వ్యాధితో బాధ పడుతున్నారు. భవిష్యత్ తరాలకు భరోసా కల్పిస్తూ కోట్లాది రూపాయలు వెచ్చించి ఇంటింటికీ తాగు నీరు అందించే ఏకైక నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి. ఆయన రుణం తీర్చుకోలేనిది.

– కొడియార్పీ వాసుదేవరావు ఆచారి, కిడ్నీ బాధితుడు, బొర్డర్, ఇచ్ఛాపురం మండలం

మంచి చేసినా ఏడుపే

మూడు నెలలే..ఎల్లో క్యాన్సర్ గడ్డలు పూర్తిగా పోతాయి: సీఎం వైఎస్ జగన్

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: ఉద్దానంలో కిడ్నీ బాధితుల సమస్య ఒక్క రోజులో వచ్చింది కాదని, ఆ కష్టాలు చంద్రబాబు హయాంలోనూ ఉన్నా దశాబ్దాల పాటు ఎందుకు పట్టించుకోలేదని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలదీశారు. ఇవాళ రాష్ట్రంలో జరుగుతున్న కార్యక్రమాలపై ప్రజలందరూ ఆలోచించాలని విన్నవిస్తున్నట్లు చెప్పారు. గురువారం శ్రీకాకుళం జిల్లా పలాసలో నిర్వహించిన బహిరంగ సభలో సీఎం జగన్ మాట్లాడుతూ విపక్షాల వైఖరిపై తీవ్రంగా మండిపడ్డారు.

> **క్యాన్సర్ గడ్డలను ఎన్నికల్లో తొలగించాలి**
>
> ఉద్దానం సమస్య చంద్రబాబు హయాంలో కూడా ఉన్నా పరిష్కారం చూపలేదు సరికదా కనీసం ఆ ఆలోచన కూడా చేయలేదు. సమాజం గురించి పట్టని ఇలాంటి క్యాన్సర్ గడ్డలను ఎన్నికల్లో పూర్తిగా తొలగించండి. పక్క రాష్ట్రంలో ఉంటూ ఏడుపుతో మనపై పడుతున్న వారికి ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలి. ఈ ఏడుపులన్నింటినీ కేవలం మరో మూడు నెలలు భరించండి. మీ ఇంటికి, మీ కుటుంబానికి మంచి జరిగి ఉంటే మీ బిడ్డకు మీరే సైనికులుగా నిలబడండి. ఇలా ధైర్యంగా అడగగలిగే చిత్తశుద్ధి వాళ్లకు ఉందా?
>
> – సీఎం జగన్

నాన్ లోకల్ ప్యాకేజీ స్టార్

ఏ ఒక్కరిపైనా మానవత్వం, మమకారం లేని మనిషి ఈ చంద్రబాబు. తన సొంత నియోజకవర్గం కుప్పానికి గతంలో ఎప్పుడూ నీరిచ్చిన చరిత్రే లేదు. కుప్పానికి నీళ్లు ఇవ్వాలన్నా కూడా అది జరిగింది మీ బిడ్డ ముఖ్యమంత్రి అయిన తర్వాతనే. మరి సొంత నియోజకవర్గం, తనను ఎమ్మెల్యేగా దశాబ్దాలుగా గెలిపించిన నియోజకవర్గాన్నే పట్టించుకోని ఈ వ్యక్తికి ఉత్తరాంధ్రపై ఏం ప్రేమ ఉంటుంది? ఈ పెద్దమనిషి దత్తపుత్రుడిగా ఒక యాక్టర్‌ను పెట్టుకొని డ్రామాలు ఆడతాడు. ఆ దత్తపుత్రుడు మొన్న తెలంగాణ ఎన్నికల్లో అభ్యర్థులను నిలబెడుతూ అన్న మాటలు వింటే ఆశ్చర్యం అనిపించింది. తాను తెలంగాణలో పుట్టనందుకు తెగ బాధపడిపోతున్నానంటాడు. తన దురదృష్టం అంటాడు. ఇలాంటి వ్యక్తి, ఇలాంటి డైలాగులు కొట్టిన నాన్ లోకల్ ప్యాకేజీ స్టార్.. చంద్రబాబుకు పార్టనర్.

బర్రెలక్క బెటర్..

ఆంధ్రా పాలకులకు చుక్కలు చూపిస్తానని తెలంగాణలో డైలాగులు కొడతాడు ఈ ప్యాకేజీ స్టార్, మ్యారేజీ స్టార్. ఆంధ్ర రాష్ట్రానికి వ్యతిరేకంగా కొట్టిన ఇన్నిన్ని డైలాగులకు ఆయనకు పడిన ఓట్లు ఎన్నో తెలుసా? చివరికి ఇండిపెండెంట్‌గా నిలబడిన చెల్లెమ్మ బర్రెలక్కకు వచ్చినన్ని ఓట్లు కూడా ఈ దత్తపుత్రుడి అభ్యర్థులకు రాలేదు. డిపాజిట్లు కూడా రాలేదు.

ఏడుపులే.. ఏడుపులు

అక్కచెల్లెమ్మలను, పొదుపు సంఘాల్ని నిలువునా ముంచేసిన చంద్రబాబుకు ఇవాళ మనం పార్టీలకు అతీతంగా మంచి చేస్తుంటే ఏడుపు. 31 లక్షల ఇంటి పట్టాలు అక్కచెల్లెమ్మల చేతిలో పెడితే ఏడుపు. 22 లక్షల ఇళ్లను కట్టిస్తుంటే ఏడుపు. పేద పిల్లల బతుకులు మారాలి, వారి కుటుంబాల బతుకులు మారాలని తపిస్తూ పేద పిల్లలు వెళ్తున్న గవర్నమెంట్ బడుల్లో ఇంగ్లీషు మీడియం చదువులు తీసుకొస్తే ఏడుపు. గోరుముద్ద, నాడు–నేడు కార్యక్రమాలు గవర్నమెంట్ బడుల్లో పెడితే ఏడుపు. 6వ తరగతి, ఆపై తరగతుల పిల్లలకు, ప్రతి క్లాస్ రూమ్‌ను డిజిటలైజ్ చేస్తూ ఐఎఫ్‌పీ ప్యానల్స్ తెస్తే ఏడుపు. 8వ తరగతి పిల్లలకు ట్యాబ్స్ ఇస్తే కూడా ఏడుపు. ఏకంగా 35 లక్షల ఎకరాలు హక్కులేని భూములకు, అసైన్డ్ భూముల మీద పేదవాడికి సర్వ హక్కులు మీ బిడ్డ కల్పిస్తే ఏడుపు. 99 శాతం హామీలను నెరవేరుస్తుంటే ఏడుపు. లంచాలు, వివక్ష లేకుండా మీ బిడ్డ బటన్ నొక్కి నేరుగా రూ.2.40 లక్షల కోట్లు జమ చేస్తుంటే ఏడుపు. మరో 1.70 లక్షల కోట్లు నాన్ డీబీటీగా పేదలకు ఇస్తున్నా కూడా ఏడుపే ఏడుపు.

పాల్గొన్న మంత్రులు, ప్రజాప్రతినిధులు

స్పీకర్ తమ్మినేని సీతారాం, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, మంత్రులు ధర్మాన ప్రసాదరావు, విడదల రజని, సీదిరి అప్పలరాజు, ఎమ్మెల్సీలు పాలవలస విక్రాంత్, వరుదు కళ్యాణి, నర్తు రామారావు, దువ్వాడ శ్రీనివాస్, ఎమ్మెల్యేలు ధర్మాన కృష్ణదాస్, రెడ్డి శాంతి, గొర్లె కిరణ్‌కుమార్, కంబాల జోగులు, విశ్వాసరాయి కళావతి, జిల్లా పరిషత్ చైర్మన్లు పిరియా విజయ, మజ్జి శ్రీనివాసరావు, హెల్త్ సెక్రటరీ కృష్ణబాబు, జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, కార్పొరేషన్ చైర్మన్లు పాల్గొన్నారు.

నాన్ లోకల్స్.. ఒకటే ఏడుపులు

ప్రతిపక్షంలో ఉండి కూడా వాళ్లు ఉత్తరాంధ్రకు చేయని ద్రోహం లేదు. రాష్ట్రంలో అతిపెద్ద నగరమైన విశాఖను పరిపాలన రాజధానిగా చేస్తామని మీ బిడ్డ అంటే అడ్డుకుంటున్న దుర్మార్గం వారిది. ఉత్తరాంధ్రలో ఒక బిల్డింగ్ కట్టినా వీళ్లు ఏడుస్తారు. మీ బిడ్డ నాలుగు ఆఫీసులు పెట్టినా ఏడుస్తారు. సీఎంగా నేను ఇక్కడికి వచ్చి ఉంటానన్నా ఏడుస్తారు. ఈ ప్రాంతంలో ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు, పోర్టు వస్తుందన్నా ఏడుస్తారు. ఈ ప్రాంతంలో మెడికల్ కాలేజీలు, రీసెర్చ్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నామంటే ఏడుస్తారు. ఓ చంద్రబాబు, ఓ రామోజీరావు, దత్తపుత్రుడు, రాధాకృష్ణ, టీవీ 5 వీళ్లంతా ఒక దొంగల ముఠాగా తయారై మన మీద పడి ఏడుస్తుంటారు. వీళ్లలో ఎవరూ మన రాష్ట్రంలో ఉండరు. ఉండేది హైదరాబాద్‌లో. అలాంటి నాన్ లోకల్స్.. ముఖ్యమంత్రి ఏం చేయాలి? ఎక్కడ ఉండాలి? మన రాజధానులు ఎక్కడ ఉండాలి? అని శాసిస్తారా? ఈ నాన్ లోకల్స్ చెప్పినట్లు ఆంధ్ర రాష్ట్రంలో జరగాలట. అధికారం పోయినందుకు వీళ్లకు ఏడుపు. వారు ఏనాడూ ఇవ్వని విధంగా మనం ఇంటింటికీ పెన్షన్ ఇస్తుంటే కూడా ఏడుపు. వారి హయాంలో ఇచ్చిన వెయ్యి పింఛన్‌ను మనం రూ.2250తో ప్రారంభించి ఏకంగా రూ. 3 వేలు చేస్తుంటే ఏడుపు. దోపిడీని అరికట్టి, జన్మభూమి కమిటీలను రద్దు చేసి, ప్రతి గ్రామంలో సచివాలయ వ్యవస్థ, వలంటీర్ వ్యవస్థ తెచ్చి ప్రతి పేదవాడికీ తోడుగా ఉండి నడిపిస్తుంటే ఏడుపు. వారు ఇవ్వని విధంగా ఏకంగా మీ బిడ్డ ప్రభుత్వంలో 2.10 లక్షల శాశ్వత ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చినందుకు ఏడుపు. వారి ఐదేళ్ల పాలనలో నష్టపోయిన రైతన్నకు మీ బిడ్డ హయాంలో వైఎస్సార్ రైతు భరోసా, సున్నా వడ్డీ, ఆర్బీకే వ్యవస్థ, పగటి పూటే నాణ్యమైన ఉచిత విద్యుత్, ఉచిత బీమా, సకాలంలో ఇన్ పుట్ సబ్సిడీ.. ఇవన్నీ అందిస్తున్నందుకు ఏడుపు.

క్లుప్తంగా...

13 పీడియాట్రిషియన్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

20వ తేదీన వాక్ ఇన్ ఇంటర్వ్యూలు

సాక్షి, అమరావతి: రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ పరిధిలోని డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్(డీఈఐసీ)లలో 13 పీడియాట్రిషియన్ (పిల్లల వైద్యులు) పోస్టుల భర్తీకి గురువారం ఏపీ మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ నోటిఫికేషన్ జారీ చేసింది. కాంట్రాక్ట్ విధానంలో ఈ పోస్టులు భర్తీ చేస్తున్నట్టు బోర్డ్ మెంబర్ సెక్రటరీ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో రూ.1.40 లక్షలు, మైదాన ప్రాంతాల్లో రూ.1.10 లక్షల చొప్పున వేతనాలు ఉంటాయన్నారు. అర్హులైన వైద్యులు ఈ నెల 20వ తేదీ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విజయవాడలోని డీఎంఈ కార్యాలయంలో నిర్వహించే వాక్-ఇన్ ఇంటర్వ్యూలకు హాజరుకావాలని సూచించారు.

మరింత సమర్థంగా ప్రజాపంపిణీ వ్యవస్థ

అనివార్య కారణాలతో రేషన్ తీసుకోని వారి కోసం ప్రత్యేక పంపిణీ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ప్రజా పంపిణీ వ్యవస్థను మరింత సమర్థంగా అమలు చేయనున్నట్టు పౌరసరఫరాల శాఖ కమిషనర్ హెచ్.అరుణ్‌కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎండీయూ వాహనాల్లో వంద శాతం ఇంటింటికీ ఉచిత బియ్యం, సబ్సిడీపై కందిపప్పు, పంచదార పంపిణీ చేసేలా దృష్టి సారించామని పేర్కొన్నారు. ఎండీయూ వాహనం నిర్దేశిత ప్రాంతానికి వచ్చినప్పుడు అనివార్య కారణాలతో రేషన్ తీసుకోని లబ్ధిదారుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశామనీ, ప్రతి నెలా 17వ తేదీ మధ్యాహ్నం సంబంధిత సచివాలయం పరిధిలో ఎండీయూ వాహనాన్ని అందుబాటులో ఉంచి రేషన్ పంపిణీ చేస్తామన్నారు.

27 నుంచి ఢిల్లీలో సీఎస్‌ల సమావేశం

- సీఎస్ జవహర్‌రెడ్డితో కేంద్ర కేబినెట్ కార్యదర్శి వీడియో కాన్ఫరెన్స్

సాక్షి, అమరావతి : ఈ నెల 27 నుంచి 29 వరకూ ఢిల్లీలో 3వ జాతీయ చీఫ్ సెక్రటరీల సమావేశం జరగనుందని కేంద్ర కేబినెట్ కార్యదర్శి రాజీవ్ గౌబ వెల్లడించారు. ఈ విషయమై గురువారం ఢిల్లీ నుంచి ఆయన వివిధ రాష్ట్రాల సీఎస్‌లు, కేంద్రపాలిత ప్రాంతాల అడ్మినిస్ట్రేటర్లతో వీడియో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కేఎస్ జవహర్‌రెడ్డి తన క్యాంపు కార్యాలయం నుంచి ఈ వీడియో సమావేశంలో పాల్గొన్నారు

ఆడుదాం ఆంధ్ర రిజిస్ట్రేషన్లకు గడువు పొడిగింపు

- ఈనెల 17వ తేదీ వరకు అవకాశం
- ఇప్పటికే రిజిస్ట్రేషన్ చేసుకున్న 30.50 లక్షల మంది క్రీడాకారులు
- ప్రతి సచివాలయం పరిధిలో విజేతలకు టీషర్టుల పంపిణీ
- అనంతరం జిల్లా స్థాయి విజేతలకు స్పోర్ట్స్ డ్రెస్ కిట్లు ఇచ్చేలా ప్రణాళిక
- 9,060 క్రీడా మైదానాలను గుర్తించిన శాప్



సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా 'ఆడుదాం ఆంధ్ర' మెగా టోర్నీ నిర్వహణకు ప్రభుత్వం ఏర్పాట్లు చురుగ్గా చేస్తోంది. ఈ టోర్నీలో పాల్గొనడానికి యువత పెద్ద ఎత్తున ఆసక్తి వ్యక్తం చేస్తోంది. ఇప్పటివరకు 30.50 లక్షల మంది క్రీడాకారులు తమ వివరాలను నమోదు చేసుకున్నారు. మరో 1.36 లక్షల మందికి పైగా ప్రేక్షకులుగా నమోదయ్యారు. వీరిలో క్రీడల్లో పాల్గొనాలనే ఆసక్తి కలిగిన వారి కోసం శాప్ ప్రత్యేకంగా ఎడిట్ ఆప్షన్‌ను తీసుకొస్తోంది. అలాగే యువత నుంచి వస్తున్న విజ్ఞప్తుల మేరకు రిజిస్ట్రేషన్ల గడువును ఆదివారం వరకు పొడిగించింది.

ప్రత్యేక డ్రెస్.. డిజిటల్ స్కోరింగ్

ఈ టోర్నీని ప్రొఫెషనల్ స్థాయిలో నిర్వహిస్తున్న ప్రభుత్వం.. ప్రత్యేక డ్రెస్ కోడ్ అమలు చేస్తోంది. గ్రామ, వార్డు సచివాలయ స్థాయిలో విజేతలకు ప్రభుత్వం స్పోర్ట్స్ టీ షర్టులను పంపిణీ చేయనుంది. దాదాపు ఒక్కో సచివాలయం పరిధిలో ఐదు క్రీడాంశాల్లో(క్రికెట్, ఖోఖో, బ్యాడ్మింటన్ డబుల్స్, కబడ్డీ, వాలీబాల్)గెలిచిన 114 మంది మహిళలు, పురుషులకు 'ఆడుదాం ఆంధ్ర' లోగోతో కూడిన టీషర్టులు అందించనుంది. తొలి దశలో 17.19 లక్షల టీషర్టులను అందజేయనుంది. అనంతరం రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించిన జిల్లా స్థాయి విజేతలకు స్పోర్ట్స్ డ్రెస్ కిట్లు ఇచ్చేలా ప్రణాళిక రూపొందించింది. అలాగే సచివాలయాల పరిధిలో వలంటీర్ల సేవలను 'ఆడుదాం ఆంధ్ర' పోటీల కోసం ఉపయోగించుకోనున్నారు. జిల్లా కోచ్‌లు, పీఈటీలు, పీడీలతో పాటు వలంటీర్లకు అంపైరింగ్, డిజిటల్ స్కోరింగ్‌పై తొలి దశ శిక్షణ అందించారు. మరోసారి సాంకేతిక నిపుణులతో ప్రత్యేక యాప్‌లో స్కోరింగ్ నమోదుపై శిక్షణ ఇవ్వనున్నారు. గ్రామ, వార్డు సచివాలయం, మండల స్థాయి వరకు ఆఫ్‌లైన్‌లో స్కోర్లు నమోదు చేసి వాటిని యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. నియోజకవర్గ స్థాయిలో క్రీడాకారులు, ప్రేక్షకులు తమ మొబైల్‌లోనే స్కోర్ చూసుకునే విధంగా పోటీల సమయంలోనే ఆన్‌లైన్‌లో స్కోరింగ్ నమోదు చేస్తారు.

తొలిదశలో క్రీడాంశాల వారీగా విజేతలకు ఇచ్చే టీషర్టుల వివరాలు

క్రీడలు	టీషర్టులు
క్రికెట్	4,79,904
బ్యాడ్మింటన్	59,988
వాలీబాల్	3,59,928
కబడ్డీ	3,59,928
ఖోఖో	4,49,910

పది రోజుల పాటు వాయిదా

రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే దాదాపు 9,060 క్రీడా మైదానాలను శాప్ అధికారులు గుర్తించారు. మైదానాల్లో గడ్డి తొలగించడంతో పాటు క్రీడలకు అనువుగా మార్చే ప్రక్రియను ప్రారంభించారు. కానీ తుపాను కారణంగా పలు జిల్లాల్లోని మైదానాల్లోకి నీళ్లు చేరాయి. ప్రస్తుతం వాటిని తొలగించే పనిలో సిబ్బంది నిమగ్నమయ్యారు. దీంతో 15వ తేదీన ప్రారంభం కావాల్సిన టోర్నీని పది రోజుల పాటు వాయిదా వేశారు.

ఏపీకి జగనే ఎందుకు కావాలంటే.. వివరించే కార్యక్రమంలో భాగంగా..



తిరుపతి జిల్లా ఉస్త్రికాయలపెంటలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి



పశ్చిమగోదావరి జిల్లా తణుకు 24వ వార్డులో పార్టీ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి కారుమూరి

విశాఖ ఇండస్ ఆస్పత్రిలో భారీ అగ్నిప్రమాదం

- రెండో అంతస్తు ఆపరేషన్ థియేటర్ నుంచి మంటలు
- మండే స్వభావం గల నైట్రస్ ఆక్సైడ్ లీక్
- విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం జరిగినట్టు ప్రాథమిక అంచనా



దట్టమైన పొగలతో ఇండస్ హాస్పటల్

దాబాగార్డెన్స్(విశాఖ): జగదాంబ జంక్షన్ సమీపంలోని ఇండస్ హాస్పిటల్లో గురువారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. పోలీసులు, అగ్నిమాపక, జీవీఎంసీ సిబ్బంది చేపట్టిన ముమ్మర సహాయక చర్యలతో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. అయితే కొంతమేర ఆస్తి నష్టం వాటిల్లింది. ఆస్పత్రి రెండో అంతస్తులో ఉన్న ఆపరేషన్ థియేటర్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈ ఘటన జరిగినట్టు అధికారులు చెబుతున్నారు. మండే స్వభావం గల నైట్రస్ ఆక్సైడ్ లీక్ అయినట్టు ప్రాథమిక అంచనా వేసినట్టు ఆర్డీవో తెలిపారు. మిగిలిన అంతస్తులకు మంటలు, పొగ వ్యాపించకుండా యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టారు. విచారణ అనంతరం సీఎం జగన్‌కు నివేదిక పంపనున్నట్టు అధికారులు వెల్లడించారు. ప్రమాదం జరిగిన వెంటనే ఆస్పత్రి సిబ్బందితో పాటు పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, ఎన్డీఆర్ఎఫ్ బృందం.. చికిత్స పొందుతున్న పేషెంట్లను సమీపంలోని మెడికవర్, విజేత ఆస్పత్రులకు తరలించారు. 30 మందిని విజేత ఆస్పత్రికి, 17 మందిని మెడికవర్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. వీరిలో ఇద్దరు వెంటిలేటర్లపై ఉన్నట్టు వైద్యులు తెలిపారు. వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, మంత్రి అమర్‌నాథ్, స్థానిక ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ఆస్పత్రి వద్దకు చేరుకుని వివరాలు తెలుసుకున్నారు.

నిబంధనల ఉల్లంఘన జరిగినట్టు తేలితే కఠిన చర్యలు

ఈ ఘటనపై వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఇండస్ ఆస్పత్రిలో జరిగిన ప్రమాదం దురదృష్టకరమన్నారు. పేషెంట్లను సమీపంలోని వేర్వేరు ఆస్పత్రుల్లో జాయిన్ చేశారని, ప్రాణహాని లేదని, 20 మంది కొద్ది సేపటి కిందటే డిశ్చార్జ్ అయ్యారని తెలిపారు. కృష్ణమనాయుడు ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారన్నారు. షార్ట్ సర్క్యూట్ కారణంగానే ప్రమాదం జరిగినట్టు అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారని, సమగ్ర విచారణకు ఆదేశించినట్టు తెలిపారు. ఇండస్ ఆస్పత్రికి అన్ని అనుమతులున్నాయని యాజమాన్యం చెబుతోందని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇండస్ హాస్పటల్ ఎండీ శ్రీధర్ మాట్లాడుతూ ఆపరేషన్ థియేటర్లో విద్యుత్ సమస్య ఉందని ఉదయమే గుర్తించామని, ఇంతలోనే దట్టమైన పొగ వచ్చిందని, అయితే థియేటర్‌లో ఫైర్‌కు సంబంధించి ఏమీ ఉండవన్నారు.

ఏపీకి అత్యుత్తమ 'ఇంధన సామర్థ్య' అవార్డు

- ప్రతిష్టాత్మక నేషనల్ ఎనర్జీ కన్జర్వేషన్ అవార్డు-2023ను దక్కించుకున్న రాష్ట్రం



ముర్ము చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న కె.విజయానంద్

సాక్షి, అమరావతి: ఇంధన రంగంలో ప్రతిష్టాత్మక నేషనల్ ఎనర్జీ కన్జర్వేషన్ అవార్డు 2023ను దక్కించుకున్న ఏపీ ప్రభుత్వం దేశవ్యాప్తంగా గుర్తింపు పొందింది. వరుసగా రెండేళ్లలో రెండుసార్లు ఈ అవార్డును దక్కించుకుని ఏపీ రికార్డు సృష్టించింది. ఇంధన సామర్థ్యం, పరిరక్షణ చర్యలను ప్రోత్సహించి అమలు చేయడంతో ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎనర్జీ కన్జర్వేషన్ మిషన్ (ఏపీఎస్ఈసీఎం) స్టేట్ డిజిగ్నేటెడ్ ఏజెన్సీ సెక్టార్(గ్రూప్-2)లో మొదటి బహుమతి గెలుచుకుంది. జాతీయ ఇంధన పరిరక్షణ దినోత్సవం సందర్భంగా న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో గురువారం అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. ఏపీ ప్రభుత్వం తరపున ఇంధన శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కె.విజయానంద్, ఏపీఎస్ఈసీఎం చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బీఏవీపీ కుమారరెడ్డి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా నేషనల్ ఎనర్జీ కన్జర్వేషన్ అవార్డును అందుకున్నారు. విద్యుత్ వినియోగం ఆధారంగా రాష్ట్రాలను బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్సీ (బీఈఈ) నాలుగు గ్రూపులుగా విభజించింది. ఏపీ గ్రూప్-2లో అత్యుత్తమ పనితీరు కనబరిచిన రాష్ట్రంగా ఎంపికైంది. స్టేట్ ఎనర్జీ ఎఫిషియెన్సీ ఇండెక్స్-2023లో గతేడాది కంటే 7 శాతం అధికంగా వృద్ధితో 83.25 పాయింట్లను ఏపీ సాధించింది. 2022లో ఈ స్కోరు 77.5 పాయింట్లుగా నమోదైంది. ఇంధన శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కె.విజయానంద్ మాట్లాడుతూ..ఇంధన సామర్థ్యం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఇంధన శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిలు నిరంతర సహాయం, దిశానిర్దేశం అందించారని తెలిపారు.

విజయవాడ వ్యాగన్ వర్క్‌షాప్‌నకు జాతీయ అవార్డు



ముర్ము చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న నరేంద్ర పాటిల్, అరుణ్‌కుమార్ జైన్

రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ): కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్సీ (బీఈఈ) అవార్డుల్లో వర్క్‌షాప్ విభాగంలో విజయవాడ డివిజన్‌లోని వ్యాగన్ వర్క్‌షాప్‌నకు నేషనల్ ఎనర్జీ కన్జర్వేషన్ అవార్డు లభించింది. గురువారం న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా విజయవాడ రైల్వే డీఆర్ఎం నరేంద్ర పాటిల్, దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్‌లు ఈ అవార్డును అందుకున్నారు. ఇంధన పొదుపులో వ్యాగన్ వర్క్‌షాపులో అనుసరిస్తోన్న చర్యలకు ఈ అవార్డు ఇచ్చారు. ఎల్ఈడీ లైట్లు, బీఎల్‌డీసీ ఫ్యాన్లు వాడకం, స్టార్ రేటెడ్ విద్యుత్ ఉపకరణాలు, సౌరశక్తి వినియోగం ఫలితమే ఈ అవార్డుకు కారణమని డీఆర్ఎం చెప్పారు.

నేటి నుంచి శ్రీకాకుళంలో దుర్గమ్మ ప్రచార రథయాత్ర



ప్రచార రథానికి పూజా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న చైర్మన్ రాంబాబు

ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై ఉన్న శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల ప్రచార రథయాత్ర శుక్రవారం నుంచి శ్రీకాకుళం జిల్లాలో ప్రారంభం కానుంది. శ్రీకాకుళానికి బయలుదేరిన ప్రచార రథానికి దుర్గగుడి వద్ద దేవస్థాన చైర్మన్ కర్నాటి రాంబాబు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. 9 రోజుల పాటు శ్రీకాకుళం జిల్లాలో ఈ యాత్ర సాగుతుంది. 15న కోరుకొండ, గోకవరం, అడ్డతీగల (ఏజన్సీ ప్రాంతం), 16న పాపంపేట, జె.అన్నవరం, జడ్డంగి(ఏజన్సీ ప్రాంతం),17న ఏటీ కాలనీ, బుట్టా వారి వీధి, పూదేడు, 18న కొత్తవలస, చాపల ఉప్పాడ, 19న తాళ్ళవలస, చీపురుపల్లి, శ్రీకాకుళం, అరసవల్లి, 20న నరసన్నపేట, పోలాకి, రాజారాపురం, కొత్తరేవు, కొరివిపేట, గుల్లవానిపేట, ఉమ్మలాడ, పిన్నింటి పేట, సంతబొమ్మాళి, టెక్కలి, 21న పలాస, మిలియాపుట్టి, పర్లాకిమిడి, పాతపట్నం, హిరమండలం, శుభలై, కొత్తూరు, సీతంపేట, 22న పాలకొండ, ఆముదాలవలస, వీరఘట్టం, నాగూరు, 23న గిజబ, పార్వతీపురం, బొబ్బిలి, 24న గొల్లపల్లి, గజపతినగరం, విజయనగరంలో ఈ యాత్ర కొనసాగనుంది.

విశాఖ ఆర్గానిక్ మేళా ప్రారంభం



సేంద్రీయ ఉత్పత్తులను పరిశీలిస్తున్న కమిషనర్ సాయికాంత్ వర్మ

ఏయూక్యాంపస్: గో ఆధారిత ప్రకృతి సేద్యంతో తయారైన సేంద్రీయ ఉత్పత్తులు ఎంతో ఆరోగ్యకరమని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న 4వ విశాఖ ఆర్గానిక్ మేళా-2023ను ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సాయికాంత్ వర్మ మాట్లాడుతూ నేటి మానవ జీవనవిధానంలో ఆర్గానిక్ ఉత్పత్తులు ఎంతో అవసరమన్నారు. ఇంత పెద్ద ఆర్గానిక్ మేళాకు విశాఖపట్నం ఆతిథ్యం ఇవ్వడం, నగర ప్రజలకు ఆర్గానిక్ ఉత్పత్తులను చేరువ చేయడం మంచి పరిణామమన్నారు. కాగా, ఈ నెల 17వ తేదీ వరకు ఆర్గానిక్ మేళా కొనసాగుతుంది. మొత్తం 160 స్టాల్స్‌లో రైతులు పండించిన పంటలు, కుటీర పరిశ్రమదారులు సేంద్రీయ ఉత్పత్తులతో తయారు చేసిన ఆహార ఉత్పత్తులు, తేనె, నెయ్యి, బెల్లం, సహజ రంగులు అద్దిన చేనేత వస్త్రాలు, మొక్కలు వంటివి విక్రయానికి ఉంచారు. గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం, రైతు సాధికార సంస్థ సంయుక్తంగా ఈ మేళాను నిర్వహిస్తున్నాయి. మాజీ ఎమ్మెల్సీ పీవీఎస్ మాధవ్, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణరాజు, విద్యా భారతి జాతీయ అధ్యక్షుడు దూసి రామకృష్ణ, విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ పేరి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'శ్రీవాణి'తో 3,615 ఆలయాల నిర్మాణం

టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి వెల్లడి

తిరుపతి (అలిపిరి): టీటీడీ ఆధ్వర్యంలోని శ్రీ వేంకటేశ్వర ఆలయ నిర్మాణ ట్రస్ట్ (శ్రీవాణి) ద్వారా 3,615 ఆలయాల నిర్మాణం, పలు ఆలయాల జీర్ణోద్ధరణ చేపట్టినట్లు టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి తెలిపారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో గురువారం ఆలయాల నిర్మాణంపై ఈవో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ శ్రీవాణి ట్రస్ట్ ద్వారా ఇప్పటివరకు 1,500 ఆలయాల నిర్మాణాలు పూర్తయ్యాయని..మిగిలినవి 2024 మార్చి లోపు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో ప్రజలు కమిటీలుగా ఏర్పడి దరఖాస్తు చేసుకుంటే ఆలయాల నిర్మాణానికి ఆర్థిక సాయం అందిస్తామన్నారు. సమరసత సేవా ఫౌండేషన్‌కుఁ మరికొన్ని ఆలయాల నిర్మాణ బాధ్యతలు అప్పగించే ఆలోచన ఉందన్నారు. సమరసత సేవా ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు విష్ణు మాట్లాడుతూ.. శ్రీవాణి నిధులతో ఎస్సీ, ఎస్టీ, కాలనీలు, కొండ, సముద్రతీర ప్రాంతాల్లో నిర్మించిన ఆలయాల్లో 3 చార్టెడ్ అకౌంటెంట్ సంస్థల ద్వారా సామాజిక తనిఖీ చేశామని తెలిపారు. ఇందులో ఆలయాల నిర్వహణ చక్కగా జరుగుతోందని, గ్రామాల్లో విభేదాలను పక్కనపెట్టి ప్రజలు కలిసిమెలిసి ఆలయాల్లో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడైందన్నారు. నూతన ఆలయాలు, జీర్ణోద్ధరణ చేపట్టిన ఆలయాల్లో ధూపదీప నైవేద్యాలకు శ్రీవాణి ట్రస్ట్ నుంచి ప్రతి నెలా రూ.5 వేలు సాయం అందిస్తున్నట్లు చెప్పారు. సమరసత సేవా ఫౌండేషన్ రాష్ట్ర కార్యదర్శి త్రినాథ్, టీటీడీ జే ఈవోలు సదా భార్గవి, వీరబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో 'దిశ' డీఎస్పీ మృతి

- నిద్రలోనే ప్రాణాలు విడిచిన వెంకట నాగ వరప్రసాద్
- నివాళులర్పించిన శ్రీసత్యసాయి జిల్లా పోలీస్ అధికారులు



పుట్టపర్తి టౌన్ : శ్రీసత్యసాయి జిల్లా 'దిశ' డీఎస్పీ వెంకట నాగ వరప్రసాద్(60) బుధవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. ఏడు నెలల క్రితం బదిలీపై ఇక్కడికి వచ్చిన ఆయన పట్టణంలోని మూడో క్రాస్‌లోని శ్రీసాయి ప్లాజా అపార్టుమెంట్‌లో ఒంటరిగా నివాసం ఉండేవారు. రోజూ తెల్లవారుజామున 5 గంటలకే లేచి జాగింగ్‌కు వెళ్లే డీఎస్పీ.. గురువారం ఉదయం 6 గంటలు దాటినా తలుపు తీయకపోవడంతో రూమ్ బాయ్‌కి అనుమానం వచ్చింది. వెంటనే అతను అపార్ట్‌మెంట్ యజమానికి తెలపడంతో ఆయన పుట్టపర్తి అర్బన్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ వీరేష్‌కు సమాచారం ఇచ్చారు. అనంతరం అంతా కలిసి డీఎస్పీ ఉంటున్న గది తలుపు బద్దలుకొట్టి చూడగా పడకపై విగతజీవిగా కనిపించారు. నిద్రలోనే గుండెపోటుతో కన్నుమూసినట్లు తెలుస్తోంది. మృతుడికి భార్య స్వర్ణలతతోపాటు కుమారుడు సూర్యతేజ, కుమార్తె శివాణి ఉన్నారు. 1991లో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పోలీసు శాఖలో చేరిన వెంకటనాగ వరప్రసాద్ అంచెలంచెలుగా ఎదిగారు. కాగా, డీఎస్పీ మృతికి శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ మాధవరెడ్డి, అడిషనల్ ఎస్పీ విష్ణు, సీఐలు కొండారెడ్డి, రవీంద్రారెడ్డి, జిల్లా పోలీసు కార్యాలయ సిబ్బంది నివాళులర్పించారు. మృతదేహాన్ని పెనుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబీకులకు అప్పగించగా, వారు స్వగ్రామానికి తీసుకెళ్లారు.

జారిపోయిన స్టంట్‌ను బయటకు తీసిన వైద్యులు

గుంటూరు జీజీహెచ్‌లో ఆరోగ్యశ్రీ ద్వారా యువకుడికి సర్జరీ



చింతయ్యతో గ్యాస్ట్రో ఎంటరాలజీ వైద్యులు తొలగించిన స్టంట్ (ఇన్‌సెట్‌లో)

గుంటూరు మెడికల్: ఐదేళ్లుగా తీవ్ర కడుపు నొప్పితో బాధపడుతోన్న వ్యక్తికి గుంటూరు జీజీహెచ్ వైద్యులు ఎలాంటి కోత, కుట్లు లేకుండా అత్యాధునిక వైద్య పరికరంతో నొప్పి లేకుండా సర్జరీ నిర్వహించారు. ఉమ్మడి కృష్ణా జిల్లా ఉయ్యూరుకు చెందిన చింతయ్య(23)కు ఐదేళ్ల క్రితం క్రానిక్ పాంక్రియాటిస్ సమస్య రాగా, హైదరాబాద్‌లో ఆపరేషన్ చేయించుకున్నాడు. అందులో భాగంగా పాంక్రియాస్ నాళంలో స్టంట్ వేశారు. స్టంట్ వేసిన 6 నెలల్లోగా దానిని తొలగించాల్సి ఉంది. యువకుడు ఆర్థికస్థితి వల్ల దాన్ని తొలగించుకోలేదు. దీంతో స్టంట్ నాళంలోకి జారిపోయి తీవ్రమైన కడుపు నొప్పితో బాధపడుతూ ఈ నెల 12న గుంటూరు జీజీహెచ్‌కు వచ్చాడు. గ్యాస్ట్రో ఎంటరాలజీ హెడ్ డాక్టర్ అనుమల కవిత, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ షేక్ నాగూర్‌బాషాలు యువకుడిని పరీక్షించి తక్షణమే స్టంట్‌ను బయటకు తియ్యాలని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం జీజీహెచ్‌కు అత్యాధునిక ఎండోస్కోపిక్ వైద్య పరికరాన్ని అందజేసింది. ఆ పరికరం ద్వారా గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులు ఈనెల 13న స్టంట్‌ను విజయవంతంగా తొలగించారు. రూ.2 లక్షల విలువైన ఈ ఆపరేషన్‌ను ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా చేశారు. ఆపరేషన్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శివరామకృష్ణ, పీజీ వైద్యుడు డాక్టర్ అనిల్, మత్తు వైద్యులు నికోలస్, పోలయ్య, విష్ణు మహేష్ పాల్గొన్నారు. అత్యంత క్లిష్టమైన సమస్యను ఆపరేషన్ లేకుండా విజయవంతంగా నయం చేసిన గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ అభినందించారు.

స్కూల్ గేమ్స్ అండర్-19 హాకీ పోటీలు ప్రారంభం



హోరాహోరీగా జరుగుతున్న హాకీ మ్యాచ్

నక్కపల్లి (అనకాపల్లి జిల్లా): ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 67వ రాష్ట్ర స్థాయి అండర్-19 హాకీ పోటీలు గురువారం అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో ప్రారంభమయ్యాయి. ఈ పోటీలకు ఉమ్మడి విశాఖ, తూర్పు గోదావరి, విజయనగరం, కృష్ణా, కర్నూలు, వైఎస్సార్ కడప, గుంటూరు, నెల్లూరు, ప్రకాశం, అనంతపురం తదితర జిల్లాల నుంచి సుమారు 600 మంది క్రీడాకారులు హాజరయ్యారు. రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్, విశాఖ దక్షిణ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వీసం రామకృష్ణ ఈ పోటీలను ప్రారంభించగా, మూడు రోజులపాటు బాలబాలికలకు వేర్వేరుగా పోటీలు నిర్వహిస్తారు. తొలిరోజు పోటీల్లో బాలుర విభాగంలో విజయనగరం జట్టుపై ప్రకాశం, పశ్చిమ గోదావరి జట్టుపై చిత్తూరు, శ్రీకాకుళం జట్టుపై అనంతపురం జట్లు గెలుపొందాయి. కర్నూలు, కృష్ణా జిల్లాల జట్ల మధ్య మ్యాచ్ 2-2 గోల్స్‌తో డ్రాగా ముగిసింది. తూర్పు గోదావరి, గుంటూరు జట్ల మధ్య మ్యాచ్ కూడా 2-2తో డ్రాగా ముగిసింది. అనంతపురం, విశాఖపట్నం జట్ల మధ్య మ్యాచ్ 1-1తో డ్రా అయ్యింది. బాలికల విభాగంలో అనంతపురం జట్టుపై చిత్తూరు జట్టు విజయం సాధించింది.

'కాశీ తమిళ సంగమం'కు ప్రత్యేక రైళ్లు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ఈనెల 15 నుంచి జనవరి 2 వరకు కాశీలో జరిగే 'కాశీ తమిళ సంగమం' మహోత్సవాల్లో పాల్గొనే ప్రయాణికుల కోసం 14 ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు రైల్వే అధికారులు ప్రకటించారు. తమిళనాడు-వారణాసిల మధ్య విజయవాడ మీదుగా 06101, 06102, 06103, 06104, 06105, 06106, 06107, 06108, 06109, 06110, 06111, 06112, 06113, 06114 నంబర్లతో నడుస్తాయని పేర్కొన్నారు.

బాడ్మింటన్ చాంపియన్లు కేరళ, పంజాబ్



బాడ్మింటన్ బాలికల టీమ్ చాంపియన్‌షిప్ అందుకుంటున్న పంజాబ్ జట్టు

విజయవాడ స్పోర్ట్స్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ 67వ జాతీయ అండర్-19 బాడ్మింటన్ బాలుర టీమ్ చాంపియన్‌షిప్‌ను కేరళ, బాలికల టీమ్ చాంపియన్‌షిప్‌ను పంజాబ్ జట్లు దక్కించుకున్నాయి. విజయవాడలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో మూడు రోజులపాటు పోటీలు జరిగాయి. బాల బాలికల విభాగాల్లో సెమీ ఫైనల్, ఫైనల్ మ్యాచ్‌లు గురువారం హోరాహోరీగా సాగాయి. బాలుర సెమీ ఫైనల్స్‌లో కేరళ జట్టు 2-0 తేడాతో మహారాష్ట్రను ఓడించి ఫైనల్‌కు చేరగా.. చండీగఢ్ 2-0 తేడాతో ఆంధ్రప్రదేశ్‌ను ఓడించి ఫైనల్‌కు చేరింది. ఫైనల్స్‌లో చండీగఢ్‌ను 2-0తో ఓడించిన కేరళ జట్టు చాంపియన్‌షిప్‌ను కైవశం చేసుకుంది. రన్నర్ ట్రోఫీని చండీగఢ్ అందుకోగా.. మూడో స్థానంలో మహారాష్ట్ర, నాలుగో స్థానంలో ఆంధ్రప్రదేశ్ నిలిచాయి.

బాలికల విభాగంలో..

బాలికల సెమీస్‌లో ఢిల్లీ 2-0 తేడాతో చండీగఢ్‌పై, పంజాబ్ 2-1 తేడాతో ఆంధ్రప్రదేశ్‌పై గెలిచి ఫైనల్స్‌కు చేరాయి. ఫైనల్స్‌లో ఢిల్లీపై 2-1 తేడాతో గెలిచిన పంజాబ్ ఛాంపియన్‌షిప్‌ను కైవశం చేసుకుంది. రన్నర్ ట్రోఫీని ఢిల్లీ, మూడో స్థానాన్ని చండీగఢ్, నాలుగో స్థానాన్ని ఆంధ్రప్రదేశ్ సాధించాయి. విజేతలకు సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.శ్రీనివాస్, ఏఎస్‌పీడీ బి.శ్రీనివాసులురెడ్డి, ఎస్‌జీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జి.భానుమూర్తిరాజు, టోర్నీ జాతీయ పరిశీలకులు రాజు రాణా, సిద్ధార్థ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ సీహెచ్ వెంకటేశ్వర్లు, ఎస్‌జీఎఫ్ అండర్-19 కృష్ణా జిల్లా కార్యదర్శి వి.రవికాంత ట్రోఫీలను అందజేశారు.

దుర్గమ్మకు విరాళంగా వజ్రపు నత్తు



ఈవో రామారావుకు వజ్రపు నత్తును అందజేస్తున్న దాతలు

ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మకు చెన్నైకి చెందిన భక్తులు గురువారం బంగారపు నత్తును కానుకగా సమర్పించారు. చెన్నైకి చెందిన కొనంగి చంద్రవేణుగోపాలరావు కుటుంబం అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి వచ్చింది. ఆలయ ఈవో కేఎస్ రామారావును కలిసి 10.2 గ్రాముల బంగారంతో వజ్రాలు పొదిగిన నత్తును కానుకగా సమర్పించింది. దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితులు తమ ఆశీర్వచనాన్ని, ఆలయాధికారులు అమ్మవారి చిత్రపటం ప్రసాదాలు, శేషవస్త్రాలను దాతలకు అందజేశారు.

తెలంగాణ మంత్రి దృష్టికి మా-ఏపీ ప్రతిపాదనలు

మా-ఏపీ వ్యవస్థాపకుడు దిలీప్‌రాజా

తెనాలిటౌన్: తెలంగాణ ప్రభుత్వ నూతన సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి దృష్టికి మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ తరఫున కొన్ని ప్రతిపాదనలు పంపామని మా-ఏపీ వ్యవస్థాపకుడు, సినీ దర్శకుడు దిలీప్‌రాజా తెలిపారు. గుంటూరు జిల్లా తెనాలిలోని సుల్తానాబాద్‌లోని మా ఏపీ కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. తెలంగాణలో సినిమాలు నిర్మిస్తున్న నిర్మాణ సంస్థలకు కోటి రూపాయలు సబ్సిడీ ప్రకటించాలని ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. జీఎస్టీ మినహాయింపు కూడా నిర్మాతలకు వర్తించేలా నూతన ప్రభుత్వం జీవో జారీ చేయాలని కోరామన్నారు. తెలంగాణలో అధికారికంగా ఉన్న 485, ఆంధ్రలోని 1097 థియేటర్లలో చిన్న సినిమాలను కూడా ప్రతి మాసంలో ఒక వారం రోజులు విధిగా ప్రదర్శించాలనే నిబంధనలను పరిశీలించాలని రెండు ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. సినిమాటోగ్రఫీ మంత్రిగా బాధ్యతలు చేపట్టినందుకు వెంకటరెడ్డికి అభినందనలు తెలుపుతున్నట్లు దిలీప్‌రాజా తెలిపారు.

ఈ సంపద మరియు ఈ సంతానం, కేవలం ఐహిక జీవితపు
అలంకారాలు మాత్రమే. కాని శాశ్వతంగా నిలిచేవి సత్కార్యాలే!
అవే నీ ప్రభువు దృష్టిలో ప్రతిఫలానికి ఉత్తమమైనవి.
– ఇస్లాం ధర్మం

సాక్షి
శుక్రవారం, 15 డిసెంబర్ 2023

జాతికి జవాబు కావాలి!

దేశం మొత్తాన్నీ ఉలిక్కిపడేలా చేసిన ఘటన అది. ప్రధాని సహా పార్లమెంటరీ ప్రజాప్రతినిధులందరూ సమావేశమయ్యే ప్రాంగణంలోని పెను భద్రతా వైఫల్యాలను బుధవారం టీవీల సాక్షిగా కళ్ళకు కట్టిన ఉదంతమది. 2001 నాటి చేదు జ్ఞాపకాలను ఈ దురంతం మళ్ళీ గుర్తుచేసింది. అప్పట్లో పాక్ ప్రేరేపిత తీవ్రవాదులు మన పార్లమెంట్‌పై తుపాకులతో దాడికి తెగబడితే, ఈసారి సందర్శకులుగా వచ్చిన ఇద్దరు భారతీయ సాధారణ యువకులు పదుల అడుగుల ఎత్తులోని లోక్‌సభ ప్రేక్షకుల గ్యాలరీ పై నుంచి సభాంగణంలోకి దూకి, రహస్యంగా తెచ్చిన పొగగొట్టాలతో అలజడి రేపారు. సభ వెలుపల రంగుల పొగతో మరో ఇద్దరు నిరసన పూర్వక నినాదాలు చేశారు. నలుగురినీ అరెస్ట్ చేసి, కఠినమైన 'ఉపా' చట్టం కింద కేసు పెట్టి పోలీస్ కస్టడీకి పంపారు. సూత్రధారుల కోసం గాలింపు సాగుతోంది. ప్రస్తుతానికి 8 మంది భద్రతా సిబ్బందిపై సస్పెన్షన్ వేటు వేశారు కానీ, ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలు, నేర్చుకోవాల్సిన పాఠాలు చాలా ఉన్నాయి.

ఇదేదో అప్పటికప్పుడు ఈ యువతీ యువకులు సృష్టించిన హంగామా కాదు. ఇరవై రెండేళ్ళ క్రితం పార్లమెంట్‌పై పాక్ తీవ్రవాదులు దాడి జరిపిన డిసెంబర్ 13నే... తమ దుశ్చర్యకు వారు ఎంచుకున్నారంటే ఎంత ఆలోచన, ప్రణాళిక ఉండివుంటుంది! ఒక్కపక్క అమెరికా గడ్డ మీద నుంచి హూంకరిస్తున్న ఖలిస్తానీ తీవ్రవాది గురుపత్‌వంత్ సింగ్ పన్నూ ఈ నెలాఖరులోగా పార్లమెంట్‌పై దాడి చేస్తామని చాలా రోజుల క్రితమే హెచ్చరించారు. మరోపక్క పార్లమెంట్‌పై మునుపటి దాడిలో పలువురు బలైన ఘటనకు 22వ వార్షిక సంస్మరణ దినం. ఈ నేపథ్యంలో బుధవారం పార్లమెంట్ వద్ద ఎంత పారాహుషార్‌గా ఉండాలి! అంచెలంచెల తనిఖీని దాటుకొని, ఆ నలుగురూ కాలిజోళ్ళలో పొగగొట్టాలు పెట్టుకొని, లోపలికి వచ్చారంటే మన తనిఖీ, నిఘా వ్యవస్థలు నిద్రిస్తున్నట్టేగా!

ప్రాథమిక సమాచారం మేరకు... పార్లమెంట్‌లో అలజడి రేపిన నలుగురిలో ఎవరూ తీవ్రవాదులు కారు. మధ్య, దిగువ తరగతి నిరుద్యోగులు. భగత్ సింగ్ అభిమానులంటున్న వీరంతా దేశంలోని వేర్వేరు భౌగోళిక ప్రాంతాల నుంచి ఫేస్‌బుక్ పేజీ ద్వారా ఎలా ఒక్కటయ్యారు, ఎలా ఈ నిరసన దుశ్చర్యకు దిగారన్నది ఇంకా లోతుగా ఆరా తీయాలి. ఆరు డిగ్రీలు చేసి, లెక్చరర్ ఉద్యోగానికి 'నెట్' సైతం పాసైన నిరుద్యోగ హర్యానా యువతి నీలమ్. కంప్యూటర్ ఇంజనీరైన నిరుద్యోగ మైసూరీ మధ్యవయస్కుడు మనోరంజన్. ఆర్మీలో చేరాలని ఆరాటపడి విఫలమైన కుర్రాడు అమోల్. లక్నోకు చెందిన ఇ–రిక్షా కార్మికుడు సాగర్ శర్మ. ఇలాంటి సామాన్యులు ఏ నిస్పృహలో, ఎవరి ప్రేరేపణతో చెడుదోవ పట్టి ఇంతటి దుస్సాహసానికి దిగినట్టు? వీరిని ఆడించిన అసలు నాయకుడు ఎవరు? ఇంటి దొంగలా, లేక దేశ సార్వభౌమాధికారాన్ని సవాలు చేస్తున్న విదేశీ శక్తులా?

ఏడాదిగా ఈ పథకరచన సాగుతోందట. ఈ మార్చి, జూలైల్లోనూ పార్లమెంట్‌లో భద్రతపై రెక్కీ నిర్వహించారట. ఇది దిగ్భ్రాంతికరం. ప్రజాస్వామ్య దేవాలయంలో జరిగిన దుస్సాహసంపై ప్రజాప్రతినిధులంతా ఏకమై పిడికిలి బిగించాల్సిన వేళ దురదృష్టవశాత్తూ రాజకీయాలు రేగుతున్నాయి. అధికారపార్టీ ఎంపీ నుంచి ఈ నిరసనకారులకు పాసులు జారీ కావడాన్ని ప్రతిపక్షాలు తప్పుబడుతున్నాయి. పార్లమెంట్ సహా ఢిల్లీ భద్రత మొత్తం చేతిలో ఉండే హోమ్ మంత్రి ఈ మొత్తం ఘటనపై సభలో ప్రకటన చేయాలని కోరుతున్నాయి. జవాబివ్వాల్సిన అధికార పక్షం మొండికేయడం, రచ్చ పెరగడంతో ప్రతిపక్షానికి చెందిన 14 మందిని లోక్‌సభ నుంచి, ఒకరిని రాజ్యసభ నుంచి శీతకాల సమావేశాలు ముగిసేవరకు సస్పెండ్ చేస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించడం దీనికి పరాకాష్ఠ.

సభలోనే కాదు ఢిల్లీలోనే లేని ఓ ప్రతిపక్ష ఎంపీ పేరు సైతం సస్పెండైన వారి పేర్లలో పేర్కొనడం విడ్డూరం. ఆ వాస్తవం రచ్చకెక్కేసరికి 'అది క్లరికల్ మిస్టేక్' అని సింపుల్‌గా తేల్చేస్తూ, 13మందే సస్పెండయ్యారని గురువారం పొద్దుపోయాక వివరణ నిచ్చుకోవాల్సి వచ్చింది. భద్రత విషయంలోనే కాదు... చివరకు సభా నిర్వహణలోనూ సర్కారీ నిర్లక్ష్యాన్ని ఇది చెప్పకనే చెబుతోంది. నిరసన తెలిపే ప్రతిపక్షాలను పరోక్షంగా వెక్కిరిస్తూ, వచ్చి అరెస్టయినవారు 'ఆందోళన్ జీవు'లంటూ అధికారపక్షం తేలిగ్గా ముద్ర వేస్తోంది. ఒకవేళ వచ్చింది 'ఆతంకవాదులై' ఉంటేనో? వారు పొగగొట్టాలు కాక గ్రెనేడ్లు, ఐఈడీలు తేగలిగితేనో? ఏమై ఉండేది? భీతిగొలిపే ఆలోచన అది. అందుకే సర్వోన్నత పార్లమెంట్‌లోనే సభ్యుల రక్షణను వెక్కిరిస్తున్న ఘటనను ఆరోపణలపర్వంగా మారిస్తే లాభం లేదు.

తీవ్రమైన ఈ భద్రతా వైఫల్యంపై జాతీయ భద్రతా ఏజెన్సీ సహా అత్యున్నత వ్యవస్థలతో దర్యాప్తు జరిపించాలి. సంయుక్త పార్లమెంటరీ సంఘం (జేపీసీ)తోనూ పరిస్థితిని మదుపు చేయిస్తే, భద్రతా ఏర్పాట్లను పునస్సమీక్షిస్తే సభ్యులకు భరోసా కలుగుతుంది. దుర్భేద్యమని పదేపదే చెప్పిన కొత్త పార్లమెంట్ భవనంలోనే ఇంతటి ఘటన జరిగినందున అందరూ ఒకే గేటు నుంచి రాకపోకలు సాగించడం లాంటి పద్ధతులు మార్చాలి. మెటల్ డిటెక్టర్లతో ప్లాస్టిక్‌ను గుర్తించలేనందున తనిఖీ విధానాల్ని ఆధునికీకరించి, పటిష్ఠపరచాలి. పార్లమెంటరీ సెక్యూరిటీలో నేటికీ వందకు పైగా ఉద్యోగ ఖాళీలున్నాయట. అదీ పట్టించుకోక కళ్ళు తెరిచి నిద్రపోతే నష్టం దేశానికి! అలాగే, ప్రభుత్వ గుర్తింపున్న పాత్రికేయుల్ని సైతం పార్లమెంట్‌లోకి రానివ్వని పాలకులు మహిళా రిజర్వేషన్ లాంటి కీలక బిల్లుల వేళ బస్సుల్లో జనాన్ని తరలించుకొచ్చి, గ్యాలరీ నుంచి నినాదాలిప్పిస్తున్న సంస్కృతిని విడనాడాలి. పార్లమెంట్ ప్రాంగణం ప్రజాపాలనకై తప్ప, ప్రచార ఆర్భాటానికి కాదని గుర్తించాలి. మణిపూర్ మొదలు జాతీయ భద్రత దాకా ప్రతిదానిపైనా ప్రభుత్వ జవాబు కోసం, జవాబుదారీతనం కోసం ఇంతగా పట్టుబట్టాల్సి రావడం మాత్రం ప్రజాస్వామ్యానికి వన్నె తీసుకురాదని గ్రహించాలి.

బహిష్కరణకూ ఓ పద్ధతుంది!

విశ్లేషణ



చక్షూ రాయ్

పార్లమెంట్ సభ్యురాలు మహువా మోయిత్రాను సభా సభ్యత్వం నుండి డిసెంబర్ 8న లోక్‌సభ బహిష్కరించింది. ఆమెను లోక్‌సభలో ప్రసంగించడానికి అనుమతించలేదు. ప్రతిపక్ష ఎంపీలు వాకౌట్ చేశారు. అయినా మొయిత్రాను 17వ లోక్‌సభ నుండి బహిష్కరించే తీర్మానాన్ని సభ ఆమోదించింది. ఉనికిలో లేని నీతి నియమావళితో ఆమెను దోషిగా నిర్ధారించారు. పార్లమెంటు తనను తానే నియంత్రించుకుంటుంది కాబట్టి, ఎంపికైన ప్రజా ప్రతినిధి సభ్యత్వాన్ని రద్దు చేయడం అనే తీవ్రమైన చర్యను నిందకు తావులేని ప్రక్రియ ద్వారా చేయాలి. చట్టసభలకు ఎన్నికైన ప్రతినిధుల దుష్ప్రవర్తన, నైతిక ఉల్లంఘనల ప్రశ్నలను ఎదుర్కోవటానికి రెండు ప్రజాస్వామ్య దేశాలైన అమెరికా, బ్రిటన్ ఉదాహరణలు మనకు ఉన్నాయి.

మహువా మొయిత్రాను బహిష్కరించే తీర్మానాన్ని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషీ ప్రవేశపెట్టారు. మొయిత్రా ప్రవర్తన (ఆమె తన పార్లమెంటరీ లాగిన్ వివరాలను పంచుకోవడం, వ్యాపారవేత్త దర్శన్ హీరానందానీ నుండి నగదును, సౌకర్యాలను స్వీకరించడం) పార్లమెంట్ సభ్యురాలికి తగదని ఆ తీర్మానం పేర్కొంది. బహిష్కరణ ప్రక్రియను వెంటాడి వేధించడంగా అభివర్ణించారు మొయిత్రా. తనపై ఆరోపణకు సంబంధించి డబ్బు మార్పిడికి ఎలాంటి రుజువు లేదనీ, నైతిక కమిటీలో తనకు వ్యతిరేకంగా ఉన్న సాక్ష్యం ప్రేరేపితమైనదనీ, ఇది వైరుధ్యపూరితంగా ఉందనీ అన్నారు. తనపై నిందమోపిన వారిని ఎదురు ప్రశ్నించడానికి ఆమెను అనుమతించలేదు.

మన పార్లమెంట్ పనితీరుకు సంబంధించినంత వరకు ఈ మొత్తం అధ్యాయం వివాదాస్పదమైంది. రాజకీయాలు, వ్యక్తిత్వం ఈ ప్రక్రియను కప్పివేశాయి. పార్లమెంట్ తన వ్యవహారాల నిర్వహణకు సొంత నిబంధనలను రూపొందించుకునే అధికారాన్ని మన రాజ్యాంగం ఇచ్చింది. దుష్ప్రవర్తన కారణంగా దాని సభ్యులను బహిష్కరించే అధికారం దీని పర్యవసానమే. పార్లమెంటు తనను తానే నియంత్రించుకుంటుంది కాబట్టి, ఎంపికైన ప్రజా ప్రతినిధి సభ్యత్వాన్ని రద్దుచేయడం అనే తీవ్రమైన చర్యను నిందకు తావులేని ప్రక్రియ ద్వారా చేయాలి.

చట్టసభలకు ఎన్నికైన ప్రతినిధుల దుష్ప్రవర్తన, నైతిక ఉల్లంఘనల ప్రశ్నలను ఎదుర్కోవటానికి రెండు ప్రజాస్వామ్య దేశాలైన అమెరికా, బ్రిటన్‌ల ఉదాహరణలు మనకు ఉన్నాయి. అమెరికన్ కాంగ్రెస్‌తో మొదలుపెడదాం: డిసెంబర్ 1న అమెరికా ప్రతినిధుల సభ, న్యూయార్క్ రిపబ్లికన్ గెరోజ్ శాంటోస్‌ను తన సభ్యత్వం నుండి బహిష్కరించింది. ఎన్నికల ప్రచారంలో వంచన, ఆర్థికపరమైన అవకతవకలు, ఉల్లంఘనలు, లైంగిక దుష్ప్రవర్తన ఆరోపణలపై సుమారు తొమ్మిది నెలల విచారణ తర్వాత ఈ బహిష్కరణ ఆదేశం వచ్చింది.

రిపబ్లికన్ పార్టీ ప్రతినిధిపై వచ్చిన ఫిర్యాదులను రెండు వేర్వేరు కార్యాలయాలు పరిశీలించాయి. ఒకటి... కాంగ్రెషనల్ ఎథిక్స్ కార్యాలయం (ఓసీఈ). నైతిక చట్టంలో నైపుణ్యం కలిగిన న్యాయవాదులు, పరిశోధకులతో కూడిన స్వతంత్ర, పక్షపాతం లేని ఈ సంస్థను 2008లో స్థాపించారు. ఇది హౌస్ సభ్యులపై, కాంగ్రెస్ సిబ్బందిపై ఫిర్యాదులను స్వీకరిస్తుంది, పునఃపరిశీలిస్తుంది. ఒక వివరణాత్మక పరీక్ష తర్వాత, ఇది తన సిఫార్సును ఎథిక్స్ కమిటీకి పంపుతుంది. ఇది స్వీకరించే ఫిర్యాదులు, వాటిపై తీసుకునే చర్యల గురించి వివరణాత్మక గణాంకాలను కూడా ప్రచురిస్తుంది.

శాంటోస్‌పై వచ్చిన ఫిర్యాదులను పరిశీలించిన రెండో కార్యాలయం హౌస్ ఎథిక్స్ కమిటీ. ఇది ఇతర సభ్యుల నుండి ఫిర్యాదులను స్వీకరించింది. 'ఓసీఈ' నుండి సూచనను, శాంటోస్ వ్యవహారాన్ని



విచారించిన ప్రతినిధుల సభ నుండి తీర్మానాన్ని హౌస్ ఎథిక్స్ కమిటీ పరిశీలించి ఒక పరిశోధనాత్మక సబ్ కమిటీని నియమించింది. ఇది 40 మంది సాక్షులను ఇంటర్వ్యూ చేసింది. 72,000 పేజీల పత్రాలను అందుకుంది. సబ్‌కమిటీకి తన వివరణను ఇవ్వడానికి ఎథిక్స్ కమిటీ శాంటోస్‌నూ అనుమతించింది. కాని దాన్ని ఆయన తిరస్కరించారు.

శాంటోస్ 'తన వ్యక్తిగత ఆర్థిక లాభం కోసం, ప్రతినిధుల సభకు తన అభ్యర్థిత్వంలోని ప్రతి అంశాన్నీ మోసపూరితంగా ఉపయోగించుకోవాలని చూసినట్లు' పరిశోధనాత్మక కమిటీ కనుగొంది. ఎథిక్స్ కమిటీ నివేదికలోని బహిష్కరణ ప్రతిపాదనను ప్రతినిధుల సభ పరిగణనలోకి తీసుకుంది. కాంగ్రెస్ సభ్యుడిని తొలగించడానికి అమెరికా రాజ్యాంగం ఒక భారీ అడ్డంకిని ఉంచింది. అలాంటి తొలగింపు ప్రతిపాదనకు సంబంధిత సభలోని మూడింట రెండొంతుల మంది సభ్యులు అంగీకరించాలి. అతడిని తొలగించడానికి చేసిన మొదటి రెండు ప్రయత్నాలు విఫలమయ్యాయి. మూడవ ప్రయత్నంలో, అతని రిపబ్లికన్ పార్టీకి చెందిన 105 మంది సభ్యులు కూడా 206 మంది డెమోక్రాట్‌లతో కలిసి శాంటోస్‌ని బహిష్కరించారు.

ఎంపీల ప్రవర్తనా నియమావళికి కట్టుబడి ఉండేలా పర్యవేక్షించడానికి బ్రిటన్ పార్లమెంట్ కూడా విస్తృతమైన యంత్రాంగాన్ని కలిగి ఉంది. ఇది ప్రయోజనాలకు సంబంధించిన పబ్లిక్ రిజిస్టర్‌ని నిర్వహిస్తుంది. ఎంపీలు తమ పార్లమెంటరీ విధుల సమయంలో పొందిన ఆదాయాలు, ఆతిథ్యం, బహుమతులను తప్పనిసరిగా ప్రకటించాలి. పార్లమెంటరీ ప్రమాణాల కమిషనర్ అని పిలిచే ఒక స్వతంత్ర అధికారి ఈ రిజిస్టర్‌ను నిర్వహిస్తారు. ఎంపీలపై వచ్చిన ఫిర్యాదులను పరిశీలిస్తారు. కమిషనర్ పనిని ఎంపీల స్టాండర్డ్స్ కమిటీ సమీక్షిస్తుంది. ఎంపీలపై ఎలాంటి చర్య తీసుకోవాలో సిఫారసు చేస్తుంది.

2009లో, ఖర్చుల కుంభకోణం (హౌస్ ఆఫ్ కామన్స్ ఎంపీలు పార్లమెంట్ నుండి వ్యక్తిగత ఖర్చులను రీయింబర్స్ చేయడం) తర్వాత, ఎంపీలు, వారి సిబ్బంది వేతనాలు, పింఛన్లను నియంత్రించేందుకు స్వతంత్ర పార్లమెంట్ ప్రమాణాల సంస్థను ఏర్పాటు చేయడానికి బ్రిటన్ ఒక చట్టాన్ని కూడా ఆమోదించింది. ఫిర్యాదులను స్వీకరించడానికి, దర్యాప్తు చేయడానికి స్వతంత్ర యంత్రాంగాలతో పాటు, అమెరికా, బ్రిటన్ పార్లమెంటులు, వారి సభ్యులు అనుసరించడానికి వివరణాత్మక మార్గదర్శకాలను కూడా అందించాయి. ఉదాహరణకు అమెరికాలో ఈ సంవత్సరం ప్రారంభంలో, కాంగ్రెషనల్ ఎథిక్స్ కార్యాలయం ఒక విషయాన్ని హౌస్ ఎథిక్స్ కమిటీకి సూచించింది; ప్రతినిధుల సభకు చెందిన అలెగ్జాండ్రియా ఒకాసియో-కోర్టెజ్, 2021లో ఛారిటీ మెట్ గాలాలో ధరించేందుకు మేకప్ సేవలు, హ్యాండ్‌బ్యాగ్, ఆభరణాలు, దుస్తులను అంగీకరించడం ద్వారా బహుమతి నియమాలను ఉల్లంఘించి ఉండవచ్చంది.

భారతదేశంలో రాజ్యసభ ఎథిక్స్ కమిటీ తన ఎంపీలకు ప్రవర్తనా నియమావళిని నిర్వచించింది. రాజ్యసభ ఎంపీలు తమ పార్లమెంటరీ వ్యవహారాల కోసం ఎలాంటి ప్రయోజనాలనూ అంగీకరించకూడదని కోడ్ నిర్దేశిస్తుంది. వారి వ్యక్తిగత ప్రయోజనాలకూ, ప్రజా ప్రతినిధిగా వారి విధినిర్వహణకూ మధ్య వైరుధ్యం ఏర్పడిన సందర్భాల్లో, వారు తమ ప్రభుత్వ కార్యాలయానికి బాధ్యత వహించాలని కూడా ఇది పేర్కొంది. రాజ్యసభ ఎంపీలు తప్పనిసరిగా బ్రిటన్ పార్లమెంట్ పద్ధతిలో వలే సభ్యుల ప్రయోజనాల రిజిస్టర్‌ను కూడా పూరించాలి. ప్రత్యక్షంగా ఎన్నికైన సభ ఇంకా ఈ నిబంధనలను తన నియమాలలో పొందుపరచనందున ఈ కోడ్, రిజిస్టర్ రాజ్యసభ ఎంపీలకు వర్తిస్తుంది తప్ప లోక్‌సభ సభ్యులకు కాదు.

1951లో నాటి మన తాత్కాలిక పార్లమెంటు తన సభ్యులలో ఒకరైన హెచ్‌జి ముద్గల్ సభా గౌరవాన్ని కించపరిచేలా ప్రవర్తించిన మొదటి కేసును ఎదుర్కొంది. ఈ కేసులో ముద్గల్‌ను సమర్థించుకోవడానికి అనుమతించారు. ఆ తర్వాత సభ తనను బహిష్కరించే ముందు ఆయన రాజీనామా చేశారు. ఆయన ప్రవర్తనను పరిశీలించిన కమిటీ, ఎంపీలకు ప్రవర్తనా నియమావళిని విధించాలని కోరింది. ఏ సభ్యుడైనా సంబంధిత పార్టీల నుండి ద్రవ్య లేదా ఇతర పరిగణనలను అంగీకరించడంపై నిర్దిష్ట కారణాలను, ప్రయోజనాలను సమర్థించుకోవడం అనేది ప్రజాస్వామ్యానికి విషం అవుతుంది.

72 ఏళ్ల తరువాత, ఇదే విధమైన ప్రశ్నపై బహిరంగ చర్చ కేంద్రీకృతమై ఉన్నందున, ఎంపీల నైతిక నిబంధనల ఉల్లంఘనలను నిర్ణయించడానికి పార్లమెంటుకు పటిష్ఠమైన విధానం ఉండాల్సిన సమయం ఆసన్నమైంది. ఇటువంటి ప్రక్రియ పార్లమెంటు గౌరవాన్ని నిలబెట్టి, దాని శాసన సమగ్రతను కాపాడే సాధనంగా మారుతుంది. దాని నిర్ణయాల గురించి ఎలాంటి అనుమానాలనైనా తొలగించివేస్తుంది.

వ్యాసకర్త లెజిస్లేటివ్ అండ్ సివిక్ ఎంగేజ్‌మెంట్ హెడ్, పీఆర్ఎస్ లెజిస్లేటివ్ రీసెర్చ్ ('ది హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

పనికేం ఆటంకం?



రుతుస్రావం అనేది ప్రతిబంధకం కాదు. దాని కోసం 'పెయిడ్ లీవ్' విధానం అక్కర్లేదని అన్నారు మంత్రి స్మృతీ ఇరానీ. నూరు శాతం ఏకీభవిస్తున్నా. దాని కోసం పెయిడ్ లీవ్ అక్కర్లేదు.

– నూపుర్ జె. శర్మ, సంపాదకురాలు

నొప్పిని తప్పనొద్దు!



పీరియడ్ (రుతుస్రావ) లీవ్ అనేది మెటర్నిటీ లీవ్ లాంటిది. కాబట్టి, మీ పీరియడ్ బాధాకరంగా లేకపోతే సెలవు తీసుకోవద్దు. కానీ మీకు నొప్పి లేనంత మాత్రాన ఇతరుల నొప్పిని నిరాకరించొద్దు.

– కరుణా నంది, న్యాయవాది

హింసాత్మక బృందం



36 ఏళ్ల క్రితం, ఈ రోజున (డిసెంబర్ 14, 1987) హమాస్‌ను స్థాపించారు అహ్మద్ యాసీన్. మూడు దశాబ్దాల హింస, వినాశనాలకు తెర పడనుంది. ఈ శతాబ్దపు నరమేధానికి పాల్పడిన రాక్షస బృందంగా మాత్రమే హమాస్ గుర్తుండిపోతుంది.

– మొసాబ్ హసాన్ యూసెఫ్, యాక్టివిస్ట్

కంపు గొట్టిస్తున్నారు!



సాధారణంగా భారతీయ రైల్వేల్లో కంపుగొట్టే టాయ్‌లెట్లకు 'మురికి' భారతీయుల్ని నిందిస్తుంటాం. కానీ ప్రధాని, రైల్వేమంత్రి రైల్వేను నాశనం చేశారు. జైపూర్ నుంచి (మొన్న) 1:10కు బయల్దేరిన 22934 రైల్లో 2 గంటలకే టాయ్‌లెట్లు కంపు కొడుతున్నాయి. పైగా ఒక టాయ్‌లెట్‌లో కిటికీ విరిగింది. చలికాలంలో రాత్రి ఉష్ణోగ్రతలు 9–10 డిగ్రీలకు పడిపోయే రాజస్థాన్‌లో ప్రయాణికుల దుస్థితి ఊహించండి. పైగా ఇదంతా ఏసీ ఫస్ట్ క్లాసులో! మోదీ వందేభారత్ పబ్లిసిటీ స్టంట్ మీదే రైల్వే మంత్రి పూర్తిగా దృష్టి పెట్టారు.

– రాజేంద్ర కుంభట్, ఆగ్రహ భారతీయుడు

కోపం పలువిధాలు



ప్రపంచంలో చాలా ఆగ్రహావేశాలు నెలకొని ఉన్నాయి. ఉదాహరణకు, 'నాకు ఆలూ పరాఠా ఇష్టం' అని మీరు ట్వీట్ చేయొచ్చు. కానీ మూలీ (ముల్లంగి) పరాఠాను అవమానించినందుకు మిమ్మల్ని జనం ట్రోల్ చేస్తారు.

– పర్మీందర్ సింగ్, వ్యాపారవేత్త

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

కమ్యూనిస్టుల పరిస్థితేమిటి?

అభిప్రాయం



డా॥ త్రిపురనేని హనుమాన్ చౌదరి

కమ్యూనిస్టు పార్టీలైన సీపీఐ, సీపీఎంలు 'మతతత్వ' బీజేపీని ఓడించాలనే తమ ప్రధాన కోరికను పదే పదే వ్యక్తం చేస్తుంటాయి. అయితే, 1930 నుంచి 1948 సెప్టెంబరు 17 వరకు ఉనికిలో ఉన్న రజాకార్ల నుండి ఉద్భవించిన... పూర్తిగా ముస్లిం పార్టీ అయిన ఏఐఎమ్ఐఎమ్‌ని వీరు ఎప్పుడూ ఖండించరు. హైదరాబాద్‌ను భారత్‌లో చేర్చడాన్ని వ్యతిరేకించిన నాటి ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ 1951 సెప్టెంబరు వరకు భారత యూనియన్‌కు వ్యతిరేకంగా గెరిల్లా యుద్ధానికి దిగింది. అలాగే వీరు తాము విమర్శించిన పార్టీలతోనూ ఎన్నికల సమయంలో పొత్తులు పెట్టుకుంటారు. అయితే పొత్తులున్నా వీరు డిపాజిట్లు కోల్పోవడం జరుగుతుంది. తాజాగా 2023 నవంబర్ 30న తెలంగాణ రాష్ట్ర శాసనసభకు జరిగిన ఎన్నికల్లో ఉభయ కమ్యూనిస్టు పార్టీలు మళ్లీ విడివిడిగా పోరాడాయి. ముందు బీఆర్ఎస్‌తో బేరసారాలు ఆడి తిరస్కరణకు గురై కాంగ్రెస్ దగ్గరకు వెళ్లాయి. చెరొక రెండు సీట్లు ఇవ్వమని కాంగ్రెస్‌ను కోరినా ప్రయోజనం లేకపోయింది. చివరికి సీపీఐకి ఒక్క సీటు ఇచ్చింది కాంగ్రెస్. సీపీఎంకు మాత్రం ఆ పార్టీతో పొత్తు కుదరలేదు.

దీంతో సీపీఎం పలు పార్టీలతో కూడిన కూటమిని ఏర్పాటు చేసి 19 నియోజక వర్గాల్లో అభ్యర్థులను నిలబెట్టింది. కానీ ప్రతి చోటా డిపాజిట్లను కోల్పోయింది. ఒక్క సీటు గెలిచిన సీపీఐ మాత్రం ప్రజాస్వామ్యం గెలిచేసిందని ప్రకటన చేసింది. ఇకపోతే ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమితో "బీఆర్ఎస్ నియంతృత్వ పాలన ముగిసింది' అని సీపీఎం ప్రకటన ఇచ్చింది. ఈ పార్టీలన్నింటికీ ఓట్ల శాతం 0.1 శాతం కంటే తక్కువగా ఉంది, అయినప్పటికీ దేశంలోని ప్రతి చోటా 'మతతత్వ బీజేపీ'ని ఓడిస్తామని వారు గొప్పలు చెప్పుకుంటున్నారు. మతతత్వ బీజేపీకి వ్యతిరేకంగా 'లౌకిక, ప్రగతిశీల, ప్రజాతంత్ర' శక్తులను బలోపేతం చేయడానికి అన్ని వామపక్ష పార్టీలు కలిసి రావాలని ఈ రెండు పార్టీలు తరచుగా ప్రకటిస్తున్నాయి. కానీ అవి మాత్రం ఒకదానితో ఒకటి విలీనం కావు!

కమ్యూనిస్టు పార్టీల చరిత్ర దుర్భరమైనది. 1975 జూన్ – 1977 మార్చి వరకు ఇందిరా గాంధీ విధించిన ఎమర్జెన్సీకి సీపీఐ మద్దతు ఇచ్చింది. ఎమర్జెన్సీ తర్వాత జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమి పాలైనప్పుడు, ఇందిరా ఎమర్జెన్సీ పాలనకు మద్దతు ఇచ్చినందుకు చింతిస్తూ 1978లో భటిండాలో సీపీఐ తీర్మానం చేసింది. మరోవైపున సీపీఎం, ఇందిర ఎమర్జెన్సీ పాలనను వ్యతిరేకించింది. ఇందిరాగాంధీతో సీపీఐ సహకారాన్ని కూడా వ్యతిరేకించింది.

గవర్నర్ ఆరిఫ్ మహ్మద్ ఖాన్ వెల్లడించిన ప్రకారం, కేరళలో (బహుశా పశ్చిమ బెంగాల్, త్రిపురల్లో కూడా) కమ్యూనిస్టులు అధికారంలో ఉన్నప్పుడు, ప్రతి మంత్రి ఇద్దరు ప్రైవేట్ కార్యదర్శులను రెండేళ్ళ కాలానికి నియమిస్తారు, తర్వాత రెండేళ్లకు మరో ఇద్దరిని నియమిస్తారు. పదవీ విరమణ అనంతరం వారందరికీ జీవిత కాలపు పెన్షన్ లభిస్తుంది. ఆ విధంగా ప్రభుత్వ ఖర్చులతో జీవితకాల కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలను వారు సృష్టిస్తున్నారు. ఇది అవినీతి కాకపోతే మరేమిటి?

వ్యాసకర్త భారతీయ ధర్మరక్షణ సమాఖ్య కన్వీనర్ । 83093 92687

చందమామపై మన అడుగే తరువాయి!

అభిప్రాయం



ఎస్. సోమనాథ్

అందరినీ ఆశ్చర్యానందాలలో ముంచెత్తిన చంద్రయాన్–3 విజయం తర్వాత, ఏ మాత్రం ఆలస్యం చేయకుండా 2040 నాటికి భారతీయ వ్యోమగాములు చంద్రునిపైకి వెళ్ళే దిశగా పూర్తిగా ప్రయత్నం చేస్తున్నాం. భవిష్యత్తుపై దృష్టితో, 'గగన్‌యాన్' ప్రోగ్రామ్‌లో భాగంగా, ఇద్దరి నుంచి ముగ్గురు వరకూ భారతీయ వ్యోమగాములను 'లో ఎర్త్ ఆర్బిట్' (ఎల్ఈఓ) లోకి పంపించి, మూడు రోజుల వరకు అక్కడ ఉంచి, మన దేశంలోని ఒక నీటి వనరుపై వారిని ల్యాండ్ చేసే (దించే) కార్యక్రమంలో మరొక అడుగు ముందుకు వేయాలని ప్రయత్నిస్తోంది ఇస్రో.

ఈ మిషన్ కోసం భారత వైమానిక దళానికి చెందిన నలుగురు టెస్ట్ పైలట్‌లను ఆస్ట్రోనాట్–డెసిగ్నేట్‌లుగా ఎంపిక చేశాం. ప్రస్తుతం, వారు బెంగళూరులోని ఆస్ట్రోనాట్ ట్రైనింగ్ ఫెసిలిటీ (ఏటీఎఫ్)లో మిషన్–నిర్దిష్ట శిక్షణ పొందుతున్నారు. హ్యూమన్–రేటెడ్ (మానవులను సురక్షితంగా రవాణా చేయగల సామర్థ్యం) లాంచ్ వెహికల్ (హెచ్ఎల్‌వీఎమ్3), క్రూ మాడ్యూల్ (సీఎమ్), సర్వీస్ మాడ్యూల్ (ఎస్ఎమ్)లతో కూడిన ఆర్బిటల్ మాడ్యూల్; లైఫ్ సపోర్ట్ సిస్టమ్‌లతో సహా క్లిష్టమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయడం మానవ సహిత అంతరిక్ష యాత్ర గగన్‌యాన్‌లో ప్రారంభ దశలో ఉంటుంది. ఇంటిగ్రేటెడ్ ఎయిర్ డ్రాప్ టెస్ట్, ప్యాడ్ అబార్ట్ టెస్ట్, టెస్ట్ వెహికల్ ఫ్లైట్‌లతో పాటు రెండు ఒకేలా ఉండే అన్–క్రూడ్ మిషన్‌లు (జీ1, జీ2) మనుషులతో కూడిన మిషన్‌కు ముందు ఉంటాయి.

సీఎమ్‌ను కూడా ఏర్పాటు చేస్తాం. సీఎమ్ అనేది సిబ్బంది కోసం అంతరిక్షంలో భూమి–వంటి వాతావరణంతో నివాసయోగ్యంగా ఉండే స్థలం. వ్యోమగాములు సురక్షితంగా తిరిగి రావడం కోసం ఉద్దేశించింది ఇది. భద్రతా చర్యలలో అత్యవసర పరిస్థితుల కోసం క్రూ ఎస్కేప్ సిస్టమ్ (సీఈఎస్) కూడా ఉంటుంది.

టెస్ట్ వెహికల్ (టీవీ–డీ1) యొక్క మొదటి డెవలప్‌మెంట్ ఫ్లైట్ 2023 అక్టోబరు 21న ప్రారంభించబడింది. ఇది క్రూ ఎస్కేప్ సిస్టమ్ యొక్క ఫ్లైట్ అబార్ట్‌ను విజయవంతంగా పరీక్షించగలిగింది. ఆ తర్వాత క్రూ మాడ్యూల్ వేరుపడటం, బంగాళాఖాతంలో ఇండియన్ నావికదళం దానిని సురక్షితంగా రికవర్ చేయడం కూడా జరిగాయి. మానవ రహిత మిషన్‌లూ, అంతిమంగా మానవ సహిత అంతరిక్ష మిషన్ 2025లో ప్రారంభించబడుతుందనీ అంచనా



వేయడానికి ఈ టెస్ట్ ఫ్లైట్ విజయం కీలకమైనది.

ఇస్రో మరొక ముఖ్యమైన ప్రాజెక్ట్, భారతదేశపు తొలి సౌర అన్వేషణ మిషన్ అయిన ఆదిత్య ఎల్1. ఇది 'లాగ్‌రేంజ్ పాయింట్ 1' యొక్క ప్రత్యేకమైన వాన్టేజ్ పాయింట్ నుండి సూర్యుడిని అధ్యయనం చేస్తుంది. చంద్రునిపైనా సూర్యునిపైనా చేసే పరిశోధనల్లోనూ ఇది ఉపయోగపడుతుంది. వివిధ ఇస్రో కేంద్రాలు, విద్యా సంస్థల సహకారంతో దేశీయంగా అభివృద్ధి చేసిన ఏడు సైంటిఫిక్ పేలోడ్‌లతో నిండిన ఆదిత్య ఎల్1 అంతరిక్ష నౌక సూర్యుని రహస్యాలను ఛేదించడానికి ప్రయోగిస్తున్నాం. 2023 సెప్టెంబర్ 2న ప్రారంభించిన ఆదిత్య ఎల్1 ఐదేళ్ల పాటు పని చేస్తుందని భావిస్తున్నాం. ఇది భూమి నుండి సుమారు 1.5 మిలియన్ కి.మీ. దూరంలో ఉన్న సూర్యుడు–భూమి లాగ్రాంజ్ పాయింట్ 1 (ఎల్1) వైపు ఉద్దేశించిన మార్గంలో ఉంది. ఇక్కడే అది జనవరి 2024లో హాలో కక్ష్యలోకి చేర్చబడుతుంది.

చంద్రయాన్–3 మిషన్ ఒక చరిత్రాత్మక విజయం. ఆ విజయం సిద్ధించిన ఆగస్టు 23ను 'భారతదేశంలో జాతీయ అంతరిక్ష దినోత్సవం'గా ప్రకటించడం ముదావహం. 14 రోజుల (ఎర్త్ డేస్) మిషన్ జీవిత కాలంలో, ఇది చంద్రుని మట్టిలో అల్యూమినియం, కాల్షియం, ఐరన్, క్రోమియం, టైటానియం, సల్ఫర్, మేంగనీస్, సిలికాన్, ఆక్సిజన్‌లను కనుగొన్న విలువైన డేటాను అందించింది. మనం తలపెట్టిన చిన్న శాటిలైట్ లాంచ్ వెహికిల్ (ఎస్ఎస్ఎల్‌వీ), పునర్వినియోగ ప్రయోగ వాహనం (ఆర్ఎల్‌వీ) ప్రోగ్రామ్, ఎక్స్–రే ఆస్ట్రానమీ మిషన్ 'ఎక్స్‌పోశాట్', స్పేస్ డాకింగ్ ప్రయోగం, ఎల్ఓఎక్స్–మీథేన్ ఇంజన్ వంటి పరివర్తనాత్మక కార్యక్రమాలు కలిసి, భారత్ అంతరిక్ష అన్వేషణలో కొత్త శకాన్ని నిర్వచించాయి.

మూడు దశల లాంచ్ వెహికల్ అయిన ఎస్ఎస్ఎల్‌వీ 500 కిలోల బరువున్న ఉపగ్రహాన్ని 500 కి.మీ. ప్లానార్ ఆర్బిట్‌లో ప్రవేశపెట్టగలదు. బహుళ ఉపగ్రహాలను తీసుకెళ్లగలదు. ఉపగ్రహాలను ఎప్పుడు ఎక్కడ ఆర్బిట్‌లో ప్రవేశపెట్టాలనుకుంటే అప్పుడు ప్రవేశపెట్టగల (లాంచ్–ఆన్–డిమాండ్) సామర్థ్యం దీనికి ఉంది. దీన్ని ప్రయోగించడానికి కనీస మౌలిక సదుపాయాలు ఉంటే చాలు. అలాగే ప్రయోగించడానికి ఖర్చు కూడా తక్కువే!

ఎక్స్‌పోశాట్ అనేది భారత్ మొట్టమొదటి నిర్దిష్ట సైన్స్ మిషన్. ఇది శాస్త్రీయ పేలోడ్‌లను ఉపయోగించి తీవ్ర పరిస్థితుల్లోనూ ప్రకాశవంతమైన ఖగోళ ఎక్స్–రే మూలాలను పరిశోధిస్తుంది. అటువంటి దీనిని 2023–2024లో ప్రారంభించేందుకు ప్రణాళిక సిద్ధమయింది. స్పాడెక్స్ (స్పేస్ డాకింగ్ ఎక్స్‌పరిమెంట్)ను 2024 మూడవ త్రైమాసికంలో ప్రారంభించాలనేది ప్రణాళిక. ఇది మానవ అంతరిక్షయానంలో అనువర్తనాల పరిధితో డాకింగ్, ఫార్మేషన్ ఫ్లయింగ్ టెక్నాలజీలను అభివృద్ధి చేయడానికి ఉద్దేశించిన జంట అంతరిక్ష నౌక. ఈ మిషన్‌లో రెండు చిన్న–ఉపగ్రహాలు ఉంటాయి. ఒకటి ఛేజర్‌గా, మరొకటి టార్గెట్‌గా, సహ–ప్రయాణికులుగా కలిపి ప్రయోగించబడతాయి. 'భవిష్యత్తులో 'చంద్రయాన్' మిషన్‌లలో చంద్రుని నుంచి శాంపిల్స్ తీసుకువచ్చేందుకు మార్గం సుగమం చేయడంలో డాకింగ్ ప్రయోగ విజయం గణనీయమైన ప్రాముఖ్యతను కలిగి ఉంది.

రానున్న కాలంలో సాంకేతికత పరంగా అత్యంత ప్రాముఖ్యం కలిగిన 'ఎల్ఓఎక్స్ మీథేన్' (లిక్విడ్ ఆక్సిజన్ ఆక్సిడైజర్, మీథేన్ ఇంధనం) ఇంజిన్‌ల అభివృద్ధి కూడా ముఖ్యమైనదే. ఇది అంగారక గ్రహం వంటి ఇతర గ్రహాలపై పర్యావరణాల ఉనికి కోసం మానవుడు చేసే అన్వేషణను సులభతరం చేస్తుంది. అంతరిక్షంలో నీరు, కార్బన్ డై ఆక్సైడ్ లను సంశ్లేషణ చేయడం ద్వారా తయారు చేయగలిగిన మీథేన్ అంతరిక్షంలో సుదూరం ప్రయాణించే నౌకలకు ఇంధనంగా ఉపయోగిస్తారని భావిస్తున్నారు. అందుకే ఎల్ఓఎక్స్ మిథేన్ ఇంజిన్‌ల అభివృద్ధి చాలా ప్రాముఖ్యం కలిగిందని చెప్పాలి.

2035 నాటికి 'భారతీయ అంతరిక్ష స్టేషన్' ప్రారంభించడం, వీనస్ ఆర్బిటర్ మిషన్, మార్స్ ల్యాండర్‌తో కూడిన అంతర్ గ్రహ అన్వేషణను ప్రారంభించడం వంటి ప్రతిష్ఠాత్మక లక్ష్యాలను ప్రధాన మంత్రి నిర్దేశించుకున్నారు. ఇవన్నీ ప్రపంచ అంతరిక్ష పరిశోధనా వేదికపై భారత్ ఉనికిని మరింత పటిష్ఠం చేస్తాయి. 'భారత్ అంతరిక్ష కార్యక్రమం రాబోయే సంవత్సరాల్లో కొత్త శిఖరాలను చేరుకోవడానికి సిద్ధంగా ఉంది. ప్రయోగించబడిన ప్రతి మిషన్, ప్రతి ఆవిష్కరణతో ఇస్రో ప్రపంచ వేదికపై తన స్థానాన్ని సగర్వంగా పునరుద్ఘాటిస్తుంది.

('మలయాళ మనోరమ'కు ఇస్రో ఛైర్మన్ సోమనాథ్ అందించిన కథనం ఆధారంగా)

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, మార్గశిర మాసం, **తిథి:** శు.తదియ రా.1.04 వరకు, తదుపరి చవితి, **నక్షత్రం:** పూర్వాషాఢ ఉ.10.41 వరకు, తదుపరి ఉత్తరాషాఢ, **వర్జ్యం:** సా.6.19 నుండి 7.47 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.35 నుండి 9.23 వరకు, తదుపరి ప.12.17 నుండి 1.05 వరకు, **అమృతఘడియలు:** ఉ.6.03 నుండి 7.34 వరకు; **రాహుకాలం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **యమగండం:** ప.3.00 నుండి 4.30 వరకు, **సూర్యోదయం:** 6.26, **సూర్యాస్తమయం:** 5.24.

క్లుప్తంగా...

కాలి నడకన తిరుమలకు దీపిక పదుకొనే



తిరుమల: ప్రముఖ బాలీవుడ్ హీరోయిన్ దీపిక పదుకొనే గురువారం తిరుమల చేరుకున్నారు. అలిపిరి మెట్ల మార్గంలో నడుచుకుంటూ రాగా, టీటీడీ అధికారులు ఆమెకు స్వాగతం పలికారు. శుక్రవారం ఉదయం ఆమె శ్రీవారిని దర్శించుకోనున్నారు. ఇందుకోసం అధికారులు ఏర్పాట్లు చేశారు.

ప్రభుత్వ ఖర్చుతో 'వై ఏపీ నీడ్స్ జగన్'

- ఎన్నికల సంఘానికి టీడీపీ ఫిర్యాదు.. ఓటరు జాబితాలో టాంపరింగ్ అంటూ బీజేపీ

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ ఖర్చుతో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహిస్తోందని కేంద్ర ఎన్నికల సంఘానికి టీడీపీ ఫిర్యాదు చేసింది. మరోవైపు బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి నేతృత్వంలోని బీజేపీ ప్రతినిధుల బృందం కూడా రాష్ట్రంలో డూప్లికేట్ ఓట్లపై కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. గురువారం ఢిల్లీలో కేంద్ర ఎన్నికల సంఘాన్ని టీడీపీ, బీజేపీ నేతలు వేర్వేరుగా కలిసి వినతిపత్రాలు అందజేశారు. అనంతరం టీడీపీ ఎంపీలు కనకమేడల రవీంద్రకుమార్, రామ్మోహన్‌నాయుడు, గల్లా జయదేవ్ మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వ ఖర్చుతో 'వై ఏపీ నీడ్స్ జగన్' పేరుతో కార్యక్రమం చేపట్టారని ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకువెళ్లామన్నారు. ఈ నెల 22న ఎన్నికల అధికారులు ఆంధ్రప్రదేశ్‌లో పర్యటిస్తామని, చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని వారు తెలిపారు. బీజేపీ జాతీయ కార్యదర్శి వై.సత్యకుమార్, ఎంపీలు సీఎం రమేష్, మాజీ ఎంపీ సుజనాచౌదరి, రాష్ట్ర అధికార ప్రతినిధి భానుప్రకాశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజుతో కలిసి పురందేశ్వరి మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఓటర్ల జాబితాకు సంబంధించి పలు అంశాలపై ఫిర్యాదు చేశామన్నారు. కొంతకాలంగా రాష్ట్రంలో ఓటరు జాబితాలో టాంపరింగ్ జరుగుతోందన్న వార్తల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల అధికారులను కలిశామన్నారు. దొంగ ఓట్లకు సంబంధించి రుజువులు అందజేశామని పురందేశ్వరి తెలిపారు.

పాఠ్యాంశంగా ఎన్నికల అక్షరాస్యత

- పార్లమెంట్‌లో ప్రకటించిన కేంద్రం

సాక్షి, అమరావతి: ఎన్నికల అక్షరాస్యత, ఓటరు విద్యను పాఠ్యాంశాల్లో చేర్చనున్నట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. ఈ మేరకు 6 నుంచి 12వ తరగతి వరకు ఎన్నికల అక్షరాస్యతను పాఠ్యాంశంగా చేర్చాలని దేశంలోని రాష్ట్రాల విద్యా బోర్డులకు సూచించినట్లు ఇటీవల పార్లమెంట్‌లో కేంద్రం ప్రకటించింది. నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ ద్వారా ఎన్నికల అక్షరాస్యత పాఠ్యాంశం లక్ష్యాలను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపింది. ఇందుకు సంబంధించి గత నెలలో కేంద్ర విద్యాశాఖ, కేంద్ర ఎన్నికల కమిషన్ మధ్య అవగాహన ఒప్పందం కుదిరినట్లు పేర్కొంది. ఎన్నికల అక్షరాస్యతను బోధించడంపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వాలని రాష్ట్రాలకు సూచించినట్లు తెలిపింది. భారతీయ సమాజంలో ప్రజాస్వామ్య విలువలను ప్రోత్సహించడం వంటి అంశాలను కూడా పాఠ్యాంశాల్లో చేర్చనున్నట్లు కేంద్ర ప్రభుత్వం వివరించింది. దీనికి అదనంగా ప్రస్తుతం ఒకటి నుంచి తొమ్మిదో తరగతి వరకు సాంఘికశాస్త్రం, పొలిటికల్ సైన్స్ పాఠ్యపుస్తకాల్లో ప్రజాస్వామ్య రాజకీయాలు అంశాన్ని పొందుపరిచినట్లు తెలిపింది.

'వామపక్షాల ఐక్యకార్యాచరణ తక్షణ కర్తవ్యం'

సాక్షి, అమరావతి: దేశంలో మతతత్వ శక్తులను ఓడించేందుకు వామపక్షాల ఐక్య కార్యాచరణ తక్షణ అవసరమని ఎంఎల్‌పీఐ(రెడ్ ఫ్లాగ్) జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంఎస్ జయకుమార్ పిలుపునిచ్చారు. రెడ్ ఫ్లాగ్ 10వ జాతీయ మహాసభ విజయవాడలో గురువారం ప్రారంభమైంది. పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు థామస్ ఫ్రెడీ అధ్యక్షతన జరిగిన ప్రారంభ సభలో జయకుమార్ మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మతతత్వ శక్తులను, కార్పొరేట్లను ప్రోత్సహిస్తోందని విమర్శించారు. బీజేపీని గద్దెదించేందుకు వామపక్ష పార్టీలు ఐక్య కార్యాచరణతో ముందుకు సాగాలన్నారు. వి.శ్రీనివాసరావు(సీపీఎం), కె.రామకృష్ణ(సీపీఐ), గుర్రం విజయ్‌కుమార్(సీపీఐ ఎంఎల్), ప్రదీప్ సింగ్ ఠాకూర్(రివల్యూషనరీ ఇన్సియేటివ్), ఎం.వెంకటరెడ్డి(ఎంసీపీఐయు) తదితర పార్టీల నేతలు సౌహార్ద్ర సందేశాలు ఇచ్చారు.

తెలంగాణ

నేడు ఆస్పత్రి నుంచి కేసీఆర్ డిశ్చార్జ్!

సాక్షి,హైదరాబాద్: మాజీ సీఎం కేసీఆర్ ఆరోగ్యం మెరుగుపడుతోంది. శుక్రవారం ఉదయం ఆయనను ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేసే అవకాశం ఉంది. ఇటీవల ఆయన బాత్‌రూమ్‌కు వెళ్తూ జారి పడిన విషయం తెలిసిందే. చికిత్స కోసం సోమాజిగూడ యశోద ఆస్పత్రిలో చేర్పించగా, వైద్యులు ఆయనకు తుంటి కీలు మార్పిడి చికిత్స చేశారు. ప్రస్తుతం ఆయన కోలుకుంటున్నారు. ఆరోగ్యం మెరుగుపడటంతో కేసీఆర్‌ను ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేసి ఇంటికి తరలించాలని వైద్యులు నిర్ణయించారు.

నాడు 'సేవామిత్ర'.. నేడు 'మై టీడీపీ'

▶ మొదటి పేజీ తరువాయి

ఓటరు ప్రొఫైలింగ్‌కు, టీడీపీ మేనిఫెస్టో డాట్ కాం పేరుతో ఓటరు పేరు, ఊరు, చిరునామా, జెండర్, వయసుతో పాటు కులం, సదరు వ్యక్తి మద్దతిచ్చే పార్టీ పేరు తెలుసుకుంటోందని వైఎస్సార్‌సీపీ ఎంపీలు గురువారం ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. ఈ రెండు వెబ్‌సైట్ల సర్వర్లు విదేశాల్లో ఉన్నాయని, వివరాలన్నీ అక్కడే భద్రపరుస్తున్నారని పేర్కొన్నారు. అలాగే, 'బాబు షూరిటీ–భవిష్యత్‌పై గ్యారెంటీ' అంటూ ఒక బాండు పేపర్ ఇస్తూ ప్రజల్ని నిస్సిగ్గుగా మోసం చేస్తున్నారని కూడా వారు తెలిపారు. టీడీపీ ఎలక్షన్ సెల్ స్టేట్ కో–ఆర్డినేటర్ కోనేరు సురేష్ ఇచ్చిన ఒక తప్పుడు ఫిర్యాదుతో ప్రజాధనం దుర్వినియోగం అయ్యిందని వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి నేతృత్వంలో ఎంపీలు అయోధ్యరామిరెడ్డి, నిరంజన్‌రెడ్డి, గురుమూర్తి, సత్యవతి, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డిలతో కూడిన ప్రతినిధి బృందం గురువారం ఢిల్లీలోని ఎన్నికల సంఘానికి వివరించింది. అనంతరం ఎంపీ విజయసాయిరెడ్డి ఎన్నికల సంఘానికి ఇచ్చిన ఫిర్యాదు అంశాలను మీడియాకు వివరించారు. ఆయన ఏమన్నారంటే..

'మై పార్టీ డ్యాష్‌బోర్డ్ డాట్‌కామ్'తో మాల్‌ప్రాక్టీస్..

ఎన్నికల కమిషన్ డ్యాష్‌బోర్డులో ఉన్న డేటాను ఆధారంగా చేసుకుని తెలుగుదేశం పార్టీ రూపొందించిన 'మై పార్టీ డ్యాష్‌బోర్డ్ డాట్‌కామ్'లో ఓటరు పేరు, ఊరు, చిరునామా, జెండర్, వయసు, కులంతో పాటు అతను సపోర్టుచేసే పొలిటికల్ పార్టీ, మొబైల్ నెంబర్ వంటి వివరాలున్నాయి. రాజకీయ పార్టీల వారీగా ఓటర్లను వేరు చేయడమనేది చట్టవిరుద్ధ చర్యగా మేం ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకొచ్చాం. టీడీపీ సేకరించిన ఈ డేటా మొత్తాన్ని అమెరికాలోని న్యూయార్క్‌లో ఒక సర్వర్ పాయింట్ వద్ద స్టోర్ చేశారు. ఇదే తరహా మాల్‌ప్రాక్టీస్ గతంలోనూ టీడీపీ 'సేవామిత్ర' యాప్ ద్వారా సేకరించింది. అప్పట్లో ఆ యాప్‌పై మేం ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశాం. దీనిపై హైదరాబాద్ మాదాపూర్ పీఎస్‌లో పోలీసులు ఎఫ్ఐఆర్ (174/2019) కూడా నమోదు చేసినా ఎలాంటి పురోగతి లేదన్న సంగతిని ఎన్నికల కమిషన్‌కు తెలిపాం. తాజాగా.. 'మై పార్టీ డ్యాష్ బోర్డు డాట్‌కామ్' ద్వారా టీడీపీ చేపట్టిన చట్టవిరుద్ధమైన కార్యక్రమంపై 120 (బి), 379, 420, 188 (ఐపీసీ), 72, 66 (ఐటీఏ–2000 యాక్ట్) కింద చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘాన్ని కోరాం.

టీడీపీ మేనిఫెస్టో డాట్‌కామ్‌తో మరో కుట్ర..

ఇక ఓటరు అంగీకారంతో సంబంధం లేకుండా ఓట్లను ఉంచాలా.. తొలగించాలా అనే సమాచారం కోసం టీడీపీ మరో వెబ్‌సైట్‌ను ఏర్పాటుచేసుకుంది. మై పార్టీ డ్యాష్‌బోర్డు డాట్‌కామ్ ద్వారా సేకరించిన డేటా మొత్తం న్యూయార్క్ సర్వర్‌లో దాస్తుంటే.. టీడీపీ మేనిఫెస్టో డాట్‌కామ్ వెబ్‌సైట్ డేటా మొత్తాన్ని లండన్‌లోని మరో సర్వర్‌లో స్టోర్ చేస్తున్నారు. టీడీపీ మేనిఫెస్టో డాట్‌కామ్ పేరిట ఎన్నికల కమిషన్ డ్యాష్ బోర్డులో ఇమేజ్ ఫార్మాట్‌లో ఉన్న సమాచారాన్ని ఎక్సెల్ ఫార్మేట్‌లోకి మార్చి ప్రతీ 30 ఓట్లను టీడీపీకి చెందిన ఒక ఏజెంట్‌కు అప్పగిస్తున్నారు. అతను తనకు కేటాయించిన 30 మంది ఓటర్ల ఇళ్లకు వెళ్లి వాళ్ల కులం, పొలిటికల్ గుర్తింపు, వారు ఏ రకమైన లబ్ధి పొందుతున్నారు, వారు ఆరాధించే మతం వంటి ఓటర్ల వ్యక్తిగతమైన డేటాను సేకరిస్తున్న విషయాలను ఎన్నికల సంఘానికి ఆధారాలతో సహా వివరించాం.

'బాబు షూరిటీ... భవిష్యత్‌కు గ్యారెంటీ'పై ఫిర్యాదు..

అలాగే, క్షేత్రస్థాయిలో ఓటర్ల నుంచి చట్టవిరుద్ధంగా సమాచారాన్ని సేకరించడం టీడీపీ మాల్‌ప్రాక్టీస్‌లో ఒక భాగమైతే.. 2024 నుంచి రాబోయే ఐదేళ్లలో టీడీపీ పథకాల ద్వారా ఓటరు ఎంత మేలు పొందుతాడనేది లెక్కలేసి 'బాబు షూరిటీ.. భవిష్యత్‌కు గ్యారెంటీ' అనే ప్రమాణపత్రంతో కూడిన కార్డుల్ని వారు పంపిణీ చేస్తున్నారు. ఇలా దాదాపు 2 లక్షల 40 వేల మందికి వాటిని అందజేశారు. దీనిపైనా ఆధారాలతో సీఈసీకి ఫిర్యాదు చేశాం.

చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడే వ్యక్తుల్ని ప్రోత్సహించొద్దు..

టీడీపీ ఎలక్షన్ సెల్ స్టేట్ కో–ఆర్డినేటర్ కోనేరు సురేష్ ఇచ్చిన ఒక తప్పుడు ఫిర్యాదుతో ప్రజాధనం దుర్వినియోగం అయ్యిందని ఎన్నికల సంఘం దృష్టికి తీసికెళ్లాం. అతను డూప్లికేటింగ్, డబుల్ ఎంట్రీస్, నాన్ లోకల్ కింద ఏపీలో మొత్తం 10 లక్షల ఓట్లు ఉన్నట్లు.. వాటిపై ఎంక్వైరీ చేయాలని గతంలో సీఈసీకి ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై ఎంక్వైరీ చేయాలని పైనుంచి ఆదేశాలు రావడంతో.. అధికారులు వారి సమయాన్ని వెచ్చించి పరిశీలిస్తే ఫిర్యాదులో నిజంలేదని తేలింది. దీనిబట్టి కోనేరు సురేష్ ఎన్నికల సంఘం సమయాన్ని ఎంతగా వృధా చేశాడో అర్థం చేసుకోవాలని సీఈసీ తెలిపాం. దీనిని చట్టవ్యతిరేక చర్యగా పరిగణించాల్సిందిగా ఫిర్యాదు చేశాం.

పవన్ సోదరుడు నాగబాబు కుటుంబం బరితెగింపు..

ఇటీవల తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటువేసిన జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ సోదరుడు నాగబాబు, అతని భార్య, కుమారుడు ఇప్పుడు కొత్త ఓటు కోసం ఏపీలోనూ దరఖాస్తు చేసుకున్నారు. ఖైరతాబాద్ నియోజకవర్గంలోని పోలింగ్‌బూత్–168లో కొణిదల నాగబాబు (సీరియల్ నెంబర్–323), కొణిదల పద్మజ (సీరియల్–324), సాయి వరుణ్‌తేజ్ (సీరియల్ నెంబర్–325) ఓటువేశారు. వీరు తాజాగా ఏపీలోని మంగళగిరి నియోజకవర్గం వడ్డేశ్వరంలో కొత్త ఓట్ల కోసం ఫారం–6తో దరఖాస్తు చేసుకున్నారు. నాగేంద్రబాబు అక్కడి ఎన్నికల్లో నాగేంద్రరావుగా ఓటు వేయగా.. ఇక్కడ నాగేంద్రబాబుగా కొత్త ఓటు కోసం దరఖాస్తు చేసుకున్నారు.

తెలంగాణలో ప్రత్యేక శిబిరాలు

ఇక తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు పూర్తికావడంతో అక్కడున్న ఏపీ సెటిలర్స్ త్వరలో ఏపీలో జరగబోయే ఎన్నికల్లో పాల్గొనేందుకు టీడీపీ వ్యూహం పన్నింది. ఇందుకోసం తెలంగాణలో ప్రత్యేకంగా ఓటరు నమోదు శిబిరాలను ఏర్పాటుచేసి ఆన్‌లైన్‌లో ఓటర్ల నమోదు చేస్తున్నారు. టీడీపీ అనుకూల సామాజికవర్గ ఓటర్లను తెలంగాణ జాబితాలో తొలగించకుండానే ఏపీలోనూ వారికి ఓటు హక్కు కల్పించేందుకు ప్రయత్నిస్తున్న విషయాలను ఎన్నికల కమిషన్ దృష్టికి తీసికెళ్లాం.

4.36 లక్షల డూప్లికేట్ ఓట్లను గుర్తించాం..

ఓటర్ల పేర్లలో ఒకటో రెండో అక్షరాలను మార్పుచేసి వారు స్థానికంగా కాకుండా ఇతర ప్రాంతాల్లో నివాసం ఉంటున్నట్లు పేర్కొంటూ ఓట్లు చేర్పించే కార్యక్రమానికి టీడీపీ తెగబడింది. తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ఓట్లను కూడా ఏపీ ఓటర్ల జాబితాలోకి తీసుకొచ్చే మాల్‌ప్రాక్టీస్ జరుగుతోంది. ఇప్పటికే దాదాపు 4 లక్షల 36 వేల 268 ఓట్లు తెలంగాణ ఓటర్ల జాబితాలోనూ ఇటూ ఏపీలోనూ డూప్లికేటింగ్ ఓట్లుగా కనిపిస్తున్నాయి. ఈ వివరాల్ని ఆధారాలతో సహా సీఈసీకి అందజేసి, వీటన్నింటినీ జాబితా నుంచి తొలగించాలని కోరాం.



శ్రీనివాసులును బంధువులకు అప్పగిస్తున్న చిన్నబ్బాయి తదితరులు

25 ఏళ్ల తర్వాత

ఇంటికి...

- పాతికేళ్ల కిందట ఇంటి నుంచి వెళ్లిపోయిన మానసికస్థితి బాగాలేని వ్యక్తి
- సూళ్లూరుపేటలో ఓ హోటల్ యజమాని చొరవతో గుర్తింపు
- కుటుంబ సభ్యులకు అప్పగింత

సూళ్లూరుపేట (తిరుపతి జిల్లా): మానసికస్థితి సరిగా లేక సుమారు 25 ఏళ్ల కిందట ఇంటి నుంచి వెళ్లిపోయిన వ్యక్తి ఎట్టకేలకు ఓ హోటల్ యజమాని చొరవతో మళ్లీ తన కుటుంబ సభ్యుల చెంతకు చేరాడు. ఇక కనిపించడనుకున్న వ్యక్తి కళ్లముందుకు రావడంతో అతని కుటుంబ సభ్యులు సంతోషంతో ఉప్పొంగిపోయారు. సూళ్లూరుపేటలో గురువారం చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు... ఉమ్మడి గుంటూరు జిల్లా, ప్రస్తుతం పల్నాడు జిల్లా నరసరావుపేట మండలం పమిడిపాడు గ్రామానికి చెందిన కటికాల శ్రీనివాసులు (60) అనే వ్యక్తి మానసికస్థితి బాగాలేదు. ఆయన 25 ఏళ్ల కిందట ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల ప్రాంతాల్లో ఎంత వెదికినా కనిపించలేదు. అయితే, వివిధ ప్రాంతాల్లో తిరుగుతూ శ్రీనివాసులు తిరుపతి జిల్లా సూళ్లూరుపేట చేరుకున్నాడు. ఇక్కడ తనలో తానే మాట్లాడుకుంటూ తిరుగుతుండగా, ఓ వ్యక్తి పిలిచి ఆరా తీయగా... తన పేరు శ్రీనివాసులు అని, తమది గుంటూరు జిల్లా అని తెలియజేసి ఒక ల్యాండ్‌లైన్ ఫోన్ నంబర్ కూడా చెప్పాడు. దీంతో ఆ వ్యక్తి తన స్నేహితుడైన గ్రీన్‌టెక్ హోటల్ యజమాని చిన్నబ్బాయికి సమాచారం ఇచ్చాడు. చిన్నబ్బాయి చొరవతీసుకుని బుధవారం శ్రీనివాసులు ఇచ్చిన నంబర్‌కు ఫోన్ చేసి విషయం చెప్పగా, అతని బంధువులు సంతోషం వ్యక్తంచేశారు. గురువారం ఉదయం సూళ్లూరుపేటకు చేరుకుని శ్రీనివాసులును చూసి ఆనందంగా తమవెంట తీసుకువెళ్లారు. ఇక లేడనుకున్న వ్యక్తిని తమకు అప్పగించిన చిన్నబ్బాయి, అతని స్నేహితుడికి కృతజ్ఞతలు తెలిపారు.

50వేల టన్నుల కందులు సేకరణ

- తొలిసారి మార్కెట్ రేటుకు నాఫెడ్ కొనుగోలు
- వ్యాపారులతో పోటీపడి రైతుల నుంచి కొనుగోలు
- ఆర్బీకేల ద్వారా కొనుగోలుకు మార్క్‌ఫెడ్ ఏర్పాట్లు
- వచ్చే వారం నుంచి కొనుగోలు.. ఐదు రోజుల్లోనే చెల్లింపులు
- వీడియో కాన్ఫరెన్స్‌లో వెల్లడించిన నాఫెడ్ ఎండీ రితేష్ చౌహాన్

సాక్షి, అమరావతి: ఏపీ తరహాలోనే ధరల స్థిరీకరణ నిధి పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం కందుల కొనుగోలుకు సిద్ధమైంది. దిగుమతులపై ఆధారపడడాన్ని తగ్గించుకోవడంతో పాటు పప్పుధాన్యాలు పండించే రైతుకు అదనపు లాభం సమకూర్చడమే లక్ష్యంగా ప్రస్తుత వ్యవసాయ సీజన్‌లో దేశ వ్యాప్తంగా 10 లక్షల టన్నుల కందులను సేకరించాలని జాతీయ వ్యవసాయ మార్కెటింగ్ సమాఖ్య(నాఫెడ్) లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఇందులో 50వేల టన్నులను ఆర్బీకేల ద్వారా ఏపీ నుంచే సేకరించబోతుంది. తొలిసారి మద్దతు ధరకు మించి రోజువారీ మార్కెట్ రేటుకనుగుణంగా వ్యాపారులతో పోటీపడి రైతులకు అత్యధిక ధర చెల్లించి కందుల సేకరణకు సమాయత్తమవుతున్నది. ఈ మేరకు గురువారం ఢిల్లీ నుంచి నాఫెడ్ మేనేజింగ్ డైరెక్టర్ రితేష్‌చౌహాన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నాఫెడ్, మార్క్‌ఫెడ్ అధికారులకు సూచనలు చేశారు. ఖరీఫ్ సీజన్‌లో 10.97లక్షల ఎకరాల్లో కందులు సాగు చేయగా, మొదటి ముందస్తు అంచనా ప్రకారం 1.88లక్షల టన్నుల దిగుబడులు వస్తాయని అంచనా వేశారు. కాగా ప్రస్తుతం మార్కెట్‌లో ఎమ్మెస్పీకి మించి క్వింటా రూ.9,500 నుంచి 10,500 మధ్య ధర పలుకుతోంది. ఈ నేపథ్యంలో వ్యాపారులతో పోటీ పడి కందులు కొనుగోలు చేయాలని కేంద్రం నిర్ణయించింది. ఏపీలో ధరల స్థిరీకరణ ద్వారా గడిచిన నాలుగున్నరేళ్లలో ఏపీ మార్క్‌ఫెడ్ పెద్ద ఎత్తున పంట ఉత్పత్తులను కొనుగోలు చేయడం ద్వారా రైతులకు గిట్టుబాటుధర దక్కేలా చేస్తున్నది. దీంతో కందుల సేకరణ బాధ్యతలను కూడా ఏపీ మార్క్‌ఫెడ్‌కు అప్పగించింది. వచ్చే వారం నుంచి కొనుగోళ్లు చేపట్టాల్సిందిగా ఆదేశాలు జారీ చేసింది.

సద్వినియోగం చేసుకోవాలి

రాష్ట్రంలో కంది పంట సాగు చేసే రైతులు తమ వివరాలను ఆర్బీకేల్లో నమోదు చేసుకోవాలి. క్వాలిటీని బట్టి బహిరంగ మార్కెట్‌లో ఆరోజు ఉన్న ధరకనుగుణంగానే చెల్లింపులు జరుగుతాయి. సేకరించిన 5 రోజుల్లోనే రైతుల ఖాతాలకు సొమ్ము జమ చేస్తాం.

– వినయ్‌కుమార్, ఏపీ బ్రాంచ్‌మేనేజర్, నాఫెడ్

ఏపీ ఇన్ పార్లమెంట్

రాజ్యసభ

రక్షిత వృక్ష జాతుల్లో ఎర్రచందనం

- వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి ప్రశ్నకు కేంద్రం సమాధానం



సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లోని కొన్ని జిల్లాల్లో మాత్రమే పెరిగే ఎర్రచందనం వృక్షాలను రాష్ట్ర ప్రభుత్వం రక్షిత వృక్ష జాతిగా, అరుదైన చెట్లున్న ప్రాంతాలను రక్షిత ప్రాంతాలుగా ప్రకటించినట్లు కేంద్ర అడవులు, పర్యావరణ శాఖ సహాయ మంత్రి అశ్విని కుమార్ చౌబే తెలిపారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి ఈమేరకు లిఖితపూర్వక సమాధానమిచ్చారు. అంతరించిపోతున్న జంతు, వృక్ష జాతుల అంతర్జాతీయ వాణిజ్య ఒడంబడిక జాబితాలో ఎర్రచందనాన్ని చేర్చిన కారణంగా ఇది అంతర్జాతీయ వాణిజ్యాన్ని నియంత్రిస్తుందని చెప్పారు. కన్వెన్షన్ ఆన్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఇన్ ఎన్‌డేంజరస్ స్పీసెస్ (సైట్స్) స్టాండింగ్ కమిటీ ఎర్రచందనాన్ని ముఖ్యమైన వాణిజ్య ప్రక్రియ సమీక్ష నుంచి తొలగించాలని సూచించిందన్నారు. గ్రామీణ ప్రజలు, చిన్న, సన్నకారు రైతులకు ఉపాధి, ఆదాయ మార్గాల సృష్టి, ఉత్పాదకత మెరుగుపరచడానికి పరిపూర్ణమైన, సమగ్ర పద్ధతిలో చెట్ల పెంపకాన్ని విస్తరించే లక్ష్యంతో ఆగ్రో ఫారెస్ట్రీని ప్రోత్సహించేలా కేంద్రం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. ఆగ్రో ఫారెస్ట్రీలో భాగంగా ఎర్రచందనం, టేకు వంటి వృక్ష జాతులను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు.

పులికాట్ సరస్సు నిర్వహణకు ప్రణాళిక



ఆంధ్రప్రదేశ్, తమిళనాడు సరిహద్దుల్లోని పులికాట్ సరస్సు సహా చిత్తడి నేలల నిర్వహణకు ఇంటిగ్రేటెడ్ మేనేజ్‌మెంట్ ప్లాన్ (ఐఎంపీ) ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాలను కోరినట్లు మంత్రి అశ్వినికుమార్ చౌబే తెలిపారు. రాయదొరువు వద్ద సరస్సు ప్రవేశ ద్వారం నీటి ప్రవాహాన్ని అధ్యయనం చేయడంతోపాటు, ఇతరత్రా రక్షణ చర్యలను రెండు రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్నాయని వైఎస్సార్‌సీపీ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నకు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో వివరించారు.

ఆ న్యాయమూర్తుల వివరాలు ప్రత్యేకంగా లేవు



సుప్రీంకోర్టు, హైకోర్టుల్లో న్యాయమూర్తుల నియామకంలో ఎలాంటి రిజర్వేషన్లు లేవని, అందువల్ల ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ న్యాయమూర్తుల వివరాలేమీ ప్రత్యేకంగా నిర్వహించడం లేదని కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ సభ్యులు పిల్లి సుభాష్‌చంద్ర బోస్, ఆర్.కృష్ణయ్య ప్రశ్నకు మంత్రి ఈమేరకు లిఖితపూర్వక సమాధానమిచ్చారు.

కులగణన చేపట్టడానికి భయపడుతున్నారా?

కేంద్రానికి జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య ప్రశ్న



సాక్షి, న్యూఢిల్లీ: దేశంలో కులగణన చేపట్టడానికి భయం ఎందుకు? అని కేంద్రాన్ని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ప్రశ్నించారు. బీసీ కులగణన చేపట్టాలంటూ గురువారం ఢిల్లీలో బీసీ సంఘాల నేతలు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. జనగణనలో బీసీ కులగణన కూడా చేపట్టాలని డిమాండ్ చేశారు. బీసీ కమిషన్‌లు కులగణన చేపట్టాలని సిఫారసు చేసినా కేంద్రం పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. రిజర్వేషన్లకు బీజేపీ ప్రభుత్వం వ్యతిరేకమా? అని నిలదీశారు. ఈ వైఖరి మార్చుకోకపోతే బీసీలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఏపీతో పాటు పలు రాష్ట్రాలు కులగణన చేపట్టాయని గుర్తుచేశారు. దేశంలో బీసీ కులగణన చేపట్టే వరకు, చట్ట సభల్లో బీసీలకు రిజర్వేషన్లు అమలు చేసేవరకు ఈ పోరాటం కొనసాగిస్తామని ఆర్.కృష్ణయ్య స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, మారేష్, మహేందర్, కర్రి వేణుమాధవ్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీలో 4096.65 మెగావాట్ల పవన విద్యుత్తు

లోక్‌సభ



సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో 4096.65 మెగావాట్ల పవన విద్యుత్తు ఇన్‌స్టాల్ చేసినట్లు కేంద్ర పునరుత్పాదక ఇంధన వనరుల శాఖ మంత్రి ఆర్కే సింగ్ తెలిపారు. 120 మీటర్ల ఎత్తులో 74,906 మెగావాట్లు, 150 మీటర్ల ఎత్తులో 1,23,336 మెగావాట్ల పవన విద్యుత్తు ఉత్పత్తి చేసే సామర్థ్యం ఏపీలో ఉందని వైఎస్సార్‌సీపీ సభ్యుడు పోచ బ్రహ్మానందరెడ్డి ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లో 4,555.20 మెగావాట్ల సౌర విద్యుత్తు ఇన్‌స్టాల్ అయినట్లు వైఎస్సార్‌సీపీ సభ్యుడు కోటగిరి శ్రీధర్ ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిచ్చారు.

ఏపీలో ఎస్ఏటీఏటీ కమిటీ



కంప్రెస్డ్ బయో గ్యాస్ (సీబీజీ) ప్లాంట్ల ఏర్పాటుకు, ఉత్పత్తి చేసిన సీబీజీని ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలకు ఆటోమోటివ్, ఇండస్ట్రియల్ ఇంధనాలుగా విక్రయించడానికి ప్రోత్సహించే సస్టయినబుల్ ఆల్టర్నేటివ్ టువర్డ్స్ అఫర్డబుల్ ట్రాన్స్‌పోర్టేషన్ (ఎస్ఏటీఏటీ) పర్యవేక్షణ కమిటీని ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేశామని కేంద్ర పెట్రోలియం సహజవనరుల శాఖ సహాయ మంత్రి రామేశ్వర్ తేలి తెలిపారు. వైఎస్సార్‌సీపీ సభ్యుడు బాలశౌరి అడిగిన ప్రశ్నకు ఆయన లిఖితపూర్వక సమాధానమిచ్చారు.

విజయవాడ-గుండుగొలను ఆరులేన్ల ఆలస్యం



జాతీయ రహదారి–16లోని విజయవాడ– గుండుగొలను తొలి రెండు ప్యాకేజీలు పూర్తయ్యాయని, మూడు, నాలుగు ప్యాకేజీలు వివిధ కారణాలతో ఆలస్యమవుతున్నాయని కేంద్ర రవాణా శాఖ మంత్రి గడ్కరీ తెలిపారు. కరోనా, వర్షాలు, సామగ్రి తరలింపు, భూసేకరణపై కోర్టు కేసులు తదితర కారణాలతో ఆలస్యం అవుతోందని వైఎస్సార్‌సీపీ సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలు ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిచ్చారు.

ఆయిల్‌పామ్‌కు రూ.20 వేల మద్దతు ధర ఇవ్వాలి



భారత ప్రభుత్వం ఆయిల్ పామ్ రైతులకు టన్నుకు రూ.20 వేలు మద్దతు ధర ఇవ్వాలని ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ కోరారు. జీరో అవర్‌లో ఆయన మాట్లాడుతూ రైతుల ప్రయోజనాల దృష్ట్యా ఎడిబుల్ ఆయిల్ స్వయం సమృద్ధి దృష్ట్యా లభ్యతను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. లభ్యత ధరకు కాయల వాటాను చేర్చాలని కోరారు. ఇటీవలి కాలంలో ఎరువులు, కూలీల ధర రెట్టింపు కావడం వల్ల ఆయిల్‌పామ్ సాగు ఖర్చు టన్నుకు రూ.18 వేలు ఉందని, అందువల్ల రూ.20 వేలు లాభదాయకమైన ధర ఉండాలని, లేకుంటే రైతులు తోటలను తొలగించే పరిస్థితి వస్తుందని తెలిపారు.

తెలంగాణ

తెలంగాణ స్పీకర్‌గా గడ్డం ప్రసాద్‌కుమార్

- ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించిన ప్రొటెం స్పీకర్ అక్బరుద్దీన్ ఒవైసీ
- గడ్డంను స్పీకర్ స్థానంలో కూర్చోబెట్టిన సీఎం, డిప్యూటీ సీఎం, ప్రతిపక్ష సభ్యులు
- బీఆర్ఎస్, ఎంఐఎం, సీపీఐ సభ్యులకు సీఎం ధన్యవాదాలు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీ స్పీకర్‌గా గడ్డం ప్రసాద్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం ఉదయం శాసనసభ సమావేశం కాగానే ప్రొటెం స్పీకర్ అక్బరుద్దీన్ ఒవైసీ ఈ మేరకు అధికారికంగా ప్రకటించారు. ప్రసాద్‌కుమార్‌కు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రతిపక్ష సభ్యులు అభినందనలు తెలిపారు. అనంతరం సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ తదితరులు స్పీకర్‌ను గౌరవ పూర్వకంగా తోడ్కొని వెళ్లి ఆయన కుర్చీలో కూర్చోబెట్టారు. ఆ తర్వాత వరుసగా మంత్రులు, ఎమ్మెల్యేలు స్పీకర్ చైర్ వద్దకు వచ్చి ప్రసాద్‌కుమార్‌కు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. స్పీకర్ ఏకగ్రీవ ఎన్నికకు మద్దతు తెలిపిన బీఆర్ఎస్, ఎంఐఎం, సీపీఐ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. మంచి సంప్రదాయానికి అందరూ మద్దతు తెలిపారని, భవిష్యత్‌లో కూడా ఇలాగే కొనసాగాలని ఆకాంక్షించారు. గొప్ప వ్యక్తి స్పీకర్ అయ్యారని కొనియాడారు. ప్రతిపక్ష, పాలకపక్షం అందరూ కుటుంబ సభ్యులేనన్నారు. కాగా, స్పీకర్ ఎన్నిక విషయంలో మద్దతు ఇవ్వాలని మంత్రి శ్రీధర్ బాబు అడగగానే సంపూర్ణ మద్దతు ఇవ్వాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశించారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ తెలిపారు.

పార్టీల బలాలను బట్టి సమయం: స్పీకర్

తనను స్పీకర్‌గా ఎంపిక చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి ప్రసాద్‌కుమార్ ధన్యవాదాలు తెలిపారు. ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు అన్ని పార్టీలకు కృతజ్ఞతలు తెలిపారు. 57 మంది కొత్త సభ్యులు ఉన్నారంటూ.. పార్టీల బలాలను బట్టి సమయం కేటాయిస్తానని చెప్పారు. కాగా, ప్రొటెం స్పీకర్‌గా అక్బరుద్దీన్ నియామకాన్ని వ్యతిరేకిస్తూ బీజేపీ ఎమ్మెల్యేలు మొదటి రోజు అసెంబ్లీకి గైర్హాజరైన సంగతి తెలిసిందే. ఎమ్మెల్యేలుగా ప్రమాణ స్వీకారానికి సైతం దూరంగా ఉన్న వారు గురువారం స్పీకర్ ప్రసాద్‌కుమార్ సమక్షంలో ఎమ్మెల్యేలుగా ప్రమాణ స్వీకారం చేశారు.

నేడు అసెంబ్లీకి గవర్నర్ తమిళిసై

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ శాసనసభ, శాసనమండలి సంయుక్త సమావేశం శుక్రవారం ఉదయం 11.30కు శాసనసభ సమావేశ మందిరంలో జరుగుతుంది. రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. ఈ సమావేశం ప్రారంభానికి ఐదు నిమిషాల ముందే గవర్నర్ అసెంబ్లీ ప్రాంగణానికి చేరుకుంటారు. స్పీకర్ ప్రసాద్‌కుమార్‌తో పాటు సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తదితరులు స్వాగతం పలుకుతారు. జాతీయ గీతాలాపన అనంతరం గవర్నర్ ప్రసంగిస్తారు. తమిళిసై ప్రసంగం సుమారు గంటకు పైగా ఉండే అవకాశముందని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఆ తర్వాత ఉభయ సభలు శనివారానికి వాయిదా పడనున్నాయి. శనివారం శాసనసభ, శాసనమండలి వేర్వేరుగా సమావేశమై గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చించి ఆమోదిస్తాయి. కాగా అసెంబ్లీ సమావేశాలు ఎన్ని రోజులు కొనసాగే అవకాశముందనే అంశంపై శుక్రవారం స్పీకర్ అధ్యక్షతన జరిగే బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బీఏసీ) భేటీలో నిర్ణయిస్తారు. అయితే బీఏసీ ఏర్పాటు కాకపోవడంతో దీనిపై కూడా శుక్రవారమే స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

హెచ్ఐవీ నియంత్రణకు కొత్త ఔషధాలు

- సాంక్రమిక వ్యాధుల నిపుణులు మోనాలిసా సాహు వెల్లడి

సాక్షి, హైదరాబాద్: హెచ్ఐవీని నియంత్రించేందుకు కొత్త ఔషధాలు అందుబాటులోకి వచ్చాయని, వ్యాధి బారినపడిన వారికి వీటితో మంచి ఫలితం ఉంటుందని ప్రముఖ సాంక్రమిక వ్యాధుల నిపుణులు డాక్టర్ మోనాలిసా సాహు తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. 'ఇంటిగ్రేస్ స్ట్రాండ్ ట్రాన్స్‌ఫర్ ఇన్‌హిబిటర్స్ (ఐఎన్ఎస్‌టీఐ)' ఔషధాలు బాధితుల శరీరంలో హెచ్ఐవీ వైరస్ స్థాయిలను గణనీయంగా తగ్గించాయని వివరించారు. ఈ ఐఎన్ఎస్‌టీఐ, డోలుటెగ్రావిర్ వంటివి వైరస్‌ను అణచివేస్తాయని తెలిపారు. మన దేశంలో 24 లక్షల మంది హెచ్ఐవీతో బాధపడుతున్నారని, బాధితుల సంఖ్యలో భారత్ ప్రపంచంలో 3వ స్థానంలో ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. 2021లో విడుదలైన నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ నివేదిక ప్రకారం.. దేశంలో హెచ్ఐవీ ఏటా 62 వేల మందికి సోకుతోందని డాక్టర్ మోనాలిసా సాహు తెలిపారు. ఎయిడ్స్ సంబంధిత మరణాల సంఖ్యను 2021లో 41,000గా అంచనా వేశారన్నారు. ఇప్పటికీ హెచ్ఐవీ గుర్తింపు, సత్వర చికిత్స అందించటం ప్రధాన సవాలుగా ఉందన్నారు. డోలుటెగ్రావిర్‌ను కలిగి ఉన్న కొత్త అధునాతన ఐఎన్ఎస్‌టీఐ ఆధారిత ఔషధాలు హెచ్ఐవీ చికిత్సలో మంచి ఫలితాలను చూపుతున్నాయని తెలిపారు. కొత్త చికిత్స అవకాశాలు రోగులకు సౌకర్యవంతంగా ఉంటాయని, ఖర్చు కూడా తగ్గుతుందని వైరాలజిస్ట్ మేకా సత్యనారాయణ తెలిపారు.

సభలో గందరగోళం..!

భద్రతా వైఫల్యంపై ఆందోళనలు, నినాదాలతో దద్దరిల్లిన ఉభయ సభలు

- ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా వివరణ ఇవ్వాలి
- లోక్‌సభ, రాజ్యసభలో ప్రతిపక్ష సభ్యుల డిమాండ్
- లోక్‌సభ నుంచి 13 మంది, రాజ్యసభ నుంచి ఒక విపక్ష ఎంపీ సస్పెన్షన్
- శీతాకాల సమావేశాల్లో మిగిలిన సెషన్ మొత్తం సభకు రావొద్దని స్పష్టీకరణ

న్యూఢిల్లీ: పార్లమెంట్‌లో చోటుచేసుకున్న భద్రతా వైఫల్యంపై గురువారం ఉభయ సభలు అట్టుడికిపోయాయి. ప్రతిపక్ష సభ్యులు కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. బుధవారం జరిగిన అవాంఛనీయ ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా తక్షణమే వివరణ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ లోక్‌సభ, రాజ్యసభలో తీవ్ర అలజడి సృష్టించారు. వెల్‌లోకి దూసుకొచ్చి బిగ్గరగా నినాదాలు చేశారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే ప్రకటన చేయాలని పట్టుబట్టారు. అరుపులు, కేకలతో లోక్‌సభ, రాజ్యసభ హోరెత్తిపోయాయి. తీవ్ర గందరగోళం నెలకొంది. ఉభయ సభలను పలుమార్లు వాయిదా వేసినా పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో లోక్‌సభ నుంచి 13 మంది విపక్ష ఎంపీలపై, రాజ్యసభలో ఒక ప్రతిపక్ష ఎంపీపై సస్పెన్షన్ వేటు పడింది. ప్రస్తుత శీతాకాల సమావేశాల్లో మిగిలిన సెషన్ మొత్తం వారు సభకు హాజరు కాకూడదని లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ చైర్మన్ స్పష్టం చేశారు.


నిరసన తెలుపుతున్న డెరెక్ ఓబ్రెయిన్

లోక్‌సభలో నినాదాల హోరు

లోక్‌సభ గురువారం ఉదయం ప్రారంభం కాగానే ప్రతిపక్ష సభ్యులు నినాదాలు ప్రారంభించారు. వెల్‌లోకి దూసుకొచ్చారు. వెనక్కి వెళ్లాలని స్పీకర్ పదేపదే కోరినా వారు వినిపించుకోలేదు. దీంతో సభను మధ్యాహ్నం 2 గంటల దాకా వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ చెప్పారు. సభ పునఃప్రారంభమైన తర్వాత కూడా విపక్ష ఎంపీలు శాంతించలేదు. దీంతో సభా కార్యకలాపాలకు అడ్డు తగులుతున్న ఐదుగురు విపక్ష ఎంపీలను సస్పెండ్ చేయాలని కోరుతూ పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషీ ఒక తీర్మానం ప్రవేశపెట్టారు. టీఎన్ ప్రతాపన్, హిబీ ఎడెన్, జోతీమణి, రమ్య హరిదాస్, డీన్ కురియాకోస్‌పై సస్పెన్షన్ వేటు వేస్తున్నట్లు స్పీకర్ తెలిపారు. అనంతరం సభ మధ్యాహ్నం 3 గంటల వరకు వాయిదా పడింది. సభ మళ్లీ ప్రారంభమయ్యాక కూడా పరిస్థితిలో మార్పు రాలేదు. దాంతో ప్రహ్లాద్ జోషీ మరో తీర్మానం ప్రవేశపెట్టారు. 9 మంది విపక్ష సభ్యులను సస్పెండ్ చేయాలని స్పీకర్‌ను కోరారు. వీకే శ్రీకందన్, బెన్నీ బెహనన్, మొహమ్మద్ జావెద్, పీఆర్ నటరాజన్, కనిమొళి, కె.సుబ్బరాయన్, ఎస్ఆర్ పార్తీబన్, ఎస్.వెంకటేశన్, మాణిక్కం ఠాగూర్‌ను సభ నుంచి స్పీకర్ సస్పెండ్ చేశారు. సభను శుక్రవారానికి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. పార్లమెంట్ ప్రాంగణంలో భద్రతను పర్యవేక్షించే బాధ్యత లోక్‌సభ సెక్రెటేరియట్‌దేనని స్పీకర్ ఓంబిర్లా చెప్పారు. సభ వాయిదా పడిన తర్వాత పలువురు విపక్ష సభ్యులు సభలోనే ఉండి ఆందోళన కొనసాగించారు. ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.


సస్పెండ్ అయ్యాక బయటికొస్తున్న విపక్ష సభ్యులు

ఎగువ సభలో తీవ్ర అలజడి

పార్లమెంట్‌లో భద్రతా వైఫల్యంపై రాజ్యసభలోనూ విపక్షాలు ఆందోళనకు దిగాయి. ప్రభుత్వం తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశాయి. ఈ రోజు మిగతా కార్యకలాపాలను పక్కనపెట్టి, కేవలం భద్రతా వైఫల్యంపైనే సభలో చర్చ చేపట్టాలని పలువురు ఎంపీలు గురువారం ఉదయం 28 నోటీసులు ఇచ్చారు. వీటిని తిరస్కరిస్తున్నట్లు రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ తేల్చిచెప్పారు. సభకు సహకరించాలని కోరారు. ప్రతిపక్ష సభ్యులు వెల్‌లోకి ప్రవేశించి, నినాదాలు చేస్తుండడంతో సభ పలుమార్లు వాయిదా పడింది. మధ్యాహ్నం సభ పునఃప్రారంభమైన తర్వాత కూడా పరిస్థితి అదుపులోకి రాలేదు. తృణమూల్ కాంగ్రెస్ పార్టీ(టీఎంసీ) ఎంపీ డెరెక్ ఓబ్రెయిన్ చైర్మన్ వేదిక ముందుకు చేరుకొని, గాల్లోకి చేతులు విసురుతూ గట్టిగా అరిచారు. ఆయన తీరుపై చైర్మన్ ధన్‌ఖడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సభను ధిక్కరిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. డెరెక్ ఓబ్రెయిన్‌ను సభ నుంచి సస్పెండ్ చేయడానికి రూల్ 256 కింద తీర్మానం ప్రవేశపెట్టడానికి బీజేపీ పక్షనేత పీయూష్ గోయల్‌కు అనుమతి ఇచ్చారు. పీయూష్ గోయల్ తీర్మానం ప్రవేశపెట్టడం, మూజువాణి ఓటుతో ఆమోదం పొందడం, డెరెక్ ఓబ్రెయిన్‌పై సస్పెన్షన్ వేటు వేయడం వెంటనే జరిగిపోయాయి. ఆయనను ఈ సెషన్‌లో మిగిలిన కాలమంతా స్పెండ్ చేస్తున్నట్లు చైర్మన్ వెల్లడించారు. సస్పెండ్ అయినప్పటికీ బయటకు వెళ్లకుండా సభలోనే కూర్చున్న డెరెక్ ఓబ్రెయిన్‌పై ధన్‌ఖడ్ అసహనం వ్యక్తం చేశారు. నియమ నిబంధనలు పాటించాలని హితవు పలికారు. అయినా ఓబ్రెయిన్ వినిపించుకోలేదు. రాజ్యసభను శుక్రవారానికి వాయిదా వేస్తున్నట్లు చైర్మన్ ధన్‌ఖడ్ చెప్పారు. ఇదిలా ఉండగా, సభ నుంచి సస్పెండ్‌చేసినా బయటకు వెళ్లకుండా నిబంధనలను ఉల్లంఘించిన డెరెక్ ఓబ్రెయిన్ తీరుపై విచారణ జరపాలని సభా హక్కుల కమిటీకి జగదీప్ ధన్‌ఖడ్ సిఫార్సు చేశారు.

ప్రజాస్వామ్యాన్ని సస్పెండ్ చేశారు: కాంగ్రెస్

పార్లమెంట్ ఉభయ సభల నుంచి గురువారం మొత్తం 14 మంది ఎంపీలను సస్పెండ్‌చేయడంపై ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. విపక్ష ఎంపీలను కాదు, దేశ ప్రజాస్వామ్యాన్ని బీజేపీ ప్రభుత్వం సస్పెండ్ చేసిందని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. పార్లమెంట్‌లో భద్రతా వైఫల్యంపై ప్రభుత్వం నుంచి సమాధానం కోరినందుకు ప్రతిపక్ష ఎంపీలను సభ నుంచి సస్పెండ్‌చేయడం అప్రజాస్వామికం, భయానక చర్య అని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్ విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని కేంద్ర ప్రభుత్వం హత్య చేసిందని, పార్లమెంట్‌ను రబ్బర్ స్టాంప్ స్థాయికి దిగజార్చిందని దుయ్యబట్టారు. ఈ మేరకు గురువారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. ఆగంతకులు పార్లమెంట్‌లోకి ప్రవేశించేందుకు కారణమైన బీజేపీ ఎంపీపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆక్షేపించారు.

సభలో లేకున్నా సస్పెన్షన్



లోక్‌సభలో రెండో విడతలో సస్పెండైన విపక్ష ఎంపీల్లో తమిళనాడుకు చెందిన ఎస్ఆర్ పార్తీబన్ పేరు కూడా ఉంది. వాస్తవానికి ఆయన గురువారం సభకు రాలేదని, చెన్నైలో ఉన్నారని ప్రతిపక్ష సభ్యులు చెప్పారు. సభలో లేని ఎంపీని సస్పెండ్ చేయడం ఏమిటని ప్రశ్నించారు. దీనిపై కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషీ స్పందించారు. పొరపాటు జరిగిందని అంగీకరించారు. ఆయన పేరును తొలగిస్తున్నట్లు చెప్పారు. పార్తీబన్‌పై సస్పెన్షన్ వేటును స్పీకర్ ఉపసంహరించినట్లు తెలిపారు. గురువారం లోక్‌సభ నుంచి మొత్తం 13 మందిని సస్పెండ్ చేసినట్లు వెల్లడించారు. బుధవారం నాటి ఘటనపై ఉన్నతస్థాయి విచారణ జరిపిస్తామన్నారు.



కాఫీకి చైనా జై

అమెరికా కంటే చైనాలోనే అత్యధిక కాఫీ ఔట్‌లెట్లు | **'వరల్డ్ కాఫీ పోర్టల్' సర్వేలో వెల్లడి**

తేనీరు... ప్రపంచంలో ఈ పానీయం గురించి తెలియనివారు ఉండరు. తేనీరు డ్రాగన్ దేశం చైనాలో పుట్టిందన్న వాదన కూడా ఉంది. ఈ ఉష్ణోదకం సేవించడంలో చైనీయులు ముందంజలో ఉంటారు. కానీ, ఇప్పుడా పరిస్థితి మారిపోయింది. చైనా ప్రజలు ఇప్పుడు కాఫీపై మక్కువ పెంచుకుంటున్నారు. సాక్షాత్తూ 'వరల్డ్ కాఫీ పోర్టల్' నిర్వహించిన తాజా సర్వేలో ఈ విషయం బహిర్గతమైంది. బ్రాండెడ్ కాఫీ షాప్ మార్కెట్ విషయంలో అమెరికాను చైనా మించిపోయిందని 'వరల్డ్ కాఫీ పోర్టల్' వెల్లడించింది. అమెరికాలో కంటే చైనాలోనే అత్యధిక కాఫీ ఔట్‌లెట్లు ఉన్నాయని తెలియజేసింది. ప్రపంచంలో రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలుస్తున్న చైనాలో కాఫీ ప్రేమికుల పెరిగిపోతోందని, కేవలం గత 12 నెలల వ్యవధిలోనే కాఫీ ఔట్‌లెట్ల సంఖ్య 58 శాతం పెరిగిందని పేర్కొంది. ప్రసుతం చైనాలో 49,691 బ్రాండెడ్ కాఫీ దుకాణాలు ఉన్నాయని వివరించింది.

- ప్రఖ్యాత స్టార్‌బక్స్ సంస్థ గత ఏడాది వ్యవధిలో చైనాలో కొత్తగా 785 కాఫీ దుకాణాలు తెరిచింది. చైనాలో రూ.1,660 కోట్లకుపైగా పెట్టుబడులు పెట్టింది. అమెరికా బయట స్టార్‌బక్స్ ఈ స్థాయిలో పెట్టుబడులు పెట్టడం ఇదే మొదటిసారి. ప్రపంచవ్యాప్తంగా తమకు రెండో అతిపెద్ద మార్కెట్ చైనాయేనని స్టార్‌బక్స్ స్పష్టం చేసింది.
- చైనాలో కాఫీలను విక్రయించడంలో స్టార్టప్ కంపెనీ 'లకిన్ కాఫీ'దే పైచేయి. ఈ సంస్థకు దేశంలో 13,000కుపైగా ఔట్‌లెట్లు ఉన్నాయి.
- సర్వేలో భాగంగా 4,000 మంది కాఫీ ప్రియులను ప్రశ్నించారు. వీరిలో 90 శాతం మంది వారానికోసారి హాట్ కాఫీ తాగుతామని చెప్పారు. వారానికి ఒక్కసారైనా ఐస్డ్ కాఫీ తీసుకుంటామని 64 శాతం మంది తెలిపారు.
- ప్రతివారం కాఫీ షాప్‌నకు వెళ్తాం లేదా ఆర్డర్ చేసి తెప్పించుకుంటామని 90 శాతం మంది వెల్లడించారు.
- చైనాలో ఇటీవలికాలంలో ఆర్థిక ప్రగతి కొంత నెమ్మదించింది. అయినప్పటికీ ప్రపంచ కాఫీ పరిశ్రమగా చైనా ఎదుగుతుండడం విశేషం.
- చైనాలో తమ కంపెనీ ప్రస్థానం ఇంకా ప్రాథమిక దశలోనే ఉందని స్టార్‌బక్స్ సీఈఓ లక్ష్మణ్ నరసింహన్ చెప్పారు. 2025 నాటికి చైనాలో 9,000 కాఫీ దుకాణాలు ప్రారంభించాలని స్టార్‌బక్స్ లక్ష్యంగా పెట్టుకుంది.

– సాక్షి, నేషనల్ డెస్క్

నెలసరి లీవ్ అవసరం లేదు

అది వైకల్యం కాదు • స్మృతి ఇరానీ స్పష్టీకరణ



న్యూఢిల్లీ: ప్రభుత్వ మహిళా ఉద్యోగులకు నెలసరి రోజుకు వేతనంతో కూడిన సెలవుదినంగా కొన్ని దేశాల్లో పాటిస్తున్నారు. భారత్‌లోనూ మహిళా ఉద్యోగులకు నెలసరికి పెయిడ్ లీవ్ ఇవ్వాలన్న డిమాండ్ పెరిగిన నేపథ్యంలో కేంద్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మహిళా మంత్రి స్మృతి ఇరానీ ఒక స్పష్టతనిచ్చారు. జనతాదళ్(యూ) సభ్యుడు మనోజ్ కుమార్ ఝా రాజ్యసభలో అడిగిన ఒక ప్రశ్నకు సమాధానంగా స్మృతి వివరణ ఇచ్చారు. ''నెలసరి అనేది మహిళల జీవితంలో ఒక సహజ ప్రక్రియ. అదేం వైకల్యం కాదు. దీనికి ప్రత్యేకంగా వేతనంతో కూడిన సెలవు దినం ప్రకటించాల్సిన అవసరం లేదు. నెలసరిని ప్రత్యేక సెలవు ఇవ్వాల్సిన సందర్భంగా పరిగణించకూడదు. నెలసరిని ఒక ఆటంకంగా కూడా భావించకూడదు. ఒకవేళ ఉద్యోగినులకు ఒక పెయిడ్ లీవ్ ఇస్తే తోటి పురుషులు తమకు ఒక సెలవు లభించలేదే అని భావించి పని ప్రదేశాల్లో వివక్షపూరిత వాతావరణం నెలకొనే ప్రమాదం ఉంది'' అని ఇరానీ వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా నెలసరి శుభ్రత విధాన ముసాయిదాను కేంద్రం తీసుకొచ్చిందని ఆమె గుర్తుచేశారు. 10–19 ఏళ్ల టీనేజర్లలో నెలసరి శుభ్రతపై అవగాహన పెంచేందుకు కేంద్రం ఇప్పటికే ప్రత్యేక పథకాన్ని అమలుచేస్తోందని ఆమె వెల్లడించారు. మరోవైపు, ''నెలసరి రోజుల్లో చాలా మంది ఉద్యోగినులు ఇబ్బందులు పడుతూ అది పని ప్రదేశాల్లో ఉత్పత్తిపై ప్రభావం చూపుతోంది. వీరికి నెలసరి సెలవు లేదా సిక్ లీవ్ లేదా నెలకో సంవత్సరానికో సగం వేతనంతో కూడిన సెలవు ఇవ్వొచ్చు'' అని సిబ్బంది, శిక్షణ వ్యవహారాలు, న్యాయ, సాధికారత వ్యవహారాల పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఒక నివేదికలో పేర్కొనడం గమనార్హం.



కన్నబిడ్డల మృతి కేసులో ఆస్ట్రేలియా మహిళ..

20 ఏళ్లకు విముక్తి

సిడ్నీ: కన్నబిడ్డల మృతి కేసులో 20 ఏళ్లపాటు కారాగారంలో మగ్గిన ఆస్ట్రేలియా మహిళకు ఎట్టకేలకు విముక్తి లభించింది.న్యూ సౌత్ వేల్స్‌లోని క్రిమినల్ కోర్టు ఆదేశాలతో గురువారం ఆమె విడుదలయ్యారు. కాథ్లీన్ ఫాల్బిగ్‌కు జన్మించిన నలుగురు సంతానం 1989–1999 సంవత్సరాల మధ్య వివిధ కారణాలతో చనిపో యారు. అయితే, వారి మరణాలకు తల్లి కాథ్లీనే కారణమంటూ పోలీసులు 2003లో హత్య కేసు నమోదు చేసి, జైలు శిక్ష విధించారు. తాను అమాయకురాలినని, తన బిడ్డల మరణాలు సహజంగానే జరిగినవని ఆమె ఎంతగా చెప్పినా ఎవరూ వినలేదు. మీడియా ఆమెను వరస్ట్ ఫిమేల్ సీరియల్ కిల్లర్‌గా అభివర్ణించింది. 2019లో మరోసారి జరిగిన దర్యాప్తులోనూ ఆమెనే దోషిగా తేలింది. 2022లో మాజీ న్యాయాధికారి జరిపిన విచారణలో మాత్రం..చనిపోయిన నలుగురు బిడ్డల్లో ఇద్దరు జన్యు సంబంధ వ్యాధులతోనే చనిపోయి ఉండొచ్చంటూ తెలిపింది. దీంతో, ఈ ఏడాది జూన్‌లో ఆమెకు కోర్టు క్షమాభిక్ష ప్రకటించింది. ఆమెపై వచ్చిన ఆరోపణలను న్యూ సౌత్ వేల్స్ కోర్టు కొట్టివేస్తూ జైలు నుంచి విడుదల చేసింది. జైలు నుంచి విడుదలైన కాథ్లీన్ ఫాల్బిగ్ హర్షం వ్యక్తం చేశారు. 1999లోనే తనపై మోపిన ఆరోపణలకు జవాబులు దొరికినా, నిరపరాధినని నిరూపించుకోలేకపోయాను. పిల్లలు ఆకస్మికంగా, గుర్తు తెలియని కారణాలతో చనిపోయే అవకాశం ఉందని భావించని యంత్రాంగం నన్ను దోషిగా చూసింది'అని పేర్కొన్నారు. రెండు దశాబ్దాలపాటు తనను నిర్బంధించిన యంత్రాంగం నుంచి భారీగా పరిహారం కోరుతూ దావా వేస్తానన్నారు. ఫాల్బిగ్‌ను విడుదల చేయాలంటూ పలువురు వైద్య నిపుణులు, వైద్యులు పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాలను సైతం చేపట్టారు.

బోయిమ్, అవ్వాద్‌లకు ఇందిరా గాంధీ శాంతి బహుమతి

న్యూఢిల్లీ: ఇజ్రాయెల్–పాలస్తీనా సమస్యకు శాంతియుత పరిష్కారం కనుగొనడంలో కృషి సాగిస్తున్న డేనియల్ బరెన్‌బోయిమ్, అలీ అబు అవ్వాద్‌లకు 2023 సంవత్సరం ఇందిరా గాంధీ శాంతి బహుమతిని ప్రకటించారు. అర్జెంటీనాలో జన్మించిన సంగీత కళాకారుడు బరెన్‌బోయిమ్, పాలస్తీనాకు చెందిన ప్రముఖ ఉద్యమకారుడు. వీరిద్దరికీ కలిపి సంయుక్తంగా ఇందిరాగాంధీ శాంతి, నిరాయుధీకరణ, సామాజికాభివృద్ధి బహుమతిని ప్రదానం చేసినట్లు కమిటీ జ్యూరీ చైర్మన్ మాజీ ప్రధాన న్యాయమూర్తి టీఎస్ ఠాకూర్ చెప్పారు. వీరిద్దరూ మధ్యప్రాచ్యంలో దశాబ్దాలుగా నలుగుతున్న సమస్యకు శాంతియుత పరిష్కారం కనుగొనేందుకు కృషి సాగిస్తున్నారని ఇందిరా గాంధీ మెమోరియల్ ట్రస్ట్ ప్రశంసించింది.

మహారాష్ట్రలో ఎన్‌కౌంటర్.. ఇద్దరు మావోయిస్టులు మృతి

నాగ్‌పూర్: మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో గురువారం జరిగిన ఎన్‌కౌంటర్ మావోయిస్టు సీనియర్ నేత సహా ఇద్దరు నక్సల్స్ చనిపోయారు. ఛత్తీస్‌గఢ్– మహారాష్ట్ర సరిహద్దుల్లోని బోధింటొలా ప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు పోలీసులు కూంబింగ్ చేపట్టారు. ఈ సమయంలో మావోయిస్టులు వారిపైకి కాల్పులకు దిగారు. ఎదురుకాల్పుల్లో కసన్‌సూర్ దళం డిప్యూటీ కమాండర్ దుర్గేశ్ వట్టి, మరో గుర్తు తెలియని మావోయిస్టు చనిపోయారు.

ఛత్తీస్‌గఢ్‌లో పేలిన మందు పాతర.. నేలకొరిగిన బీఎస్ఎఫ్ జవాన్

కాంకేర్: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కాంకేర్ జిల్లాలో మావోయిస్టులు అమర్చిన మందు పాతర పేలి ఒక బీఎస్ఎఫ్ జవాను వీర మరణం పొందారు. పర్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సడక్‌టోలా గ్రామ సమీపంలో కూంబింగ్ జరుపుతుండగా గురువారం ఈ ఘటన చోటుచేసుకుంది. పేలుడులో ఉత్తరప్రదేశ్‌కు చెందిన బీఎస్ఎఫ్ హెడ్ కానిస్టేబుల్ అఖిలేశ్ రాయ్(45) చనిపోయారని అధికారులు తెలిపారు. ఘటన నేపథ్యంలో ఆ ప్రాంతంలో గాలింపు ముమ్మరం చేశారు.

వెనెజులాలో ట్రక్కు బీభత్సం.. 16 మంది మృతి

కారకాస్: వెనెజులా రాజధాని కారకాస్‌ను కలిపే జాతీయ రహదారిపై వేగంగా వెళ్తున్న ట్రక్కు పలు కార్లను ఢీకొట్టుకుంటూ ముందుకు దూసుకెళ్లింది. ఈ ఘటనలో 17 వాహనాలు ఒకదానినొకటి ఢీకొట్టి కుప్పగా రోడ్డుకు అడ్డంగా పడిపోయాయి. మంటల్లో చిక్కుకున్న వాహనాలు, ఉవ్వెత్తున ఎగసిన పొగతో కూడిన ఫొటోలు బుధవారం ఉదయం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఘటనలో 16 మంది చనిపోగా ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రుల్లో కొందరి పరిస్థితి విషమంగా మారడంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశముందని అధికారులు తెలిపారు.

జూలైలోనే పక్కాగా రెక్కీ

- పార్లమెంట్‌లో చొరబడిన ఆగంతకుల పకడ్బందీ ప్రణాళిక
- షూలను తనిఖీ చేయట్లేదని రెక్కీలో కనుగొన్న వైనం
- పొగ గొట్టాలు దాచేలా లక్నోలో ప్రత్యేక షూ తయారీ


నిందితులు నీలం, సాగర్, షిండేలను గురువారం కోర్టుకు తీసుకొస్తున్న దృశ్యం

న్యూఢిల్లీ: అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఉండే పార్లమెంటులో పొగగొట్టాలతో కలకలం రేపిన నిందితులు ఇందుకు కొద్ది నెలల క్రితమే పక్కా ప్రణాళిక రచించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. పార్లమెంట్‌లోకి పొగగొట్టాలను ఎలా దాచి తీసుకెళ్లాలన్న దానిపై రెక్కీ నిర్వహించినట్లు తెలుస్తోంది. పార్లమెంట్‌కు వచ్చిన వారి షూలను తనిఖీ చేయట్లేరనే విషయాన్ని 'రెక్కీ' సందర్భంగా వీరు కనుగొన్నారని పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. నిందితుల్లో ఒకరైన మనోరంజన్ జులైలోనే ఈ మేరకు ఒకసారి సందర్శకుల పాస్‌తో లోపలికి వచ్చి రెక్కీ నిర్వహించాడని తెల్సింది. షూలు విప్పి తనిఖీలు చేయట్లేరనే విషయం గమనించి పొగ గొట్టాలను షూలో దాచి తెచ్చారు. ఇందుకోసం ప్రత్యేకంగా లక్నోలో షూలను తయారుచేయించారట. మరోవైపు పార్లమెంట్‌లో 'పొగ' ఘటనకు కీలక సూత్రధారిగా భావిస్తున్న లలిత్ ఝాను గురువారం రాత్రి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఘటనలో పాల్గొన్న మరో నలుగురిపాటు వారికి ఆశ్రయం కల్పించిన మరో వ్యక్తినీ అరెస్టుచేశారు. లోక్‌సభ లోపల, వెలుపల పొగ గొట్టాలను విసిరిన నలుగురిపై కఠినమైన చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం(ఉపా)సహా పలు సెక్షన్ల కింద పోలీసులు కేసులు నమోదు చేశారు. ఈ నలుగురికీ ప్రత్యేక కోర్టు ఏడు రోజుల రిమాండ్‌కు పంపించింది. ఘటనకు కీలక సూత్రధారిగా భావిస్తున్న లలిత్ ఝా వృత్తిరీత్యా ఉపాధ్యాయుడు. కోల్‌కతాకు చెందిన ఇతడు విప్లవ యోధుడు భగత్ సింగ్ వీరాభిమాని. లలిత్, సాగర్, మనోరంజన్ ఏడాది క్రితం మైసూర్‌లో కలిశారు. అప్పుడే పార్లమెంట్ లోపలికి చొరబడేందుకు ప్రణాళిక రచించారు. వీరికి తర్వాత నీలమ్ దేవి, అమోల్ షిండే తోడయ్యారు. ఫేస్‌బుక్‌లో భగత్‌సింగ్ ఫ్యాన్స్ క్లబ్ పేరుతో సృష్టించిన పేజీలో వీరంతా ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరిపేవారు. లలిత్ వీరిని ముందుండి నడిపాడు. ప్రణాళిక ప్రకారమే వర్షాకాల సమావేశాల్లో పార్లమెంట్ అన్ని ప్రవేశ ద్వారాల వద్ద మనోరంజన్ రెక్కీ నిర్వహించాడు. జూలైలో సందర్శకుల పాస్‌తో పార్లమెంట్ ప్రాంగణంలోకి వచ్చాడు. భద్రతా సిబ్బంది సందర్శకుల షూలను విప్పి తనిఖీ చేయడం లేదని విషయం గమనించాడు. ఆ మేరకు ప్రణాళిక సిద్ధమైంది. మంగళవారం రాత్రి గురుగ్రామ్‌లోని విశాల్ శర్మ అలియాస్ వికీ ఇంట్లో సాగర్, మనోరంజన్, అమోల్, నీలం, లలిత్‌లు బస చేశారు. ఉదయం అందరూ కలిసి పార్లమెంట్ వద్దకు చేరుకున్నారు. వీరి సెల్‌ఫోన్లను లలిత్ తన వద్దే ఉంచుకున్నాడు. పాస్‌లు ఇద్దరికి మాత్రమే రావడంతో మిగతా ముగ్గురు బయటే ఉండిపోయారు. అమోల్, నీలమ్‌లు పార్లమెంట్ ఆవరణలో పొగ గొట్టాలు విసురుతుండగా లలిత్ వీడియో చిత్రీకరించాడు. అనంతరం ఈ వీడియోను అతడు ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశాడు. నిందితులిచ్చిన సమాచారం ఆధారంగా కోల్‌కతాకు చెందిన ఒక ఎన్‌జీవో నిర్వాహకుడు నీలాక్ష్ అయిష్‌తో స్పెషల్ సెల్ పోలీసులు మాట్లాడారు. ఈ ఎన్‌జీవోతోనే లలిత్ ఝాకు సంబంధాలున్నట్లు భావిస్తున్నారు. దర్యాప్తు వేగవంతం చేసిన అధికారులు గురువారం రాత్రి లలిత్ ఝాను అదుపులోకి తీసుకున్నారు. ఇతడి ద్వారానే పార్లమెంట్ ఘటన వెనుక నిజాలు వెలుగులోకి వస్తాయని భావిస్తున్నారు.

వారం రోజుల రిమాండ్

పార్లమెంట్ భద్రతా నిబంధనలను ఉల్లంఘించిన కేసులో పట్టుబడిన నలుగురిపై ఉపా చట్టంతోపాటు ఐపీసీలోని పలు సెక్షన్ల కింద నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేశారు. గురువారం మనోరంజన్, సాగర్, అమోల్, నీలమ్‌లను 'పటియాలా' కోర్టుకు తీసుకొచ్చి ఎన్ఐఏ కేసులను విచారించే జడ్జి ఎదుట హాజరుపరిచారు. జడ్జి ఏడు రోజుల రిమాండ్‌కు అనుమతిస్తూ ఉత్తర్వులిచ్చారు.

ఒకే రకమైన సమాధానాలు

సాగర్ శర్మ(26), మనోరంజన్(34), అమోల్ షిండే(25), నీలమ్ దేవి(37)లకు రామ్ మనోహర్ లోహియా ఆస్పత్రిలో వైద్యుల బృందంతో పోలీసులు మెడికల్ పరీక్షలు చేయించారు. అనంతరం వీరిని చాణక్యపురిలోని డిప్లొమాటిక్ సెక్యూరిటీ ఫోర్స్(డీఎస్ఎఫ్) కార్యాలయానికి తీసుకొచ్చి విచారణ జరిపారు. ముందుగా, నీలమ్, అమోల్‌లను పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్‌స్టేషన్‌కు, తర్వాత డీఎస్ఎఫ్ కార్యాలయానికి తరలించారు. విచారణలో వీరు రెండు సంస్థల పేరు వెల్లడించారు. నిందితులు చెబుతున్న సమాధానాలన్నీ ఒకే రకంగా ఉండటాన్ని బట్టి చూస్తే, ముందుగానే ప్రిపేర్ అయినట్లుగా తెలుస్తోందని అధికారులు చెబుతున్నారు. 'దేశంలో రైతుల ఆందోళనలు, మణిపూర్‌లో హింస, నిరుద్యోగం వంటి సమస్యలను చూసి నిరాశకులోనై ఈ చర్యకు పాల్పడ్డాం. ప్రభుత్వానికి ఒక హెచ్చరిక చేయడం కోసం, ఎంపీలు పై అంశాలపై చర్చ జరపాలనే ఉద్దేశంతో రంగుల పొగను వినియోగించాం. బ్రిటిష్ పాలనలో విప్లవయోధుడు భగత్ సింగ్ చేసినట్లుగా పార్లమెంట్‌లో అలజడి సృష్టించడం ద్వారా దేశ ప్రజల్లో ఇది చర్చనీయాంశంగా మారాలని భావించాం' అని నలుగురు నిందితులు వెల్లడించినట్లు పోలీసులు చెప్పారు. ఆధారాలు దొరక్కుండా చేసేందుకే లలిత్ ఝా వీరి ఫోన్లను వెంటతీసుకెళ్లినట్లు అనుమానిస్తున్నారు. బహుశా అతడు వీటిని ధ్వంసం చేసి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు.

షాహీ ఈద్గాలో సర్వే చేయండి

- అలహాబాద్ హైకోర్టు ఉత్తర్వు
- మథుర ఆలయం–మసీదు కేసులో మలుపు

ప్రయాగ్‌రాజ్: ఉత్తరప్రదేశ్‌లోని మథుర నగరంలో శ్రీకృష్ణుడు జన్మించిన ప్రదేశంలో షాహీ ఈద్గాను నిర్మించారంటూ దాఖలైన కేసు గురువారం కీలక మలుపు తీసుకుంది. కోర్టు పర్యవేక్షణలో షాహీ ఈద్గాలో శాస్త్రీయ సర్వే చేపట్టాలని అలహాబాద్ హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. మథురలోని శ్రీకృష్ణ జన్మభూమి ఆలయాన్ని ఆనుకుని ఉన్న మసీదు ప్రాంగణంలో ఒకప్పటి హిందూ ఆలయ ఆనవాళ్లు ఉన్నాయంటూ కోర్టులో పిటిషన్లు దాఖలైన విషయం తెల్సిందే. ఈ నేపథ్యంలో సర్వే కోసం కమిషనర్‌ను నియమించేందుకు కోర్టు అంగీకారం తెలిపింది. 'త్రిసభ్య కమిషన్ ఈ సర్వేను పర్యవేక్షిస్తుంది. సర్వే సందర్భంగా అక్కడి కట్టడాలు దెబ్బ తినకుండా చూడాలి. డిసెంబర్ 18న జరిగే ఈ కేసు తదుపరి విచారణలో సర్వే విధివిధానాలపై నిర్ణయం తీసుకుంటాం. శాస్త్రీయ సర్వేను ఇరు పక్షాల తరఫు ప్రతినిధులు ప్రత్యక్షంగా గమనించవచ్చు. పూర్తి పారదర్శకమైన నివేదికను కోర్టును కమిషన్ అందించాలి. ఈ నివేదికపై అభ్యంతరాలుంటే ఈద్గా తరఫు లాయర్లు తమ అభ్యంతరాలు తెలుపుతూ కోర్టును ఆశ్రయించవచ్చు' అని జస్టిస్ మయాంక్ కుమార్ జైన్ తన ఉత్వర్వులో పేర్కొన్నారు. కాగా, కోర్టు ఉత్తర్వును సుప్రీంకోర్టులో సవాల్ చేస్తామని షాహీ ఈద్గా మేనేజ్‌మెంట్ కమిటీ తెలిపింది. ఇటీవలి కాలంలో ఆలయం–మసీదు వివాదాల్లో అలహాబాద్ హైకోర్టు ఇలా సర్వేకు ఆదేశాలివ్వడం ఇది రెండోసారి కావడం గమనార్హం. ఇటీవలే వారణాసిలోని కాశీ విశ్వనాథ్ ఆలయం పక్కనే ఉన్న జ్ఞానవాపి మసీదు ప్రాంగణంలో సర్వేకు అలహాబాద్ హైకోర్టు ఆదేశాలివ్వడం, సర్వే పూర్తయి భారత పురావస్తు శాఖ నుంచి తుది నివేదిక కోసం వేచి ఉన్న సంగతి తెల్సిందే. ''మసీదు ప్రాంగణంలో కమలం ఆకృతిలో ఉన్న పునాదులతో ఒక నిర్మాణం ఉంది. అది హిందువులు పూజించే శేషనాగును పోలి ఉంది. పునాదిపై హిందూ మత సంబంధ గుర్తులు, నగిషీలు స్పష్టంగా కనిపిస్తున్నాయి'' అని ఇటీవల పిటిషనర్ తరఫు న్యాయవాది విష్ణు శంకర్ జైన్ కోర్టులో వాదించారు.

ప్రమాణ స్వీకారం



టీటీడీ స్థానిక సలహామండలి సభ్యుడిగా నియమితులైన వి.రాధాకృష్ణ గురువారం శ్రీవారి ఆలయంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఆయనకు నియామక ఉత్తర్వును స్థానిక సలహా మండలి ఛైర్మన్ ఎ జె శేఖర్ అందచేశారు. ఈ సందర్భంగా ఏపీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి, టీటీడీ ఛైర్మన్ కరుణాకరరెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.

– సాక్షి, చెన్నై

న్యూస్‌రీల్

శబరికి ప్రత్యేక రైళ్లు

• వందే భారత్ కూడా..



వందేభారత్ రైలు

సాక్షి, చెన్నై : శబరిమలైకు అయ్యప్ప భక్తులు పోటెత్తుతుండడంతో ప్రత్యేక రైళ్లను చెన్నై నుంచి నడిపేందుకు దక్షిణ రైల్వే చర్యలు తీసుకుంది. ఇందులో ఓ వందే భారత్‌రైలు కూడా ఉంది. ఇది 15, 17, 22, 24 తేదీల్లో చెన్నై ఎంజీఆర్ సెంట్రల్ నుంచి కొట్టాయం వరకు ప్రయాణించనుంది. చెన్నై నుంచి ఈ తేదీల్లో ఉదయం 4. 30 గంటలకు బయలుదేరి సాయంత్రం 4.15 గంటలకు కొట్టాయం చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 16, 18, 23, 25 తేదీలలో కొట్టా యం నుంచి చెన్నైకు నడపనున్నారు. కొట్టా యంలో ఉదయం 4.40 గంటలకు బయలు దేరే వందే భారత్ రైలు సాయంత్రం 5.15 గంటలకు చెన్నైకు చేరుకుంటుంది. ఈ రైలు ఎంజీఆర్ సెంట్రల్ నుంచి పెరంబూరు, కట్పాడి, సేలం, ఈరోడ్, తిరుప్పూర్, పొతనూరు, పాలక్కాడ్, త్రిస్సూర్, అలువా, ఎర్నాకులం నార్త్ మీదుగా కొట్టాయం వెళ్తుంది. అలాగే చెన్నై తాంబరం నుంచి కొల్లం మధ్య శబరి ప్రత్యేక రైళ్ల నడిపేందుకు చర్యలు తీసుకున్నారు. తాంబరం – కొల్ల శబరి స్పెషల్ రైలు 16వ తేదీ చెన్నై నుంచి తిరుగు పయనంలో 17వ తేదీ కొల్లం నుంచి బయలు దేరనుంది. ఈ రైలు తాంబరం, పెరంబూర్, అరక్కోణం, కాట్పాడి, జోలార్ పేట, సేలం, ఈరోడ్, తిరుప్పూర్, కోయంబత్తూరు, పాలక్కాడ్ త్రిస్సూర్, అలువా, ఎర్నాకులం టౌన్, కొట్టాయం, తిరువల్ల, చెంగన్నూరు, మావేలిక, కాయం కులం మీదుగా కొల్లంకు ప్రయాణించనుంది.

అభివృద్ధి కార్యక్రమాలకు.. అధికారులే అడ్డు

• సీఎం రంగన్న ఆగ్రహం



రంగస్వామి

సాక్షి, చెన్నై: ప్రతిపనికి ప్రశ్నలతో ఉక్కిరి బిక్కిరి చేయడమే కాకుండా అడ్డంకులు సృష్టిస్తున్నారని అధికారులపై పుదుచ్చేరి సీఎం రంగ స్వామి ఆగ్రహం వ్యక్తంచేశారు. సంతకాలు పెట్టించుకునేందుకు శ్రమించాల్సిన పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తంచేశారు. వివరాలు.. కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరిలో ఎన్ఆర్ కాంగ్రెస్ – బీజేపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న విషయం తెలిసిందే. ఎన్ఆర్ కాంగ్రెస్ అధినేత సీఎం రంగస్వామి సీఎంగా ఉన్నా, తనకు అడ్డంకులు సృష్టించే వారే అధికం అని పలుమార్లు ఆవేదన వ్యక్తంచేశారు. కేంద్ర హోంశాఖ, ఎల్జీపై కూడా ఆయన కొన్ని సందర్భాలలో అసహనం , అసంతృప్తి వెళ్లగక్కారు. ఈ పరిస్థితుల్లో అధికారులపై ఆగ్రహాన్ని, వారి రూపంలో తనకు ఎదురు అవుతున్న కొత్త చిక్కులను గుర్తు చేస్తూ ఓ కార్యక్రమంలో గురువారం ఆవేదన వ్యక్తం చేశారు. ఒక ఫైల్‌పై లేదా నివేదికపై సంతకం చేయించుకునేందుకు శ్రమించాల్సిన పరిస్థితి ఉందని పేర్కొన్నారు. ఆ మేరకు అభివృద్ధి పనులకు అధికారులు అడ్డుగా మారుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. డైరెక్టర్లు, కార్యదర్శులు, సీఎస్‌లు పలు ఫైళ్లు, నివేదికలకు సంబంధించి ప్రశ్నలతో ఉక్కిరి బిక్కిరి చేస్తూ, అడ్డుకట్ట వేస్తున్నారని అసహనం వ్యక్తంచేశారు. అధికారంలో ఉన్న వాళ్లను బాధ్యత కలిగిన అధికారులు ఆట ఆడుకుంటున్నట్టుగా పరిస్థితులు ఉన్నాయని పేర్కొన్నారు. విద్యార్థులకు ల్యాప్ టాప్‌ల పంపిణీ త్వరితగతిన చేయాలనే ఆశ తనకు ఉన్నా, ఈ ఫైల్ మీద సంతకం చేయడానికి అధికారులే అధిక సమయం తీసుకున్నారని వివరించారు. ప్రస్తుతం సంతకం పెట్టి ఉన్నారని, త్వరితగతిన ఇతర పనులను ముగించి పది రోజులలో విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అందజేస్తామన్నారు. ప్లస్–2 ముగియగానే అధిక శాతం మంది విద్యార్థులు వైద్య, ఇంజనీరింగ్ సీట్లపై దృష్టి పెడుతున్నారని పేర్కొన్నారు. ఇక్కడి విద్యార్థులు ఇతర డిగ్రీలపై కూడా దృష్టి పెట్టాలని, ఐపీఎస్‌లుగా, ఐఏఎస్‌లుగా సొంత రాష్ట్రానికి భవిష్యత్తులో సేవలు అందించే విధంగా ముందుకు సాగాలని కోరారు.

పనుల్లో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు



రోడ్డు నాణ్యతను పరిశీలిస్తున్న కలెక్టర్ కలైసెల్వి

కాంచీపురం(పళ్లిపట్టు): అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ కలైసెల్వి హెచ్చరించారు. కాంచీపురం జిల్లా ఉత్తరమేరూర్ మండలవ్యాప్తంగా నిర్వహిస్తున్న వివిధ అభివృద్ధి పనులను గురువారం కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రోడ్డు, కట్టడ నిర్మాణం, ఇళ్లు, సహా సంక్షేమ పనులను పరిశీలించారు. ఒరకాట్టుపేట్టైలో సీఎం గ్రామీణ రోడ్లు అభివృద్ధి పథకం ద్వారా రూ.38 లక్షల వ్యయంతో తారురోడ్డు నిర్మాణపు పనులు, తిరువాళికోవిల్ పంచాయతీలో తారురోడ్డు పనుల నాణ్యత తనిఖీ చేశారు. అలాగే ఎస్టీల కోసం నిర్మిస్తున్న 178 ఇళ్ల నిర్మాణపు పనులు పరిశీలించారు. జిల్లా ప్రాజెక్ట్ అధికారి సెల్వకుమార్ తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

మిచాంగ్‌తో కోలుకోలేని దెబ్బ!



కేంద్ర బృందంతో సీఎం స్టాలిన్ సమావేశం

"మిచాంగ్ తుపాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు చెన్నై, చెంగల్పట్టు, కాంచీపురం, తిరువళ్లూరు జిల్లాల్లో అపార నష్టం వాటిల్లింది. ఈనేపథ్యంలో శాశ్వత నివారణ చర్యలకు రూ. 12,659 కోట్లు అవసరం.. ఇందులో తక్షణ సాయంగా రూ. 7,033 కోట్లు విడుదల చేయించేందుకు చర్యలు తీసుకోండి.." అని కేంద్ర బృందాన్ని సీఎం స్టాలిన్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సచివాలయంలో సెంట్రల్ కమిటీ సభ్యులకు ఆయన విన్నవించారు. రాష్ట్ర ప్రభుత్వ అధికారులు రూపొందించిన నివేదికను వారికి అందజేశారు.

- శాశ్వత వరద నివారణ చర్యలకు రూ. 12,669 కోట్లు
- తక్షణ సాయంగా.. రూ.7,033 కోట్లు అందించండి
- కేంద్ర బృందానికి సీఎం స్టాలిన్ విజ్ఞప్తి
- రాష్ట్రంలో ముగిసిన కేంద్ర ప్రభుత్వ అధికారుల పర్యటన

సాక్షి, చెన్నై: మిచాంగ్ విలయం నుంచి చెన్నై, శివారు జిల్లాలు క్రమంగా కోలుకుంటున్నాయి. తుపాను కారణంగా ఇక్కడ వాటిల్లిన నష్టం తీవ్రతను గత రెండు రోజులుగా ఢిల్లీ నుంచి వచ్చిన కేంద్ర బృందం పరిశీలించింది. గురువారం వరద బాధిత ప్రాంతాలలో పర్యటనను ముగించుకున్న జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ సలహాదారుడు కునాల్‌సత్యార్థి నేతృత్వంలోని కేంద్ర గ్రామీణ, వ్యవసాయ, విద్యుత్ ఆర్థిక, రహదారుల శాఖ అధికారులు నదిమన్ సింగ్, ఏకే శివ్‌హరో, భవ్య పాండే, రంగనాథ్, విజయకుమార్‌తో కూడిన బృందం గురువారం ఉదయం సచివాలయానికి చేరుకుంది. సీఎం స్టాలిన్, సీఎస్ శివదాస్ మీన, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి కేకేఎస్ఎస్ఆర్ రామచంద్రన్, ఇతర అధికారులతో తుపాను నష్టంపై చర్చించింది. ఇందులో సీఎం స్టాలిన్ ప్రసంగిస్తూ, గతంలో ఎన్నడూ లేని విధంగా కురిసిన వర్షాలతో ప్రజల జీవనోపాధిపై తీవ్ర ప్రభావం పడిందని వివరించారు. అలాగే రోడ్లు, వంతెనలు, జలమార్గాలతో సహా వివిధ రంగాలు తీవ్ర నష్టాన్ని చవిచూసినట్టు పేర్కొన్నారు. ఇప్పటికే ప్రధాని నరేంద్ర మోదీకి వివరాలతో లేఖ పంపించామని గుర్తు చేశారు.రక్షణ శాఖమంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలో జరిగిన సమావేశం మేరకు తక్షణం రూ. 5,060 కోట్లు కేటాయించాలని విజ్ఞప్తి చేశామని పేర్కొన్నారు. ఆ తదుపరి పూర్తి స్థాయిలో నష్టం తీవ్రతపై అధ్యయనం చేశామని , సమగ్ర వివరాలతో నివేదికను సిద్ధం చేసినట్టు వివరిస్తూ, కేంద్ర బృందానికి అందజేశారు. తుపాన్ కారణంగా ఎదురైన నష్టం నుంచి శాశ్వత ఉపశమనం కలగాలంటే రూ. 12,659 కోట్లు కేటాయించే విధంగా కేంద్రానికి విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ముందుగా రూ.7,033 కోట్లను కేటాయించే విధంగా కేంద్రానికి సూచించాలని ఆ బృందాన్ని సీఎం స్టాలిన్ కోరారు. ఈ నిధులతో ప్రజల జీవనోపాధిని పునరుద్ధరించడం, మౌలిక సదుపాయాల కల్పన, వివిధ రకాల సామాజిక అవసరమైన సహాయాన్ని అందించడమే కాకుండా, నిర్మాణాలను పునరుద్ధరించడం, మరమ్మతులు చేయడం వంటి పనులు పూర్తి స్థాయిలో చేపట్టాల్సి ఉందని వివరించారు. ఇక్కడి అధ్యయనంలో వెలుగు చూసిన అంశాలతో సమగ్ర నివేదికను కేంద్రానికి సమర్పించి తమిళనాడుకు త్వరితగతిన నిధులు అందే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశానంతరం కేంద్ర ఆర్థిక శాఖమంత్రి నిర్మలా సీతారామన్‌కు సీఎం స్టాలిన్ లేఖ రాశారు. తుపాన్ కారణంగా చిన్న వ్యాపారులు, చిన్న, సూక్ష్మ తరహా సంస్థలు, వ్యాపారులు బ్యాంకులకు చెల్లించాల్సిన ఈఎంఐలు భారంగా మారినట్టు వివరించారు. బ్యాంక్‌ల నుంచి ఒత్తిడి లేకుండా రుణ చెల్లింపు షెడ్యూల్‌లో మార్పులు చేసి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇదిలాఉండగా, ముందుగా జరిగిన ఓ కార్యక్రమంలో సీఎం స్టాలిన్ ప్రసంగిస్తూ, ఎప్పటికప్పుడు చెంబరంబాక్కం రిజర్వాయర్‌పై నిఘా ఉంచి చెన్నైను అతి భారీ వరదల విలయం నుంచి రక్షించామని ధీమా వ్యక్తం చేశారు.అధిక వర్షం పడుతుందన్న సమాచారం ఇచ్చారేగానీ, రోజంతా అతి భారీ వర్షానికి సంబంధించిన హెచ్చరికలు తమకు ముందుగా ఇవ్వలేని వ్యాఖ్యలు చేశారు.



కేంద్ర బృందానికి నివేదిక సమర్పిస్తున్న సీఎం స్టాలిన్

టోకెన్ల పంపిణీకి శ్రీకారం

వరద బాధితులను ఆదుకునేందుకు రూ. 6 వేలు నగదు సాయాన్ని సీఎం స్టాలిన్ ప్రకటించిన విషయం తెలిసిందే. రేషన్ దుకాణాల ద్వారా ఈ మొత్తం అందజేయనున్నారు. ఇందులో భాగంగా కుటుంబ కార్డు దారులకు టోకెన్ల పంపిణీకి శ్రీకారం చుట్టారు. చెన్నై వ్యాప్తంగా అన్ని రేషన్ దుకాణాల పరిధిలోని కార్డు దారులకు టోకెన్లను అందజేస్తున్నారు. శివారు జిల్లాలో ఎంపిక చేసిన తాలుకాలలోని వారికి మాత్రం టోకెన్ల పంపిణీకి చర్యలు తీసుకున్నారు. ఇందులో ఆయా కార్డు దారులకు టోకెన్ నెంబర్లు, రేషన్ దుకాణాలకు రావాల్సిన తేదీ, సమయం వివరాలను పొందుపరిచారు. వీటి ఆధారంగా ఆయా పరిధిలోని రేషన్ దుకాణాలకు వెళ్లి రూ. 6 వేలు సాయం పొందే విధంగా చర్యలు చేపట్టారు. ఈ నగదు పంపిణీ 17వ తేదీ నుంచి జరగనుంది.

ఐపీఎస్ అధికారుల బదిలీ

సాక్షి, చెన్నై : పలువురు ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ గురువారం హోం శాఖకార్యదర్శి పి. అముదా ఉత్తర్వులు జారీ చేశారు. మహిళలు, పిల్లలకు వ్యతిరేకంగా నేరాల కట్టడి విభాగం ఏడీజీపీ డి. కల్పన నాయక్‌ను తమిళనాడు యూనిఫాం సర్వీసు రిక్రూట్‌మెంట్ బోర్డు ఏడీజీపీగా నియమించారు. ఏడీజీపీ మహేశ్వర్ దయాల్‌ను జైళ్లశాఖకు, ఇక్కడున్న డీజీపీ హోదా అధికారి అమరేష్ పూజారిని తమిళనాడు న్యూస్ ప్రింట్ అండ్ పేపర్స్ ప్రధాన విజిలెన్స్ అధికారిగా బదిలీ చేశారు. ఈ విభాగంలో ఉన్న ఐజీ ప్రమోద్‌కుమార్‌ను విద్యుత్ బోర్డు విజిలెన్స్ ఐజీగా, తమిళనాడు యూనిఫాం సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డులో పనిచేస్తూ వచ్చిన ఆర్ తమిళ్ చంద్రన్‌ను మహిళలు, పిల్లలకు వ్యతిరేకంగా నేరాల నియంత్రణ విభాగానికి స్థానం చలనం కల్పించారు. కేంద్ర విధులలో ఉన్న డీఐజీ ధర్మరాజన్‌ను చెన్నై శాంతి భద్రతల విభాగానికి, మెరైన్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ఎస్పీ చంద్రశేఖరన్‌ను కోయంబత్తూరు పౌర సరఫరాల విభాగం సీఐడీ విభాగానికి, ఇక్కడ పనిచేసిన పి. బాలాజీని మదురై నగర డిప్యూటీ కమిషనర్‌గా, ఇక్కడున్న ప్రదీప్‌ను దిండుగల్ ఎస్పీగా బదిలీ చేశారు. దిండుగల్ ఎస్పీగా ఉన్న భాస్కరన్‌ను చెన్నై ట్రాఫిక్ (తూర్పు) డిప్యూటీ కమిషనర్‌గా, ఇక్కడున్న సమ య సింగ్ మీనను కళ్లకురిచ్చి ఎస్పీగా బదిలీ చేశా రు. అలాగే శిక్షణ కాలం ముగించుకున్న 8 మంది యువ ఐపీఎస్ అధికారులకు పోస్టింగ్‌లను కల్పిస్తూ మరో ఉత్తర్వును హోంశాఖ కార్యదర్శి జారీ చేశారు.

పన్నీరు 'కొత్త' ప్రయత్నం

• వచ్చే ఏడాదిలో ముహూర్తం



పన్నీరు సెల్వం

సాక్షి, చెన్నై : అన్నాడీఎంకే పూర్తిగా చేజారడంతో మాజీ సీఎం పన్నీరు సెల్వం కొత్త ప్రయత్నాలపై దృష్టి పెట్టినట్టు తెలుస్తోంది. కొత్త సంవత్సరంలో సరికొత్తగా పార్టీ పెట్టేందుకు ముహూర్తం సిద్ధం చేసినట్టు ఆయన మద్దతు దారులు పేర్కొంటున్నారు. వివరాలు.. అన్నాడీఎంకేను కైవసం చేసుకునేందుకు మాజీ సీఎం పన్నీరు సెల్వం పట్టువదలని విక్రమార్కుడి తరహాలో న్యాయ పోరాటం ద్వారా విశ్వ ప్రయత్నాలు చేస్తూ వస్తున్నారు. అయితే ఆయనకు ప్రతి కోర్టులోనూ చుక్కెదురవుతూ వస్తోంది. చివరకు ఆ పార్టీ పేరు, జెండా, లెటర్ పాడ్ కూడా ఉపయోగించకుండా కోర్టు స్టే విధించింది. అయినా కోర్టు ఉత్తర్వులు, తీర్పులను వ్యతిరేకిస్తూ అప్పీల్ పిటిషన్లతో న్యాయ పోరాటాన్ని ఆయన కొనసాగిస్తూ వస్తున్నారు. సుప్రీంకోర్టులో ఉన్న అప్పీల్ పిటిషన్ సహా హైకోర్టులో ఉన్న కేసులపై తీర్పులు ఈనెలాఖరులో విడుదలయ్యే అవకాశాలు ఉన్నట్టు తెలుస్తోంది. ఇవన్నీ తనకు వ్యతిరేకంగా వచ్చిన పక్షంలో ప్రత్యామ్నాయంగా రాజకీయ భవిష్యత్తు కోసం కొత్త పార్టీ ప్రయత్నాలను పన్నీరు వేగవంతం చేశారు. అన్నాడీఎంకేను ఇరకాటంలో పెట్టే విధంగా అమ్మడీఎంకే పేరిట కొత్త పార్టీ కసరత్తు చేస్తున్న సమాచారం. కొత్త సంవత్సరం వేళ కొత్త ప్రయత్నంగా కొత్త పార్టీ ప్రకటనకు ముహూర్తాన్ని సైతం కుదుర్చుకుని ఉన్నట్టు ఆయన మద్దతుదారులు పేర్కొంటుండటం గమనార్హం. ఈ దృష్ట్యా త్వరలో తమిళనాట మరో పార్టీ ఆవిర్భావం ఖాయంగా కనిపిస్తోంది. దక్షిణ తమిళనాడులో బలంగా ఉన్న దేవర్, ముక్కళత్తోర్‌ల సామాజిక వర్గం అంతా తన వెన్నంటే వచ్చే అవకాశం ఉందని పన్నీరు భావిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది.

జాలర్లకు రూ. 4 కోట్ల నష్టం



తెట్టును తొలగిస్తున్న సిబ్బంది

సాక్షి, చెన్నై : సీపీసీఎల్ నుంచి వెలువడ్డ చమురు తెట్టు జాలర్లకు తీవ్రనష్టాన్ని కలిగించాయి. సుమారు రూ. 4 కోట్ల వరకు నష్టం ఏర్పడినట్టు అధికారుల పరిశీలనలో తేలింది. 797 పడవలను చమురు తెట్టు చుట్టుముట్టడంతో పూర్తిగా దెబ్బ తిన్నాయి. వివరాలు.. మిచాంగ్ తుపాన్ కారణంగా కురిసిన భారీ వర్షాల వల్ల పోటెత్తిన వరద నీరు సముద్ర తీరంలోని సీపీసీఎల్ చమురు శుద్ధికరణ కేంద్రాన్ని ముంచేసిన విషయం తెలిసిందే. ఈ వరద నీటిలో ఇక్కడి చమురు కూడా భారీ స్థాయిలో కలిసిపోయింది. దీంతో చెన్నై సముద్ర తీరం 20 కి.మీ దూరం చమురు తెట్టుతో నిండిపోయింది. దీనిని మూడో రోజైన గురువారం కూడా తొలగించే పనులు శరవేగంగా జరిగాయి. అదే సమయంలో పర్యావరణ నిపుణులు, కాలుష్య నియంత్ర బోర్డు అధికారులు, మత్స్యశాఖ అధికారులు ఆ పరిసరాల్లో పరిశీలించారు. జాలర్ల గ్రామాలలో చేరిన తెట్టు, జాలర్లకు ఎదురైన నష్టాలు, కష్టాలను అధ్యయనం చేశారు. తుపాన్ రూపంలో తమకు ఓ వైపు నష్టం, మరోవైపు సీపీసీఎల్ చమరు రూపంలో మరో నష్టం ఏర్పడడంతో జాలర్లు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. జాలర్లకు సుమారు రూ. 4 కోట్ల వరకు నష్టం కలిగినట్టు పరిశీనలో తేలింది. చమురు తెట్టు చుట్టుముట్టడంతో 979 పడవలు దెబ్బతిన్నాయి. దీంతో దెబ్బతిన్న పడవలకు రూ. 10 వేలు, వలలకు రూ. 5 వేలు సాయం అందించేందుకు అధికారులు కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు.

కార్మికుడి హత్య కేసులో ఇద్దరికి యావజ్జీవం

తిరువొత్తియూరు: నెల్‌లై జిల్లా తాళ యూత్ సమీపంలోని రాజవల్లిపురం పిల్లయార్ ఆలయ వీధికి చెందిన ఇసక్కిముత్తు (23) వ్యవసాయ కూలీ. అదే ప్రాంతానికి చెందిన దురైరాజు కుమారుడు సురేష్ (అలియాస్) సూసై (25). అతను ఆ ప్రాంతంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్టు తేలడంతో పోలీసులు అతన్ని అరెస్టు చేశారు. అందుకు ఇసక్కి ముత్తు కారణమని సురేష్ సందేహించాడు. ఈ కారణంగా వారిద్దరికీ మధ్య వివాదం నెలకొంది. ఈ క్రమంలో గత 07.05.20 రోజున సాయంత్రం ఇసక్కిముత్తుపై సురేష్, అతని స్నేహితులు రాజా (26), జపరాజు (26) అని ముగ్గురు రాళ్లతో దాడి చేసి హత్య చేశారు. దీని గురించి తాళయత్తు పోలీసులు కేసు నమోదు చేసి సురేష్, రాజా, జపరాజును అరెస్టు చేశారు. దీనిపై నెల్‌లై మూడవ అదనపు జిల్లా కోర్టులో విచారణ జరుగుతూ వచ్చింది. ఈ క్రమంలో దీనిపై గురువారం విచారణలో న్యాయమూర్తి పన్నీర్ సెల్వం తుది తీర్పు ఇచ్చారు. సురేష్, రాజా ఇద్దరికీ యావజీవ శిక్ష విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు. మరో నిందితుడు జపరాజు అదృశ్యంలో ఉన్నట్లు ప్రకటించారు.

అరుణాచలేశ్వరాలయ మహా కొండపై పరిహార పూజ



కొండపై పరిహార పూజలు


వేలూరు: తిరువణ్ణామలై అరుణాచలేశ్వరాలయ మహా కొండకు పరిహార పూజలను ఆలయ జాయింట్ కమిషనర్ జ్యోతి అధ్యక్షతన ఆలయ నిర్వాహకులు గురువారం ఉదయం చేశారు. అరుణాచలేశ్వరాలయ కార్తీక బ్రహ్మోత్సవాలు గత నెల 17న ధ్వజారోహణంతో ప్రారంభమై 26న 2,668 అడుగుల ఎత్తుగల మహా కొండపై మహా దీపాన్ని వెలిగించడంతో ముగిశాయి. ఈ దీపాన్ని దర్శించుకునేందుకు భక్తులు కొండపైకి ఎక్కారు. ఈ కొండను శివునిగా భావించడంతో కొండపైకి భక్తులు ఎక్కడంతో ఏటా బ్రహ్మోత్సలు ముగిసిన తర్వాత పరిహార పూజలు చేయడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగా గురువారం ఉదయం ఆలయంలోని యాగ శాలలో పవిత్ర కలశాలతో నింపినశ నీటితో అభిషేకాలు చేశారు. అనంతరం ఆలయ జాయింట్ కమిషనర్, ఆలయ నిర్వాహకులు మేళ తాళాల నడుమ మహా కొండపైకి తీసుకెళ్లి కొండపై పరిహార పూజలు చేశారు. ఈ సమయంలో ఆలయ నిర్వాహకులు పెద్దఎత్తున హరోం హరా నామస్మరణాలు చేసి మహా కొండపై పుష్పాలంకరణ చేపట్టి ప్రత్యేక పూజలు చేశారు.




కలశ నీటితో కొప్పరి పెట్టిన ప్రాంతాన్ని శుభ్రం చేస్తున్న సిబ్బంది

ప్రేమలతకు ప్రమోషన్

- డీఎండీకే ప్రధాన కార్యదర్శిగా ఎంపిక
- ఆ పార్టీ సర్వ సభ్య సమావేశంలో తీర్మానం



విజయకాంత్, ప్రేమలతను సత్కరిస్తున్న డీఎండీకే నాయకులు



హాజరైన పార్టీ కార్యకర్తలు

సాక్షి, చెన్నై : దేశీయ ముర్పోక్కు ద్రావిడ కళగం(డీఎండీకే) ప్రధాన కార్యదర్శిగా ప్రేమలత విజయకాంత్ ఎంపికయ్యారు. కోశాధికారి పదవి నుంచి ఆమెకు ప్రమోషన్ కల్పిస్తూ డీఎండీకే సర్వ సభ్య సమావేశంలో గురువారం తీర్మానం ఆమోదించారు. ఆస్పత్రిలో చికిత్స అనంతరం పార్టీ సర్వ సభ్య సమావేశానికి హాజరైన అధ్యక్షుడు విజయకాంత్ నీరసించి ఉండడంతో మహిళా కార్యకర్తలు కన్నీటి పర్యంతమయ్యారు.

నేపథ్యం ఇదీ..

2005లో సినీ నటుడు విజయకాంత్ డీఎండీకేను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. తొలిసారిగా ఎదుర్కొన్న ఎన్నికల్లో తానొక్కడే అసెంబ్లీకి ఎన్నికైనా , ఆయన పార్టీ సాధించిన ఓటు బ్యాంక్ తమిళ రాజకీయాలలో విజయకాంత్‌ను ప్రత్యామ్నాయ శక్తిగా మార్చింది. 2011 అసెంబ్లీ ఎన్నికలలో అన్నాడీఎంకేతో చేతులు కలిపి డీఎంకేను చిత్తు చేసిన విజయకాంత్ ప్రధాన ప్రతి పక్ష నేతగా అవతరించారు. ఆ తదుపరి అన్నాడీఎంకేతో వైరం వంటి పరిణామాలు విజయకాంత్ పార్టీకి గడ్డు పరిస్థితులను సృష్టించాయి. 2014 లోక్‌సభ ఎన్నికలలో ఎన్డీఏతో వెళ్లి ఓటమిని చవి చూసినా ఓటు బ్యాంక్ శాతం పెంచుకోవడం కలిసి వచ్చిన అంశంగా మారింది. 2016 అసెంబ్లీ డీఎండీకే నేతృత్వంలో రాష్ట్రంలో మూడో కూటమి అవతరించినా, ఫలితం శూన్యం. ఆతర్వాత వరుస ఓటములు ఎదురైనా ఏ మాత్రం డీలా పడకుండా కేడర్ మద్దతు, సినీ అభిమానుల అండతో పార్టీని నడిపిస్తూ వస్తున్నారు. ప్రస్తుతం అనారోగ్య పరిస్థితుల దృష్ట్యా, పార్టీ వ్యవహారాలను ఆయన పర్యవేక్షించ లేని పరిస్థితి నెలకొంది. దీంతో తన వద్ద అదనంగా ఉన్న పార్టీ ప్రధాన కార్యదర్శి పదవిని సతీమణి, పార్టీ కోశాధికారి ప్రేమలత విజయకాంత్‌కు అప్పగిస్తూ గురువారం నిర్ణయం తీసుకున్నారు.

మహిళా నేత నుంచి ప్రధాన కార్యదర్శి వరకు

విజయకాంత్ ఆస్పత్రిలో మూడు వారాలకు పైగా చికిత్స పొందిన విషయం తెలిసిందే. ఆయన ఆరోగ్యంపై వదంతులు సైతం వచ్చాయి. ఈ పరిస్థితుల్లో గురువారం ఉదయం తిరువేర్కాడులో జరిగిన డీఎండీకే సర్వస సమావేశానికి ఆయన హాజరయ్యారు. చిక్కి శల్యమైన తమ నాయకుడిని చూసి కన్నీటి పర్యంతమవుతూ, కరతాళ ధ్వనులతో ఆయన్ని కేడర్ ఆహ్వానించింది. వేదిక మీద కూర్చుని తన దైన శైలిలో హావాభావాలతో అభిమానులు, కేడర్‌ను విజయకాంత్ పలకరించే ప్రయత్నం చేశారు. ఈ సమావేశంలో 17 తీర్మానాలను ఆమోదించారు. ఇందులో కీలక తీర్మానంగా పార్టీ ప్రధాన కార్యదర్శి పదవిని ప్రేమలత విజయకాంత్‌కు అప్పగించారు. ఈ సమయంలో తన భర్త, పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు విజయకాంత్ నుంచి ప్రేమలత ఆశీస్సులు అందుకున్నారు. ఈ సమయంలో ఆ వేదిక అంతా కరతాళ ధ్వనులతో మారుమోగింది. ప్రేమలత విజయకాంత్ డీఎండీకే ఆవిర్భావం నుంచి అధ్యక్షుడు విజయకాంత్ వెన్నంటి ఉంటూ వచ్చారు. పార్టీ మహిళా విభాగం ప్రధాన కార్యదర్శిగా 13 ఏళ్లు పనిచేశారు. 2018 నుంచి డీఎండీకే కోశాధికారి బాధ్యతలు నిర్వర్తిస్తూ వస్తున్నారు. ప్రస్తుతం విజయకాంత్ అనారోగ్య పరిస్థితులతో పార్టీని తన భుజాన వేసుకుని నడిపించేందుకు ప్రేమలత సిద్ధమయ్యారు. ప్రధాన కార్యదర్శిగా తన తొలి ప్రసంగంలో పార్టీ బలోపేతమే లక్ష్యంగా ముందుకెళ్లడమే కాకుండా, కేడర్, అభిమానులకు ఎల్ల వేళలా తాను అండగా ఉంటానని విజయకాంత్ బాణిలో ప్రకటించారు. అదే సమయంలో రానున్న లోక్‌సభ ఎన్నికల్లో పొత్తులు, సీట్ల పందేరాలు, తదితర నిర్ణయాలను తీసుకునే అధికారాన్ని మాత్రం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు విజయకాంత్‌కు అప్పగించారు. ఇవికాకుండా ఇతర నిర్ణయాలను తీసుకునే అధికారం ప్రేమలతకు కేటాయించారు. ఇదిలా ఉండగా ఈ సమావేశానికి హాజరైన విజయకాంత్ చిక్కిశల్యమైన కనిపించడం అభిమానులు, కేడర్‌ను దిగ్భ్రాంతికి గురి చేసింది. కుర్చీలో తనకు తానుగా కూర్చునే స్థితి లేక, తరచూ తన దైన శైలిలో సంకేతాన్ని చూపించే ప్రయత్నంలో ముందుకు పడబోయిన ఆయన్ని వెనుక నుంచి తనయుడు విజయ ప్రభాకరన్, పార్టీ నేత పార్థసారథి గట్టిగా పట్టుకునే ఉండడం అభిమానులను కలిచి వేసింది.

చెన్నై శుక్రవారం 15 డిసెంబర్ 2023 సాక్షి

క్లుప్తంగా

16 ఏళ్ల బాలుడి కిడ్నాప్

అన్నానగర్: చెన్నై ఓట్టేరి పొన్నన్ వీధికి చెందిన తంగరాజ్, ఇతని భార్య ప్రేమ. వీరి చిన్న కుమారుడు పురసైవాక్కంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ప్లస్ 1 చదువుతున్నాడు. అదే ప్రాంతంలో హిజ్రాలు, బాలుడు స్నేహంగా ఉండేవారు. ఈ స్థితిలో గత శనివారం తమ కుమారుడిని హిజ్రాలు తీసుకెళ్లారు. ఆ తర్వాత అతను ఇంటికి రాలేదని 16 ఏళ్ల కుమారుడిని కిడ్నాప్ చేసి వారికి తెలియకుండా మార్చారని, వారి నుంచి తమ కుమారుడిని రక్షించాలని ఓట్టేరి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కిడ్నాప్ కేసు నమోదు చేయకుండా అదృశ్యం కేసు నమోదు చేశారు. అయితే ఇప్పటి వరకు తమ కుమారుడిని రక్షించేందుకు పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. అంతే కాకుండా ఈ ప్రాంతంలో 18 ఏళ్ల లోపు మైనర్ బాలులను హిజ్రాలు కిడ్నాప్ చేసి, వారికి లింగ మార్పిడి చేయించి, వారిని కూడా హిజ్రాలుగా మారుస్తున్నారని, అటువంటి వారి నుంచి మగ బిడ్డలను రక్షించాలని స్థానికులు పోలీసులను వేడుకుంటున్నారు.

నాటు బాంబులు స్వాధీనం

తిరువొత్తియూరు: దిండుక్కల్ నత్తం సమీపంలోని పరలిపుత్తూరు ఎంజీఆర్ నగర్‌కు చెందిన చిన్నకాలై(46) ఇంటిలో నాటు బాంబులు దాచి ఉంచినట్లు నత్తం పోలీసులకు రహస్యంగా సమాచారం అందింది. దీంతో ఆ ప్రాంతంలో గస్తీ చేస్తున్న పోలీసులు చిన్నస్వామి ఇంటిలో తనిఖీ చేశారు. ఆ సమయంలో ఇంటికి వెనక పశువుల కొట్టంలో నాటు బాంబులు దాచి ఉంచినట్లు కనుగొన్నారు. దీంతో నాటు బాంబులను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు దీనికి సంబంధించి పారిపోయిన చిన్నకాలై కోసం గాలిస్తూ ఉన్నారు.

30 సవర్ల నగలు చోరీ

తిరువొత్తియూరు: కన్యాకుమారి జిల్లాలో ఒక ఇంటి తలుపు తాళాలు పగలగొట్టి 30 సవర్ల నగలు చోరీ చేసిన దుండగుల కోసం పోలీసులు గాలిస్తూ ఉన్నారు. కన్యాకుమారి జిల్లా తిరువట్టారై సమీపం వేర్ కిలంబి విరాలి కొట్టు వినయ్ ప్రాంతానికి చెందిన రాజకుమార్(54), ఇతని భార్య బ్రాట్టి పొన్ను కుమారి(52). ఈ దంపతులకు ఒక కుమార్తె ఉన్నారు. వీరు కుటుంబంతో సహా విదేశాలకు వెళ్లి బుధవారం రాత్రి 10 గంటల సమయంలో ఇంటికి తిరిగి వచ్చారు. ఆ సమయంలో ఇంటిలోని వస్తువులు చిందరవందరగా పడి ఉండడం చూసి దిగ్భ్రాంతి చెందారు. ఒక గదిలో బీరువాలో ఉంచిన 30 సవర్ల నగలు చోరీ అయినట్లు తెలిసింది. ఆ ఇంటి వెనక తలుపుల తాళాలు పగలగొట్టిన దుండగులు లోపలికి చొరబడి చోరీ చేసినట్లు తెలిసింది. దీనిపై ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

ప్రభుత్వ ఫ్యాక్టరీలకు చెరుకు తరలించాలి



కోఆపరేటివ్ చక్కెర ఫ్యాక్టరీలో క్రషింగ్ ప్రారంభిస్తున్న మంత్రులు దురై మురుగన్, గాంధీ

వేలూరు: రైతులు ప్రభుత్వ కోఆపరేటివ్ చక్కెర ఫ్యాక్టరీలకు చెరకు తీసుకు రావాలని మంత్రి దురై మురుగన్ అన్నారు. వేలూరు జిల్లా అమ్ముండిలోని కోఆపరేటివ్ సహకార చక్కెర ఫ్యాక్టరీలో చెరకు క్రషింగ్‌ను గురువారం ఉదయం కలెక్టర్ కుమరవేల్ పాండియన్ అధ్యక్షతన మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సంవత్సరంలో చెరుకు సీజన్‌లో తీసుకొచ్చిన రైతులకు కొంత మందికి బిల్లులు రాలేదని ఫిర్యాదులున్నాయన్నారు. అయితే రైతులందరికీ పెండింగ్ బిల్లులతోపాటు వడ్డీని చేర్చి ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. రైతుల ప్రైవేటు ఫ్యాక్టరీలు చెప్పే మాయమాటలు నమ్మి మోస పోకూడదన్నారు. కోఆపరేటివ్ చక్కెర ఫ్యాక్టరీలకు చెరుకు తీసుకు రావాలన్నారు. ఫ్యాక్టరీని కాపాడుకోవాల్సిన బాధ్యత రైతులందరిపై ఉందన్నారు. ఈ సంవత్సరం అవసరమైన మేరకు రైతులతో నేరుగా సంప్రదించి చెరుకును కోఆపరేటివ్ చక్కెర ఫ్యాక్టరీకి తీసుకొచ్చే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. తన కుటుంబ సభ్యులకన్నా తన నియోజక వర్గంలోని ప్రజలను అధికంగా ప్రేమిస్తున్నానని తెలిపారు. తాను మొదటగా ఎమ్మెల్యేగా గెలిచిన సమయంలో ఈ చక్కెర ఫ్యాక్టరీని తన నియోజక వర్గంలో తీసుకువచ్చామని, అయితే కొంత మంది ఈ ఫ్యాక్టరినీ నాశనం చేశారన్నారు. అనంతరం ఫ్యాక్టరీలోని యంత్రాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మంత్రి గాంధీ, ఎమ్మెల్యే అములు, ఈశ్వరప్పన్, జెడ్పీ చైర్మన్ బాబు, డిప్యూటీ మేయర్ సునీల్‌కుమార్, కాట్పాడి యూనియన్ చైర్మన్ వేల్ మురుగన్, వైస్ చైర్మన్ శరవణన్, డీఎంకే డివిజన్ కార్యదర్శి చొక్కలింగం, అధికారులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై విద్యార్థినులకు అవగాహన



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

పళ్లిపట్టు: రుతుస్రావం కాలంలో ఆరోగ్యంపై పాఠశాల విద్యార్థినులకు వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. ఆర్కేపేట యూనియన్ రాజానగరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆల్ ది చిల్డ్రన్ ట్రస్ట్, ఓయిట్ ఆరా ట్రస్ట్ సంయుక్తంగా రుతుస్రావం కాలంలో విద్యార్థినులకు ఆరోగ్య సూత్రాలపై అవగాహన శిబిరం గురువారం నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం కళ్యాణి అధ్యక్షత వహించిన నిర్వహించిన శిబిరంలో విద్యార్థినులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైద్యుల బృందం శిబిరంలో పాల్గొని ఆరోగ్య సూత్రాలు తెలిపి అవగాహన కల్పించారు. నర్సు కౌసల్య సహా వైద్య సిబ్బంది పాల్గొన్నారు. ఆల్ ది చిల్డ్రన్ ట్రస్ట్ జిల్లా కోఆర్డినేటర్ రజిని అవగాహన శిబిరానికి ఏర్పాట్లు చేశారు.

బస్సులోనే క్లీనర్ మృతి

అన్నానగర్: తిరుపతికి చెందిన దాదాపు 35 మంది అయ్యప్ప భక్తులు మినీ బస్సులో శబరిమలకు వెళ్లి తిరువనంతపురం మీదుగా తిరిగి ఇంటికి వస్తున్నారు. వీరు గురువారం ఉదయం కన్యాకుమారి–నెల్లై నాలుగు లైన్ల రహదారిపై మినీ బస్సులో వస్తున్నారు. పనంగుడి సమీపంలో క్లీనర్ తిరుపతికి చెందిన కృష్ణ(52)కు ఛాతీనొప్పి వచ్చింది. వెంటనే కృష్ణను పనంగుడి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్లు తేలింది.

ఘాట్ రోడ్డులో భక్తులకు అనుమతి నిషేధం

తిరుత్తణి: తిరుత్తణి కొండ ఆలయ ఘాట్‌రోడ్డు పనులు జరుగుతున్న క్రమంలో ఈ నెల 20 వరకు వాహనాలతోపాటు సామాన్య భక్తుల రాకపోకలపై నిషేధం విధించినట్లు ఆలయ జాయింట్ కమిషనర్ తెలిపారు. మిచాంగ్ తుపాను ప్రభావంతో తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామి ఆలయ ఘాట్‌రోడ్డులో కొండ చరియలు విరిగిపడ్డాయి. దీంతో వాహన రాకపోకలపై నిషేధం విధించారు. అయితే మరమ్మతులు చేపట్టే సమయంలో కొండ చరియలు మరింతగా కూలడంతో రోడ్డు మరమ్మతులకు ఆటంకం చోటుచేసుకుంటున్నది. దీంతో గురువారం నుంచి 20వ తేదీ వరకు సామాన్య భక్తులకు సైతం ఘాట్‌రోడ్డు మార్గంలో ప్రవేశానికి నిషేధం విధించారు. అదే సమయంలో మట్టి చరియలు విరిగి మరమ్మతు పనులు జరుగుతున్న ప్రాంతంలో హిందు దేవదాయ శాఖ కమిషనర్ మురళీధరన్ గురువారం తనిఖీ చేశారు. మెట్లోత్సవం ప్రారంభం కానున్న నేపథ్యంలో రోడ్డు పనులు వారం రోజుల్లో పూర్తి చేయాలని, అంతవరకు సామాన్య భక్తులను సైతం ఘాట్‌రోడ్డులో అనుమతించరాదని ఆదేశించారు.



మూతపడ్డ తిరుత్తణి ఆలయ ఘాట్ రోడ్డు ప్రధాన ద్వారం

మురుగన్ మెట్లోత్సవం ఏర్పాట్లపై సమీక్ష



ఆర్డీఓ దీప అధ్యక్షతన సమీక్ష సమావేశం

తిరుత్తణి: సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో మెట్లోత్సవానికి సంబంధించి ఆర్డీఓ ఆధ్వర్యంలో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో డిసెంబర్ 31న మెట్లోత్సవం. జనవరి 1న నూతన ఆంగ్ల సంవత్సరం సందర్భంగా వేలాది భక్తజనం తిరుత్తణికి చేరుకోనున్నారు. ఈ క్రమంలో భక్తులకు సౌకర్యాలతోపాటు భద్రతకు సంబంధించి ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ దీప అధ్యక్షతన వివిధ శాఖల అధికారులు పాల్గొన్న సమీక్ష సమావేశం నిర్వహించారు. డీఎస్పీ విఘ్నేష్, ఆలయ జాయింట్ కమిషనర్ రమణి, తహసీల్దారు మదన్, మున్సిపల్ కమిషనర్ అరుల్, హైవేశాఖ సహాయ ఇంజినీరు అన్బరసు సహా వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తిరుత్తణి ఆలయ వేడుకల్లో వేలాదిగా భక్తులు పాల్గొంటున్నందున కొండ ఆలయంతో పాటు పట్టణ ప్రాంతాల్లో పరిశుభ్రత, తాగునీరు, తాత్కాలిక మరుగుదొడ్లు, భక్తుల వసతిగృహాలు, అదనపు దర్శన క్యూలైన్లు ఏర్పాట్లు, అన్నప్రసాదం, వైద్య కేంద్రాలు, విద్యుత్, పోలీసుల రక్షణ, అగ్నిమాపక శాఖ సేవలకు సంబంధించి ఆయా శాఖల ద్వారా ఏర్పాట్లను వివరించారు. జనవరి 1న నూతన ఆంగ్ల సంవత్సరాది రోజున స్వామి దర్శనానికి 24 గంటలపాటు ఆలయ తెరిచి ఉంచుతామని ఆలయ జాయింట్ కమిషనర్ రమణి తెలిపారు. అదే సమయంలో తిరువలంగాడు వతారన్నేశ్వరర్ ఆలయంలో 27న ఆరుద్ర అభిషేకానికి సంబంధించి ఏర్పాట్లపై సమీక్షించారు.

అన్నామలై యూనివర్సిటీలో 24 మంది బదిలీ

అన్నానగర్: ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్న చిదంబరం అన్నామలై యూనివర్సిటీని 2013 నుంచి తమిళనాడు ప్రభుత్వం నడుపుతోంది. ఆర్థిక సంక్షోభాన్ని అధిగమించేందుకు యూనివర్సిటీలో పని చేస్తున్న అదనపు ఉద్యోగులను పునర్విభజన ద్వారా తమిళనాడులోని పలు ప్రాంతాల్లోని ప్రభుత్వ కళాశాలలకు బదిలీ చేయాలని నిర్ణయించారు. దీంతో యూనివర్సిటీలో పనిచేస్తున్న 6వేల మందికిపైగా ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ఉద్యోగులను వివిధ ప్రభుత్వ కళాశాలలకు బదిలీ చేశారు. ఈ దశలో తదుపరి దశలవారీగా అన్నామలై యూనివర్సిటీలో వివిధ విభాగాల్లో పని చేస్తున్న 16 మంది జూనియర్ అసిస్టెంట్లు, 8 మంది అసిస్టెంట్లను తమిళనాడులోని పలు ప్రాంతాల్లో ఎన్‌సీసీకి బదిలీ చేస్తూ ఉన్నత విద్యాశాఖ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.

కరుణానిధి విగ్రహం ఏర్పాటుకు అనుమతి నిరాకరణ



యూనియన్ చైర్‌పర్సన్ తంగధనం అధ్యక్షతన సమావేశం



పాల్గొన్న సభ్యులు

తిరుత్తణి: తిరుత్తణి బీడీఓ కార్యాలయ ఆవరణలో కరుణానిధి విగ్రహం ఏర్పాటుకు సంబంధించి ప్రవేశపెట్టిన తీర్మానం సభ్యులు తిరస్కరించారు. తిరుత్తణి యూనియన్ సమితి చైర్‌పర్సన్ తంగధనం అధ్యక్షతన యూనియన్ సమితి సమావేశం నిర్వహించారు. వైస్ చైర్మన్ రవి, బీడీఓ సంతానం సహా 10 మంది యూనియన్ కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ ప్రవేశపెట్టిన ఆధాయ ఖర్చు వివరాలతో కూడిన తీర్మానాలు ప్రవేశపెట్టారు. ఇందులో సభ్యులు పాల్గొని తమ వాదనలు వినిపించారు. ప్రధానంగా మాజీ ముఖ్యమంత్రి, దివంగత నాయకుడు కరుణానిధి శత జయంతి వేడుకల్లో భాగంగా బీడీఓ కార్యాలయం ఆవరణలో అతని విగ్రహం ఏర్పాటు చేసేందుకు ప్రవేశపెట్టిన తీర్మానంతో పాటు తిరుత్తణి జీఆర్‌టీ ప్రైవేటు కళాశాల వేదికగా ముఖ్యమంత్రి స్టాలిన్ పాల్గొని స్వయం సహాయక బృందాల మహిళలకు పంపిణీ చేసిన రుణసాయం కార్యక్రమానికి సంబంధించి రోడ్డు, ఇతర ఖర్చులు రూ.16 లక్షలను యూనియన్ జనరల్ నిధుల నుంచి చెల్లింపునకు వ్యతిరేకత, బీడీఓ కార్యాలయం పైకప్పు మరమ్మతులకు రూ. ఐదు లక్షల కేటాయింపు తీర్మానం సహా ఐదు తీర్మానాలకు సభ్యులు వ్యతిరేకత తెలిపి ఆ తీర్మానాలను తిరస్కరించారు. అదే సమయంలో యూనియన్‌లోని 27 గ్రామ పంచాయతీల్లో కనీస సదుపాయాల కల్పనకు వీలుగా రూ. 35 లక్షలు యూనియన్ జనరల్ నిధుల నుంచి విడుదల చేస్తూ తీర్మానం ఆమోదించారు. ఇంజినీరు ధర్మేష్, డిప్యూటీ బీడీఓ గిరిరాజ్ అధికారులు పాల్గొన్నారు.

జిత్తన్ రమేష్ కోసమే రూట్ నెంబర్ 17



రూట్ నెంబర్ 17 చిత్ర ఆడియో విడుదల వేడుక

తమిళ సినిమా: నటుడు జిత్తన్ రమేష్ కథానాయకుడిగా నటించిన చిత్రం రూట్ నెంబర్ 17. నిమి ప్రొడక్షన్ పతాకంపై డాక్టర్ అమర్ రామచంద్రన్ నిర్మించిన చిత్రం ఇది. దీనికి 14 అంతర్జాతీయ అవార్డులను తెచ్చుకున్న తాయ్ నిలం చిత్ర దర్శకుడు అభిలాష్ జి.దేవన్ దర్శకత్వం వహించారు. నటి అంజు పాండియన్ నాయికిగా నటించిన ఇందులో హరీష్ పేరడీ ప్రతినాయకుడిగా, అరువి మదన్ కీలక పాత్రను పోషించగా, ముఖ్యపాత్రలో అమర్ రామచంద్రన్, నివాస్, అఖిల్, ప్రభాకర్, జెనీఫర్, బిందు, కార్తీక్, విశ్వనాథన్ తదితరులు నటించారు. ఈ చిత్రం ద్వారా ప్రముఖ మలయాళ సంగీత దర్శకుడు ఔసె బచ్చన్ కోలీవుడ్‌కు పరిచయం కావడం విశేషం. కాగా హర్రర్, థ్రిల్లర్ ఇతివృత్తంతో రూపొందిన రూట్ నెంబర్ 17 చిత్రం నిర్మాణ కార్యక్రమాలు పూర్తి చేసుకుని ఈ నెల 29వ తేదీన విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా బుధవారం సాయంత్రం చిత్ర ఆడియో ఆవిష్కరణ కార్యక్రమాన్ని స్థానిక వడపలనిలోని ఫోరం హాల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్మాత టి.శివ, నటుడు ఆరి, గాయని సుజాత మోహన్, శ్వేతా మోహన్, నటుడు సురేష్ చక్రవర్తి మొదలగు పలువురు సినీ ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు మాట్లాడుతూ.. తనకు, జిత్తన్ రమేష్‌కు 15 ఏళ్ల స్నేహమని చెప్పారు. ఈ చిత్ర ఆయన కోసమే చేసినట్లు చెప్పారు. ఈ చిత్రం కోసం ఆయన్ని చాలా కష్టపెట్టినట్లు పేర్కొన్నారు. 29 రోజులపాటు మండే ఎండల్లో జిత్తన్ రమేష్ ఈ చిత్రం కోసం పనిచేశారని తెలిపారు. చిత్ర షూటింగ్ పది షెడ్యూల్లో పూర్తి చేసినట్లు చెప్పారు. సాధారణంగా షూటింగ్ స్పాట్‌లో ఉంటే అందరికీ ఒక రకమైన టెన్షన్ ఉంటుందని, అలాంటిది తమ చిత్ర నిర్మాత సెట్‌లో ఉంటే జాలీగా ఉంటుందన్నారు. మలయాళంలో 50 ఏళ్లుగా సంగీత దర్శకుడుగా పనిచేస్తూ పలు జాతీయ, కేరళా ప్రభుత్వం అవార్డులను గెలుచుకున్న ఔసె బచ్చన్‌ను ఈ చిత్రం ద్వారా తమిళ చిత్ర పరిశ్రమకు పరిచయం చేయడం సంతోషంగా ఉందన్నారు. పాటలు, నేపథ్య సంగీతం చిత్రానికి అదనపు ఆకర్షణగా ఉంటాయని దర్శకుడు తెలిపారు.


1962 నుంచి అభివృద్ధి చెందిన గ్రామంలో..!

తమిళ సినిమా: గ్రామీణ నేపథ్యంలో రూపొందే చిత్రాలపై ప్రేక్షకులకు ఆసక్తి నెలకొంటుంది. అలాంటి కథా చిత్రాల కంటెంట్ బాగుంటే మంచి ఆదరణ లభిస్తుంది. అలాంటి నేపథ్యంలో రూపొందిన చిత్రం వట్టార వళక్కు అని ఆ చిత్ర దర్శకుడు కన్ను సామి రామచంద్రన్ పేర్కొన్నారు. మధుర టాకీస్ ఆంజనేయ ప్రొడక్షన్స్ సంస్థల అధినేతలు కె.కంద సామి కలిసి నిర్మిస్తున్న ఈ చిత్రంలో జాతీయ ఉత్తమ చిత్రం అవార్డును గెలుచుకున్న టులెట్ చిత్రం ఫేమ్ సంతోష్ నమ్మిరాజన్, నటి నవీనా రవి జంటగా నటించిన ఈ చిత్రం నిర్మాణ కార్యక్రమాలు పూర్తి చేసుకుని ఈ నెల 29వ తేదీన తెరపైకి రావడానికి రెడీ అవుతోంది. ఈ సందర్భంగా మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో చిత్ర దర్శకుడు దీని వివరాలు తెలుపుతూ... వట్టారా వళక్కు చిత్రం ప్రేక్షకులకు ఆశ్చర్యాన్ని కలిగించడానికి ఎదురుచూస్తోందని చెప్పారు. మధురై ఉత్తర ప్రాంతంలో జరిగిన ఒక యదార్థ సంఘటన ఆధారంగా పగ, ప్రతీకారం, ప్రేమ, అసహ్యం, హత్య, కేసు మొదలగు సంఘటనలతో కూడిన కథా చిత్రంగా ఇది ఉంటుందన్నారు. ఇది ఇంతకుముందు ఎప్పుడు తెరపైకి రానటువంటి ప్రేమోద్రేకాన్ని కలిగించే కథా చిత్రంగా ఉంటుందన్నారు. ఇది 1985లో జరిగే కథ చిత్రంలోనిది, అయితే 1962 ప్రాంతంలో జరిగే చిన్న ఫ్లాష్ బ్యాక్ ఉంటుందని, ఆ సన్నివేశాలు చిత్రీకరించడానికి ఒక ప్రాంతం అవసరం అయిందని అన్నారు. అందుకు వెస్ట్ మధురై లోని కళ్ల పట్టి అనే గ్రామం బాగుంటుందని భావించామన్నారు. అది 1962 నుంచి ఎలాంటి అభివృద్ధి చెందని గ్రామం అని అన్నారు. ఈ చిత్రానికి మూడర్ కూట్టం చిత్రం ఫేమ్ దోనీ షాన్, సురేష్ మణియన్‌ల ద్వయం ఛాయాగ్రహణం అందించారు.



వట్టార వళక్కు చిత్ర బృందం

వైవిధ్య భరిత ప్రేమ కథా చిత్రంగా ఆలన్



ఆలన్ చిత్ర ఫస్ట్ లుక్

తమిళ సినిమా: 8 తూట్టాగళ్ చిత్రం ఫేమ్ వెట్రి కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం ఆలన్. ఈయనకు జంటగా ఆస్ట్రేలియాకు చెందిన తబేయా మధురర్ నటిస్తున్న ఈ చిత్రాన్ని త్రీఎస్ పిక్చర్స్ పతాకంపై శివ.ఆర్ నిర్మిస్తూ స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్ర వివరాలను ఆయన తెలుపుతూ కోలీవుడ్‌లో పూర్తి ప్రేమకథా చిత్రాలు అరుదుగానే వస్తుంటాయన్నారు. అలాంటి ప్యూర్ లవ్ స్టోరీ చిత్రంగా ఆలన్ ఉంటుందన్నారు. చిన్నతనం నుంచి రచనల మీద ఆసక్తి కలిగిన ఒక యువకుడి కథే ఈ చిత్రం అని చెప్పారు. అతని 15 ఏళ్ల వయసులో జరిగిన ఒక అనూహ్య సంఘటన, అతని ప్రేమ, 40 ఏళ్ల వరకు జరిగే తన జీవిత పయనం ఈ చిత్రం అన్నారు. జీవితంలో జరిగిన అనూహ్య సంఘటన అది ఒక నది ప్రవాహంగా సాగే పయనం, ప్రేమ, ఆధ్యాత్మిక రచనలు అంటూ అతని పరిపూర్ణ జీవితాన్ని ఆవిష్కరించే కథా చిత్రమని దర్శకుడు శివ.ఆర్ తెలిపారు. ఈ చిత్ర షూటింగ్ తమిళనాడులోని రామేశ్వరం తదితర ప్రాంతాలతో పాటు కాశీ, రిషికేష్ వంటి ఇతర రాష్ట్రాలలో చిత్రీకరిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం చిత్ర తొలి షెడ్యూల్ షూటింగ్ పూర్తయిందని, రెండో ఆ షెడ్యూల్ జరుగుతోందని చెప్పారు. చిత్ర టీజర్, ట్రైలర్ ఆవిష్కరణ వివరాలను త్వరలోనే వెల్లడించినట్లు తెలిపారు. కాగా ఆలయం చిత్ర ఫస్ట్ లుక్ పోస్టర్‌ను నటుడు విజయ్ సేతుపతి గురువారం ఆన్‌లైన్ ద్వారా విడుదల చేశారని, దీనికి సినీ వర్గాల నుంచి, ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వస్తుందనే సంతోషాన్ని దర్శక నిర్మాత శివ.ఆర్ వ్యక్తం చేశారు.

కోలీవుడ్ టాక్స్

రష్మిక పాత్రలో మాళవిక మోహన్?



తమిళ సినిమా: ఇప్పుడు కోలీవుడ్‌లో ఒక ఆసక్తికరమైన ప్రచారం జరుగుతోంది. అదే నటి రష్మిక మందన నటించిన చిత్రానికి సీక్వెల్‌లో మలయాళ బ్యూటీ మాళవిక మోహన్ నటించబోతున్నారన్నదే ఆ ప్రచారం. రజనీకాంత్ కథానాయకుడిగా నటించిన పేట చిత్రం ద్వారా కోలీవుడ్‌కు పరిచయమైన మలయాళ నటి మాళవిక మోహన్. ఆ చిత్రంలో నటుడు శశి కుమార్‌కు భార్యగా నటించి ప్రశంసలు అందుకున్న ఈమె ఆ తర్వాత విజయ్‌కు జంటగా మాస్టర్ చిత్రంలో నటించారు. ఆ తర్వాత ధనుష్ సరసన మారన్ చిత్రంలో మెరిశారు. ప్రస్తుతం విక్రమ్ జంటగా తంగలాన్ చిత్రంలో నటించిన మాళవిక మోహన్ ఆ చిత్ర విడుదల కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. పా.రంజిత్ దర్శకత్వంలో స్టూడియో గ్రీన్ పతాకంపై కేఈ జ్ఞానవేల్ నిర్మిస్తున్నారు. నిర్మాణ కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం వచ్చే ఏడాది జనవరి 26వ తేదీన తెరపైకి రావడానికి ముస్తాబు అవుతోంది. కాగా నటి మాళవిక మోహన్ ఇంతకుముందు కొన్ని హిందీ, మలయాళం చిత్రాల్లోనూ నటించారన్నది గమనార్హం. తాజాగా మరో హిందీ చిత్ర అవకాశం ప్రసారం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతుంది. బాలీవుడ్ నటుడు రణ్వీర్‌కపూర్ హీరోగా నటించిన యానిమల్ చిత్రంలో ఇండియన్ క్రష్ బ్యూటీ రష్మిక మందన్న నాయకిగా నటించిన విషయం తెలిసిందే. టాలీవుడ్ దర్శకుడు సందీప్ వంగా దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఇటీవల విడుదలై వసూళ్ల వర్షం కురిపిస్తోంది. దీంతో ఈ చిత్రానికి సీక్వెల్‌ను రూపొందించడానికి యూనిట్ వర్గాలు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. ఇందులో నటి మాళవిక మోహన్ కథానాయకిగా నటింపజేయడానికి చర్చలు జరుగుతున్నట్లు టాక్ స్ప్రెడ్ అవుతోంది. ఇదే నిజమైతే మరి యానిమల్ చిత్రంతో మంచి విజయాన్ని అందుకున్న రష్మిక మందన్న పరిస్థితి ఏమిటన్న ప్రశ్న తలెత్తుతోంది. అయితే దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన వచ్చే వరకు ఒక నిర్ణయానికి రాకూడదు.



● విజయ్ చిత్రంలో

మరో యువ నటికి ఛాన్స్?

తమిళ సినిమా: దళపతి విజయ్ సరసన నటించే అవకాశం రావడం ఏ హీరోయిన్‌కైనా లక్కీ చాన్సే అవుతుంది. ఆయనతో ఒక చిత్రంలో నటిస్తే చాలు పాపులర్ అయిపోతారు. అలాంటి లక్కీ అవకాశం ఓ యువ నటికి వచ్చినట్లు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం వైరల్ అవుతుంది. విజయ్ కథానాయకుడిగా నటించిన చిత్రం విడుదలై మిశ్రమ స్పందనను తెచ్చుకున్న కలెక్షన్ల పరంగా కుమ్మేసింది అనే చెప్పాలి. కాగా ప్రస్తుతం ఈయన తన 68వ చిత్రంలో నటిస్తున్నారు. వెంకట్ ప్రభు దర్శకత్వం వహిస్తున్న ఈ భారీ చిత్రాన్ని ఏజీఎస్ సంస్థ నిర్మిస్తోంది. నటుడు ప్రశాంత్, ప్రభుదేవా, వైభవ్, ప్రేమ్ జీ, నటి స్నేహ తదితరులు ముఖ్యపాత్రలు పోషిస్తున్న ఈ చిత్రంలో నటి మీనాక్షి చౌదరి కథానాయకిగా నటిస్తున్నారు. యువన్ శంకర్ రాజా సంగీతాన్ని అందిస్తున్నారు. ఈ చిత్ర షూటింగ్ శరవేగంగా జరుపుకుంటుంది. ముందుగా చెన్నైలో కొంత భాగాన్ని చిత్రీకరణ జరుపుకున్న ఈ చిత్ర ఆ తర్వాత థాయ్ ల్యాండ్ లో కొన్ని కీలక సన్నివేశాలను పూర్తి చేసుకుంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో చిత్రీకరణ జరుపుకుంటుంది. కాగా ఇందులో మరో ముఖ్య పాత్రలో నటి మాళవిక శర్మ నటించబోతున్నట్లు టాక్ వైరల్ అవుతోంది. ఈమె ఇంతకుముందు తెలుగులో కొన్ని చిత్రాలు నటించారు. అదేవిధంగా సుందర్.సి దర్శకత్వంలో కాఫీ విత్ ఖాదల్ చిత్రంలో నటించారు. కాగా ఈమె పేరుతో సామాజిక మాధ్యమాల్లో విజయ్ 68వ చిత్రంలో నటిస్తున్నట్లు పోస్ట్ చే దీంతో మాళవిక శర్మ విజయ్ సరసన నటించబోతున్నట్లు ప్రచారం హల్ చల్ చేస్తోంది. ఇదే దీనికి సంబంధించి చిత్ర వర్గాలు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. కాగా విజయ్ 68వ చిత్రం సన్స్ ఫిక్షన్ నేపథ్యంలో తెరకెక్కుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే అది వాస్తవం కాదని ఈ చిత్రం పక్కా కమర్షియల్ అంశాలతో మాస్ ఎంటర్‌టైనర్‌గా ఉంటుందని తెలిసింది.

క్లుప్తంగా

బ్యాంకు భవనంలో అగ్నిప్రమాదం

అన్నానగర్: చెన్నై ప్యారిస్ కార్నర్‌లో ఇండియన్ బ్యాంక్ ప్రధాన కార్యాలయం ఉంది. ఈ 8 అంతస్తుల భవనం గత రెండు నెలలుగా పునర్నిర్మాణంలో ఉంది. బ్యాంకులు భవనం అంతస్తులలో మాత్రమే పని చేస్తున్నాయి. బ్యాంక్ రక్షణ ఉన్నప్పటికీ, నిర్మాణ సిబ్బంది భవనం రెండో అంతస్తు వెలుపల బుధవారం పునర్నిర్మాణ పనులు చేస్తున్నారు. వెల్డింగ్ ప్రక్రియలో అకస్మాతుగా ఒక స్పార్క్ ప్రారంభమై భద్రత వస్త్రానికి మంటలు అంటుకున్నాయి. ఆపై పొడవాటి వస్త్రం మొత్తం మంటలు చెలరేగడంతో బ్యాంకు ఖాతాదారులు, ఉద్యోగులు షాక్‌కు గురయ్యారు. బ్యాంకులో మంటలు చెలరేగాయని భావించి ప్రాణాల కోసం కేకలు వేస్తూ బయటకు పరుగులు తీశారు. కొంతమంది కిటికీలోంచి కూడా వెళ్లిపోవడంతో తోపులాట చోటుచేసుకుంది. ఇంతలో క్లాత్‌లోని మంటలను సిబ్బంది కొద్ది నిమిషాలలోనే ఆర్పి వేశారు. దీంతో బ్యాంకు ఉద్యోగులు, ఖాతాదారులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనపై నార్త్ సముద్రతీరం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కార్మికుడి హత్య కేసులో నిందితుడికి జైలు

అన్నానగర్: చెన్నై కొత్వాల్‌చావడికి చెందిన వరదన్ కూలీ కార్మికుడు. ఇతనితోపాటు అరియలూరు జిల్లా సుంకుడికి చెందిన రాజామాణిక్యం కూలీ పని చేసేవాడు. ఒకటిగా కలిసి చేసిన పనికి వచ్చే వేతనాల విభజనపై వాగ్వాదం జరగడంతో వారి మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఈ శత్రుత్వం కారణంగా 9.3.2015న కొత్వాల్‌చావడి వరదముత్తియప్పన్ వీధిలోని ఓ భవనం మెట్లపై నిద్రిస్తున్న వరదన్‌పై రాజమాణిక్యం ఇనుప రాడ్‌తో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన వరదన్ మృతి చెందాడు. కొత్వాల్‌చావడి పోలీసులు కేసు నమోదు చేసి రాజమాణిక్యంను అరెస్టు చేశారు. ఈ కేసు విచారణ చెన్నై 7వ అదనపు సెషన్స్ కోర్టులో న్యాయమూర్తి పాండ్యరాజ్ సమక్షంలో జరిగింది. కేసును విచారించిన న్యాయమూర్తి రాజమాణిక్యంపై అభియోగం రుజువు కావడంతో జీవిత ఖైదు, రూ.500 జరిమానా విధిస్తూ గురువారం తీర్పు చెప్పారు.

చికెన్ షాపు కార్మికుడి హత్య

కొరుక్కుపేట: రూ.500 అప్పు విషయమై చికెన్ షాపు ఉద్యోగిని కత్తితో పొడిచి చంపిన యువకుడిని అరెస్ట్ చేశారు. సిబుల్(25), శుక్లా(40) అసోంకు చెందిన వారు. చెన్నైలోని నీలాంగరైలోని థియ రోడ్డులో ఉన్న ధోనీ చికెన్‌షాపులో పని చేసేవారు. ఈ పరిస్థితిలో శుక్లా తనతో పని చేస్తున్న సిబుల్ నుండి రూ.500 అప్పుగా తీసుకున్నాడు. డబ్బులు అడగడంతో.. తన వద్ద డబ్బులు లేవని శుక్లా చెప్పాడు. దీంతో వారిద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో కోపోద్రిక్తుడైన సిబుల్ కోడిని కోసేందుకు ఉపయోగించే కత్తితో శుక్లా మెడపై నరికాడు. ఇది గమనించిన ఇరుగుపొరుగు వారు వచ్చి అతడిని వెంటనే చెన్నై రాయపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ ఇంటెన్సివ్ కేర్‌లో ఉండగా శుక్లా గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. దీనిపై సమాచారం అందుకున్న నీలాంగరై పోలీసులు వెళ్లి శుక్లా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి ఆ ప్రాంతంలో తలదాచుకున్న సిబుల్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం అతడిని ఆలందూరు కోర్టులో హాజరుపరిచి పుళల్ జైలులో ఉంచారు.

వ్యక్తి కోసం గాలింపు

కొరుక్కుపేట: పదేళ్ల బాలికను లైంగికంగా వేధించిన నిందితుడిని పట్టుకునేందుకు లుక్ అవుట్ నోటీసు జారీ చేశారు. చెన్నైలోని కోయంబేడు ప్రాంతానికి చెందిన కుమార్ బహదూర్(30) అదే ప్రాంతంలో అట్ట పెట్టె వద్ద పనిచేస్తున్నాడు. 2015లో పదేళ్ల బాలికను లైంగికంగా వేధించినందుకు చెన్నై తిరుమంగళంలోని మహిళా పోలీసు అధికారి ఆ యువకుడి పోక్సో కేసు నమోదు చేసి, అదే రోజు చెన్నై హైకోర్టులోని పోక్సో కోర్టులో హాజరుపరిచి జైలుకు పంపారు. పుళల్ జైలు నుంచి బయటకు వచ్చిన కుమార్ బహదూర్ గత 8 సంవత్సరాలుగా పోక్సో కోర్టుకు హాజరు కాకుండా పరారీలో ఉన్నాడు. దీంతో అతడిని వాంటెడ్ క్రిమినల్‌గా ప్రకటించాలని కోయంబేడు మహిళా పోలీసులందరినీ ఆదేశించింది. దీంతో కోయంబేడు మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో ఎయిర్ పోర్టు, కోయంబేడు బస్టాండ్, కీలక ప్రాంతాల్లో లుకౌట్ నోటీసులు అంటించారు.

ప్రియుడిని హత్య చేసిన వివాహిత

తిరువళ్లూరు: అప్పుగా ఇచ్చిన నగదును తిరిగి ఇవ్వాలన్నందుకు ఏకంగా ప్రియుడిని దారుణంగా హత్య చేయించిన వివాహితతోపాటు మరో ఇద్దరిని అరెస్టు చేసిన పోలీసులు పరారీలో ఉన్న మరో ఇద్దరి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. తిరువళ్లూరు జిల్లా పొన్నేరి సమీపంలోని శివన్ ఆలయ వీధికి చెందిన ప్రియకు అదే ప్రాంతానికి చెందిన లక్ష్మణన్‌తో పది సంవత్సరాల క్రితం వివాహమైంది. భార్యాభర్త మధ్య మనస్పర్థల కారణంగా విడిపోయి తన పిల్లలతో కలిసి అదే ప్రాంతంలో ప్రియ నివాసం ఉంటోంది. కొద్ది నెలల క్రితం బాలాజీ నగర్‌కు చెందిన గోపి అనే ప్రైవేటు ఉద్యోగితో ప్రియకు పరిచయం ఏర్పడింది. కొద్ది రోజులుగా ఓ ఇంటిని అద్దెకు తీసుకుని గోపి, ప్రియ నివాసం ఉంటున్నారు. ఈ సమయంలో గోపి ప్రియకు అప్పుగా రూ.2 లక్షలు ఇచ్చాడు. అప్పుగా ఇచ్చిన రూ.2 లక్షలు తిరిగి ఇవ్వాలని కోరాడు. దీంతో ప్రియ నలుగురు యువకులతో కలిసి గోపిని వెంబడించి దారుణంగా హత్య చేసింది. పోలీసులు ప్రియతోపాటు ఇద్దరిని అరెస్టు చేశారు.

పాఠశాల భవనంపై కూలిన మర్రిచెట్టు


పాఠశాల భవనంపై కూలిన చెట్టు కొమ్మ


గాయపడిన విద్యార్థులకు ఎమ్మెల్యేలు, కలెక్టర్ పరామర్శ

• 20 మంది విద్యార్థులకు గాయాలు

తిరువళ్లూరు: మధ్యాహ్నం క్లాసులు ముగిన తరువాత భోజనం చేస్తున్న సమయంలో మర్రిచెట్టు కొమ్మ విరిగి పాఠశాల భవనంపై పడింది. ఈ ప్రమాదంలో మధ్యాహ్న భోజనం ఉద్యోగి సుగుణతో సహా 21 మంది గాయపడిన సంఘటన స్థానికంగా కలకలం రేపింది. తిరువళ్లూరు జిల్లా శిరువానూర్ కండ్రిగ గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉంది. ఈ పాఠశాలలో ముగ్గురు ఉపాధ్యాయులు, 35 మంది విద్యార్థులు ఉన్నారు. గురువారం ఉదయం యథావిధిగా తరగతులకు హాజరైన విద్యార్థులు మధ్యాహ్న భోజనం కోసం సమీపంలోని భోజన తయారీ భవనానికి వెళ్లి అక్కడే భోజనం చేయడం ప్రారంభించారు. విద్యార్థులు భోజనం చేస్తున్న సమయంలో హఠాత్తుగా సమీపంలోని మర్రిచెట్టు కొమ్మ విరిగి పాఠశాల పాత భవనంపై పడింది. దీంతో పాఠశాల పైకప్పులోని పెంకులు విరిగి విద్యార్థులపై పడ్డాయి. ఈ ప్రమాదంలో జయశ్రీ, నిషా, ధనిష్క, సంతానం, గోపికశ్రీ, యామిని, కార్తీక్, ప్రియతో పాటు 13 మంది బాలికలు, ఏడుగురు బాలురు, మధ్యాహ్న భోజన తయారీ ఉద్యోగి సుగుణతో సహా 21 మంది గాయపడ్డారు. ప్రమాదం విషయం తెలుసుకున్న ప్రధానోపాధ్యాయుడు అన్నామలై 108కు సమాచారం ఇచ్చారు. గాయపడిన వారిని తిరువళ్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రమాదంపై స్పందించిన కలెక్టర్, ప్రభుత్వ డీన్ రేవతితో ప్రత్యేకంగా మాట్లాడి, నాణ్యమైన చికిత్స అందించేలా వేగంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో అప్రమత్తమైన డీన్, ఆర్థోపెడిక్, చైల్డ్ స్పెషలిస్టులను పిలిపించి వైద్యసేవలను ప్రారంభించారు. అవసరమైన వారికి సీటీ స్కాన్, ఎక్స్‌రే తీసి వైద్యం అందించారు. తలకు గాయమై స్పృహ కోల్పోయిన వారిని ఐసీయూకి తరలించారు. కాగా విద్యార్థులకు ప్రమాదం విషయం తల్లిదండ్రులకు తెలియడంతో వారు పెద్ద ఎత్తున వైద్యశాలకు చేరుకున్నారు. తమ బిడ్డల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకోవడానికి ఎగబడడంతో ఉద్రిక్తంగా మారింది. తల్లిదండ్రుల రోదనలు, అరుపులతో వైద్యశాల ఆవరణం దద్దరిల్లింది.

కలెక్టర్, ఎమ్మెల్యేల పరామర్శ

విద్యార్థులు ప్రమాదానికి గురైన సంఘటనపై సమాచారం అందుకున్న కలెక్టర్ డాక్టర్ ప్రభుశంకర్, ఎమ్మెల్యేలు వీజీ రాజేంద్రన్, తిరుత్తణి చంద్రన్, సీఈఓ రవిచంద్రన్‌తోపాటు పలువురు ఉన్నతాధికారులు గాయపడిన విద్యార్థులను పరామర్శించారు. వారికి ధైర్యం చెప్పారు. నాణ్యమైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని వైద్యులను ఆదేశించారు.

డీఎంకే–బీజేపీ మధ్య వాగ్వాదం

పాఠశాల విద్యార్థులు ప్రమాదానికి గురైన సంఘటనపై అన్ని పార్టీలకు చెందిన నేతలు విద్యార్థులను పరామర్శించారు. ఇందులో భాగంగానే బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు ఆర్యశ్రీనివాసన్, కరుణాకరన్, జిల్లా కార్యదర్శి కోలా బాలాజీ, ఓబీసీ విభాగం రాష్ట్ర కార్యదర్శి రాజ్‌కుమార్‌తోపాటు పలువురు విద్యార్థులను పరామర్శించారు. అనంతరం అక్కడే వున్న కలెక్టర్ డాక్టర్ ప్రభుశంకర్, ఎమ్మెల్యేలను కలిసి పాఠశాలకు నూతన భవనం నిర్మించడానికి అవసరమైన నిధులను ఇవ్వాలని కోరుతూ వినతి పత్రం ఇవ్వడానికి యత్నించారు. అయితే డీఎంకే నేతలు బీజేపీ నేతలను పక్కకు తోసేసి ఎమ్మెల్యేలను నేరుగా కారు ఎక్కించి బయటకు పంపారు. దీంతో విస్తుపోయిన బీజేపీ నేతలు డీఎంకే అనుచిత వైఖరిని ఖండిస్తూ నినాదాలు చేశారు. అనంతరం వైద్యశాలలో బైఠాయించారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ హనుమంతు, సీఈఓ రవిచంద్రన్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. పాఠశాలకు అదనపు కొత్త భవనం నిర్మించడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో వారు శాంతించి ఆందోళన విరమించారు.

సీనియర్ నటుడు, దర్శకుడు ఆర్.శంకరన్ కన్నుమూత


ఆర్ శంకరన్

తమిళ సినిమా: సీనియర్ దర్శకుడు నటుడు ఆర్ శంకరన్ (93) గురువారం ఉదయం చెన్నైలోని స్వగృహంలో వృద్ధాప్యం కారణంగా కన్నుమూశారు. 1962లో విడుదలైన ఆడి పేరుకు చిత్రం ద్వారా నటుడుగా పరిచయమైన శంకరన్ ఆ తర్వాత ఊరు, ఖైదీ, లీలావతి, ఖాదర్ కోట్టై తదితర చిత్రాల్లో నటించారు. నటుడు కార్తీక్, రేవతి జంటగా నటించిన మౌనరాగం చిత్రంలో రేవతి తండ్రిగా చంద్రమౌళి అనే పాత్రలో నటించి బాగా పాపులర్ అయ్యారు. ఈయన చివరిగా 1999లో అళగర్ సామి అనే చిత్రంలో నటించారు. కాగా 19 74లో విడుదలైన ఒన్నే ఒన్ను కన్నె కన్ను అనే చిత్రం ద్వారా దర్శకుడుగా పరిచయం అయ్యారు. ఆ తర్వాత తేన్ సింధు దే వానం, దుర్గాదేవి, ఒరువనుక్కు ఒరుత్తి, తూండిల్ మీన్, పెరిమై కురియవన్, వేలుమ్ మైలుమ్ తున్నై, కుమారి పెణిన్ ఉళ్లత్తిలే వంటి పలు సక్సెస్‌ఫుల్ చిత్రాలకు దర్శకత్వం వహించారు. దర్శకుడు భారతి రాజా ఈయన వద్ద సహాయ దర్శకుడిగా పనిచేశారు అన్నది గమనార్హం. స్థానిక టీ నగర్ లో నివసిస్తున్న ఆర్ శంకరన్ గురువారం ఉదయం తుది శ్వాస విడిచారు. ఆయన మృతికి దర్శకుడు భారతీయ రాజా ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేస్తూ ట్వీట్ చేశారు. అందులో తన గురువు శంకరం మృతి తీవ్ర మస్తాపానికి గురిచేసిందన్నారు. ఆయన్ని కోల్పోయిన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేస్తున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా పలువురు సినీ ప్రముఖులు శంకర్ మృతికి తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు.

మాగ్ని ఫ్లెక్స్ ఇండియా సేవల విస్తరణ

సాక్షి, చెన్నై: చెన్నై, తిరుప్పూర్, కోయంబత్తూరులలో మాగ్ని ఫ్లెక్స్ ఇండియా చార్ట్స్, ఫ్రాంచైజ్ నెట్‌వర్క్ విస్తరణకు ప్రణాళికను రూపొందించామని ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఆనంద్ నిచాని తెలిపారు. చెన్నై అతిపెద్ద వాణిజ్యానికి కేంద్రంగా ఉన్న దృష్ట్యా, 12 బలమైన నెట్ వర్క్‌లతో తమిళనాడులో సేవలను విస్తృతం చేయనున్నామని ప్రకటించారు. గురువారం స్థానికంగా జరిగిన సమావేశంలో ఎర్గోట్రి ఎలక్ట్రిక్ బెడ్, మాగ్ని ఫ్లెక్స్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (ఎంఐపీ) ప్రారంభం గురించి ఆయన వివరించారు. ఇటలీ కేంద్రంగా శక్తి వంతమైన ల్యాండ్ స్కేప్‌లో ప్రత్యేకంగా రాణిస్తున్న తమ సంస్థ జనవరి 2024లో తమ ముద్రను మరింత బలోపేతం చేయనున్నట్లు వివరించారు. చెన్నై, తిరుప్పూర్, కోయంబత్తూరులోనూ సేవల విస్తరణతో పాటు వినియోగదారుల ఆరోగ్యానికి ప్రాధాన్యతను ఇచ్చే విధంగా మాగ్ని ఫ్లెక్స్ ఇండియా ఎర్గోట్రి ఎలక్ట్రిక్ బెడ్‌లను సిద్ధం చేశామని తెలిపారు.

రూ. 4 కోట్ల విలువైన బంగారం సీజ్

• ఇద్దరు అరెస్టు

కొరుక్కుపేట: చెన్నై అంతర్జాతీయ విమానాశ్రయంలో మలేషియా, కువైట్ నుంచి వచ్చిన 2 విమానాల్లో అక్రమంగా తరలిస్తున్న రూ. 4 కోట్ల విలువైన బంగారాన్ని కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి మలేషియా ప్రయాణికుడి సహా ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. దీంతో అక్కడ పెద్దఎత్తున గందరగోళం నెలకొంది. వివరాలు.. చెన్నై విమానాశ్రయంలోని అంతర్జాతీయ విమానాశ్రయ టెర్మినల్‌లో విదేశీ విమానాల ద్వారా పెద్ద ఎత్తున బంగారు కడ్డీలు అక్రమంగా తరలిస్తున్నట్లు విమానాశ్రయ అధికారులకు రహస్య సమాచారం అందింది. దీంతో బుధవారం ఉదయం నుంచి అధికారులు తీవ్ర నిఘా పెట్టారు. ఈ క్రమంలో మలేషియా రాజధాని కౌలాలంపూర్ నుంచి ఎయిర్ ఏషియా విమానం చెన్నై అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకుంది. కస్టమ్స్ అధికారులు ప్రయాణికులను పర్యవేక్షించి అనుమానాస్పద ప్రయాణికులను నిలిపి సోదాలు చేశారు. ఆ సమయంలో మలేషియాకు చెందిన 30 ఏళ్ల యువకుడిపై అధికారులకు అనుమానం వచ్చింది. అతని వస్తువులు వెతికితే డ్రిల్లింగ్ మిషన్ కనిపించింది. దాన్ని తొలగించగా.. లోపల రూ. 1.88 కోట్ల విలువైన 3.49 కిలోల బరువున్న 3 బంగారు కడ్డీలు అక్రమంగా తరలించినట్లు తేలింది. వాటిని కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మలేషియా ప్రయాణికుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. అలాగే కువైట్ నుంచి అబుదాబి మీదుగా ఎయిర్ అరేబియా విమానం బయలుదేరింది. ప్రయాణికులను కస్టమ్స్ అధికారులు తనిఖీ చేశారు. ఆ సమయంలో చెన్నైకి చెందిన ఓ ప్రయాణికుడిపై అనుమానం వచ్చింది. అతని సూట్ సిరాలను పరీక్షిస్తున్నప్పుడు 4.93 కిలోల బరువున్న రూ. 2.67 కోట్ల విలువైన బంగారు కడ్డీలను అక్రమంగా తరలించినట్లు తేలింది. ఈ నేపథ్యంలో చెన్నైకి చెందిన ఆ ప్రయాణికుడిని అదుపులోకి తీసుకున్నారు. బంగారు కడ్డీలు కస్టమ్స్ అధికారులు జప్తు చేశారు.


స్వాధీనం చేసుకున్న బంగారు కడ్డీలు

నూతన ఆసుపత్రి ప్రారంభం


వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే చంద్రన్

తిరుత్తణి: తిరుత్తణి బైపాస్ రోడ్డులో నూతన ప్రైవేటు ఆసుపత్రి సేవలను ఎమ్మెల్యే చంద్రన్ గురువారం ప్రారంభించారు. తుంబికులం గ్రామానికి చెందిన డీఎంకే కార్యకర్త గోపి కుమారుడు ముత్తరసన్ వైద్య విద్యలో ఎండీ పూర్తిచేసి, చెన్నైలోని ప్రైవేటు ఆసుపత్రిలో పనిచేసేవాడు. ఈ క్రమంలో తమ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు అందించాలన్న సంకల్పంతో తిరుత్తణి బైపాస్ రోడ్డు మార్గంలో నూతన క్లినిక్ ఏర్పాటు చేశారు. వైద్య సేవలను ఎమ్మెల్యే చంద్రన్ ప్రారంభించి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ప్రతి ఒక్కరికి సకాలంలో వైద్య సేవలు అందాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని ఆ దిశగా ప్రభుత్వం వైద్య సేవలను విస్తరిస్తున్నట్లు, వైద్యులు గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలకు ముందుకు రావడం ఆనందంగా ఉందన్నారు. డీఎంకే మండల కన్వీనర్లు హారతి రవి, గూలూరు రాజేంద్రన్ సహా పలువురు పాల్గొన్నారు.

రైతుల ఆందోళన

సేలం: భవాని సాగర్ సాగునీటి కాలువల అడుగు భాగాన కాంక్రీట్ ఫ్లోర్‌ను నిర్మించే యోచనను విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ రైతులు పలుచోట్ల నిరసనలు తెలుపుతున్నారు. ఈ డిమాండ్‌ను నొక్కి చెబుతూ కిల్‌భవాని సాగునీటి పరిరక్షణ ఉద్యమం తరపున ఈరోడ్ పాలయ్యపాలెం నుంచి కాలినడకన కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి వినతిపత్రం సమర్పించారు. ఈ విషయమై కిల్‌భవాని సాగునీటి పరిరక్షణ ఉద్యమ సమన్వయకర్త రవి మాట్లాడుతూ.. 2010లో డీఎంకే హయాంలో కిల్‌భవాని డ్రెయిన్లు మరమ్మతులకు సంబంధించి మోహనకృష్ణ నేతృత్వంలో కమిటీని ఏర్పాటు చేశారు. మోహనకృష్ణన్ నివేదికను అమలు చేయడం వల్ల కిల్‌భవాని కాలువ చుట్టూ ఉన్న వ్యవసాయ భూములు, పర్యావరణం దెబ్బతింటుందని రైతులు నిరసన వ్యక్తం చేయడంతో పథకం రద్దు చేయబడింది. అనంతరం 2013లో అప్పటి ముఖ్యమంత్రి జయలలిత హయాంలో కిల్‌భవాని డ్రెయిన్లలో కాంక్రీట్ ఫ్లోర్ నిర్మించేందుకు ప్రయత్నించారు. మళ్లీ 2020లో మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి ఆధునీకరణ, పునరుద్ధరణ, విస్తరణ పేరుతో కాంక్రీట్ ఫ్లోర్ నిర్మాణానికి ఆర్డినెన్స్ 276ను జారీ చేశారు. దీనికి సంబంధించిన కేసులో హైకోర్టు ఆదేశాల మేరకు డ్రెయిన్లలో కాంక్రీట్ వేసే పనులు ప్రారంభమయ్యాయి. కిల్‌భవాని కెనాల్ ద్వారా సాగునీరందించే తిరుపూర్, ఈరోడ్, కరూర్ జిల్లాల్లోని 90 శాతం మంది రైతులు ఈ ప్రాజెక్టును వ్యతిరేకిస్తున్నారు. కెనాల్ నిర్మాణ ప్రాజెక్టులోనే 33 శాతం లీకేజీ ఉంటుందని పేర్కొన్నారు. నీటి ఎద్దడి కారణంగా దాదాపు 2,000 ఎకరాల వ్యవసాయ భూమికి సాగునీరు అందుతుంది. కాలువల నిర్వహణ సరిగా లేకపోవడమే అవుట్‌లెట్‌లోకి నీరు చేరకపోవడానికి ప్రధాన కారణం. దీంతో మెజారిటీ రైతుల డిమాండ్‌ను అంగీకరించి కాంక్రీట్ వేసే ప్రతిపాదనను రద్దు చేయాలని కోరారు. కాలువపై ఉన్న పాత నిర్మాణాలను పునరుద్ధరించాలని తెలిపారు. 34 సీపేజ్ ఇరిగేషన్ రైతులను కూడా కాపాడాలని కాలువ సాగునీటి ప్రాజెక్టుకు భూమిలిచ్చిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కాలువలో ప్రతి ఏటా క్రమానుగతంగా పూడిక తీయడం ద్వారా అన్ని ఔట్‌లెట్లకు పూర్తిస్థాయిలో నీరు వచ్చేలా చూడాలని విన్నవించారు. దెబ్బతిన్న కల్వర్టులకు మరమ్మతులు చేయాలని, నీటిపారుదల మండలికి సక్రమంగా ఎన్నికలు నిర్వహించాలని, మట్టి కట్ట, మట్టి కాలువ ప్రజల కోసమే అనే నినాదంతో 1000 మందికి పైగా రైతులు కాలినడకన వెళ్లి కలెక్టర్‌ను కలిశారు. వ్యవసాయం, తాగునీరు, పర్యావరణాన్ని పరిరక్షించాలని వినతి పత్రం అందించారని తెలిపారు. జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించిన అనంతరం కొమదెక ప్రధాన కార్యదర్శి ఈ.ఆర్.ఈశ్వరన్ ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ కాంక్రీట్ ప్రాజెక్టును చాలా మంది రైతులు వ్యతిరేకిస్తున్నారన్నారు. మెజారిటీ ప్రజల డిమాండ్‌ను ప్రజాప్రతినిధిగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించామన్నారు. రైతుల డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. రైతుల డిమాండ్‌ను మంత్రులు ఎస్.ముత్తుసామి, ఎం.పి.సామినాథన్ ద్వారా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఈ ప్రాజెక్టు వల్ల కలిగే ప్రభావాలను ఎత్తిచూపడంతో పాటు మట్టి కట్టలు నిర్మించాలని ముఖ్యమంత్రిని కోరతామన్నారు. కొమదెక రాష్ట్ర కోశాధికారి కె.కె.సి.బాలు, యువజన కార్యదర్శి ఎస్.సూర్యమూర్తి, బీజేపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.కె.నాగరాజ్, తమిళనాడు చిన్న,సన్నకారు రైతు సంఘం అధ్యక్షుడు కె.ఆర్.సుతందరరసు, ఈరోడ్, తిరుపూర్, కరూర్ జిల్లాల సభ్యులు పాదయాత్రలో ఉన్నారు. పలు కోరికలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ గురువారం ఈరోడ్‌లో రైతులు ఆందోళన చేపట్టారు. కీల్‌భవానీ సాగునీటి పరిరక్షణ ఉద్యమం తరపున జరిగిన ఈ ఆందోళనలో ఈరోడ్ పాలయ్యపాలెం నుంచి రైతులు కాలినడకన కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి నేరుగా కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ పాదయాత్రంలో ఈరోడ్, తిరుపూర్, కరూర్ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో నేతలు, రైతులు పాల్గొన్నారు.




పాదయాత్ర నిర్వహిస్తున్న రైతులు

శవంతోనే మూడు రోజులు

అన్నానగర్: తండ్రి చనిపోయాడని తెలియక మూడు రోజులపాటు మృతదేహంతోనే ఉన్న యువకుడి ఉదంతం కలకలం రేపింది. మదురైలోని విల్లాపురానికి చెందిన జగదీశన్(74) జ్యోతిష్యుడు. ఇతని కుమారుడు కార్తీక్ శ్రీనివాసన్(35) మానసిక వ్యాధిగ్రస్తుడు. కూతురు షర్మిల(44)కు వివాహమై భర్తతో కలిసి విల్లాపురం ప్రాంతంలో ఉంటోంది. జగదీశన్ కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఇంటిలోనే ఉంటున్నాడు. దీంతో షర్మిల తన తండ్రికి, మానసిక వికలాంగుడైన తమ్ముడికి భోజనం పెడుతోంది. గత 10న తండ్రి వద్దకు భోజనం ఇవ్వడానికి వచ్చింది. ఆ తరువాత భోజనం ఇవ్వడానికి రాలేదు. జగదీశన్ తన ఇంటి గ్రౌండ్‌ఫ్లోర్‌లో రెండు షాపులను అద్దెకు ఇచ్చాడు. ఈ క్రమంలో గురువారం అతని ఇంటిలో నుంచి దుర్వాసన వెదజల్లింది. ఆ ఇంటి నుంచి జగదీశన్ గానీ, అతని కొడుకు గానీ బయటకు రాకపోవడంతో బయటి వారికి అనుమానం కలిగింది. దీంతో చూసేందుకు పైకి వెళ్లారు. జగదీశన్ మరణించి అతని శరీరం కుళ్లిపోయింది. అతని శరీరం పక్కనే కార్తీక్ శ్రీనివాసన్ ధ్యానం చేస్తూ ఉన్నాడు. వెంటనే అవనియాపురం పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి వచ్చి జగదీశన్ మృతదేహాన్ని శవపరీక్షల నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై తదుపరి విచారణ జరుపుతున్నారు. జగదీశన్ చనిపోయి మూడు రోజులు అయ్యిందని, తండ్రి చనిపోయాడన్న విషయం తెలియక మానసిక అనారోగ్యంతో ఉన్న కొడుకు మృతదేహం దగ్గరే ఉన్నాడని వెల్లడించారు. గత మూడు రోజులుగా కార్తీక్ శ్రీనివాసన్ ఇంటిలో ఉన్న ఆహారం మాత్రమే తింటున్నాడు. అతని పరిస్థితి దయనీయంగా ఉంది. ఈ ఘటన ఆ ప్రాంతంలో కలకలం సృష్టించింది. జ్యోతిష్యుడి మృతిపై పోలీసులు విచారణ చేపట్టారు.

• ఇప్స్‌కాన్ - 2023



ఎస్ఆర్ఎం ఐఎస్‌టీలో ఫార్మకాలజీ సొసైటీ నేతృత్వంలో ఇప్స్‌కాన్ – 2023 సదస్సు గురువారం ప్రారంభమైంది. ఇందులో డాక్టర్ ధరణికి టీఆర్ పారివేందర్ అవార్డును శంకర నేత్రాలయ చైర్మన్ డాక్టర్ పీఎస్ సురేంద్రన్, ఎస్ఆర్ఎం ఐఎస్‌టీ ప్రో చాన్స్‌లర్ పి.సత్యనారాయణన్ ప్రదానం చేశారు.

– సాక్షి, చెన్నై

మంటల్లో కాలి ప్రధానోపాధ్యాయురాలి మృతి

అన్నానగర్: చెన్నై తాంబరం సమీపం మాడబాక్కం ప్రాంతానికి చెందిన తంగస్వామి, ఇతని భార్య లీలాభాయ్(75) రిటైర్డ్ ప్రధానోపాధ్యాయిని. ఇప్పుడు భార్యాభర్తలిద్దరూ అదే ప్రాంతంలో సొంతంగా మెట్రిక్యులేషన్ పాఠశాల నడుపుతున్నారు. తంగస్వామి గురువారం ఉదయం ఆ పాఠశాల నుండి బయల్దేరారు. లీలాభాయ్ మాత్రమే ఇంటిలో ఒంటరిగా ఉంది. ఇంటిలో వారి గదిలో నుంచి పొగలు రావడం గమనించిన ఇరుగుపొరుగు వారు అక్కడికి వెళ్లి చూశారు. గదిలోని పుస్తకాలు మండుతున్నాయి. సమీపంలో లీలాభాయ్ మృతదేహం కాలిపోయి ఉంది. సమాచారం అందుకున్న సేలయూరు ఫ్రంట్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అనంతరం లీలాభాయ్ మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం క్రోంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోబో సాయంతో 100 మోకాలి మార్పిడి శస్త్రచికిత్స

సాక్షి చెన్నై: చెన్నైకు చెందిన సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్, ప్రశాంత్ హాస్పిటల్స్ మోకాలి మార్పిడి నిపుణుడు డాక్టర్ ఎస్. ఆర్ముగం అరుదైన ఘనతను సాధించారు. 100 కంటే ఎక్కువ రోబోటిక్ అసిస్టెడ్ మోకాలి మార్పిడి శస్త్రచికిత్సలను పూర్తి చేసిన దేశంలోని అతికొద్ది మంది ఆర్థోపెడిక్ సర్జన్లలో ఆరుముగం ఒకడిగా నిలిచి అందరి ప్రశంసలు అందుకుంటున్నారు. ఈ మేరకు గురువారం స్థానికంగా జరిగిన కార్యక్రమంలో ఆ ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ప్రశాంత్ కృష్ణన్‌తో కలసి సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ ఆర్ముగం మీడియాతో మాట్లాడారు. ప్రశాంత్ హాస్పిటల్స్ జాయింట్ రీప్లేస్‌మెంట్‌లో విప్లవాత్మక మార్పులు తీసుకుని వచ్చిందని వివరించారు. ఈ విభాగం స్థాపించిన ఆరు నెలల్లోనే 100కి పైగా రోబోటిక్ అసిస్టెడ్ మోకాలి మార్పిడి శస్త్రచికిత్సలను విజయవంతంగా చేశామన్నారు. తద్వారా అధునాతన ఆర్థోపెడిక్ కేర్‌లో తాము అద్భుతమైన విజయాన్ని సాధించామని ధీమా వ్యక్తంచేశారు. ఈ అరుదైన సాధనలో 4వ తరం రోబోట్‌ని ఉపయోగించి 110 రోబోటిక్ మోకాలి మార్పిడి శస్త్రచికిత్సలను పూర్తి చేశామని ప్రకటించారు. దేశంలోని అతికొద్ది మంది సర్జన్‌లలో ఒకరుగా తమ వైద్యుడు నిలిచారని ప్రశాంత్ కృష్ణన్ అభినందించారు. మోకాలి మార్పిడి శస్త్రచికిత్సలు చేయించుకున్న వారిలో మహిళల సంఖ్య ఎక్కువగా ఉన్నట్లు ఈసందర్భంగా పేర్కొన్నారు.


వివరాలను తెలియజేస్తున్న డాక్టర్ ఆర్ముగం

ఘనంగా 'టూ వర్డ్స్ ఏ ఫ్రీ ఎకానమీ' పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

కొరుక్కుపేట: చెన్నై కొట్టూర్‌పురంలోని మద్రాస్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ రచయిత, విద్యావేత్త ఆదిత్య బాలసుబ్రహ్మణ్యన్ రచించిన టూ వర్డ్స్ ఏ ఫ్రీ ఎకానమీ: స్వతంత్ర అండ్ అపోజేషన్ పాలిటిక్స్ ఇన్ డొమెస్టిక్ ఇండియా పుస్తకాన్ని బుధవారం రాత్రి ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అపోలో హాస్పిటల్స్ గ్రూప్ ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్‌పర్సన్ ప్రీతారెడ్డి, మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్, ఇరీనా విట్టల్, రచయిత, విద్యావేత్త, ఆదిత్య బాలసుబ్రమణియన్, చరిత్రకారుడు వెంకటాచలపతి, అపోలో హాస్పిటల్స్ గ్రూప్ ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్‌పర్సన్ శోభనా కామినేని తదితరులు పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరించి రచయితను అభినందించారు.

విద్యార్థినులకు లైంగిక వేధింపులు

తిరువొత్తియూరు: విల్లుపురం జిల్లా వానూరు సమీపంలో విద్యార్థినులను లైంగికంగా వేధించిన కేసులో పోక్సో చట్టం కింద అరెస్టు చేయబడిన ఉపాధ్యాయుడు సస్పెండ్ చేయబడ్డాడు. విల్లుపురం జిల్లా వానూరు సమీపంలోని తిరువక్కరైలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉంది. ఇక్కడ 350 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ పాఠశాలకు చెందిన ఒక విద్యార్థిని బుధవారం పాఠశాలకు వెళ్లకుండా ఇంటిలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు ప్రయత్నించింది. దిగ్భ్రాంతి చెందిన ఆమె తల్లి కుమార్తెను విచారించగా పాఠశాలలో తనను తమిళ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న మహేశ్వరన్(38) లైంగికంగా వేధిస్తున్నట్లు తెలిపింది. దీంతో తల్లిదండ్రులు, బంధువులు పాఠశాలకు వెళ్లి ప్రధానోపాధ్యాయులకు ఫిర్యాదు చేశారు. అదే సమయంలో మహేశ్వరన్‌చే బాధింపబడిన మరో ఆరుగురు విద్యార్థినులు వరుసగా పాఠశాలకు వచ్చి ఇలాగే ఫిర్యాదు చేశారు. ఆగ్రహించిన విద్యార్థినుల తల్లిదండ్రులు, బంధువులు ఉపాధ్యాయుడు మహేశ్వరన్‌కు దేహశుద్ధి చేసి, పోలీసులకు అప్పగించారు. దీంతో పోలీసులు ఉపాధ్యాయుడు మహేశ్వరన్‌ను పోక్సో చట్టం కింద అరెస్టు చేశారు.

వేలమ్మాళ్‌లో క్రిస్మస్ పాటల పోటీలు



విజేతలకు బహుమతులను అందజేస్తున్న స్టెల్లామేరీ, గీతాంజలి, ఎంవీఎం శశికుమార్

తిరువళ్లూరు: వేలమ్మాళ్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన క్రిస్మస్ క్యారల్ పాటల పోటీల్లో విజయం సాధించిన వారికి బహుమతులను స్టెల్లామేరీస్ కళాశాల ప్రిన్సిపల్ స్టెల్లామేరి అందజేశారు. తిరువళ్లూరు జిల్లా పొన్నేరిలోని వేలమ్మాళ్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో ప్రతి ఏటా విద్యార్థులకు క్రిస్మస్ క్యారల్ పాటల పోటీలను నిర్వహించి పోటీల్లో విజయం సాధించినవారికి బహుమతులను అందజేస్తున్నారు. ఇందులో భాగంగానే క్రిస్మస్ క్యారల్ కంటెస్ట్–2023 పోటీలను పాఠశాలలో నిర్వహించారు. ఈ పోటీలకు తిరువళ్లూరు, కాంచీపురం, కల్లకురిచ్చి, సేలం, చెన్నై, పాండిచ్చేరి తదితర ప్రాంతాల్లోని 30 పాఠశాలలకు చెందిన వెయ్యి మంది విద్యార్థులు హాజరయ్యారు. పోటీలను విద్యాసంస్థల డైరెక్టర్ ఎంవీఎం శశికుమార్ లాంచనంగా ప్రారంభించారు. న్యాయనిర్ణేతగా డాక్టర్ స్టెల్లామేరి హాజరై విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. డైరెక్టర్ గీతాంజలితోపాటు పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు హాజరయ్యారు. పాటలు, సంగీతం, నాటకాలతోపాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



ఇవిగో నవరత్నాల వెలుగులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

రూ.10 లక్షల ఇంటికి యజమానిని



నా భర్త గోవిందు వ్యవసాయ కూలీ. మేము గత పదిహేనేళ్ల నుంచి డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు గ్రామంలో అద్దె ఇంట్లో గడిపాం. రోజు వారీ సంపాదించిన కష్టార్జితంతో చాలా కష్టంగా జీవనం సాగిస్తూ మాకు భారమైనా అద్దె కట్టుకుంటూ వచ్చాం. ఇంటి యజమానులకు కోపం వచ్చినా, మాకు కోపం వచ్చినా ఇల్లు ఖాళీ చేయాల్సి వచ్చేది. జగనన్న పుణ్యమా అని మెయిన్ రోడ్డుకు కూతవేటు దూరంలో ప్రభుత్వ కార్యాలయాల దగ్గర లక్షల రూపాయలు విలువ చేసే స్థలం ఇచ్చారు. ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.80 లక్షలు మంజూరు చేసింది. నేను ఉపాధి పనులకు వెళ్లడం ద్వారా వచ్చిన రూ.30 వేలు, డ్వాక్రా సంఘం ద్వారా తీసుకున్న రూ.లక్ష రుణంతో ఇంటి నిర్మాణం మొదలు పెట్టాము. ప్రభుత్వం వారు ఐరన్, గుమ్మాలు, సిమెంట్‌ను రాయితీపై ఇచ్చారు. నాణ్యమైన ఇసుకను ఉచితంగా సరఫరా చేశారు. సర్కారు సాయంతో ఇంటిని నిర్మించుకుని సొంతింటి కలను సాకారం చేసుకున్నాం. దాదాపు రూ.పది లక్షల విలువైన ఇంటికి నన్ను యజమానిని చేశారు జగనన్న. నాలుగో తరగతి చదువుతున్న మా కుమార్తెకు అమ్మ ఒడి వస్తోంది. పాప చదువు సాఫీగా సాగుతోంది.

– గరగ వీర కుమారి, ఆలమూరు
(నామాల ఏసురాజు, విలేకరి, ఆలమూరు)

నా బిడ్డకు పునర్జన్మ



మాది గుజరాత్ రాష్ట్రం. 19 ఏళ్ల క్రితం తిరుపతికి వలస వచ్చాం. అప్పటి నుంచి అద్దె ఇంటిలో కాపురం ఉంటున్నాం. నా భర్త తోపుడు బండిలో పానీపూరి వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. మాకు ఏడుగురు సంతానం. ఆరో సంతానమైన మా కుమారుడు అరుణ్ చిన్న వయస్సులో ఆడుకుంటూ వీధిలో విషపు ఆహారం తినడంతో ఆరోగ్యం పూర్తిగా క్షీణించింది. కాళ్లు, చేతులు సన్నబడిపోయాయి. సమస్య తీవ్రం కావడంతో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించాం. ఫిట్స్ పెద్ద ఎత్తున వస్తుండటంతో ఆరోగ్యం పూర్తిగా క్షీణించి ప్రాణపాయ స్థితికి చేరిందని, మెనింగో ఎన్సెఫాలిటీస్ అనే వ్యాధి సోకిందని వైద్యులు నిర్ధారించారు. మాకు ఈ ప్రభుత్వం రైస్ కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు అందజేసింది. కానీ అందులో బాబు పేరు లేకపోవడంతో సచివాలయ సిబ్బందిని కలిశాం. వారు పెద్ద మనస్సుతో బేబీ ఆఫ్ అనే ఆప్షన్ ద్వారా తండ్రి పేరుతో ఆరోగ్యశ్రీ వర్తించేలా సహకరించారు. నెల్లూరులోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స ప్రారంభించారు. 11 రోజుల పాటు ఐసీయూలో చికిత్స అందించారు. గత ఆరు నెలలుగా సాధారణ వైద్యం అందిస్తున్నారు. ప్రస్తుతం బాబు ఆరోగ్యం నిలకడగా ఉంది. రూ.లక్షల్లో ఖర్చయ్యే చికిత్సను డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా పూర్తిగా ఉచితంగా అందించారు. మేము ఈ ప్రాంత వాసులం కాక పోయినా ప్రభుత్వం ఆదరించి, నా బిడ్డకు పునర్జన్మను ప్రసాదించింది.

– సోనీ, కొర్లగుంట, తిరుపతి
(పి.బాలచంద్ర, విలేకరి, తిరుపతి తుడా)

బిడ్డలు చూడకున్నా.. ప్రభుత్వం ఆదుకుంది



నా భర్త సుమారు పదేళ్ల కిందట చనిపోయాడు. ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. వారిద్దరికీ పెళ్లిళ్లు అయిపోయాయి. కూతురు హైదరాబాద్‌లో ఉంటోంది. కొడుకు ఆటో నడుపుకుంటూ తన బతుకు తాను బతుకుతున్నాడు. నాకు 59 ఏళ్లు ఉంటాయి. ఈ వయసులో బిడ్డలు పట్టించుకోకపోయినా ఈ ప్రభుత్వం ఎంతగానో ఆదుకుంది. భర్త చనిపోయాక జీవనం కష్టతరంగా మారిన సమయంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే నాకు వితంతు పింఛన్ మంజూరు చేసింది. ప్రతినెలా ఒకటో తారీఖునే రూ.2,750 వలంటీర్ నా వద్దకు వచ్చి చేతిలో పెడుతున్నారు. దానికి తోడు చేయూత ద్వారా ఏడాదికి రూ.18,750 వంతున ఇప్పటికి మూడు దఫాలు పడింది. అంతకు ముందు ఇళ్లల్లో పాచి పనులు చేసుకుని జీవనోపాధి పొందేదాన్ని. చేయూత పథకం ద్వారా నా కష్టాలు తీరిపోయాయి. ఇస్త్రీ పెట్టె కొనుగోలు చేసి ఇంటి వద్దే కుల వృత్తి చేసుకుంటూ సాఫీగా జీవనం సాగిస్తున్నా. మూడు పూటలా భోజనం చేస్తున్నా. విశాఖనగరం ఫోర్ట్ టౌన్ పోలీస్‌స్టేషన్ సమీపంలోని రజక వీధిలో ఇప్పుడు హాయిగా జీవిస్తున్నా.

– పొన్నాడ కొండమ్మ, రజకవీధి, బాలయ్యశాస్త్రి లేఅవుట్, విశాఖపట్నం
(దుక్క మురళీకృష్ణారెడ్డి, విలేకరి, విశాఖపట్నం)







తన అభిమాన నేత సీఎం జగన్‌తో సెల్ఫీ దిగాలని పలాసకు చెందిన విద్యార్థి దిలీప్ సభాప్రాంగణంలో బారికేడ్లపైకి ఎక్కగా.. సెక్యూరిటీ సిబ్బంది వారించారు. దీనిని గమనించిన సీఎం జగన్.. అలాంటి ప్రమాదకర ప్రయత్నం చేయొద్దని విద్యార్థికి చెబుతూనే.. సెల్ఫీ దిగి ఆత్మీయంగా హత్తుకున్నారు.

ఉద్దానానికి ఊపిరి పోసిన సీఎం జగన్

రూ.700 కోట్లతో రక్షిత మంచి నీటి పథకం, రూ.85 కోట్లతో కిడ్నీ రీసెర్చ్ సెంటర్, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం

నాడు...

ఉద్దానం ప్రాంతంలో ఎందుకు పుట్టామా అన్న ఆవేదనే నిత్యం వారిని వెంటాడుతుండేది. అప్పటికే దాదాపు ప్రతి ఇంటా ఒకరిద్దరు కిడ్నీ వ్యాధుల బారిన పడ్డారు. కదలలేక మంచానికే పరిమితమయ్యారు. వైద్యం పేరుతో ఇళ్లు గుల్లయిపోతున్నాయి. ఇళ్లూ, ఆస్తులు అమ్ముకున్నా, మందులకు, డయాలసిస్‌కు డబ్బు చాలని పరిస్థితి. 40 ఏళ్లగా ఉద్దానం ప్రాంతం దయనీయజీవిత మిది. పాలకులు మారుతున్నారుగానీ అక్కడి సమస్యను ఎవరూ పరిష్కారించలేదు. రాష్ట్రంలో అత్యంత సుదీర్ఘకాలం సీఎంగా పని చేసిన చంద్రబాబు గొప్ప విజనరీగా ప్రచారమైతే చేసుకుంటారు కానీ, ఉద్దానం వైపు కన్నెత్తి చూడలేదు. అక్కడి ప్రజల సమస్యకు పరిష్కారానికి చూపలేదు. కనీసం విభజన అనంతరం ఏర్పడ్డ ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రిగా పనిచేసినా, ఉద్దానం వ్యధను పట్టించుకోలేదు.

చంద్రబాబు ప్రభుత్వానికి ఎన్నికల ముందు, తర్వాత పూర్తిగా మద్దతిచ్చిన పవన్ కళ్యాణ్ కూడా ఒకసారి ఆ ప్రాంతానికి వెళ్లి వచ్చారు. చాలా మాటలే చెప్పారు. వచ్చేశారు. వారి సమస్య పరిష్కారానికి వీసమెత్తు పరిష్కారం చూపలేదు. పైగా, అక్కడి ప్రజల బాధలను రాజకీయంగా మాత్రమే వాడుకున్నారు. తన వల్లే ఆ ప్రజల సమస్య వెలుగులోకి వచ్చిందని ప్రచారం చేసుకొనే ప్రయత్నం చేశారు. ఆ తర్వాత ఉద్దానం ఊసే మరిచారు. ఆ సమయంలో.. 2017లో అప్పటి రాష్ట్ర ప్రతిపక్ష నాయకుడి హోదాలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన సుదీర్ఘ పాదయాత్రలో భాగంగా ఉద్దానం ప్రాంతానికి వచ్చారు. అక్కడి ప్రజలతో ముఖాముఖీ భేటీ అయ్యారు. వారి సమస్యలు స్వయంగా తెలుసుకున్నారు. అక్కడ కిడ్నీ వ్యాధులు ప్రబలడానికి కారణాలను లోతుగా పరిశీలించారు. ఏమి చేస్తే ఉద్దానం ప్రజల ఆరోగ్యం బాగుపడుతుందో ఓ ప్రణాళిక రూపొందించారు. ఏడాది కూడా గడవక ముందే.. 2018 డిసెంబరు 31న మరోసారి ఉద్దానానికి వెళ్లారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక, ఆ ప్రాంతంలోని ప్రతి కిడ్నీ బాధితుడికి తోడుగా ఉంటానని భరోసా ఇచ్చారు. అక్కడే సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మిస్తామని హామీ ఇచ్చారు. కలుషిత నీరు కారణంగా ఈ సమస్య వస్తుందని, ఆ ప్రాంతానికి మంచి నీటిని అందించేందుకు ప్రత్యేకంగా రిజర్వాయర్ నిర్మిస్తామని చెప్పారు. అక్కడి నుంచి నీటిని పైపులైన్ ద్వారా సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు.



శ్రీకాకుళం జిల్లా మూలపేటలో పోర్టు నిర్మాణ ప్రగతిపై సీఎం ఏరియల్ సర్వే

నేడు...

2019లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించింది. జగన్ సీఎం అయ్యారు. బాధ్యతలు చేపట్టి నాలుగు నెలలు కూడా పూర్తి కాక ముందే.. 2019 సెప్టెంబరు 6న రూ. 700 కోట్లతో ఉద్దానం ప్రాంతం రక్షిత మంచి నీటి పథకానికి శంకుస్థాపన చేశారు. ఈ ప్రాంతంలోనే సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, కిడ్నీ రీసెర్చ్ సెంటర్‌కు కూడా శంకుస్థాపన చేశారు. మధ్యలో.. కరోనా విపత్తు వచ్చి పనులేవీ ముందుకు సాగక ఆటంకాలు కలిగినా.. పట్టుదలగా నాలుగేళ్లలోనే భగీరథ ప్రయత్నం పూర్తి చేశారు. గురువారం రూ.700 కోట్లతో నిర్మించిన రక్షిత మంచి నీటి పథకానికి, రూ.85 కోట్లతో నిర్మించిన కిడ్నీ రీసెర్చ్ సెంటర్, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి ప్రారంభోత్సవం చేశారు.

పరిష్కారమూ సమగ్రంగా, శాశ్వతంగా..

సాధారణంగా.. వందల కోట్లు ఖర్చు పెట్టి రక్షిత మంచి నీటి పథకం నిర్మాణం చేపట్టినా, నీరు అందుబాటులో లేకపోతే అంతటి పథకమూ వృథా అవుతుంది. ఉద్దానం రక్షిత మంచి నీటి పథకం విషయంలోనూ అధికారులు ఇలాంటి సందేహాన్ని సీఎం జగన్ వద్ద ప్రస్తావించారు. మనం చూపే పరిష్కారం శాశ్వతంగా, సమగ్రంగా ఉండాలని సీఎం జగన్ వారికి స్పష్టం చేశారు. తక్కువ ఖర్చుతో ఉద్దానం ప్రాంత సమీపంలో ఉండే బహుదా, మహేంద్ర తనయ నదుల నుంచి రక్షిత నీటి సరఫరాకు అవకాశం ఉంది. అయితే, వేసవిలో ఆ నదులు ఎండిపోతే అక్కడి ప్రజలు బోరు నీటిని తాగక తప్పదని జగన్ సర్కారు ఆ ప్రతిపాదనను మొదట్లోనే పక్కనపెట్టింది. ఏడాది పొడవునా నీరు అందుబాటులో ఉండేలా ఖర్చు ఎక్కువైనా వెనుకాడకుండా ఆ ప్రాంతానికి 104 కి.మీ.కి పైగా దూరంలోని హిరమండలం రిజర్వాయర్ నుంచి నీటి తరలింపునకు ప్రణాళిక రూపొందించింది. ఉద్దానం ప్రాంతం మొత్తానికి ఏడాది పొడవునా ఒక టీఎంసీ కన్నా తక్కువ నీరు అవసరం ఉండగా.. హిరమండలం రిజర్వాయర్ కనీస నీటి మట్టం స్థాయిలోనూ 2.67 టీఎంసీలు అందుబాటులో ఉంటుంది. అందువల్ల ఇక్కడి నుంచి నీటిని తరలించాలని నిర్ణయించారు. ఏకంగా 1,047 కి.మీ. పొడవున భూగర్భ పైపులైన్లు నిర్మించారు. ఇప్పుడు ఉద్దానం వాసులకు నీటి బెంగ లేదు. నిత్యం స్వచ్ఛమైన నీరు అందుతుంది. అందుబాటులో అత్యాధునిక ఆసుపత్రి ఉంది. కిడ్నీ వ్యాధుల రీసెర్చ్ సెంటరూ ఉంది. 40 ఏళ్ల ఉద్దానం ప్రాంత కిడ్నీ సమస్యకు పరిష్కారం చూపి, ఆ ప్రాంతానికి ఊపిరి పోసిన సీఎం జగన్‌కు ప్రజలు జేజేలు పలుకుతున్నారు.

- సాక్షి, అమరావతి

నేడు కేబినెట్ సమావేశం

సాక్షి, అమరావతి: సీఎం వైఎస్ జగన్ అధ్యక్షతన శుక్రవారం రాష్ట్ర మంత్రివర్గం సమావేశం కానుంది. ఉదయం 11 గంటలకు సచివాలయంలోని మొదటి బ్లాక్‌లోని కేబినెట్ సమావేశ మందిరంలో కేబినెట్ భేటీ అయ్యి పలు కీలక అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకోనుందని అధికార వర్గాలు తెలిపాయి.

ఏపీలో 40 శాతం పెరిగిన ఉపాధి అవకాశాలు

- టాలీ సొల్యూషన్ సౌత్ ఇండియన్ హెడ్ భువన్ రంజన్



భువన్ రంజన్

బీచ్‌రోడ్డు (విశాఖ తూర్పు): ఏపీలో 2019లో 4.05 లక్షల చిన్న మధ్య తరహా పరిశ్రమలు ఉంటే 2023 నాటికి 5.61 లక్షలకు చేరాయని తద్వారా 40శాతం ఉపాధి అవకాశాలు పెరిగాయని టాలీ సొల్యూషన్ సౌత్ ఇండియన్ హెడ్ భువన్ రంజన్ చెప్పారు. గురువారం టాలీ ప్రైమ్ 4.0 సాఫ్ట్‌వేర్‌ను విశాఖలోని ఓ హోటల్‌లో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ నాలుగేళ్లలో ఏపీలో ఉపాధి అవకాశాలు గణనీయంగా పెరిగాయని పలు నివేదికలు స్పష్టం చేస్తున్నాయని చెప్పారు. దక్షిణ భారత్‌లో వ్యాపార విస్తరణకు ఏపీ అనుకూలంగా ఉందని, అందుకే విశాఖలో తమ సాఫ్ట్‌వేర్‌ను ఆవిష్కరించామని తెలిపారు. వచ్చే రెండేళ్లలో వంద ఎంఎస్ఎంఈ వ్యాపార క్లస్టర్లను ప్రారంభించాలని ప్రభుత్వం ప్రణాళికలను రూపొందిస్తుందని, ఇది తమ వ్యాపార విస్తరణకు ఉపయోగపడుతుందన్నారు. రాష్ట్రంలో టాలీ సాఫ్ట్‌వేర్‌ను 50 వేల మందికి పైగా ఉపయోగిస్తున్నారని, ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ద్వారా రాబోయే రెండేళ్లలో ఈ సంఖ్య 4 లక్షలకు చేరుకునే అవకాశం తమ సంస్థకు లభిస్తుందన్నారు. ఈ టాలీ ప్రైమ్ 4.0లో ఆకర్షణీయమైన డ్యాష్‌బోర్డు, వాట్సప్‌ను అనుసంధానం, ఎంఎస్ ఎక్సెల్ ఫైల్‌ను నేరుగా సాఫ్ట్‌వేర్‌లో అప్‌లోడ్ చేసే ఫీచర్ ఉంచినట్లు వివరించారు. టాలీపై యువతకు శిక్షణ ఇచ్చేందుకు టాలీ ఎడ్యుకేషన్ సెంటర్లను ప్రతీ నగరంలో ఏర్పాటు చేస్తామన్నారు.

జయహో జగన్... మళ్లీ సీఎంగా మీరే రావాలి!



కర్నూలులో విద్యార్థుల భారీ ర్యాలీ

కర్నూలు (సెంట్రల్): జయహో జగన్ మావయ్యా.. మళ్లీ సీఎంగా మీరే రావాలయ్యా అంటూ కర్నూలులో విద్యార్థులు నినదించారు. ప్లకార్డులను ప్రదర్శిస్తూ జై జగన్ అంటూ నినదిస్తూ కర్నూలు నగరాన్ని హోరెత్తించారు. వేలాదిగా నృత్యాలు చేస్తూ ఉర్రూతలూగారు. గురువారం కర్నూలులో వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు ఆర్.ప్రశాంత్ అధ్యక్షతన విద్యార్థి సాధికారత వైఎస్ జగన్‌తోనే సాధ్యమన్న నినాదంతో భారీ ర్యాలీని నిర్వహించారు. రాజ్‌విహార్ కూడలి నుంచి కలెక్టరేట్ వరకు ప్రదర్శనగా జై జగన్..జయహో జగన్ అంటూ వేలాది మంది విద్యార్థులు వచ్చారు. వీరికి కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, నగర మేయర్ బీవై రామయ్య, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు చైతన్య మద్దతు తెలిపారు. పేద విద్యార్థుల భవిష్యత్‌కు సీఎం జగన్ భరోసా ఇస్తున్నారని చైతన్య అన్నారు. చంద్రబాబు మళ్లీ అధికారంలోకి వస్తే నారాయణ, చైతన్య కళాశాలలు, పాఠశాలలకు ప్రచార కర్తగా మారిపోతారని, పేదలకు ఉన్నత విద్య అందని ద్రాక్షగా మారే ప్రమాదం ఉందన్నారు. ర్యాలీకి రాయలసీమ విద్యార్థి, యువజన సంఘాల జేఏసీ చైర్మన్ శ్రీరాములు, రాయలసీమ పరిరక్షణ సమితి నాయకులు రాజునాయుడు, ఓబులేశు,రియాజ్, జయరాజు మద్దతు తెలపగా వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు మణిరెడ్డి, కర్నూలు అసెంబ్లీ పరిశీలకుడు కర్రా హర్షవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

అవ్వాతాతల పింఛను రూ.3వేలకు పెంపు

▶ మొదటి పేజీ తరువాయి

లబ్ధిదారులు పింఛన్లు పొందారు.

బాబు జమానాలో అవస్థలే..

వాస్తవానికి.. గత చంద్రబాబు ప్రభుత్వ హయాంలో అవ్వాతాతల పింఛన్ల కోసం సరాసరిన ప్రతి నెలా పెట్టిన ఖర్చు కేవలం రూ.400 కోట్లు మాత్రమే. అలాగే, అప్పట్లో అర్హత ఉన్న వారికి కొత్తగా పింఛను మంజూరు కావాలన్నా.. మంజూరైన పింఛను ప్రతినెలా తీసుకోవాలన్నా లబ్ధిదారుల అవస్థలు అంతాఇంతా కాదు. ఆ తర్వాత.. అంటే నాలుగున్నర ఏళ్ల క్రితం జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టిన తర్వాత సామాజిక పింఛను దారులకు స్వర్ణయుగమే అని చెప్పాలి. ఎందుకంటే.. రాష్ట్రంలో ప్రస్తుతం పింఛన్లు పొందుతున్న ప్రతి పది మందిలో దాదాపు నలుగురికి వైఎస్ జగన్ సీఎం అయ్యాకే కొత్తగా పింఛన్లు మంజూరైనవే నని.. ఈ కాలంలో 28,26,884 మందికి కొత్తగా పింఛన్లు మంజూరు చేసినట్లు గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) అధికారులు వివరిస్తున్నారు. మరోవైపు.. పింఛన్ల పంపిణీలో జగన్ ప్రభుత్వం విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చింది. ప్రతీనెలా ఒకటో తేదీ నుంచి ఐదో తేదీ మధ్య ఠంఛన్‌గా లబ్ధిదారుల ఇళ్లకు వలంటీర్లు పొద్దున్నే వెళ్లి పింఛను డబ్బులు అందజేసే విధానానికి శ్రీకారం చుట్టారు.

పొదుపు మహిళలకు మంచినీటి కుళాయి ఏర్పాటు పనులు..

రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా గ్రామాల్లో ఇంటింటికీ మంచినీటి కుళాయిల ఏర్పాటుచేసే మరో కీలక కార్యక్రమాన్ని కొనసాగిస్తోంది. ఇప్పటిదాకా కాంట్రాక్టర్ల ఆధ్వర్యంలో జరిగే ఈ పనులను ఇప్పుడు కొత్తగా కమ్యూనిటీ కాంట్రాక్టింగ్ సిస్టమ్ (సీసీఎస్)లో ఆయా గ్రామాల్లో పొదుపు సంఘాల మహిళలతో కూడిన కమిటీలకే అప్పగించాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఈ కమిటీలను గ్రామ జలసంఘం పేరుతో పిలుస్తారు. దీనికి సంబంధించి ప్రతిపాదనల ఫైలు కూడా శుక్రవారం నాటి రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో చర్చకు వచ్చే అవకాశముందని అధికార వర్గాలు తెలిపాయి. ఈ ప్రక్రియలో.. మహిళా కమిటీలపై ఎలాంటి ముందస్తు ఆర్థిక భారంపడే అవకాశం లేకుండా.. ఈ పనులకు అవసరమైన పైపులైన్లు, కుళాయి సామాగ్రిని ప్రభుత్వమే ముందుగా ఆ కమిటీలకు ఇచ్చే అవకాశముందని అధికారులు వివరిస్తున్నారు.

ఇంటర్, పది పరీక్షల షెడ్యూల్ విడుదల

▶ మొదటి పేజీ తరువాయి

పరీక్షలకు హాజరవుతారని తెలిపారు. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకునే ఈ షెడ్యూల్ ఖరారు చేశామని మంత్రి చెప్పారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా షెడ్యూల్ రూపొందించామని, ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్స్ ఫిబ్రవరి 5 నుంచి 20వ తేదీ వరకు ఉంటాయన్నారు. పదో తరగతి పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు, ఇంటర్ పరీక్షలు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు ఉంటాయని మంత్రి బొత్స తెలిపారు. ఇంటర్ మొదటి, రెండో ఏడాది విద్యార్థులకు ఇబ్బంది లేకుండా ఒకరోజు మొదటి ఏడాది, మరుసటి రోజు రెండో ఏడాది పరీక్షలు ఉంటాయని వివరించారు. సమావేశంలో సమగ్ర శిక్ష ఎస్పీడీ శ్రీనివాసరావు, పదో తరగతి పరీక్షల విభాగం డైరెక్టర్ దేవానందరెడ్డి పాల్గొన్నారు.

ఇంటర్ మొదటి ఏడాది షెడ్యూల్ ఇలా..

1-3-2024	సెకండ్ లాంగ్వేజ్ -1
4-3-2024	ఇంగ్లిష్ పేపర్-1
6-3-2024	మ్యాథమెటిక్స్ పేపర్-1ఏ, బోటనీ-1, సివిక్స్-1
9-3-2024	మ్యాథమెటిక్స్ పేపర్-1బి, జువాలజీ-1, హిస్టరీ-1
12-3-2024	ఫిజిక్స్-1, ఎకనామిక్స్-1
14-3-2024	కెమిస్ట్రీ-1, కామర్స్-1, సోషయాలజీ-1, ఫైన్ ఆర్ట్స్, మ్యూజిక్-1
16-3-2024	పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్-1, లాజిక్ పేపర్-1, బ్రిడ్జి కోర్సు మ్యాథ్స్-1 (బైపీసీ వారికి)
19-3-2024	మోడర్న్ లాంగ్వేజ్-1, జాగ్రఫీ-1

ఇంటర్ రెండో ఏడాది షెడ్యూల్ ఇదీ..

2-3-2024	సెకండ్ లాంగ్వేజ్-2
5-3-2024	ఇంగ్లిష్ పేపర్-2
7-3-2024	మ్యాథమెటిక్స్ పేపర్-2ఏ, బోటనీ-2, సివిక్స్-2
11-3-2024	మ్యాథమెటిక్స్ పేపర్-2బి, జువాలజీ-2, హిస్టరీ-2
13-3-2024	ఫిజిక్స్-2, ఎకనామిక్స్-2
15-3-2024	కెమిస్ట్రీ-2, కామర్స్-2 సోషయాలజీ-2, ఫైన్ ఆర్ట్స్, మ్యూజిక్ పేపర్-2
18-3-2024	పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్-2, లాజిక్ పేపర్-2, బ్రిడ్జి కోర్సు మ్యాథ్స్-2 (బైపీసీ వారికి)
20-3-2024	మోడర్న్ లాంగ్వేజ్-2, జాగ్రఫీ-2

పదో తరగతి పరీక్షల షెడ్యూల్ ఇలా..

18-3-2024	ఫస్ట్ లాంగ్వేజ్ పేపర్(గ్రూప్-ఎ)
18-3-2024	ఫస్ట్ లాంగ్వేజ్ పేపర్-1 (కాంపోజిట్ కోర్సు)
19-3-2024	సెకండ్ లాంగ్వేజ్
20-3-2024	ఇంగ్లిష్
22-3-2024	మ్యాథమెటిక్స్
23-3-2024	ఫిజికల్ సైన్స్
26-3-2024	బయోలాజికల్ సైన్స్
27-3-2024	సోషల్ స్టడీస్
28-3-2024	ఫస్ట్ లాంగ్వేజ్ పేపర్-2 (కాంపోజిట్ కోర్సు)
28-3-2024	ఓఎస్సెస్సీ మెయిన్ లాంగ్వేజ్ పేపర్-1 (సంస్కృతం, అరబిక్, పర్షియన్)
30-3-2024	ఓఎస్సెస్సీ మెయిన్ లాంగ్వేజ్ పేపర్-2 (సంస్కృతం, అరబిక్, పర్షియన్)
30-3-2024	ఎస్సెస్సీ ఒకేషనల్ (థియరీ)

వ్యక్తిగత వైరంతోనే రఘురామ పిల్

ఆయన వ్యాజ్యం వెనుక వ్యక్తిగత, రాజకీయ ప్రయోజనాలు

- జగన్, ప్రభుత్వంపై రోజూ విషం చిమ్మడమే ఆయన పని
- ముఖ్యమంత్రిపై అసభ్యపదజాలం ఉపయోగించారు
- ప్రతీరోజూ ఎల్లో మీడియాతో ఆయన మాట్లాడిన మాటలను పరిశీలించండి
- సీఎం శరీరాకృతి, అదనపు ఏజీ, అధికారుల గురించి అసభ్యంగా మాట్లాడుతున్నారు
- అసలు ఈ పిల్ నిబంధనలకు అనుగుణంగాలేదు.. కొట్టేయండి
- హైకోర్టులో సీఎస్ జవహర్‌రెడ్డి ప్రాథమిక కౌంటర్
- దీనికి సమాధానమివ్వాలని రఘురామకృష్ణరాజుకు హైకోర్టు ఆదేశం
- తదుపరి విచారణ జనవరి 2కి వాయిదా

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న పలు ప్రజా సంక్షేమ పథకాలకు దురుద్దేశాలను ఆపాదించడంతో పాటు ఆ పథకాలవల్ల పలువురికి లబ్ధిచేకూర్చేలా ప్రభుత్వ నిర్ణయాలు, విధానాలున్నాయని, వాటిపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలని కోరుతూ నర్సాపురం ఎంపీ రఘురామకృష్ణరాజు దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)పై హైకోర్టు తదుపరి విచారణను జనవరి 2కి వాయిదా వేసింది. ఈ వ్యాజ్యంలో ప్రతివాదులుగా ఉన్న వారిలో నోటీసులు అందని వారికి వ్యక్తిగతంగా, ఈ–మెయిల్ ద్వారా నోటీసులు అందజేసేందుకు పిటిషనర్‌కు హైకోర్టు అనుమతినిచ్చింది. ఈ పిల్‌పై అభ్యంతరాలు వ్యక్తంచేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) జవహర్‌రెడ్డి దాఖలు చేసిన కౌంటర్‌కు తదుపరి విచారణ నాటికి బదులివ్వాలని రఘురామకృష్ణరాజును ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ ఉప్మాక దుర్గాప్రసాదరావు, జస్టిస్ మండవ కిరణ్మయి ధర్మాసనం గురువారం ఉత్తర్వులు జారీచేసింది. అంతకుముందు.. రఘురామకృష్ణరాజు దాఖలు చేసిన పిల్ గురువారం మరోసారి విచారణకు రాగా, రాష్ట్ర ప్రభుత్వం తరపున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎస్. శ్రీరామ్ ఈ పిల్‌పై అభ్యంతరం తెలుపుతూ సీఎస్ ప్రాథమిక కౌంటర్ దాఖలు చేశారని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం.. ధర్మాసనం ఈ వ్యాజ్యంలో ప్రతివాదులుగా ఉన్న 41 మందిలో ఎంతమందికి నోటీసులు అందాయి? ఎంతమందికి నోటీసులు అందలేదన్న విషయం గురించి ఆరాతీసి నోటీసులు అందని వారికి వ్యక్తిగతంగా నోటీసులు అందచేసేందుకు పిటిషనర్‌కు అనుమతినిచ్చింది. తదుపరి విచారణను జనవరి 2కి వాయిదా వేస్తూ ఉత్తర్వులు జారీచేసింది.

సీఎం, ప్రభుత్వంపై రోజూ విషం..

ఎంపీ రఘురామకృష్ణరాజు ఎల్లో మీడియా ద్వారా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పాటు రాష్ట్ర ప్రభుత్వంపై నిత్యం విషం చిమ్మడమే పనిగా పెట్టుకున్నారని సీఎస్ తన ప్రాథమిక కౌంటర్‌లో హైకోర్టుకు నివేదించారు. ఎలాంటి వ్యక్తిగత, రాజకీయ ప్రయోజనాలను ఆశించి ఈ పిల్ దాఖలు చేయలేదని రఘురామకృష్ణరాజు తన పిటిషన్‌లో పేర్కొన్నప్పటికీ ఆయన ప్రతీరోజూ వ్యక్తిగత వైరంతోనే మీడియా ముందు సీఎంతో పాటు ప్రభుత్వంపై విషం కక్కుతున్నారని సీఎస్ పేర్కొన్నారు. అందుకు సంబంధించి ముఖ్యమంత్రిపై రఘురామకృష్ణరాజు ఎల్లో మీడియా ఛానెళ్లలో మాట్లాడిన మాటలను జవహర్‌రెడ్డి తన అఫిడవిట్‌లో పొందుపరిచారు. కోర్టులో ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ చేసిన వాదనలను కూడా తప్పుపట్టారన్నారు. వీటిని పరిశీలించి ముఖ్యమంత్రి, ప్రభుత్వంపట్ల పిటిషనర్ తీరు ఎలా ఉందో అర్థం చేసుకోవాలని జవహర్‌రెడ్డి తన అఫిడవిట్‌లో కోర్టును కోరారు. మీడియాలో ఆయన మాట్లాడిన మాటలను బట్టి ప్రచారం కోసమే ఆయన ఈ పిల్ దాఖలు చేసినట్లు స్పష్టంగా తెలుస్తోందన్నారు. మీడియాతో మాట్లాడే సందర్భంగా ఆయన ముఖ్యమంత్రి, ఆయన కుటుంబ సభ్యులపై కూడా అసభ్యపదజాలం వాడారని ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి శరీరాకృతి గురించి.. మంత్రులు, కార్యదర్శులు, ఇతర అధికారులు, అదనపు అడ్వొకేట్ జనరల్ గురించి ఆయన మాట్లాడిన మాటలన్నీ ప్రజాబాహుళ్యంలో ఉన్నాయన్నారు. నిజానికి.. బ్యాంకును మోసం చేసిన కేసులో రఘురామకృష్ణరాజుపై సీబీఐ కేసు నమోదు చేసిందని సీఎస్ అందులో గుర్తుచేశారు. ఇక పిటిషనర్ దాఖలు చేసిన పిల్ అసలు హైకోర్టు నిబంధనలకు అనుగుణంగాలేదని, అందువల్ల ఇది పిల్ నిర్వచన పరిధిలోకి రాదన్నారు. వ్యక్తిగత వైరంతోనే ఆయన ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారని వివరించారు. ఈ వ్యాజ్యం దాఖలు వెనుక రఘురామకృష్ణరాజు ఉద్దేశాలను పరిగణనలోకి తీసుకుని దీనిని కొట్టేయాలని ఆయన కోర్టును కోరారు.



ఫ్యాషన్

సంప్రదాయ వేడుకలకు గ్రాండ్‌గా తయారవ్వాలంటే అతివలు ఎంచుకునే మొదటి ఎంపిక లంగా ఓణీ లేదా గాగ్రా చోలీ అవుతుంది. ఎంబ్రాయిడరీ లాంటి రిచ్ డిజైన్స్ లేవు అనుకునేవారు రీసెంట్‌గా ఆకట్టుకుంటున్న డిజిటల్ ప్రింట్ డిజైన్స్‌ని ఎంపిక చేసుకోవచ్చు. పురాణ గాథలు, ఫ్లోరల్, గ్రామీణ వాతావరణం నింపుకున్న డిజిటల్ డిజైన్స్ రిచ్‌లుక్‌తో అట్రాక్ట్ చేస్తున్నాయి.

డిజిటల్ మెరుపులు











మెటీరియల్

సంప్రదాయ వేడుకలకు తక్కువ ఖర్చుతో ఎక్కువ కళగా సొంతం చేసుకోవాలనుకునేవారు ఈ డిజిటల్ ప్రింట్ డిజైన్స్‌ను ఎంచుకోవచ్చు. వీటిలో మెటీరియల్, డిజైన్ బట్టి ధరలు వేల రూపాయల నుంచి మార్కెట్లో అందుబాటులో ఉన్నాయి. రెడీ టు వేర్‌గానూ ఉన్న ఈ డిజైన్స్ అమ్మాయిలను, అమ్మలనూ ఆకట్టుకుంటున్నాయి.

కలంకారీ ప్రింట్స్

చందేరీ ఫ్యాబ్రిక్‌పైన పెన్ కలంకారీ మాత్రమే కాదు కలంకారీ ప్రింట్స్ కూడా కొత్త ఊపిరి పోసుకుంటున్నాయి. హ్యాండ్‌మేడ్ చేయించుకోవడానికి టైమ్ పడుతుంది అనుకునే వారు రెడీ టు వేర్‌గా ఉన్న కలంకారీ లెహంగా చోలీ డిజైన్స్‌ను ఎంచుకోవచ్చు.

పట్టుపైనా...

పట్టు లెహంగాలు ఎప్పుడూ రిచ్ లుక్‌ని ఇస్తాయి. అయితే, వీటిని మరింత గ్రాండ్‌గా తీర్చిదిద్దడానికి డిజిటల్ ప్రింట్స్ సందడి చేస్తున్నాయి. దుపట్టా, బ్లౌజ్, లెహంగా లు కొత్త లుక్‌తో మెరిసిపోతున్నాయి. సంప్రదాయ వివాహ వేడుకలు, పండుగల రోజుల్లో ఇవి కొత్త ప్రత్యేకతను నింపుకుంటున్నాయి.

వంటిల్లు

ఈ క్రిస్మస్‌కు సులభంగా... త్వరగా చేసుకోదగిన రుచికరమైన కుకీస్ ఈ వారం

రంగు రంగుల రుచులు


క్రిస్మస్ సాఫ్ట్ కుకీస్



కావలసినవి: మైదా – మూడున్నర కప్పులు; వంటసోడా – టీస్పూను; ఉప్పు – అర టీస్పూను; పంచదార – ఒకటిన్నర కప్పులు; బటర్ – కప్పు; గుడ్లు – రెండు; వెనీలా ఎసెన్స్ – రెండు టీస్పూన్లు.

తయారీ: ● మైదా, వంటసోడా, ఉప్పుని ఒక గిన్నెలో వేసి కలిపి పక్కన పెట్టుకోవాలి ● బటర్‌లో పంచదార వేసి క్రీమ్‌లా మారేంత వరకు బీటర్‌తో కలపాలి. తరువాత ఈ క్రీమ్‌ను రెండు గంటలు రిఫ్రిజిరేటర్‌లో పెట్టాలి ● రెండు గంటల తరువాత బటర్ క్రీమ్‌లో గుడ్లసొన, వెనీలా ఎసెన్స్, మైదా మిశ్రమం వేసి ముద్దగా కలుపుకోవాలి ● పిండి ముద్దను రిఫ్రిజిరేటర్‌లో పెట్టాలి ● రెండు గంటల తరువాత పిండి ముద్దను రొట్టెల్లా వత్తుకోవాలి ● ఈ రొట్టెను క్రిస్టమస్ ట్రీ, స్టార్స్, బొమ్మల ఆకారంలో కట్ చేసి బేకింగ్ ట్రేలో పెట్టాలి. కుకీస్ ఆకారాన్ని బట్టి ఫుడ్ కలర్ వేసుకోవచ్చు ● ఈ బేకింగ్ ట్రేను 400 డిగ్రీల ఫారిన్ హీట్ వద్ద పదినిమిషాలు బేక్ చేస్తే ఎంతో రుచికరమైన క్రిస్టమస్ సాఫ్ట్ కుకీస్ రెడీ.

స్నీకర్ డూడుల్ కుకీస్



కావలసినవి: మైదా – మూడు కప్పులు; టార్టారిక్ యాసిడ్ – రెండు టీస్పూన్లు; కోషర్ సాల్ట్ – టీస్పూను; వంటసోడా – ముప్పావు టీస్పూను; బటర్ –కప్పు; పంచదార – ఒకటిన్నర కప్పులు; వెనీలా ఎసెన్స్– టీస్పూను; దాల్చినచెక్క పొడి – టేబుల్ స్పూను.

తయారీ: ● పెద్దగిన్నెలో మైదా, టార్టారిక్ యాసిడ్, వంటసోడా వేసి కలపాలి ● అన్నీ కలిసిన తరువాత బటర్, ఒకటింబావు కప్పుల పంచదార వేసి మెషీన్ మిక్సర్‌తో కలపాలి ● మిశ్రమం క్రీమ్‌లా మారిన తరువాత వెనీలా ఎసెన్స్ వేసి కలిపి రిఫ్రిజిరేటర్‌లో ఉంచాలి ● మిగిలిన పంచదారలో దాల్చినచెక్క పొడి వేసి బాగా కలిపి పక్కన పెట్టుకోవాలి ● గంట తర్వాత రిఫ్రిజిరేటర్‌నుంచి తీసిన మిశ్రమాన్ని రెండు టేబుల్ స్పూన్ల చొప్పున తీసుకుని బాల్స్‌లా చేసి దాల్చినచెక్క పొడి అద్ది బేకింగ్ ట్రేలో పెట్టాలి ● కుకీస్ అన్నీ తయారయ్యాక.. బేకింగ్ ట్రేని 350 డిగ్రీల ఫారిన్ హీట్స్ వద్ద, ఇరవై నిమిషాలు బేక్ చేస్తే స్నీకర్ డూడుల్ కుకీస్ రెడీ.

ఇటాలియన్ పీచ్ కుకీస్



కావలసినవి: మైదా – మూడున్నర కప్పులు; వంటసోడా – టేబుల్ స్పూను; కోషర్ సాల్ట్ – పావు టీస్పూను; బటర్ – అరకప్పు; పంచదార – రెండు కప్పులు; గుడ్లు – రెండు కప్పులు; వెనీలా ఎసెన్స్ – రెండు టీస్పూన్లు; పాలు – కప్పు; ఎరుపు, పసుపు ఫుడ్ కలర్ – నాలుగు చుక్కలు (ఒక్కోటి రెండు చుక్కలు). పీచ్ బటర్ క్రీమ్: బటర్ – పావు కప్పు; వెనీలా ఎసెన్స్ – అర టీస్పూను; కోషర్ సాల్ట్ – చిటికెడు; పంచదార పొడి – కప్పు; పీచ్ ప్యూరీ – రెండు టేబుల్ స్పూన్లు.

తయారీ: ● ఒక గిన్నెలో వంటసోడా, ఉప్పు వేసి కలపాలి ● దీనిలో బటర్, కప్పు పంచదార వేసి క్రీమ్‌లా మారేంత వరకు హ్యాండ్ మిక్సర్‌తో కలపాలి. తరువాత క్రీమ్‌ను పక్కన పెట్టుకోవాలి ● మిక్సర్‌ను తక్కువ స్పీడ్‌లో పెట్టి గుడ్ల సొన, వెనీలా ఎసెన్స్ వేసి రెండు నిమిషాలు బీట్ చేసుకోవాలి ● తరువాత మైదా, బటర్ మిశ్రమం అరకప్పు పాలు పోసి అన్ని చక్కగా కలిసేంత వరకు బీట్ చేయాలి ● ఇప్పుడు ఈ మిశ్రమాన్ని స్కూప్ పరిమాణంలో తీసుకుని గుండ్రని బాల్స్‌లా చేసి పైన కొద్దిగా వత్తి పీచ్ ఫ్రూట్ ఆకారంలోకి తీసుకు రావాలి ● ఇలా అన్ని కుకీస్ రెడీ అయిన తరువాత అవెన్‌లో పెట్టి 350 డిగ్రీల ఫారిన్ హీట్స్ వద్ద పదిహేను నిమిషాలు బేక్ చేయాలి ● పీచ్ క్రీమ్‌కోసం తీసుకున్న బటర్, వెనీలా ఎసెన్స్, కోషర్ సాల్ట్ లనుగిన్నెలో వేసి హ్యాండ్ మిక్సర్‌తో కలపాలి ● ఇవన్నీ చక్కగా కలిపిన తరువాత మిక్సర్ స్పీడు తగ్గించి పంచదార పొడి, పీచ్ ప్యూరీవేసి మీడియం హై లో నిమిషం పాటు మిక్సర్‌తో కలపాలి ● మిగిలిన అరకప్పు పాలను రెండు సగాలుగా చేసి రెండు వేర్వేరు గిన్నెల్లో పోయాలి. ఒకదానిలో ఎరుపు, మరో దానిలో పసుపు ఫుడ్ కలర్ వేసి కలిపి పక్కన పెట్టుకోవాలి. మరోగిన్నెలో మిగిలిన పంచదారను పెట్టుకోవాలి ● కుకీస్ బేక్ అయిన తరువాత..వేడిగా ఉన్నప్పుడే కుకీస్ మధ్యలో చిన్న గాటు పెట్టి.. మధ్యలో పీచ్‌క్రీమ్‌ను వేసి శాండ్‌విచ్‌లా కొద్దిగా వత్తాలి ● ఇప్పుడు కుకీకి ఒకవైపు ఎరు రంగు కలిపిన పాలు, మరోవైపు పసుపు రంగు కలిపిన పాలు అద్దాలి. చివరిగా పంచదార అద్దితే ఇటాలియన్ పీచ్ కుకీస్ రెడీ.

గ్రీన్ కేక్ మిక్స్ కుకీస్



కావలసినవి: వెనీలా కేక్ మిక్స్ – మూడు కప్పులు; నూనె – ముప్పావు కప్పు; గుడ్లు – రెండు; వెనీలా ఎసెన్స్ – అరటీస్పూను; గ్రీన్ ఫుడ్ కలర్ – టీస్పూను(జెల్); పంచదార పొడి – ముప్పావు కప్పు; హార్ట్ షేప్ క్యాండీస్ – గార్నిష్‌కు సరిపడా.

తయారీ: ● కేక్ మిక్స్,నూనె, గుడ్ల సొన, వెనీలా ఎసెన్స్‌ను, గ్రీన్‌ఫుడ్ కలర్‌ను ఒక గిన్నెలో వేసి ముద్దలా కలపాలి. తరువాత రిఫ్రిజిరేటర్‌లో పెట్టాలి ● ఇరవై నిమిషాల తరువాత పిండి ముద్దను బయటకు తీసి స్కూప్ పరిమాణంలో పిండిని తీసుకుని ఉండలు చేయాలి ● ఈ ఉండలను పంచదారపొడిలో ముంచి కోటింగ్‌లా అద్దాలి ● తరువాత ఉండలను బేకింగ్ ట్రేలో పెట్టి, కుకీ షేప్ వచ్చేలా వత్తుకోవాలి ● కుకీ మధ్యలో హార్ట్ ఆకారంలో ఉన్న క్యాండీని పెట్టి బేకింగ్ ట్రేని అవెన్‌లో పెట్టాలి ● 350 డిగ్రీల ఫారిన్ హీట్స్ వద్ద పదిహేను నిమిషాలు బేక్ చేస్తే గ్రీన్ కేక్ మిక్స్ కుకీస్ రెడీ.

సుగర్ కుకీస్



కావలసినవి: బటర్ – పావు కప్పు; క్రీమ్ చీజ్ – పావుకప్పు; పంచదార – ఒకటిన్నర కప్పులు; గుడ్లు – రెండు; వెనీలా ఎసెన్స్ – ఒకటిన్నర టీస్పూన్లు; బాదం ఎసెన్స్ – పావు టీస్పూను; మైదా – రెండున్నర కప్పులు; కార్న్‌స్టార్చ్ – టేబుల్ స్పూను; వంటసోడా – టీస్పూను; ఉప్పు – పావు టీస్పూను; ఎరుపు, పచ్చరంగు కలిపిన పంచదార –గార్నిష్‌కు సరిపడా.

తయారీ: ● ఒక పెద్దగిన్నెలో బటర్, క్రీమ్ చీజ్, పంచదార, గుడ్లు, వెనీలా, బాదం ఎసెన్స్ వేసి హ్యాండ్ మిక్సర్‌తో ఐదు నిమిషాలపాటు కలపాలి ● తరువాత మైదా, కార్న్ స్టార్చ్, వంటసోడా, ఉప్పు వేసి పిండి ముద్దలా కలపాలి ● ఈ పిండి ముద్దను రిఫ్రిజిరేటర్‌లో పెట్టాలి ● రెండు గంటల తరువాత తీసి చిన్నచిన్న ఉండలుగా చేసి బేకింగ్ ట్రేలో పెట్టాలి ● ఫోర్క్ సాయంతో ఉండపైన ఇంటూ ఆకారంలో ముద్ర పడేటట్లు వత్తాలి ● ఇలా అన్నిటినీ వత్తుకున్నాక ఎరుపు, పచ్చరంగు పంచదారను ఈ కుకీస్ పైన చల్లాలి ● ఇప్పుడు బేకింగ్ ట్రేని అవెన్‌లో పెట్టి 350 డిగ్రీల ఫారిన్ హీట్స్ వద్ద పదిహేను నిమిషాలు బేక్ చేస్తే సుగర్ కుకీస్ రెడీ.

మీ బద్ధకం అమ్మకు భారమే

చలికాలం



చలికాలం ముసుగు తన్ని పడుకుంటే
ఎంత బాగుణ్ణు.
బెడ్ దగ్గరకు పొగలు గక్కే టీ వస్తే
ఎంత బాగుణ్ణు.
టిఫిన్లూ, సూప్‌లు,
సాయంత్రం ఉడకబెట్టిన పల్లీలు...
ఎంత బాగుణ్ణు.
అన్నట్టు రగ్గులు, బొంతలు
భలే శుభ్రంగా, పొడిగా ఉండాలండోయ్.
చలికాలం ఎవరికీ పని చేయబుద్ధేయని కాలం.
కాని అమ్మకు తప్పుతుందా?
అమ్మ వెచ్చని రగ్గు కప్పుకుని టీవీ చూస్తూ
'టీ తెండి' అని అరిస్తే ఒకరోజైనా
ఇస్తారా ఎవరైనా?
చలికాలంలో ఇంటి సభ్యులు ఏం చేయాలి?

స్కూల్ టైమ్ మారదు. ఉదయం 8 లోపు బస్సొచ్చి ఆగుతుంది. పిల్లలకు బాక్స్ కట్టివ్వడమూ తప్పదు. ఏడున్నరకంతా కట్టాల్సిందే. టిఫిన్ తినిపించాల్సిందే. ఎంత చలి ఉన్నా, ఎంత మంచు కమ్ముకున్నా, ఎంత బద్ధకంగా ఉన్నా, ఎంత ముసుగుతన్ని నిద్రపోవాలని ఉన్నా అమ్మకు తప్పుతుందా? అమ్మ లేవకుండా ఉంటుందా? వంట గదిలో వెళ్లకుండా ఉంటుందా? నాన్న అర గంట లేటుగా లేవొచ్చు. వాకింగ్ ఎగ్గొట్టి అమ్మ ఇచ్చిన టీని చప్పరిస్తూ పేపర్‌ను చదువుతూ ఉండొచ్చు. కాని అమ్మ మాత్రం అదే వంట చేయాల్సిందే. రోజువారీ అంట్లు, బట్టల ఉతుకుడు చూడాల్సిందే. ఆమెకు ఇంట్లో నుంచి ఎలాంటి సాయం అందుతున్నదో ఆలోచించామా ఎప్పుడైనా?

బద్ధకమైన కాలం ఇది

చలికాలం బద్ధకం కాలం. తలుపులు కిటికీలు మూసుకుని అరచేతులు రుద్దుకుంటూ కూచోమని చెప్పే కాలం. బజ్జుంటే బాగుండు అనిపించే కాలం. అమ్మకు 'ఈ పూట ఎవరైనా వంట చేసి పెడితే బాగుండు' అనిపించినా అలా చేసేవారు ఎవరు? 'రోజూ వండుతున్నావ్ కదా ఇవాళ బజారు నుంచి వేడి ఇడ్లీ తెస్తానులే' అని బండి తాళం అందుకునే నాన్నలు ఎందరు? పాలల్లో కొన్ని చాకోస్ వేసివ్వు చాలు అనే పిల్లలు, బ్రెడ్ ఆమ్లేట్ చేసుకుని తింటాలే అనే భర్తలు ఉన్న ఇల్లు ఇల్లాలి శ్రమను గుర్తించే ఇల్లు. 'కాసేపు పడుకోలే' అని లేచి పేపర్లు లోపల పడేసి, పాలు ఫ్రిజ్‌లో పెట్టి, ఒక ప్యాకెట్ గిన్నెలో వేడి చేసి, కాఫీ కలిపి భార్యను లేపితే ఎంత బాగుంటుంది. మగవాళ్లు బట్టలు ఎలాగూ ఉతకరు. 'చెమ్మగా ఉన్నాయి' అని విసుక్కునే బదులు కనీసం ఎండ తగిలే తీగ దాకానో, డాబా మీదనో తీసుకెళ్లి ఆరేసే సాయం చేయరు. ఇలాంటి సమయంలో 'బట్టలు ఆరేయడం' అనే చిన్న పని కూడా చాలా పెద్ద సాయం కిందకు వస్తుంది.ఈ రోజుల్లో ప్రత్యామ్నాయ టిఫిన్లు, ఇన్‌స్టంట్ టిఫిన్లు ఎన్నో మార్కెట్‌లో ఉన్నాయి. యూట్యూబ్‌లో కొడితే వందలాది వీడియోలు ఉన్నాయి. తెచ్చిపెట్టే స్విగ్గి, జొమాటోలు ఉన్నాయి. ఈ శీతాకాలంలో ఉదయపు వంట చెర నుంచి అమ్మకు ఏ విధంగా ఉపశమనం ఇవ్వొచ్చో తప్పక ఆలోచించాలి.

అమ్మకు కావాలి వెచ్చని దుస్తులు

సాధారణంగా ఇళ్లల్లో నాన్నకు హాఫ్ స్వెటర్లు ఉంటాయి. ఎప్పుడూ వేసుకునే ఉంటాడు. అమ్మకు మాత్రం ఎందుకనో స్వెటర్ ఉండదు. కొని తేవాలని ఎవరికీ అనిపించదు. చాలా ఇళ్లల్లో అమ్మలు పాతబడిన స్వెటర్లతోనే తిరుగుతూ ఉంటారు ఈ సీజన్లలో. ఒక రంగురంగుల కొత్త స్వెటర్ కొనుక్కోవాలని వారికి ఉంటుంది. ఉద్యోగం చేస్తున్నా, గృహిణి అయినా తాను కొనుక్కునే చొరవకు ఎప్పుడూ అమ్మ దూరంగానే ఉంటుంది. స్వెటర్ లేకుండానే చలికాలం గడిపేస్తుంది. ఆమెకు స్వెటర్, సాక్సులు, స్కార్ఫ్‌లు కావాలి. ఉన్నాయా గమనించండి. ఆమె అడగదు. తెచ్చి పెట్టండి. శీతాకాలంలో స్త్రీలు తమ శరీరం గురించి ఆలోచన చేస్తారు. చర్మాన్ని, శిరోజాల్ని కాపాడుకోవడానికి వారికి కొన్ని వస్తువులు అవసరం. క్రీములు, నూనెలు, సబ్బులు... ఏర్పాటు చేయాలి. చర్మ సమస్యలు కొందరిలో రావచ్చు. వాటిని చిట్కాలతో సరిపుచ్చుతూ బాధ పడాల్సిన పని లేదు. వైద్యుల దగ్గరకు వెళ్లాలి. తీసుకువెళ్లాలి. ఇక ఇంట్లో గర్భిణీ స్త్రీలు ఉంటే చలికాలం మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. రోజువారీ చాకిరీ నుంచి దాదాపుగా తప్పించాలి.

ఇంట్లో పెద్దవారు ఉంటే?

అమ్మమ్మో, నానమ్మో ఇంట్లో ఉంటే వారి గురించి ఇల్లంతా మరింత శ్రద్ధ పెట్టాలి. మంచి షాల్, రగ్గు వారికి ఏర్పాటు చేయాలి. నేలకు పాదాలు తాకి జిల్లు మనకుండా ఇంట్లో తిరగడానికి మంచి స్లిప్పర్లు ఇవ్వాలి. స్లిప్పర్లలోనే తిరగమని చెప్పాలి. చలికి ఆకలి ఎక్కువ. పెద్దవారు పసిపిల్లల్లా మారి నోటికి హితంగా వేడివేడిగా అడుగుతారు. వారికి ఏదో ఒకటి చేసి పెట్టాలి. ఆ పనిలో కూడా అమ్మకు భర్త, పిల్లలు ఏదో ఒక మేరకు సాయం చేయాలి. వారికి వెచ్చని గది కేటాయించాలి. లేదా ఇంట్లోని వెచ్చని ప్రదేశమైనా.

శుభ్రత అందరిదీ

శీతాకాలం ఇల్లు మబ్బుగా ఉంటుంది. ఇటు పుల్ల అటు పెట్టబుద్ధి కాదు. కాని ప్రయత్నం చేసి ఇల్లు ప్రతి రోజూ సర్దుకునే పడుకోవాలి. హాల్లో బెడ్‌రూముల్లో కిచెన్‌లో కుటుంబ సభ్యులంతా నిద్రకు ముందు వీలైనంత శుభ్రంగా, సర్ది పడుకుంటే ఉదయాన్నే అమ్మ లేచినప్పుడు చిందరవందర లేకుండా పనిలో పడబుద్ధి అవుతుంది. పక్క బట్టలు మడవడం కూడా కొంతమంది చేయరు. అలాంటి వారిని తప్పక గాడిలో పెట్టాలి. చలికాలం అమ్మకి పని తేలిక చేద్దాం. చలికాలాన్ని ఎంజాయ్ చేసేలా చూద్దాం.

● ముగ్గు-ముచ్చట

ముగ్గులకు ఆహ్వానం

ధనుర్మాసం వచ్చిందంటే ఇంటిముంగిట తీర్చిదిద్దిన అందమైన రంగవల్లులు... ముచ్చటైన గొబ్బెమ్మలు... తెలుగింటి ఆడపడచులందరూ తమకు వచ్చిన ముగ్గులను మరొకరితో పంచుకుంటూ... తెలియని వాటిని నేర్చుకుంటూ కనిపిస్తుంటారు. మరి మీరు కూడా ముగ్గులు బాగా వేస్తారా? అలా అయితే ముచ్చటైన మీ ముగ్గులను అందమైన రంగులతో కాగితం మీద పెట్టండి. చుక్కల వివరాలతో సహా వాటిని మాకు పంపండి. అందిన వాటిలో చక్కటి ముగ్గును మీ ఫొటోతో సహా మేము ప్రచురిస్తాం.



ముగ్గులు పంపవలసిన చిరునామా
ముగ్గు-ముచ్చట, సాక్షి ఫ్యామిలీ,
సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్,
హైదరాబాద్–34.
ఈ మెయిల్: muggulu.sakshi@gmail.com

● సక్సెస్ స్టోరీ

మెటామ్యాన్

వచ్చిన 'ఐడియా'కు ఒక రూపం ఇచ్చి లాభదాయక కంపెనీగా నిర్మించడం అనేది అంత సులభం కాదు. దారి కనిపించినట్లుగానే ఉంటుంది. గమ్యం చేరడం మాత్రం సులువు కాదు. ఎంటర్‌ప్రెన్యూర్ కలలు కనే యువతరం తమకు వచ్చిన ఐడియాకు సంబంధించి అన్ని కోణాల్లో హోంవర్క్ చేస్తే సూపర్ సక్సెస్ సాధించవచ్చని నిరూపించింది బెంగళూరుకు చెందిన 'మెటామ్యాన్' స్టార్టప్. 'మన దేశంలో పురుషులకు జువెలరీ బ్రాండ్స్‌కు సంబంధించి తక్కువ ఆప్షన్స్ ఉన్నాయి' అనే మాట బాలీవుడ్ నటుడు సునీల్ షెట్టి నోట విన్న తరువాత అనీల్ షెట్టీ తన స్నేహితుడు హర్ష్ మస్కరతో కలిసి 'మెటా మ్యాన్' పేరుతో డిజైన్-ఓరియెంటెడ్ 'డైరెక్ట్-టు-కన్స్యూమర్ బ్రాండ్' (డీ2సీ)కి శ్రీకారం చుట్టాడు. ప్రారంభించిన ఆరు నెలలోనే ఈ బ్రాండ్ సూపర్ డూపర్ హిట్ అయింది...


అనీల్ షెట్టి

లండన్‌కు చెందిన మార్కెట్ రిసెర్చ్ కంపెనీ 'యూరోమానిటర్ ఇంటర్నేషనల్' అంచనా ప్రకారం మెన్ జువెలరీకి సంబంధించి ఇండియా థర్డ్-లార్జెస్ట్ మార్కెట్‌గా ఎదగనుంది. 'మెటామ్యాన్'కు ముందు సునీల్ షెట్టితో కలిసి మాట్లాడాడు అనీల్. ఈ ఆలోచన నచ్చడంతో కంపెనీ ఫౌండింగ్ మెంటర్, ఇన్వెస్టర్‌గా ఉండడానికి ముందుకు వచ్చాడు సునీల్ షెట్టి. హిప్-హప్ జువెలరీ ధరించడం అనేది ఇండియాలో బలపడుతున్న ట్రెండ్ అయినప్పటికీ ఏవో కొన్ని తప్ప తగినన్నీ ఆప్షన్స్ లేవు. ఈ లోటును భర్తీ చేయడానికి 'మెటామ్యాన్'తో ముందుకు వచ్చి సక్సెస్ అయింది.

ట్రెండ్‌తో పాటు బడ్జెట్‌ను కూడా దృష్టిలో పెట్టుకొని అందుబాటు ధరల్లో బ్రాస్‌లెట్స్, చైన్స్, రింగ్స్....మొదలైన వాటిని డిజైన్ చేయించారు. సందర్భానికి తగినట్లుగా డైలీ ఆఫీస్ వియర్, క్యాజువల్ వియర్, స్పోర్ట్స్ వియర్, ట్రావెల్ వియర్....మొదలైన వాటిని డిజైన్ చేయించారు.

'మెటామెన్' పీసెస్‌లు ఫిల్మ్‌ఫేర్, లైఫ్‌స్టైల్ ఏసియాలాంటి మ్యాగజైన్‌లలో కనిపించడంతో వాటికి మరింత ప్రాచుర్యం వచ్చింది. ఈ కంపెనీ ఏంజెల్ ఇన్వెస్టర్ జాబితాలో సునీల్ షెట్టితో పాటు నిఖిల్ కామత్ (జెరోద), కేఎల్ రాహుల్ (ఇండియన్ క్రికెటర్), ఆశిష్ (బుక్‌మై షో), ప్రశాంత్ ప్రకాష్ (యాక్సెల్ పాట్నర్స్), సుజిత్ కుమార్ (ఉడాన్), హర్షిల్ మాథుర్, శశాంక్ కుమార్ (రేజర్‌పే) చేరారు.

రాబోయే ఆరు నెలల కాలంలో రెండు వందల కొత్త ప్రాడక్ట్స్ డిజైన్ చేయడానికి రెడీ అయింది మెటామ్యాన్. 2024లో దుబాయ్, ఇండోనేషియా, సింగపూర్, ఆస్ట్రేలియాలలో తమ బ్రాండ్‌ను విస్తరించే పనిలో ఉంది.

అనీల్ షెట్టికి ఫ్యాషన్ నుంచి పాలిటిక్స్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ వరకు ఎన్నో రంగాలపై ఆసక్తి ఉంది. ఎంటర్‌ప్రెన్యూర్‌గా రాణించాలనే కల ఉంది. తన కలను నిజం చేసుకునే దారిని వెదుక్కునే క్రమంలో అనీల్‌కు సునీల్ షెట్టి మాటలు దారి చూపించాయి. పురుషుల యాక్సెసరీస్, జువెలరీ మార్కెట్‌లో గెలుపు జెండా ఎగరేసేలా చేశాయి.

'ఆసియాలోని లీడింగ్ జెన్ జెడ్ జువెలరీ బ్రాండ్‌గా ఎదగాలనేది మా లక్ష్యం' అంటున్నాడు 'మెటామ్యాన్' కో-ఫౌండర్ అనీల్ శెట్టి.

యూరేక మూమెంట్

యూరేక మూమెంట్ అనేది ఏ వ్యక్తికి అయినా ఏదో ఒక సమయంలో వస్తుంది. తల్లి నెక్లెస్‌ను మెడలో ధరించిన సునీల్ షెట్టిని చూసిన తరువాత నాకు ఐడియా వచ్చింది. మెన్ జువెలరీ అనేది మన దేశంలో వినూత్న కాన్సెప్ట్. ఐడియా కొత్తగా ఉన్నంత మాత్రాన సక్సెస్ కావాలని లేదు. 360 డిగ్రీ కోణంలో ఆలోచించి మంచి, చెడులపై ఒక అవగాహనకు వచ్చాం. ఫ్యాషన్ జువెలరీ ధరించాలనే ఆసక్తి పురుషులకు ఉన్నప్పటికీ అట్రాక్టివ్, క్వాలిటీ డిజైన్‌లు వారికి కనిపించడం లేదు. ఈ లోటును పూరించేలా మా జువెలరీని డిజైన్ చేసి సక్సెస్ సాధించాం.

– అనీల్ షెట్టి, మెటామ్యాన్, కో-ఫౌండర్

■ **జంప్ డౌన్ సమ్‌వన్స్ థ్రోట్**

ఆగ్రహంగా స్పందించే సందర్భంలో ఉపయోగించే మాట... జంప్ డౌన్ సమ్‌వన్స్ థ్రోట్.
ఉదా: ఐ మేడ్ ది మైల్డెస్ట్ ఆఫ్ క్రిటిసిజమ్స్ అండ్ హీ జంప్‌డ్ డౌన్ మై థ్రోట్

■ **జంప్ ఔట్ ఆఫ్ మై స్కిన్**

ఊహించని విధంగా భయపెట్టే సంఘటన జరిగినప్పుడు వాడే మాట... జంప్ ఔట్ ఆఫ్ మై స్కిన్.
ఉదా: ది నాయిస్ మేడ్ మీ జంప్ ఔట్ ఆఫ్ మై స్కిన్

English Idioms

● గేమింగ్

మృత్యుగీతం

ఫ్రీ-టు-ప్లే రోల్‌ప్లేయింగ్ గేమ్ ఏ డేట్ విత్ డెత్. ఈ గేమ్‌లో ప్లేయర్ సాధారణ వ్యక్తి. ఈ సాధారణ వ్యక్తి ఎన్నోసార్లు అసాధారణ పరిస్థితులను ఎదుర్కోవలసి వస్తుంది. మృత్యువు బారి నుంచి తప్పించుకున్న సందర్భాలు ఎన్నో. ప్లేయర్స్‌ను సంతోషపెట్టే ఫీచర్స్ ఎన్నో ఈ గేమ్‌లో ఉన్నాయి. అందులో ఒకటి... శూన్యం నుంచి అవతార్‌ను సృష్టించే ఫీచర్. వినోదం, ఒళ్లు గగుర్పొడిచే భయం మిళితమైన ఆట ఇది.



డెవలపర్స్: టు అండ్ ఈ హాఫ్ స్టూడియోస్ జానర్స్: ఇండి గేమ్, సిమ్యూలేషన్ వీడియో గేమ్, ఫ్రీ-టు-ప్లే
ప్లాట్‌ఫామ్స్: మ్యాక్‌వోఎస్, మైక్రోసాఫ్ట్ విండోస్

● మ్యూజిక్ వరల్డ్

బిల్‌బోర్డ్ టాప్ సింగర్


వోలివియ రోడ్రిగో

అమెరికన్ సింగర్, సాంగ్‌రైటర్, నటి వోలివియ రోడ్రిగో డెబ్యూ సింగిల్ 'డ్రైవర్స్ లైసెన్స్'తో సంగీతప్రపంచంలో తనదైన ముద్ర వేసింది. వోలివియకు స్ట్రాంగ్ యంగ్ ఫ్యాన్ బేస్ ఉంది. ఇరవై సంవత్సరాల రోడ్రిగోకు యూత్ పల్స్ తెలుసు. 'పాట అనేది పక్షిలాంటిది. అది ఎప్పుడు వచ్చి మన భుజం మీద వాలుతుందో తెలియదు. ఇవ్వాళ ఎలాగైనా సరే ఒక పాట చేసేయాలి అని కూర్చొని విఫలమైన సందర్భాలు ఎన్నో. టూరింగ్, రైటింగ్, రికార్డింగ్‌లను ఇష్టపడే రోడ్రిగో టూర్‌లో ఉన్నప్పుడు రాయకూడదు అనుకుంటుంది. కాని అందమైన జలపాతాన్ని చూస్తున్నప్పుడో, చిరుగాలి సితార సంగీతం వినిపించినప్పుడో ఒక పాట అప్పటికప్పుడే పుట్టవచ్చు!

'పాటలు రాసే, పాడే నైపుణ్యాన్ని ఎప్పటికప్పుడూ మెరుగుపరుచుకోవాలి. ప్రతి రోజూ మనకు ఏమీ తెలియని ఒక కొత్త రోజే' అంటున్న వోలివియ రోడ్రిగో బిల్‌బోర్డ్ గ్రేటెస్ట్ పాప్ స్టార్స్ 2023 జాబితాలో చోటు సంపాదించింది.

● అవును... ఇది నిజమే!

● 'జిమ్నాస్టిక్స్' అనేది పురాతన గ్రీకు పదం 'జిమ్నాజీన్' నుంచి పుట్టింది. దీని అర్థం నగ్నంగా వ్యాయామం చేయడం. యువకులకు యుద్ధ విద్యలలో శిక్షణ ఇచ్చే విధానం 'జిమ్నాజీన్' కాలక్రమంలో ఎన్నో మార్పులకు లోనైంది.

● ఐస్‌ల్యాండ్‌లో క్రిస్మస్ పండగ కానుకలుగా పుస్తకాలను ఒకరికి ఒకరు పంచుకునే సంప్రదాయం ఉంది. ఈ సంప్రదాయాన్ని 'ది క్రిస్మస్ బుక్ ఫ్లడ్' అంటారు. ఇతర దేశాలతో పోల్చితే సెప్టెంబర్



నుంచి నవంబర్ వరకు ప్రచురణ కర్తలు అత్యధిక సంఖ్యలో పుస్తకాలు అమ్ముతారు కాబట్టి దీనికి 'ది క్రిస్మస్ బుక్ ఫ్లడ్' అని పేరు వచ్చింది.

● 'బే క్యాట్' అనేది అత్యంత అరుదైన పిల్లి జాతి. ఇవి ఆగ్నేయ ఆసియాలోని బోర్నియో ద్వీపంలో మాత్రమే నివసిస్తాయి. అటవీ నిర్మూలన వల్ల వీటి సంఖ్య విపరీతంగా తగ్గి ప్రమాదపు అంచున ఉన్నాయి. అంతరించి పోతున్న జాతుల జాబితాలో వీటిని చేర్చారు.

● టెక్.. టాక్

ఇన్‌ఫినిక్స్ స్మార్ట్ 8 హెచ్‌డీ



సైజ్: 6.6 అంగుళాలు
రిఫ్రెష్‌రేట్: 90 హెచ్‌జడ్
ర్యామ్: 3 జీబి
స్టోరేజ్: 64జీబి
బ్యాటరీ: 5,000 ఎంఏహెచ్
కలర్స్: టింబర్ బ్లాక్, క్రిస్టల్ గ్రీన్, గెలాక్సీ వైట్



ఫ్లెక్సిబుల్ మొబైల్ హోల్డర్

బ్రాండ్: CQLEK కలర్: బ్లాక్; మెటీరియల్: ఏబీఎస్ ప్లాస్టిక్, ఫోమ్ ప్యాగింగ్ కంపాటబుల్: స్మార్ట్‌ఫోన్ డివైజెస్
● ఆల్ మొబైల్ ఫోన్స్ సైజ్ అప్ టూ: 7 ఇంచ్.
● లైట్ వెయిట్, రొటేటబుల్, నాన్-స్లిప్, స్క్రాచ్ రెసిస్టెంట్, ఫోల్డబుల్

వాట్సాప్ సెండ్ వాయిస్ మెసేజెస్

ఒకసారి విన్న తరువాత మాయం అయ్యే 'సెండ్ వాయిస్ మెసేజెస్' ఫీచర్ గురించి ఇన్‌స్టంట్ మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ వాట్సాప్ ప్రకటించింది. ఫోటోలు, వీడియోలకు సంబంధించి వాట్సాప్‌లో అందుబాటులో ఉన్న 'వ్యూ వన్స్'కు ఇది అదనపు చేర్పు. క్రెడిట్ కార్డు వివరాలను ఇతరులతో పంచుకునే సందర్భంలో, సెన్సిటివ్ మ్యాటర్‌కు సంబంధించి ఈ ఫీచర్ ఉపయోగపడుతుంది. ఈ ఆడియో మెసేజ్‌లు ఫోటోలు, వీడియోలను చూడడానికి అనుగుణంగా ఉంటాయి. 'వన్-టైమ్' ఐకాన్‌తో మార్క్ చేయబడి ఉంటాయి. ఫోటో, వీడియో, ఆడియో మెసేజ్ వచ్చిన తర్వాత 14 రోజుల్లో దాన్ని ఓపెన్ చేయాల్సి ఉంటుంది. లేకపోతే మెసేజ్ గడువు ముగుస్తుంది.



గూగుల్ మెసేజెస్‌లో ఎడిట్ ఫీచర్


Google Messages

పాపులర్ మెసేజింగ్ యాప్ 'గూగుల్ మెసేజెస్'లో వాట్సాప్‌లో ఉండే 'ఎడిట్' ఫీచర్ తరహా ఫీచర్ రానుంది. ఈ ఫీచర్ ద్వారా యూజర్‌లు పంపిన మెసేజ్‌లను ఎడిట్ చేయవచ్చు. ఐ ఇమేజ్, వాట్సాప్‌లలో ఎడిట్ ఫీచర్‌కు టైమ్ లిమిట్ ఉన్నట్లు దీనిలో ఉంటుందా? రిసీవర్‌కు ఎడిట్ హిస్టరీ చూసే అవకాశం ఉంటుందా? ఐ ఇమేజెస్, వాట్సాప్‌లోలాగా సెంట్ చేసిన మెసేజ్‌లను డిలీట్ చేసే అవకాశం ఉందా? అనేది తెలియదు. 'వర్క్ ఇన్ ప్రోగ్రెస్' స్టేజీలో ఉన్న ఈ ఫీచర్ ఎప్పుడు అందుబాటులోకి రానుందో కంపెనీ తెలియజేయలేదు.

సినిమా

గ్యాంగ్‌స్టర్ రాక్షస రాజా

రానా హీరోగా తేజ దర్శకత్వంలో వచ్చిన 'నేనే రాజు నేనే మంత్రి' (2017) సూపర్ హిట్ అయిన సంగతి గుర్తుండే ఉంటుంది. ఈ కాంబినేషన్‌లో రెండో చిత్రం రూపొందనున్న విషయం తెలిసిందే. రానా పుట్టినరోజు (డిసెంబర్ 14) సందర్భంగా ఈ చిత్రం టైటిల్‌ని 'రాక్షస రాజా'గా ప్రకటించి, రానా ఫస్ట్ లుక్‌ని విడుదల చేశారు. ''ఇప్పటివరకూ చూడని క్రైమ్ వరల్డ్‌ని ఆవిష్కరిస్తూ ఇంటెన్స్ ఎమోషన్స్, ఫ్యామిలీ డ్రామాల సమ్మేళనంతో ఈ చిత్రం ఉంటుంది. గ్యాంగ్‌స్టర్ డ్రామాగా రూపొందించనున్న ఈ చిత్రం ప్రేక్షకులను ఓ అద్భుతమైన అనుభూతికి గురి చేస్తుంది. గ్రిప్పింగ్ కథనం, వండర్‌ఫుల్ విజువల్స్‌తో 'రాక్షస రాజా' తెలుగు పరిశ్రమలో కొత్త బెంచ్ మార్క్‌ను సెట్ చేయడానికి రెడీ అవుతోంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.


● రానా

సెట్‌లో స్టార్ట్

వరుణ్ తేజ్ హీరోగా నటిస్తున్న పీరియాడికల్ యాక్షన్ డ్రామా ఫిల్మ్ 'మట్కా'. ఈ చిత్రంలో నోరా ఫతేహి, మీనాక్షీ చౌదరి హీరోయిన్లు. కరుణ కుమార్ దర్శకత్వంలో ఈ పాన్ ఇండియన్ చిత్రాన్ని విజయేందర్ రెడ్డి తీగల, మోహన్ చెరుకూరి నిర్మిస్తున్నారు. వైజాగ్ నేపథ్యంలో సాగే ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ గురువారం హైదరాబాద్‌లో మొదలైంది. ''యావత్ దేశాన్ని కదిలించిన ఓ వాస్తవ ఘటన ఆధారంగా 'మట్కా'ను తెరకెక్కిస్తున్నాం. ఇందులో వరుణ్ తేజ్ నాలుగు విభిన్నమైన గెటప్స్‌లో కనిపిస్తారు. ఈ సినిమా కథాంశం ప్రధానంగా 1958–1982ల మధ్య జరుగుతుంది. అందుకుని 1950, 1980 నాటి పరిస్థితులను రీ క్రియేట్ చేస్తున్నాం. అలా రీ క్రియేట్ చేసిన ఓ భారీ సెట్‌లోనే 'మట్కా' షూటింగ్ జరుగుతోంది. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ఈ సినిమా రిలీజ్ కానుంది'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాశ్‌కుమార్.


● వరుణ్ తేజ్

శబ్దంతో థ్రిల్

దాదాపు పదిహేనేళ్లకు హీరో ఆది పినిశెట్టి-డైరెక్టర్ అరివళగన్-మ్యూజిక్ డైరెక్టర్ తమన్‌ల కాంబినేషన్ కుదిరింది. గతంలో ఈ ముగ్గురి కాంబినేషన్‌లో వచ్చిన సూపర్ నేచురల్ క్రైమ్ థ్రిల్లర్ 'ఈరమ్' (2009) మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. తెలుగులో 'వైశాలి'గా విడుదలైంది. ఇక తాజాగా వీరి కాంబోలో తెలుగు, తమిళ ద్విభాషా చిత్రంగా 'శబ్దం' తెరకెక్కుతోంది. ఇది కూడా సూపర్ నేచురల్ క్రైమ్ థ్రిల్లర్ కావడం విశేషం. 7ఎ ఫిలింస్ శివ, ఆల్ఫా ఫ్రేమ్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఫస్ట్ లుక్‌ని హీరో నాని విడదల చేశారు. ''ఈ 'శబ్దం'లో శబ్దానికి సంబంధించి ప్రత్యేక సన్నివేశాలు ఉంటాయి. ఇంటర్వెల్ సీక్వెన్స్ కోసమే రూ. 2 కోట్లతో 120 ఏళ్ల నాటి లైబ్రరీ సెట్‌ను నిర్మించాం. ఈ సినిమా కోసం తమన్ ప్రత్యేకమైన సౌండ్ ఎఫెక్ట్స్, ఆర్‌ఆర్ చేయడానికి హంగేరీకి వెళ్లాలని ప్లాన్ చేస్తున్నారు'' అని యూనిట్ పేర్కొంది. సిమ్రాన్, లైలా, లక్ష్మీ మీనన్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్న ఈ చిత్రానికి కెమెరా: అరుణ్ పద్మనాభన్, సహనిర్మాత: భానుప్రియ శివ, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఆర్. బాలకుమార్.


● ఆది పినిశెట్టి

నా ఎనిమిదేళ్ల కల నెరవేరింది

– దర్శకుడు అను ప్రసాద్



విరాజ్ అశ్విన్, పూజితా పొన్నడ జంటగా అను ప్రసాద్ దర్శకత్వంలో నిరీష్ తిరువీధుల నిర్మించిన చిత్రం 'జోరుగా హుషారుగా..'. ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా గురువారం విలేకర్లతో అను ప్రసాద్ మాట్లాడుతూ– ''తూర్పుగోదావరిలోని పెద్దాపురం స్వస్థలం. సినిమాలపై ఆసక్తితో ఇండస్ట్రీకి వచ్చాను. జూనియర్ ఆర్టిస్టు, లైట్‌మేన్‌గా చేశాను. ఎడిటింగ్‌లో నైపుణ్యం ఉంది. నా దర్శకత్వంలో వచ్చిన షార్ట్ ఫిల్మ్ చూసి, నిరీష్‌గారు చాన్స్ ఇచ్చారు. అలా దర్శకుడ్ని కావాలనుకున్న నా ఎనిమిదేళ్ల కల 'జోరుగా హుషారుగా'తో నెరవేరింది. నా మిత్రుడి జీవితంలో జరిగిన ఓ ఘటన ఆధారంగా ఈ సినిమా కథ రాశాను. ఓ గ్రామం నుంచి పట్నానికి వచ్చిన సంతోష్ (విరాజ్ పాత్ర) జీవితంలో జరిగన ఓ ఘటన అతని జీవితాన్ని ఏ విధంగా మార్చింది? తన కుటుంబాన్ని సంతోష్ ఏ విధంగా కాపాడుకున్నాడు? అన్నది ఈ సినిమా. మంచి హాస్యం, భావోద్వేగం, సంగీతం ఉన్నాయి'' అని చెప్పుకొచ్చారు.

కన్నప్పలో కథానాయికగా..


● ప్రీతీ ముకుందన్

కన్నప్పలో భాగమయ్యారు ప్రీతీ ముకుందన్. శివ భక్తుడు కన్నప్ప జీవితం ఆధారంగా తెరకెక్కుతోన్న చిత్రం 'కన్నప్ప'. విష్ణు మంచు టైటిల్ రోల్ చేస్తున్న ఈ సినిమాకు ముఖేష్ కుమార్ సింగ్ దర్శకుడు. ప్రభాస్, మోహన్‌బాబు, బ్రహ్మానందం, మోహన్‌లాల్, శివరాజ్ కుమార్, శరత్‌కుమార్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ న్యూజిల్యాండ్‌లో జరుగుతోందని సమాచారం. ఈ సినిమాలోని హీరోయిన్ పాత్రకు ప్రీతీ ముకుందన్‌ను ఎంపిక చేసినట్లు గురువారం చిత్ర యూనిట్ వెల్లడించింది. ''ప్రీతికి ఇది తొలి సినిమా. 'కన్నప్ప' సినిమాలోని హీరోయిన్ పాత్రకు ఆమె సరిగ్గా సరిపోతుంది. నాట్య కళలో ప్రీతికి ప్రావీణ్యం ఉంది. 'కన్నప్ప'లో ఆమె పాత్రకు కొన్ని యాక్షన్ సన్నివేశాలు కూడా ఉన్నాయి'' అని చిత్ర యూనిట్ వెల్లడించింది.


సరికొత్త దళారి


● షకలక శంకర్, రాజీవ్ కనకాల

రాజీవ్ కనకాల, 'షకలక' శంకర్ ప్రధాన పాత్రల్లో శ్రీతేజ్, అక్సా ఖాన్, రూపిక కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'దళారి'. కాచిడి గోపాల్‌రెడ్డి దర్శకత్వంలో ఎడవెల్లి వెంకట్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం నేడు రిలీజవుతోంది. ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో రాజీవ్ కనకాల మాట్లాడుతూ– ''ఈ చిత్రం ప్రేక్షకులకు కొత్తగా ఉంటుంది'' అన్నారు. ''దళారి'ని రెండు భాగాలుగా తీశాం. ఇప్పుడు తొలి భాగం రిలీ జవుతోంది. ఇందులో మంచి కథ, యాక్షన్ ఉన్నాయి. ఈ సినిమా క్లైమాక్స్ బాగా వచ్చింది'' అన్నారు 'షకలక' శంకర్. ''ఒక ఊరిలోని వెంకట్ రెడ్డి అనే వ్యక్తి జీవితాన్ని ప్రేరణగా తీసుకుని ఈ సినిమా కథ చేశాం'' అన్నారు కాచిడి గోపాల్‌రెడ్డి. ''త్వరలోనే దళారి 2' చేస్తాం'' అన్నారు వెంకట్ రెడ్డి.

నిజాయితీగా శ్రమిస్తే సక్సెస్ గ్యారంటీ

– దర్శకుడు శివ నిర్వాణ


● చంద్రశేఖర్, సాహు గారపాటి, శివ నిర్వాణ, యుగంధర్, రాజేశ్, మేఘ, సుధీర్

'సత్యం' రాజేశ్, మేఘా చౌదరి హీరో హీరోయిన్లుగా, ఎస్తేర్ ఓ కీలక పాత్ర చేసిన చిత్రం 'టెనెంట్'. వై. యుగంధర్ దర్శకత్వంలో మోగుళ్ళ చంద్రశేఖర్ రెడ్డి నిర్మించారు. ఈ సినిమా ట్రైలర్ రిలీజ్ వేడుకలో దర్శకుడు శివ నిర్వాణ, నిర్మాత సాహు గారపాటి, నటుడు 'సుడిగాలి' సుధీర్ అతిథులుగా హాజరై 'టెనెంట్' ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. ''సినీ పరిశ్రమను నమ్ముకుని నిజాయితీగా శ్రమిస్తే ఆలస్యమైనా సక్సెస్ తప్పకుండా వస్తుందనడానికి నిదర్శనం 'సత్యం' రాజేశ్, 'సుడిగాలి' సుధీర్. ఈ ఇద్దరూ కష్టపడి హీరోలుగా నిరూపించుకున్నారు. యుగంధర్ ప్రతిభ గల వ్యక్తి'' అన్నారు శివ నిర్వాణ. ''ట్రైలర్ ఆసక్తిగా ఉంది. సినిమా విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది'' అన్నారు సాహు గారపాటి. ''సత్యం' రాజేశ్‌గారు వరుస హిట్స్ సాధించడం ఆనందంగా ఉంది. ఈ సినిమా బ్లాక్‌బస్టర్ అవుతుంది'' అన్నారు 'సుడిగాలి' సుధీర్. ''ఈ సినిమా కథలోని ఎమోషన్స్‌కు ఆడియన్స్ కనెక్ట్ అవుతారు'' అన్నారు 'సత్యం' రాజేశ్.

ఆ భయం లేదు!

– ఖుషీ రవి



''లాక్‌డౌన్ తర్వాత ప్రేక్షకులు వినోదాన్ని ఆస్వాదించే విధానం మారింది. కథ, నటీనటుల పాత్రల్లో కొత్తదనం ఉంటేనే చూస్తున్నారు. అందుకే ప్రయోగాత్మక, కొత్త తరహా పాత్రలే చేయాలనుకుంటున్నాను. కథ నచ్చి, అందులో నా పాత్ర బలంగా ఉంటే గ్లామరస్ పాత్రలు చేయడానికి కూడా రెడీ'' అన్నారు ఖుషీ రవి. శ్రీరామ్, ఖుషీ రవి జంటగా సాయికిరణ్ దైదా దర్శకత్వంలో యశ్వంత్ దగ్గుమాటి నిర్మించిన హారర్ చిత్రం 'పిండం'. ఈ చిత్రం ఈ నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా విలేకర్ల సమావేశంలో ఖుషీ రవి మాట్లాడుతూ– ''నటిగా కన్నడంలో 'దియా' నా తొలి చిత్రం. ఆ చిత్రం తర్వాత పెళ్లి చేసుకున్నాను. నాకో పాప ఉంది. ఇక 'పిండం' సినిమా విషయానికి వస్తే... ఈ సినిమాలో నేను మేరీ పాత్రలో నటించాను. కథ రీత్యా ఇద్దరు కుమార్తెలు నాకు. మూడో ప్రసవం కోసం గర్భిణిని. కెరీర్ ప్రారంభంలోనే తల్లి పాత్ర చేస్తే నా కెరీర్ ఏమౌతుందోననే భయం, అభద్రతాభావం నాకు లేవు. నా మరో చిత్రం 'రుద్ర'లో ట్రాన్స్‌జెండర్ పాత్ర చేస్తున్నాను. సవాల్ అనిపించే పాత్రలు చేయడం నాకు ఇష్టం'' అని చెప్పుకొచ్చారు.

నేల మీద నేను ఉన్నా...


● సోహైల్, వినాయక్ దేశాయ్

వినాయక్ దేశాయ్, అపర్ణా దేవీ హీరో హీరోయిన్లుగా రూపొందిన గ్రామీణ ప్రేమకథా చిత్రం 'రాధా మాధవం'. దాసరి ఇస్సాకు దర్శకత్వంలో గోనాల్ వెంకటేశ్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెలలోనే విడుదల కానుంది. ఈ చిత్రం నుంచి 'నేల మీద నేను ఉన్నా..' అంటూ సాగే ఫాస్ట్ మాస్ బీట్ సాంగ్‌ను బిగ్ బాస్ ఫేమ్ సోహైల్ విడుదల చేశారు. కొల్లి చైతన్య స్వరపరచిన ఈ పాటను వసంత్ వెంకట్ బాలా రాయగా వీఎం మహాలింగం, ఎంఎం మానసి ఆలపించారు.

నాలుగు కథలతో...


● మహేశ్, స్పందన

యడ్లపల్లి మహేశ్, స్పందన సోమన, కేశవ, రాజశేఖర్, చాందిని, సుదర్శన్ ముఖ్య తారలుగా నటించిన చిత్రం 'కరెన్సీ నగర్'. వెన్నెల కుమార్ పోతేపల్లి దర్శకత్వంలో ముక్కాముల అప్పారావు, డా. కోడూరు గోపాలకృష్ణ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 29న విడుదల కానుంది. ''ఈ చిత్రంలో డబ్బుకీ, మనిషికీ ఉన్న సంబంధాన్ని వెన్నెల కుమార్ చక్కగా చూపించారు. నాలుగు కథలతో ఈ చిత్రం సాగుతుంది'' అని యూనిట్ పేర్కొంది.

సాక్షి బిజినెస్

శుక్రవారం
15-12-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲ 930	నిఫ్టీ ▲ 256
70,514	21,183

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	14,805	▲ 75
డోజోన్స్	37,268	▲ 178
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,649	▲ 101
డాక్స్	16,752	▽ 14
షాంఘై	2,959	▽ 10
నికాయ్	32,686	▽ 240

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	62,396 ▲ 1,195
బంగారం (99.5 స్వచ్ఛత)	62,146 ▲ 1,190
వెండి (కిలో)	73,993 ▲ 3,095

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	82.90	83.92
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	104.24	106.80
€	యూరో	ఒకటి	89.83	92.19
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	56.67	57.96
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	55.12	57.06
S$	సింగపూర్ డాలర్	ఒకటి	61.38	63.37
SAR	సౌదీ రియాల్	ఒకటి	21.27	21.89
UAE D	యూఏఈ దిర్హామ్	ఒకటి	21.79	23.58
¥	చైనా యువాన్	ఒకటి	10.56	12.63

'డో జోన్స్ సస్టెయినబిలిటీ' సూచీలో డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: దేశీ ఫార్మా దిగ్గజం డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్ తాజాగా 2023కి గాను స్టాండర్డ్ అండ్ పూర్ డో జోన్స్ సస్టెయినబిలిటీ వరల్డ్ ఇండెక్స్ (డీజేఎస్ఐ వరల్డ్)లో చోటు దక్కించుకుంది. ఈ గుర్తింపు దక్కించుకున్న తొలి భారతీయ ఫార్మా కంపెనీ తమదేనని సంస్థ తెలిపింది. డీజేఎస్ఐ వరల్డ్‌లో కొత్తగా చోటు సాధించడంతో పాటు వరుసగా ఎనిమిదో సంవత్సరంలోనూ డీజేఎస్ఐ వర్ధమాన మార్కెట్ల (డీజేఎస్ఐ ఈఎం) సూచీలోనూ డాక్టర్ రెడ్డీస్ తన స్థానాన్ని పదిలపర్చుకుంది. మరోవైపు, అంతర్జాతీయ సస్టెయినబిలిటీ రేటింగ్స్ ఏజెన్సీ ఎకోవాడిస్ నుంచి 'గోల్డ్ మెడల్' హోదాను అందుకున్నట్లు సంస్థ తెలిపింది. 100 మార్కులకు గాను 70 మార్కులు దక్కించుకుంది. పర్యావరణ అనుకూల విధానాలతో పాటు పేషంట్లు, ఉద్యోగులు, గవర్నెన్స్ తదితర అంశాల్లో అత్యుత్తమ లక్ష్యాలను నిర్దేశించుకుని, ముందుకు సాగుతున్నట్లు ఈ సందర్భంగా కంపెనీ కో-చైర్మన్ జీవీ ప్రసాద్ తెలిపారు.

బీ న్యూ స్టోర్లలో రియల్‌మీ సీ67 5జీ స్మార్ట్ ఫోన్

హైదరాబాద్: మల్టీ బ్రాండ్ మొబైల్ రిటైల్ చైన్ బీ న్యూ మొబైల్స్-ఎలక్ట్రానిక్స్ స్టోర్లలో రియల్‌మీ సీ67 5జీ స్మార్ట్ ఫోన్ అందుబాటులోకి వచ్చింది. తెలుగు రాష్ట్రాల్లో 150కి పైగా బీ న్యూ షోరూంల్లో ఈ మోడల్ ఫోన్ లభిస్తుంది. హైదరాబాద్ మాదాపూర్‌లోని స్టోర్‌లో జరిగిన సమావేశంలో రియల్‌మీ సీ67 5జీ ఫీచర్లు, ఆఫర్ల గురించి సంస్థ సీఎండీ బాలాజీ చౌదరి, సీఈఓ సాయి నిఖిలేష్, ఎండీ సాయి నితేష్‌లు వెల్లడించారు.



ఈ స్మార్ట్ ఫోన్ రెండు వేరియంట్లలో లభిస్తుంది. 12జీబీ+ 256 జీబీ వేరియంట్ ధర రూ.52,999 కాగా.. 6జీబీ+ 128 వేరియంట్ ధర 14,999గా ఉంది. బజాజ్, హెచ్‌డీబీ, హెచ్‌డీఎఫ్‌సీ, టీవీఎస్, క్రెడిట్, బీనా, ఐడీఎఫ్‌సీ, క్లెవర్‌పే ద్వారా నెలవారీ వాయిదాలతో రియల్‌మీ సీ67 5జీ ఫోన్ పొందవచ్చన్నారు. కస్టమర్లంతా బీ న్యూ స్టోర్లను సందర్శించి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కంపెనీ ప్రతినిధులు కోరారు.

మార్కెట్‌కు 'ఫెడ్' జోష్..

- ఇంట్రాడే, ముగింపులో కొత్త రికార్డుల నమోదు
- కలిసొచ్చిన ఎఫ్ఐఐల వరుస కొనుగోళ్లు
- ఐటీ, ఫైనాన్స్, రియల్టీ, బ్యాంకింగ్ షేర్ల ర్యాలీ
- ఆల్ టైం హైకి ఇన్వెస్టర్ల సంపద



ముంబై: ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ వరుసగా మూడోసారి కీలక వడ్డీరేట్లను యథాతథంగా ఉంచడంతో పాటు వచ్చే ఏడాదిలో మూడు సార్లు వడ్డీరేట్ల కోత ఉండొచ్చని సంకేతాలివ్వడంతో గురువారం దేశీయ స్టాక్ మార్కెట్ ఒక శాతానికి పైగా ర్యాలీ చేసింది. విదేశీ ఇన్వెస్టర్ల కొనుగోళ్లు కొనసాగడం, క్రూడాయిల్ ధరలు దిగిరావడం సెంటిమెంట్‌ను మరింత బలపరిచాయి. ఫలితంగా ఐటీ, టెక్, టెలికం, ఫైనాన్స్, ఆయిల్ అండ్ గ్యాస్, ఇంధన షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో సెన్సెక్స్, నిఫ్టీలు తాజాగా సరికొత్త శిఖరాలకు చేరుకున్నాయి. సెన్సెక్స్ 930 పాయింట్లు పెరిగి 70,514 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 256 పాయింట్లు లాభపడి 21,183 వద్ద నిలిచింది. ఈ ముగింపులు సూచీలకు జీవితకాల గరిష్ట స్థాయిలు కావడం విశేషం.

ఇంట్రాడేలోనూ ఆల్‌టైం నమోదు

ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలోని సానుకూల సంకేతాలు అందిపుచ్చుకున్న స్టాక్ సూచీలు ఉదయం భారీ లాభాలతో మొదలయ్యాయి. సెన్సెక్స్ 561 పాయింట్లు పెరిగి 70,146 వద్ద, నిఫ్టీ 184 పాయింట్లు బలపడి 21,110 వద్ద ట్రేడింగ్ ప్రారంభించాయి. ఒక్క కన్జూమర్ డ్యూరబుల్స్ మినహా అన్ని రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో సూచీలు రోజంతా స్థిరమైన లాభాల్లో కదలాడాయి. ఈ క్రమంలో సెన్సెక్స్ 1018 పాయింట్లు ఎగసి 70,602 వద్ద, నిఫ్టీ 285 పాయింట్లు బలపడి 21,211 వద్ద ఆల్‌టైం గరిష్ట స్థాయిలను నమోదు చేశాయి.

''ఫెడరల్ రిజర్వ్ చైర్మన్ జెరోమ్ పావెల్ సరళతర ద్రవ్య విధాన అమలు యోచన వ్యాఖ్యలతో బాండ్ల నుంచి పెట్టుబడులు ఒక్కసారిగా ఈక్విటీల్లోకి మళ్లాయి. అందుకు సంకేతంగా అమెరికా బాండ్లపై రాబడులు అనూహ్యంగా 4% క్షీణించడం ఇన్వెస్టర్లకు మరింత విశ్వాసాన్నిచ్చింది. భారత జీడీపీ అవుట్‌లుక్ అంచనా పెంపు, ద్రవ్యోల్బణాన్ని లక్షిత స్థాయి(5.4%)కి కట్టడి చేసేందుకు ఆర్‌బీఐ నిర్ణయం తీసుకోవడం వంటి అంశాలు స్టాక్ సూచీలను సరికొత్త శిఖరాలకు చేర్చాయి. ప్రోత్సాహకర స్థూల ఆర్థిక గణాంకాల నమోదు, వచ్చే ఏడాది ద్వితీయార్థం నుంచి ఆర్‌బీఐ వడ్డీ రేట్లను తగ్గించవచ్చనే ఆశావహ అంచనాలతో స్టాక్ మార్కెట్ మరికొంత కాలం ర్యాలీ చేయొచ్చు'' అని మెహ్తా ఈక్విటీస్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ప్రశాంత్ తాప్సే తెలిపారు.

- సూచీల రికార్డు ర్యాలీతో బీఎస్ఈలో రూ.3.83 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది. దీంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ జీవితకాల గరిష్టం రూ.351.19 లక్షల కోట్లకు చేరింది.
- ఫెడ్ రిజర్వ్ వడ్డీ రేట్ల తగ్గింపు సంకేతాలు దేశీయ ఐటీ కంపెనీల షేర్లకు కలిసొచ్చింది. రుణ వ్యయాలు, ద్రవ్యోల్బణం తగ్గితే అమెరికా క్లయింట్లు చేసే ఐటీ కేటాయింపులు పెరుగుతాయి. దిగ్గజ ఐటీ ఇన్ఫోసిస్ 4%, టీసీఎస్ 2%, హెచ్‌సీఎల్‌టెక్ 3%, టెక్ మహీంద్రా, విప్రో 3.50%, కోఫోర్జ్ 6%, ఎల్‌అండ్‌టీ 3.50% చొప్పున లాభపడ్డాయి.

పసిడి, వెండి దూకుడు

- ట్రెజరీ బాండ్ల ఈల్డ్స్ డౌన్
- ఫెడ్ వడ్డీ రేట్లు యథాతథం



న్యూయార్క్: ప్రపంచ ఫైనాన్షియల్ మార్కెట్లను ప్రభావితం చేయగల యూఎస్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను యథాతథంగా ఉంచేందుకే మరోసారి కట్టుబడటంతో అటు స్టాక్స్, ఇటు పసిడి, వెండి, చమురు జంప్ చేశాయి. వరుసగా మూడోసారి యథాతథ పాలసీ అమలుకే ఫెడరల్ ఓపెన్ మార్కెట్ కమిటీ(ఎఫ్ఓఎంసీ) నిర్ణయించింది. దీంతో ఫెడ్ ఫండ్స్ రేట్లు 5.25–5.5 శాతం వద్దే కొనసాగనున్నాయి. వడ్డీ రేట్లకు కీలకమైన ద్రవ్యోల్బణం (సీపీఐ) ఫెడ్ లక్ష్యమైన 2 శాతానికిపైనే కొనసాగుతోంది. నవంబర్ నెలకు 3.1 శాతానికి చేరింది. అయితే యూఎస్ ఆర్థిక వ్యవస్థ మూడో త్రైమాసికంలో చూపిన వృద్ధిని వీడి బలహీనపడుతున్న సంకేతాలు వెలువడుతున్నట్లు ఫెడ్ చైర్మన్ జెరోమీ పావెల్ అభిప్రాయపడ్డారు. వెరసి వచ్చే ఏడాది(2024) కనీసం మూడుసార్లు వడ్డీ రేట్ల తగ్గింపు చర్యలుండవచ్చన్న అంచనాలు బలపడ్డాయి. ఫెడ్ రేట్లు 4.5–4.75కు దిగిరావచ్చని అంచనా. తాజా అంచనాల ప్రకారం 2023లో 2.6 శాతం వృద్ధి చూపేవీలున్న ఎకానమీ 2024లో 1.4 శాతానికి పరిమితం కావచ్చు. ద్రవ్యోల్బణం 2.4 శాతానికి తగ్గే వీలుంది. ఈ నేపథ్యంలో యూఎస్‌సహా ప్రపంచ స్టాక్ మార్కెట్లు, పసిడి, వెండి భారీగా ర్యాలీ చేశాయి. మరోపక్క ట్రెజరీ బాండ్ల ఈల్డ్స్ 2.2 శాతం తగ్గి 3.95 శాతానికి చేరాయి.

కమోడిటీలు జూమ్

న్యూయార్క్ కామెక్స్‌లో పసిడి ఔన్స్(31.1 గ్రాములు) 3 శాతం జంప్‌చేసి 2,055 డాలర్లకు చేరింది. వెండి ఔన్స్ 6.3 శాతం దూసుకెళ్లి 24.36 డాలర్లను అధిగమించింది. ఇక లండన్ మార్కెట్లో బ్రెంట్ చమురు 3.6 శాతం ఎగసి 76.9 డాలర్లకు, నైమెక్స్‌లో డబ్ల్యూటీఐ చమురు 3.8 శాతం బలపడి 72 డాలర్లను తాకింది. యూఎస్ స్టాక్ ఇండెక్స్ డోజోన్స్ బుధవారం 500 పాయింట్లు పుంజుకోగా.. గురువారం సెన్సెక్స్ 930 పాయింట్లు దూసుకెళ్లింది.

నవంబర్‌లో ఆహార ధరల భారం

- 'మైనస్' నుంచి 'ప్లస్'లోకి టోకు ధరలు
- 0.26 శాతంగా నమోదు



న్యూఢిల్లీ: ఏడు నెలల పాటు 'క్షీణత'లో (ప్రతి ద్రవ్యోల్బణం) ఉన్న టోకు ధరల సూచీ (డబ్ల్యూపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం నవంబర్‌లో 'ప్లస్'లోకి మారింది. ఎనిమిది నెలల గరిష్ట స్థాయిలో 0.25%గా నమోదయ్యింది. ఆహార ఉత్పత్తులు ప్రత్యేకించి ఉల్లి, కూరగాయల ధరల తీవ్రత దీనికి ప్రధాన కారణం. ఏప్రిల్‌లో ప్రతి ద్రవ్యోల్బణం బాటకు మారిన టోకు ద్రవ్యోల్బణం అక్టోబర్‌లో మైనస్ 0.52%గా నమోదయ్యింది. మార్చిలో టోకు ద్రవ్యోల్బణం 1.41%. ''2023 నవంబర్‌లో ద్రవ్యోల్బణానికి ప్రధానంగా ఆహార ఉత్పత్తులు, ఖనిజాలు, యంత్రాలు, పరికరాలు, కంప్యూటర్, ఎలక్ట్రానిక్స్, ఆప్టికల్ ఉత్పత్తులు, మోటారు వాహనాలు, ఇతర రవాణా పరికరాలు, తయారీ మొదలైన వాటి ధరల పెరుగుదల కారణం'' అని వాణిజ్య పరిశ్రమల శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది.

విస్తరణ బాటలో కియా ఇండియా

సోనెట్ ఎస్‌యూవీ లేటెస్ట్ వెర్షన్ ఆవిష్కరణ



న్యూఢిల్లీ: దక్షిణ కొరియా ఆటోమొబైల్ సంస్థ కియా భారత్‌లో తమ ఉత్పత్తి, సేల్స్ నెట్‌వర్క్, ఉత్పత్తుల శ్రేణిని వచ్చే ఏడాది మరింతగా విస్తరించే యోచనలో ఉంది. కొత్తగా మరో 100 సేల్స్ అవుట్‌లెట్స్‌ను ఏర్పాటు చేయడంతో పాటు స్థాపిత ఉత్పత్తి సామర్థ్యాన్ని లక్ష యూనిట్ల మేర పెంచుకోనుంది. కాంపాక్ట్ ఎస్‌యూవీ సోనెట్ లేటెస్ట్ వెర్షన్‌ను గురువారం అంతర్జాతీయంగా ఆవిష్కరించిన నేపథ్యంలో కియా ఇండియా ఎండీ టీ-జిన్ పార్క్ ఈ విషయాలు తెలిపారు. కంపెనీకి ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న ప్లాంటుకు ఏటా 3.4 లక్షల యూనిట్ల ఉత్పత్తి సామర్థ్యం ఉంది. 429 సేల్స్ అవుట్‌లెట్స్ ఉన్నాయి. వచ్చే ఏడాది కార్నివాల్ ఎంపీవీ కొత్త వెర్షన్‌ను భారత్‌లో ప్రవేశపెట్టనున్నట్లు పార్క్ తెలిపారు. ఆ తర్వాత సెల్టోస్ కన్నా పెద్ద మోడల్స్‌ను కూడా తీసుకొచ్చే యోచనలో ఉన్నట్లు చెప్పారు. 2025లో స్థానికంగా ఎలక్ట్రిక్ వాహనాల తయారీని పెద్ద ఎత్తున ప్రారంభించాక ఏటా కొత్త మోడల్స్‌ను ప్రవేశపెడతామని ఆయన పేర్కొన్నారు. 2030 నాటికి భారత ఎలక్ట్రిక్ వాహనాల మార్కెట్లో 15–17 శాతం వాటాను దక్కించుకోవాలని నిర్దేశించుకున్నట్లు వివరించారు.

మరిన్ని నగరాలకు ఫ్రెష్‌బస్ సర్వీసులు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: పూర్తి ఎలక్ట్రిక్ బస్సులతో ఇంటర్‌సిటీ సర్వీసులు నిర్వహించే ఫ్రెష్‌బస్ త్వరలో మరిన్ని నగరాలకు విస్తరించనుంది. వచ్చే 3–6 నెలల్లో విజయవాడ నుంచి విశాఖపట్నం, తిరుపతికి, హైదరాబాద్-రాజమండ్రి తదితర రూట్లలో సర్వీసులు ప్రవేశపెట్టనున్నట్లు సంస్థ వ్యవస్థాపకుడు, సీఈవో సుధాకర్ రెడ్డి చిర్రా తెలిపారు. ప్రస్తుతం హైదరాబాద్-విజయవాడ, బెంగళూరు-తిరుపతి మధ్య దాదాపు 40 సర్వీసులు నడుస్తున్నట్లు వివరించారు. ఇప్పుడు 20 బస్సులు ఉన్నాయని, 2025 మార్చి నాటికి వీటిని 170కి, 2027 నాటికి 1,000కి పెంచుకోనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యకలాపాల విస్తరణ కోసం రూ. 100 కోట్లు సమీకరించనున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటివరకు దాదాపు రూ. 23.5 కోట్లు ఇన్వెస్ట్ చేసినట్లు వివరించారు. ఆర్‌టీసీతో పోలిస్తే 25 శాతం తక్కువకే తమ సర్వీసులను అందిస్తున్నట్లు సుధాకర్ రెడ్డి చెప్పారు. బస్ టికెటింగ్ ప్లాట్‌ఫాం అభిబస్‌ను ఇక్సిగో సంస్థకు విక్రయించిన అనంతరం సుధాకర్ రెడ్డి ఫ్రెష్‌బస్‌ను ప్రారంభించారు.

సాక్షి స్పోర్ట్స్



నైట్‌రైడర్స్ కెప్టెన్‌గా శ్రేయస్ అయ్యర్

వచ్చే ఏడాది ఐపీఎల్ టి20 టోర్నీలో కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టుకు శ్రేయస్ అయ్యర్ కెప్టెన్‌గా వ్యవహరిస్తాడని ఫ్రాంచైజీ గురువారం ప్రకటించింది. 2023 ఐపీఎల్ సీజన్‌లో అయ్యర్ నాయకత్వంలో నైట్‌రైడర్స్ బరిలోకి దిగాల్సింది. అయితే వెన్ను నొప్పి కారణంగా అయ్యర్ మొత్తం ఐపీఎల్ టోర్నీకి దూరమయ్యాడు. దాంతో అతని స్థానంలో నితీశ్ రాణా జట్టుకు సారథిగా వ్యవహరించాడు. వచ్చే సీజన్‌లో నితీశ్ రాణా జట్టుకు వైస్ కెప్టెన్‌గా ఉంటాడు.

క్వార్టర్స్‌లో సుమీత్-సిక్కి రెడ్డి జోడీ

ఒడిశా మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్-100 బ్యాడ్మింటన్ టోర్నీ మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో సుమీత్ రెడ్డి-సిక్కి రెడ్డి (భారత్) జోడీ క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. కటక్‌లో గురువారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో సుమీత్-సిక్కి ద్వయం 21–14, 17–21, 21–14తో అశ్విని పొన్నప్ప-రోహన్ కపూర్ (భారత్) జంటపై విజయం సాధించింది.



జెమీమా | యస్తిక | దీప్తి శర్మ | శుభ

మన మహిళలు అదుర్స్

- తొలి రోజే భారత్ 410/7
- శుభ, జెమీమా, యస్తిక భాటియా, దీప్తి శర్మ అర్ధసెంచరీలు
- ఇంగ్లండ్‌తో ఏకైక టెస్టు

ముంబై: రెండేళ్ల విరామం తర్వాత టెస్టు మ్యాచ్ బరిలోకి దిగిన భారత మహిళల జట్టు అంచనాలకు మించి రాణించింది. ఇంగ్లండ్‌తో గురువారం ప్రారంభమైన నాలుగు రోజుల ఏకైక టెస్టులో మన బ్యాటర్లంతా ఒకరితో మరొకరు పోటీ పడి పరుగులు సాధించడంతో తొలి రోజే రికార్డు స్కోరు నమోదైంది. ఆట ముగిసే సమయానికి భారత్ 94 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 410 పరుగులు చేసింది. మహిళల టెస్టు క్రికెట్ చరిత్రలో ఒకే రోజు నమోదైన పరుగుల జాబితాను చూస్తే ఇది రెండో అత్యధిక స్కోరు కావడం విశేషం. శుభ సతీశ్ (76 బంతుల్లో 69; 13 ఫోర్లు), జెమీమా రోడ్రిగ్స్ (99 బంతుల్లో 68;), యస్తిక భాటియా (88 బంతుల్లో 66; 10 ఫోర్లు, 1 సిక్స్), దీప్తి శర్మ (95 బంతుల్లో 60 బ్యాటింగ్; 9 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీలు సాధించగా, కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (81 బంతుల్లో 49; 6 ఫోర్లు) త్రుటిలో ఆ అవకాశం చేజార్చుకుంది. ప్రస్తుతం దీప్తితో పాటు పూజ వస్త్రకర్ (4 బ్యాటింగ్) క్రీజ్‌లో ఉంది. డీవై పాటిల్ స్టేడియంలో జరుగుతున్న ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన భారత్ ముందుగా బ్యాటింగ్ ఎంచుకుంది. భారత్ తరఫున ముగ్గురు ప్లేయర్లు జెమీమా, రేణుకా సింగ్, శుభ సతీశ్ ఈ మ్యాచ్‌తో టెస్టు క్రికెట్‌లో అరంగేట్రం చేశారు. వీరిలో శుభకు ఇదే తొలి అంతర్జాతీయ మ్యాచ్ కూడా. ఓపెనర్లు షఫాలీ వర్మ (19), స్మృతి మంధాన (17) తక్కువ వ్యవధిలో వెనుదిరిగినా, ఆ తర్వాత భారత బ్యాటర్లు క్రీజ్‌లో పట్టుదలగా నిలబడ్డారు. కుదురుకున్న తర్వాత వేగంగా పరుగులు సాధించారు. మూడు భారీ భాగస్వామ్యాలతో జట్టును నడిపించారు. శుభ, రోడ్రిగ్స్ మూడో వికెట్‌కు 115 పరుగులు... యస్తిక, హర్మన్ ఐదో వికెట్‌కు 116 పరుగులు జోడించగా... దీప్తి, స్నేహ్ రాణా (73 బంతుల్లో 30; 5 ఫోర్లు) ఏడో వికెట్‌కు 92 పరుగులు జత చేయడం విశేషం.

స్కోరు వివరాలు

భారత్ తొలి ఇన్నింగ్స్: స్మృతి (బి) బెల్ 17; షఫాలీ (బి) క్రాస్ 19; శుభ (సి) సివర్ (బి) ఎకెల్‌స్టోన్ 69; జెమీమా (బి) బెల్ 68; హర్మన్‌ప్రీత్ (రనౌట్) 49; యస్తిక (సి) బెల్ (బి) డీన్ 66; దీప్తి (బ్యాటింగ్) 60; స్నేహ్ రాణా (బి) సివర్ 30; పూజ (బ్యాటింగ్) 4; ఎక్స్‌ట్రాలు 28; **మొత్తం (94 ఓవర్లలో 7 వికెట్లకు) 410. వికెట్ల పతనం:** 1–25, 2–47, 3–162, 4–190, 5–306, 6–313, 7–405. **బౌలింగ్:** కేట్ క్రాస్ 14–0–64–1, లారెన్ బెల్ 15–1–64–2, నాట్ సివర్ 11–4–25–1, లారెన్ 15–1–84–0, చార్లీ డీన్ 17–1–62–1, సోఫీ ఎకెల్‌స్టోన్ 22–4–85–1.

2 మహిళల టెస్టు క్రికెట్‌లో ఒకేరోజు సాధించిన అత్యధిక పరుగుల జాబితాలో భారత జట్టు రెండో స్థానం (410)లో నిలిచింది. 1935లో న్యూజిలాండ్‌పై ఇంగ్లండ్ ఒకే రోజు 431 పరుగులు సాధించింది. సొంతగడ్డపై భారత్‌కు ఇదే అత్యధిక స్కోరు కూడా.

దీపక్ హుడా 180... 'విజయ్ హజారే' ఫైనల్లో రాజస్తాన్

రాజ్‌కోట్: విజయ్ హజారే ట్రోఫీ దేశవాళీ వన్డే క్రికెట్ టోర్నీలో రాజస్తాన్ జట్టు ఫైనల్ చేరింది. కర్ణాటకతో గురువారం జరిగిన రెండో సెమీఫైనల్లో రాజస్తాన్ ఆరు వికెట్ల తేడాతో గెలిచింది. కర్ణాటక నిర్దేశించిన 283 పరుగుల లక్ష్యాన్ని రాజస్తాన్ 43.4 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. కెప్టెన్ దీపక్ హుడా (128 బంతుల్లో 180; 19 ఫోర్లు, 5 సిక్స్‌లు) భారీ సెంచరీతో రాజస్తాన్‌ను ఒంటిచేత్తో గెలిపించాడు. కరణ్ లాంబా (73 నాటౌట్; 7 ఫోర్లు)తో కలిసి దీపక్ నాలుగో వికెట్‌కు 255 పరుగులు జోడించడం విశేషం. అంతకుముందు కర్ణాటక 50 ఓవర్లలో 8 వికెట్లకు 282 పరుగులు చేసింది. శనివారం జరిగే ఫైనల్లో హరియాణాతో రాజస్తాన్ తలపడుతుంది.

సూర్య సూపర్ సెంచరీ

- చివరి టి20లో భారత్ ఘన విజయం
- 106 పరుగులతో దక్షిణాఫ్రికా చిత్తు
- కుల్దీప్ యాదవ్‌కు 5 వికెట్లు
- 1–1తో సమంగా ముగిసిన సిరీస్
- ఆదివారం తొలి వన్డే



సూర్య



కుల్దీప్

జొహన్నెస్‌బర్గ్: వాండరర్స్ మైదానంలో భారత్ విజయహాసం చేసింది. గత మ్యాచ్ ఓటమికి ప్రతీకారం తీర్చుకుంటూ భారీ విజయాన్ని నమోదు చేసింది. గురువారం జరిగిన చివరిదైన మూడో టి20 మ్యాచ్‌లో భారత్ 106 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాను చిత్తు చేసింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 201 పరుగులు చేసింది. ఫామ్‌లో ఉన్న కెప్టెన్, 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' సూర్యకుమార్ యాదవ్ (56 బంతుల్లో 100; 7 ఫోర్లు, 8 సిక్స్‌లు) మెరుపు శతకంతో చెలరేగాడు. ఓపెనర్ యశస్వి జైస్వాల్ (41 బంతుల్లో 60; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) కూడా రాణించాడు. అంతర్జాతీయ టి20ల్లో నాలుగో సెంచరీ సాధించిన సూర్య... రోహిత్ శర్మ, గ్లెన్ మ్యాక్స్‌వెల్‌లతో సమంగా నిలిచాడు. అనంతరం ఛేదనలో దక్షిణాఫ్రికా ఏ దశలోనూ ప్రభావం చూపలేకపోయింది. చివరకు ఆ జట్టు 13.5 ఓవర్లలోనే 95 పరుగులకే కుప్పకూలింది. డేవిడ్ మిల్లర్ (25 బంతుల్లో 35; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) టాప్ స్కోరర్ కాగా, మార్క్‌రమ్ (25) ఫర్వాలేదనిపించాడు. భారత స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ (5/17) తన కెరీర్‌లో అత్యుత్తమ బౌలింగ్ ప్రదర్శనతో ప్రత్యర్థిని పడగొట్టాడు. తొలి టి20 మ్యాచ్ వర్షం కారణంగా రద్దు కాగా... తాజా ఫలితంతో 1–1తో టి20 సిరీస్ సమంగా ముగిసింది. ఇరు జట్ల మధ్య మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా ఆదివారం తొలి మ్యాచ్ జరుగుతుంది.

సూర్య సిక్సర్ల జోరు...

టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు సరైన ఆరంభం లభించలేదు. గిల్ (12), తిలక్ వర్మ (0)లను వరుస బంతుల్లో కేశవ్ మహరాజ్ అవుట్ చేశాడు. అయితే మరో ఎండ్‌లో యశస్వి మాత్రం దూకుడు కనబరుస్తూ మార్క్‌రమ్ ఓవర్లో 2 ఫోర్లు, సిక్స్ బాదాడు. నాలుగో స్థానంలో వచ్చిన సూర్య తనదైన శైలిలో ఆరంభం నుంచి విరుచుకుపడటంతో స్కోరు వేగంగా దూసుకుపోయింది. పవర్‌ప్లే ముగిసేసరికి స్కోరు 62 పరుగులకు చేరింది. మధ్యలో కొంత నెమ్మదించిన యశస్వి 34 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. అనంతరం ఫెలుక్వాయో ఓవర్లో సూర్య చెలరేగిపోయాడు. వరుసగా 6, 4, 6, 6 కొట్టిన అతను 32 బంతుల్లో హాఫ్ సెంచరీని అందుకున్నాడు. మూడో వికెట్‌కు సూర్యతో 70 బంతుల్లోనే 112 పరుగులు జోడించిన అనంతరం యశస్వి వెనుదిరిగాడు. రింకూ సింగ్ (14) ఈసారి ప్రభావం చూపలేకపోగా, జితేశ్ (4), జడేజా (4) విఫలమయ్యారు. మరోవైపు సూర్య మాత్రం తన జోరు కొనసాగించాడు. బర్గర్ ఓవర్లో వరుస బంతుల్లో 4, 6, 4 బాదిన అతను షమ్సీ ఓవర్లోనూ 4, 6 కొట్టాడు. 55 బంతుల్లో సూర్య సెంచరీ పూర్తి కాగా, 20వ ఓవర్లో భారత్ 3 వికెట్లు కోల్పోయింది. చివరి 4 ఓవర్లలో టీమిండియాను కట్టడి చేయడంలో సఫలమైన సఫారీ టీమ్ 40 పరుగులే ఇచ్చింది.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: యశస్వి (సి) హెన్‌డ్రిక్స్ (బి) షమ్సీ 60; గిల్ (ఎల్బీ) (బి) మహరాజ్ 8; తిలక్ (సి) మార్క్‌రమ్ (బి) మహరాజ్ 0; సూర్యకుమార్ (సి) బ్రీట్‌కే (బి) విలియమ్స్ 100; రింకూ (సి) (సబ్) స్టబ్స్ (బి) బర్గర్ 14; జితేశ్ (హిట్‌వికెట్) (బి) విలియమ్స్ 4; జడేజా (రనౌట్) 4; అర్ష్‌దీప్ (నాటౌట్) 0; సిరాజ్ (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 201. వికెట్ల పతనం:** 1–29, 2–29, 3–141, 4–188, 5–194, 6–199, 7–199. **బౌలింగ్:** బర్గర్ 4–0–39–1, మార్క్‌రమ్ 1–0–15–0, కేశవ్ మహరాజ్ 4–0–26–2, విలియమ్స్ 4–0–46–2, ఫెలుక్వాయో 3–0–33–0, షమ్సీ 4–0–38–1.

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: హెన్‌డ్రిక్స్ (రనౌట్) 8; బ్రీట్‌కే (బి) ముకేశ్ 14; మార్క్‌రమ్ (సి) యశస్వి (బి) జడేజా 25; క్లాసెన్ (సి) రింకూ (బి) అర్ష్‌దీప్ 5; మిల్లర్ (బి) కుల్దీప్ 35; ఫెరీరా (బి) కుల్దీప్ 12; ఫెలుక్వాయో (సి) అండ్ (బి) జడేజా 0; మహరాజ్ (బి) కుల్దీప్ 1; బర్గర్ (ఎల్బీ) (బి) కుల్దీప్ 1; విలియమ్స్ (ఎల్బీ) (బి) కుల్దీప్ 0; షమ్సీ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 3; **మొత్తం (13.5 ఓవర్లలో ఆలౌట్) 95. వికెట్ల పతనం:** 1–4, 2–23, 3–42, 4–42, 5–75, 6–82, 7–89, 8–89, 9–94, 10–95. **బౌలింగ్:** సిరాజ్ 3–1–13–0, ముకేశ్ 2–0–21–1, అర్ష్‌దీప్ 2–0–13–1, జడేజా 3–0–25–2, తిలక్ 1–0–4–0, కుల్దీప్ 2.5–0–17–5.



భారత జట్టుకు నిరాశ

సెమీస్‌లో జర్మనీ చేతిలో ఓటమి

కౌలాలంపూర్: మూడోసారి జూనియర్ పురుషుల ప్రపంచకప్ హాకీ టోర్నమెంట్ టైటిల్ సాధించాలనుకున్న భారత జట్టుకు నిరాశ ఎదురైంది. ఆరుసార్లు ప్రపంచ చాంపియన్‌గా నిలిచిన జర్మనీ జట్టుతో గురువారం జరిగిన సెమీఫైనల్లో యువ భారత్ 1–4 గోల్స్ తేడాతో ఓడిపోయింది. భారత జట్టుకు సుదీప్ చిర్మాకో (11వ ని.లో) ఏకైక గోల్ అందించాడు. జర్మనీ జట్టు తరఫున బెన్ హాస్‌బాష్ (8వ ని.లో, 30+వ ని.లో) రెండు గోల్స్ చేయగా... పాల్ గ్లాండర్ (41వ ని.లో), ఫ్లోరియన్ స్పెర్లింగ్ (58వ ని.లో) ఒక్కో గోల్ సాధించారు. ఈ గెలుపుతో జర్మనీ జట్టు తొమ్మిదోసారి ఈ మెగా ఈవెంట్‌లో టైటిల్ పోరుకు అర్హత సాధించింది. భారత జట్టుకు సెమీఫైనల్లో ఏకంగా 12 పెనాల్టీ కార్నర్‌లు వచ్చినా ఒక్క దానిని కూడా సద్వినియోగం చేసుకోకుండా మూల్యం చెల్లించుకుంది.

డేవిడ్ వార్నర్ సెంచరీ



పెర్త్: టెస్టు కెరీర్‌లో చివరి సిరీస్ బరిలోకి దిగిన ఆస్ట్రేలియా ఓపెనర్ డేవిడ్ వార్నర్ అదరగొట్టాడు. పాకిస్తాన్‌తో గురువారం ప్రారంభమైన తొలి టెస్టులో వార్నర్ (211 బంతుల్లో 164; 16 ఫోర్లు, 4 సిక్స్‌లు) సెంచరీతో సత్తా చాటాడు. టెస్టుల్లో చాలా కాలంగా ఫామ్‌లో లేకపోయినా 'వీడ్కోలు సిరీస్' ఇవ్వడంపై వచ్చిన విమర్శలకు వార్నర్ తన 26వ సెంచరీతో సమాధానమిచ్చాడు. వార్నర్ జోరుతో మొదటి రోజు ఆట ముగిసే సమయానికి ఆసీస్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 84 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 346 పరుగులు సాధించింది. ఉస్మాన్ ఖ్వాజా (41), హెడ్ (40), స్మిత్ (31) ఫర్వాలేదనిపించగా... మార్ష్ (15 బ్యాటింగ్), కేరీ (14 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. ఈ ఇన్నింగ్స్‌తో హేడెన్ (8625), మైకేల్ క్లార్క్ (8643)లను దాటిన వార్నర్ ఆస్ట్రేలియా తరఫున అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్ల జాబితాలో ఐదో స్థానానికి (8651) చేరాడు.

క్లుప్తంగా...

విజయవాడలో సీబీఎస్ఈ ప్రాంతీయ కార్యాలయం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో, మొదటి దశలో 1,000 పాఠశాలలను సీబీఎస్ఈ సిలబస్‌కు అనుసంధానం చేశామని పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ తెలిపారు. సీబీఎస్ఈ సక్రమంగా అమలు చేసేందుకు, విధానపరమైన సమస్యల పరిష్కారం దిశగా బోర్డు సహకరించాలని ఆయన కోరారు. గురువారం విజయవాడలోని గవర్నర్‌పేటలో సీబీఎస్ఈ ప్రాంతీయ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. గత ఏడాది సీబీఎస్ఈ ప్రాంతీయ కార్యాలయం ఇబ్రహీంపట్నంలో ప్రారంభించగా, ఇప్పుడు విజయవాడలోని గవర్నర్‌పేట, స్టాలిన్ సెంట్రల్‌కు మార్చారు. కార్యక్రమంలో పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేశ్ కుమార్, సీబీఎస్ఈ రీజనల్ ఆఫీసర్ శేఖర్ చంద్ర, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ సాన్యం భరద్వాజ్, సీబీఎస్ఈ, మోడల్ స్కూల్ జాయింట్ డైరెక్టర్ ఎం.వి. కృష్ణారెడ్డి, హెడ్ ఆఫ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ వి.అరుణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ఈఎండీపీ కొనసాగింపు



ఒప్పంద పత్రాలను చూపుతున్న సురేశ్ కుమార్, ఈఎండీపీ ప్రతినిధులు

సాక్షి, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల్లో తొమ్మిదో తరగతి విద్యార్థులకు వ్యవస్థాపక మనస్తత్వాన్ని, ఆర్థిక నైపుణ్యాలతో సహా 21వ శతాబ్దపు నైపుణ్యాలను నేర్పించేందుకు ఎంటర్‌ప్రెన్యూరల్ మైండ్‌సెట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఈఎండీపీ) దోహదం చేస్తోందని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేశ్ కుమార్ తెలిపారు. రాష్ట్రంలో ఈ ప్రోగ్రామ్ మూడేళ్లుగా విజయవంతంగా కొనసాగుతోందన్నారు. దీన్ని మరో మూడేళ్ల పాటు అమలు చేసేందుకు ఉద్యమ్ లెర్నింగ్ ఫౌండేషన్, అఫ్లాటౌన్ ఇంటర్నేషనల్ సంస్థలతో ఒప్పందం చేసుకున్నారు. విజయవాడలోని సమగ్ర శిక్ష కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో కమిషనర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో నైపుణ్యాలను అభివృద్ధి చేయడంలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ అగ్రగామిగా ఉందని సంతోషం వ్యక్తం చేశారు. ఈ ఏడాది కూడా జిల్లా స్థాయిలో ఈఎండీపీ ఎక్స్‌పో–2024 నిర్వహించాలని డీఈఓలను కోరారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు, ఈఎండీపీ ప్రతినిధులు శ్యామ్, సూర్యనారాయణ్ పాల్గొన్నారు.

పేదల చదువులపై పిచ్చి ప్రేలాపనలు

- రామోజీరావు నడిపిస్తున్న రమాదేవి స్కూల్‌లో ట్యాబ్‌లు లేకుండానే విద్యా బోధన జరుగుతోందా?
- అక్కడి విద్యార్థులు వాడుతున్నప్పుడు పేదింటి పిల్లలు వాడితే తప్పెలా అవుతుంది?

సాక్షి, అమరావతి: పేద పిల్లలు విద్యలో ఉన్నతంగా రాణించాలని, అంతర్జాతీయ స్థాయిని అందుకోవాలన్న సమున్నత లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న ట్యాబ్‌లపైనా 'ఈనాడు' విషం చిమ్మింది. ఈ ట్యాబ్‌లు చాలా సురక్షితమైనవి. విద్యార్థుల మెదళ్లకు పదును పెట్టేలా పాఠ్యాంశాలు, విద్యా పరమైన కంటెంట్ మాత్రమే ఉంటుంది. దీనికి లాకింగ్ వ్యవస్థ కూడా ఉంటుంది. నిరంతర పర్యవేక్షణా ఉంటుంది. ఒకవేళ ఎవరైనా ఇతరత్రా విధానాలతో తప్పుగా వినియోగించినా లాక్ అయిపోతుంది. ఇంత సురక్షితమైన, పటిష్టమైన రక్షణ వ్యవస్థ ఉన్న ట్యాబ్‌లపై ఈనాడు పత్రికలో తప్పుడు ఆరోపణలతో పసి మనసులను కలుషితం చేసేలా దురుద్దేశపూరిత కథనం ప్రచురించడం రామోజీరావుకు మాత్రమే చెల్లింది. 'జగన్ బర్త్‌డే బహుమతి..చెడగొడుతోంది మతి!' అంటూ పేద పిల్లలకు ఏవేవో ఆపాదిస్తూ తప్పుడు కథనాన్ని ప్రచురించింది. మనసున్న ఏ మనిషీ ఇలా పసి మనసులపై విషం చిమ్మే ప్రయత్నం చేయరు. ఈ ఆధునిక యుగంలో అసలు ఏ సంస్థ అయినా, వ్యక్తులైనా విద్యార్థులకు అత్యాధునిక విద్యా పరికరాలను అందించవద్దని చెబుతారా? రామోజీరావు నడిపిస్తున్న రమాదేవి స్కూల్‌లో ట్యాబ్‌లు, అత్యాధునిక పరికరాలు లేకుండానే విద్యా బోధన జరుగుతోందా? అక్కడి విద్యార్థులు వాడుతున్నప్పుడు పేదింటి పిల్లలు వాడితే తప్పెలా అవుతుంది? సమాజంలో పిల్లలందరూ ఉన్నత స్థితికి చేరాలని ఎవరైనా కోరుకుంటారు.. ఒక్క రామోజీ తప్ప. ఆయన తన వర్గం, చంద్రబాబు మాత్రమే బాగుండాలని, మిగతా అందరూ తక్కువ స్థాయిలో ఉండాలన్న యావలో ఉంటారు. మరీ ముఖ్యంగా పేదలు బాగు పడుతుంటే చూడలేని కళ్లు అవి. పేదలు పేదలుగానే ఉండాలని, వారికి మంచి చదువులు అందకూడదన్నది ఆయన దృక్పథం. అందుకే ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం చదువులు ప్రవేశపెట్టినప్పుడు, టోఫెల్ శిక్షణ అమలు చేసినప్పుడు కూడా ఈనాడు ఇదే విధమైన వ్యతిరేక కథనాలు అచ్చేసింది. వైఎస్



జగన్ బర్త్‌డే బహుమతి...
చెడగొడుతోంది మతి!

జగన్ ప్రభుత్వం విద్యా రంగంలో తీసుకువస్తున్న విప్లవాత్మక సంస్కరణలపై నిత్యం తప్పుడు ప్రచారాలు, వక్రీకరణలు చేస్తోంది. వైఎస్ జగన్ ప్రభుత్వం దశాబ్దాల కాలంగా నిర్లక్ష్యానికి గురైన ప్రభుత్వ విద్యా రంగాన్ని సమూలంగా ప్రక్షాళన చేసి, దానికి మహర్దశ తీసుకువస్తోంది. ఇదే ఈనాడుకు కడుపుమంట. సంపన్నుల పిల్లలకు మాత్రమే వేలు, లక్షల రూపాయలు ఖర్చు చేస్తే అందే నాణ్యమైన విద్యను ప్రభుత్వం పేద విద్యార్థులకు ఉచితంగా అందిస్తున్నదనే ఏడుపు. అందుకే చీటికిమాటికి పేద పిల్లల విద్యపై తప్పుడు రాతలు రాస్తోంది.

ట్యాబ్స్‌కు పటిష్ట రక్షణ వ్యవస్థ

- విద్యార్థులు ట్యాబ్‌లను నిర్దేశిత పాఠ్యాంశాలకు తప్ప, విద్యేతర అంశాలకు వాటిని వినియోగించకుండా ప్రభుత్వం అనేక జాగ్రత్తలు తీసుకుంది. ప్రతి ట్యాబ్‌లోనూ మొబైల్ డివైస్ మేనేజ్‌మెంట్ (ఎండీఎం) ను పొందుపరిచింది. దీనివల్ల విద్యార్థులకు అవసరమైన 5 యాప్స్ మాత్రమే పనిచేస్తాయి. అంతేకాక నిర్వహణ, మరమ్మతుల విషయంలో కూడా విద్యాశాఖ స్పష్టమైన ఎస్‌ఓపీని నిర్దేశించుకుంది.
- ఎవరైనా ఉద్దేశపూర్వకంగా బలవంతంగా ట్యాబ్‌ను రీసెట్ చేసి, మరో యాప్ డౌన్‌లోడ్ చేసేందుకు యత్నిస్తే ఇంటర్నెట్ కనెక్టయిన వెంటనే ఆ ట్యాబ్ లాక్ అయిపోతుంది. దీన్ని అన్‌లాక్ చేయాలంటే సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాత్రమే చేయగలుగుతారు. వారు కూడా గూగుల్ అథంటికేటర్‌తో వారికి వచ్చిన ఓటీపీ ద్వారా మాత్రమే తిరిగి ఓపెన్ చేయగలరు.
- ట్యాబ్స్ నిర్వహణలో మూడంచెల రక్షణ వ్యవస్థను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ట్యాబ్స్‌లో లోపాలు వస్తే సరిచేయడానికి ప్రతి పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులకు సాంకేతిక శిక్షణ ఇచ్చారు. హార్డ్‌వేర్ సమస్యలను సరిదిద్దేలా గ్రామ/వార్డు సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్‌కు శిక్షణ ఇచ్చారు. లోపాలు ఉన్న ట్యాబ్‌ను విద్యార్థి లేదా తల్లిదండ్రులు సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్‌కు అందజేస్తే రసీదు ఇచ్చి మూడు రోజుల్లో వాటిని బాగుచేసి తిరిగి ఇస్తున్నారు. ఇంత పటిష్టమైన రక్షణ వ్యవస్థ, నిర్వహణ వ్యవస్థ ఉన్న ట్యాబ్‌లపై పిచ్చి ప్రేలాపనలు రామోజీ తప్ప మరెవరూ చేయలేరు.

పునశ్చరణ, మెరుగైన బోధన కోసం ట్యాబ్‌లు

ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు ప్రపంచ స్థాయి పోటీని తట్టుకునేలా మలచడంతోపాటు మెరుగైన విజ్ఞానం పొందేందుకు ట్యాబ్‌లను ఇవ్వాలన్నది సీఎం వైఎస్ జగన్ ఆకాంక్ష. అందు కోసమే 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. విద్యార్థులు పాఠాలను సులభంగా అర్థం చేసుకునేందుకు, పునశ్చరణకు, మెరుగైన బోధనలో భాగంగా వీటిని పంపిణీ చేస్తున్నారు. ఇవి వారికి ఇంటర్ వరకు ఉపయోగపడతాయి. 2021–22 విద్యా సంవత్సరంలో 8వ తరగతి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు బైజూస్ కంటెంట్‌తో 5.18 లక్షల ట్యాబ్‌లను గతేడాది డిసెంబర్ 21న ప్రభుత్వం పంపిణీ చేసింది. ఈ ఏడాది కూడా మరో 4.35 లక్షల ట్యాబ్‌లను ఈ నెలలో సరఫరా చేస్తోంది. గత ఏడాది ట్యాబ్‌ల పంపిణీ కోసం రూ.660 కోట్లను ఖర్చు చేసింది. పిల్లలు పాఠాలు నేర్చుకునేందుకు వీలుగా బైజూస్ యాప్ డిక్షనరీ, సందేహాల నివృత్తికి మరో యాప్, ఏపీ ఈ–పాఠశాల యాప్‌లను ట్యాబుల్లో ఇన్‌స్టాల్ చేసి విద్యార్థులకు, టీచర్లకు ఇచ్చారు. ఈ ఏడాది నుంచి విద్యార్థులు వారికి ఇష్టమైన విదేశీ భాషను నేర్చుకునేందుకు డ్యులింగో యాప్‌ను అదనంగా చేర్చారు. దేశవ్యాప్తంగా ఏ పోటీ పరీక్షనైనా ఎదుర్కొనేందుకు వీలుగా విద్యార్థులు సన్నద్ధమయ్యేందుకు ఈ ట్యాబ్స్‌ను అందించారు. ఇప్పటికే ఎన్ఎంఎంఎస్ జాతీయ పరీక్షల్లో చాలామంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. వారికి ఏటా రూ.12 వేల చొప్పున నాలుగేళ్లపాటు మెరిట్ స్కాలర్‌షిప్ లభిస్తోంది. విద్యార్థులు ఆన్‌లైన్‌లో చదువుకోవాలంటే చాలా ఎక్కువ సిలబస్ ఉంటుంది. దీనివల్ల విద్యార్థులు నేర్చుకునేందుకు చాలా సమయం పడుతుంది. దీనికోసం నిష్ణాతులైన ఉపాధ్యాయులతో కంటెంట్ తయారు చేసి ట్యాబ్స్‌లో అప్‌లోడ్ చేశారు.

పేద పిల్లల భవిష్యత్తుపై దెబ్బ కొట్టే రాతలు సహించం

- మరో 25 ఏళ్లు అధికారంలో ఉంటాం
- మరెన్నో సంస్కరణలు తెస్తాం.. విద్యార్థులకు మేలు చేస్తాం
- విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ట్యాబ్‌లు ఇస్తుంటే కొన్ని మీడియా సంస్థలు వక్రబుద్ధితో లేనివి ఆపాదించి తప్పుడు రాతలు రాస్తున్నాయని విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ మండిపడ్డారు. పేదింటి పిల్లలు ప్రగతి సాధిస్తుంటే వారి భవిష్యత్తుపై దెబ్బ కొట్టే రాతలను సహించబోమని హెచ్చరించారు. తల్లిదండ్రులను ఆందోళనకు గురి చేసే వార్తలు ప్రచురించడం దారుణమైన చర్య అని అన్నారు. మంత్రి గురువారం విజయవాడలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులకు ప్రభుత్వం ఇస్తున్న ట్యాబ్‌లపై ఈనాడు పత్రికలో ప్రచురించిన కథనంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. పేద పిల్లలైన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రతిభను మెరుగు పరుచుకుని, చదువుల్లో ఉన్నతంగా రాణించాలన్న లక్ష్యంతో వైఎస్ జగన్ నేతృత్వంలోని ప్రభుత్వం ట్యాబ్‌లు అందిస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టినప్పుడు, టోఫెల్ అమలు చేసినప్పుడు ఇదే పత్రిక వ్యతిరేక కథనాలు ఇచ్చిందని చెప్పారు. ప్రభుత్వంపై కోపం ఉంటే మరో రకంగా చూపాలేగానీ, ఇలా పేద పిల్లలపై చూపడం దిగజారిన పాత్రికేయానికి నిదర్శనమని అన్నారు. విద్యారంగంలో ఎక్కడా ట్యాబ్‌లు ఉపయోగించడంలేదా? ట్యాబ్‌లు ఇవ్వొద్దని ఏ తల్లిదండ్రులు కోరారో ఈనాడు చెప్పాలన్నారు. రామోజీరావు కొడుకు, మనవలు ట్యాబ్‌లు, కంప్యూటర్లు ఉపయోగించాలి గానీ పేదవాళ్లు ఉపయోగించకూడదా అని ప్రశ్నించారు. ఎల్లో మీడియా ఓ వర్గం రాజకీయ ప్రయోజనాలు, స్వార్థం కోసం పేద పిల్లలను బలిచేయాలనుకోవడం ఇదేం పాత్రికేయం అని ప్రశ్నించారు. రాష్ట్రంలో పత్రికా స్వేచ్ఛ దుర్వినియోగం అవుతోందని అన్నారు. ఈనాడు పనికిమాలిన పత్రికగా మంత్రి బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు.

21న ట్యాబ్‌ల పంపిణీ

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ఈ నెల 21న ప్రభుత్వ పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న 4.35 లక్షల మంది విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తామని మంత్రి బొత్స చెప్పారు. ఐదేళ్ల వారంటీతో గత ఏడాదికంటే మెరుగైన పరిజ్ఞానంతో ఇంటర్మీడియట్ వరకు ఉపయోగపడేలా వీటిని రూపొందించినట్లు తెలిపారు.

అవి బైజూస్ ట్యాబ్స్ కావు.. ఒక్క రూపాయి ఖర్చు కాలేదు

ఈనాడు పేర్కొన్నట్టు అవి బైజూస్ ట్యాబ్‌లు కావని మంత్రి చెప్పారు. కేవలం బైజూస్ కంటెంట్ ఉచితంగా అప్‌లోడ్ చేసి ఇచ్చామని, ఈనెల 21న ఇవ్వనున్న ట్యాబ్స్‌లోనూ ఇదే విధానం పాటించామని తెలిపారు. కంటెంట్ కోసం బైజూస్‌కి ప్రభుత్వం ఒక్క రూపాయి చెల్లించలేదని, అలాంటప్పుడు అవినీతి జరిగిందని ఎలా ఆరోపిస్తారని ప్రశ్నించారు. ట్యాబ్‌ల ఖర్చంతా ప్రభుత్వమే భరించిందన్నారు. పిల్లలకిచ్చిన ట్యాబ్‌లలో ఎడ్యుకేషన్ కంటెంట్ కాకుండా మరేవీ రాకుండా లాకింగ్ సిస్టమ్ ఉందని, ఎన్ని గంటలు వాడుతున్నారో కూడా తెలుస్తుందన్నారు. ఎక్కడైనా తప్పుగా వినియోగించినా ఆ సమాచారం తెలిసేలా ఏర్పాట్లు చేశామన్నారు.

విద్యపై అవగాహన లేని సెలబ్రిటీ పార్టీ

రాష్ట్రంలో విద్యా సంస్కరణలు, విద్యా పథకాలపై కనీస అవగాహన లేకుండా సెలబ్రిటీ పార్టీ నాయకులు మాట్లాడుతున్నారని జనసేన నాయకులనుద్దేశించి మంత్రి బొత్స అన్నారు. అమ్మ ఒడి, విద్యా కానుక పథకాలను ఏ ప్రాతిపదికన ప్రభుత్వం అందిస్తుందో కూడా వారికి తెలియడంలేదన్నారు. సీబీఎస్ఈ పరీక్షలు ఎప్పుడు జరుగుతాయో, ఎవరు రాస్తారో తెలుసుకోకుండా నాదెండ్ల మనోహర్ మాట్లాడుతున్నారన్నారు. విద్యా కానుక ప్రభుత్వ బడుల్లో ఎంతమంది చదివితే అందరికీ (42 లక్షలు) అందిస్తామని, అమ్మ ఒడి తల్లుల అకౌంట్‌లో ఒక విద్యార్థికి మాత్రమే జమ చేస్తామని చెప్పారు. ఈ ఏడాది ప్రభుత్వ స్కూళ్లలో ఎనిమిదో తరగతి నుంచి సీబీఎస్ఈ అమల్లోకి వచ్చిందని, ఈ విద్యార్థులు 2025 మార్చిలో సీబీఎస్ఈ పరీక్షలు రాస్తారని వివరించారు. గత నాలుగున్నరేళ్లలో విద్యా సంస్కరణలకు దాదాపు రూ.60 వేల కోట్లు తమ ప్రభుత్వం ఖర్చు చేసిందని, ఇందులో కేంద్రం ఇచ్చింది రూ.6 వేల కోట్లు మాత్రమేనన్నారు. ఇది కూడా తెలియకుండా మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. తాము మరో 25 ఏళ్లు అధికారంలో ఉంటామని, పేద విద్యార్థులకు ఏటా ట్యాబ్‌లు ఇస్తామని, విద్యా సంస్కరణలు అమలు చేస్తామని, విద్యార్థులకు మేలు చేస్తామని స్పష్టం చేశారు.

విద్యార్థులకు ట్యాబ్‌లు ఇస్తే అశుద్ధ రాతలా?

- రామోజీపై ఏపీఈడబ్ల్యూఐడీసీ చైర్మన్ నాగార్జున యాదవ్ ఫైర్
- పెత్తందారుల్ని, కుల దురహంకారుల్ని తరిమికొట్టే రోజు వస్తుంది



సాక్షి, అమరావతి: బైజూస్ కంటెంట్, ట్యాబ్‌లపై ఈనాడు రామోజీరావు తన పత్రికలో అశుద్ధమైన రాతలు రాశారని ఏపీఈడబ్ల్యూఐడీసీ (ఏపీ ఎడ్యుకేషన్, వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) చైర్మన్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి యనమల నాగార్జున యాదవ్ మండిపడ్డారు. విద్యా వ్యవస్థలో సీఎం వైఎస్ జగన్ వినూత్నమైన, విప్లవాత్మక మార్పులు తెచ్చారని.. ఇందులో భాగంగా పేద విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తే తప్పేంటని ఆయన ప్రశ్నించారు. బడుగు, బలహీన వర్గాల మీద కడుపుమంటతో రామోజీ విషం చిమ్ముతున్నారన్నారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం నాగార్జున యాదవ్ మీడియాతో మాట్లాడారు. ఆయన ఏమన్నారంటే..

కుల దురహంకారంతో రామోజీ విషం

రామోజీకి కూడా మనవళ్లు, మనవరాళ్లు, చంద్రబాబు మనవడు.. పవన్‌కళ్యాణ్ కుమారులు, కూతుర్లు అడ్వాన్స్‌డ్ ల్యాప్‌టాప్‌లు, మ్యాక్‌బుక్‌లు, ఐప్యాడ్‌లు, ట్యాబ్‌లు వాడుతున్నారు కదా.. వారంతా విజ్ఞానం కోసం ట్యాబ్‌లు, ల్యాప్‌టాప్‌లు వాడుతుంటే, మరి మా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థులు మాత్రం వాటిల్లో పోర్న్ వీడియోలు చూస్తున్నారని అంటారా? ఎంత ద్వేషం, ఎంత కుల దురహంకారంతో విషం కక్కుతున్నారో అర్థమవుతోంది. ఇది పెత్తందారీతనం కాదా రామోజీ? బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థులకు సీఎం జగన్ సుమారుగా 5.50 లక్షల ట్యాబ్‌లు ఇచ్చారు. దీనిపై రామోజీ బహిరంగ చర్చకు రావాలి. ఏ విద్యార్థులు ఎటువంటి వీడియోలు చూస్తున్నారు.. ఏ విద్యార్థులు విజ్ఞానానికి సంబంధించినవి కాకుండా వేటికి వాడుకున్నారో రామోజీ చెప్పాలి. తన మనవళ్లందరికీ ట్యాబ్ సౌకర్యం ఉందో.. లేదో.. కూడా రామోజీ సమాధానం చెప్పాలి. కేవలం సీఎం జగన్ మీద విషప్రచారం చేయాలనే ఉద్దేశంతో మాత్రమే ఇలాంటి చెత్త వార్తలు రాస్తున్నారు. పెత్తందారులకు బడుగు, బలహీనవర్గాల వారంతా బుద్ధిచెప్పాలి. వారందరినీ తరిమికొట్టే రోజు వస్తుంది.

నిరుద్యోగ రేటు తగ్గినా చెత్తరాతలేనా?

చంద్రబాబు హయాంలో నిరుద్యోగ రేటు 5.3శాతం ఉంటే, సీఎం జగన్ హయాంలో అది 4.1 శాతానికి తగ్గింది. బాబు హయాంలో కంటే నిరుద్యోగ రేటు తగ్గితే కూడా చెత్త రాతలు రాస్తారా.. నిజం రాస్తే జర్నలిజం అంటారు.. అదే అబద్ధం రాస్తే ఏమంటారో రామోజీ చెప్పాలి. అలాగే, సీఎం జగన్ ఇచ్చిన ఆరు లక్షల ఉద్యోగాలు ఎక్కడ.. బాబు ఇచ్చిన 34 వేల ఉద్యోగాలెక్కడ? అలాగే, అవినీతి, నిరుద్యోగంలో చంద్రబాబుది నంబర్ వన్ పాలన.

పేదల చదువుపై విషం చిమ్ముతున్న రామోజీ


మంత్రి మేరుగు నాగార్జున



చీమకుర్తి: చంద్రబాబును అందలం ఎక్కించాలనే ఉద్దేశంతో రామోజీరావు జర్నలిజం ముసుగులో సీఎం వైఎస్ జగన్‌పైనా, ఆయన ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలపైనా, ముఖ్యంగా పేదల చదువుపైనా తప్పుడు రాతలు రాస్తున్నారని మంత్రి మేరుగు నాగార్జున మండిపడ్డారు. సంతనూతలపాడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తగా నియమితులైన తర్వాత ఆయన తొలిసారిగా గురువారం రాత్రి చీమకుర్తిలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రి నాగార్జున మాట్లాడుతూ సీఎం జగన్ విద్యావ్యవస్థలో తీసుకొస్తున్న విప్లవాత్మక సంస్కరణలకు దేశవ్యాప్తంగా ప్రశంసలు వస్తుంటే రామోజీ మాత్రం విషం చిమ్ముతున్నారని ధ్వజమెత్తారు. చంద్రబాబు, రామోజీ, పవన్‌కళ్యాణ్, లోకేశ్ పిల్లలు ట్యాబ్‌ల ద్వారానే ఇంగ్లిష్ నేర్చుకున్న విషయాన్ని మరిచిపోయి అడ్డగోలు రాతలు రాస్తున్నారన్నారు. 2024లో గెలుపే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభ్యర్థుల మార్పులు, చేర్పులు చేస్తున్నారని స్పష్టం చేశారు. 'సీఎం జగన్ మాట మా పార్టీలో ఎవరికైనా వేదవాక్కు. ఆయన మాటే మాకు ప్రామాణికం' అని స్పష్టం చేశారు.

బాబుకు మతి భ్రమించింది

- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



సాక్షి ప్రతినిధి, నెల్లూరు: ప్రతి నిత్యం పిచ్చి ప్రేలాపనలు చేస్తూ.. ఆత్మస్తుతి పరనిందతో బతుకుతున్న చంద్రబాబు నాయుడు ఓ మహానటుడని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. నెల్లూరులోని తన క్యాంప్ కార్యాలయంలో గురువారం మంత్రి కాకాణి విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబుకు మతిభ్రమించిందన్నారు. పోలవరం ప్రాజెక్టును తానే డిజైన్ చేసినట్లుగా రోత మాటలు మాట్లాడుతున్నారని, తొమ్మిదేళ్ల పాటు సీఎంగా ఉన్న ఆయన పోలవరం ప్రాజెక్టును ఎందుకు పక్కనబెట్టారని ప్రశ్నించారు. పోలవరం ప్రాజెక్టుకు దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి శంకుస్థాపన చేస్తే.. ప్రస్తుతం ఆయన తనయుడు, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో పూర్తికానుందని స్పష్టంచేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ముందస్తు ఆదేశాలతో ఆస్తి, ప్రాణనష్టం జరగకుండా మిచాంగ్ తుపానును సమర్థంగా ఎదుర్కొన్నామన్నారు. తుపానుతో కలిగిన నష్టాన్ని కేంద్రం బృందం పరిశీలిస్తున్నదని తెలిపారు. బాబు హయాంలో రుణమాఫీ పేరుతో రూ.87,612 కోట్ల మేర రైతులను మోసం చేశారని అన్నారు. బాబు హయాంలో ఎంత నిధులు తెచ్చి కరువు మండలాల్లో రైతులకు అందజేశారో చెప్పే ధైర్యం ఉందా... అని ప్రశ్నించారు.

ఏ పద్ధతిలో అభ్యర్థుల్ని ఎంపిక చేస్తానో చెప్పను

టీడీపీ అధినేత చంద్రబాబు



సాక్షి, అమరావతి: ఏ పద్ధతిని అనుసరించి అభ్యర్థుల్ని ఎంపిక చేస్తాననేది ముందే చెప్పనని టీడీపీ అధినేత చంద్రబాబు తెలిపారు. సరైన సమయంలో సరైన వారినే ఎంపిక చేస్తానన్నారు. మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో గురువారం చంద్రబాబు మీడియాతో మాట్లాడారు. 150 మంది అభ్యర్థులను మార్చినా వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలవదన్నారు. తన రాజకీయ జీవితంలో ఇంత ప్రజా వ్యతిరేకత ఉన్న ప్రభుత్వాన్ని చూడలేదని, ఎప్పుడు ఎన్నికలు వస్తాయా అని.. ప్రజలు ఎదురు చూస్తున్నారని చెప్పారు. 175కు 175 స్థానాలు గెలుస్తామన్న సీఎం.. ఇప్పుడు ఏకంగా ఒకేసారి 11 మందిని మార్చారని, రాజకీయ నాయకుల్ని ట్రాన్స్‌ఫర్ చేయడం ఇక్కడే చూస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరి భవిష్యత్తు ఈ ఎన్నికలపైనే ఆధారపడి ఉందని తెలిపారు. మిచాంగ్ తుపాను రాష్ట్ర రైతాంగాన్ని కనీవినీ ఎరుగని విధంగా నష్టపరిచిందని చెప్పారు.

టీడీపీతో సయోధ్యతో ఉండే వారికే టికెట్లు

జనసేన అధినేత పవన్ కళ్యాణ్



సాక్షి, అమరావతి: టీడీపీతో సయోధ్యతో ప్రయాణం చేసే వారికే టికెట్లు కేటాయించడంలో ప్రాధాన్యత ఇస్తామని జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ తమ పార్టీ నేతలకు స్పష్టం చేశారు. గురువారం మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో నేతలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పుడు టికెట్ ఆశించేవారు వ్యక్తిగతంగా 10 వేల నుంచి 15 వేల ఓట్ల వరకు తెచ్చుకోవాల్సి ఉంటుందన్నారు. తాను జీరో బడ్జెట్ పాలిటిక్స్ చేస్తానన్నది వాస్తవం కాదని, ఎన్నికల కమిషనే రూ.40 లక్షలు ఖర్చు చేయవచ్చని చెబుతుంటే.. తాను జీరో బడ్జెట్ పాలిటిక్స్ చేస్తానని ఎలా చెబుతానని ప్రశ్నించారు. '2019 ఎన్నికల్లో ఉదారతతో కొంత మందికి పార్టీ టికెట్ ఇచ్చాం. ఈసారి అలా జరగదు. గట్టి నేతలకే టికెట్లు ఇస్తాం. రాబోయే ఎన్నికల్లో టీడీపీ పొత్తుతో ఎన్నికలకు వెళ్తున్న తరుణంలో ప్రతి సీటు ముఖ్యమే.' అని తెలిపారు. ప్రాంతీయ పార్టీలు.. కేంద్రంలో అధికారంలో ఉండే ఏదో ఒక జాతీయ పార్టీతో కలిసి ఉండక తప్పదని చెప్పారు. తాను బీజేపీతో కలిశానని తనను ముస్లింలు నమ్మడం లేదన్నారు. 'నేను బీజేపీతో ఉన్నా, మీ వైపు మాత్రమే పవన్ కళ్యాణ్ ఉంటాడు' అని గుర్తు పెట్టుకోండన్నారు.

చంద్రయాన్.. పార్లమెంట్ కేక్‌లు



చంద్రయాన్ నమూనా కేక్

నేటి నుంచి ప్రదర్శన ప్రారంభం

బెంగళూరు సెయింట్ జోసెఫ్ హైస్కూల్‌లో ఏటా మాదిరిగా ఈసారి కూడా నూతన సంవత్సరం కేక్ ఉత్సవం జరగనుంది. శుక్రవారం నుంచి ఈ ప్రదర్శన ప్రారంభంకానుంది. చంద్రయాన్–3 ప్రాజెక్టు, నూతన పార్లమెంటు, నిలువెత్తు చాముండేశ్వరి అమ్మవారు, శివాజీ మహారాజు... ఇంకా అనేక ఆకృతులు కేక్‌ల రూపంలో తయారుకానున్నాయి. నోరూరించే కేక్ కళాకృతులకు కళాకారులు సొబగులు అద్దుతున్నారు.

– బెంగళూరు



కొత్త పార్లమెంటు నమూనా కేక్

పేదల ఇళ్లకు ఆర్థిక సహకారమందించండి

- గృహనిర్మాణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకానికి అవసరమైన ఆర్థిక సహాయం అందించాలని రాష్ట్ర ప్రభుత్వ గృహనిర్మాణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ ఆర్థిక సంస్థలకు, లెండింగ్ సంస్థలకు విజ్ఞప్తి చేశారు. అంతర్జాతీయ సంస్థ హ్యాబిటేట్ ఫర్ హ్యూమానిటీ ఇండియా, విలేజ్ రీకన్‌స్ట్రక్షన్ ఆర్గనైజేషన్ సహకారంతో రాష్ట్రంలో అఫర్డబుల్ హౌసింగ్‌పై గురువారం విజయవాడలోని రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు.అజయ్‌జైన్ మాట్లాడుతూ..పేదలకు ఇళ్లు నిర్మిస్తున్న జగనన్న కాలనీల్లో రోడ్లు, నీటి సౌకర్యం, విద్యుదీకరణ, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాల కోసం



మాట్లాడుతున్న అజయ్‌జైన్

ప్రభుత్వం రూ. 35 వేల కోట్లు ఖర్చు చేస్తుందని తెలిపారు. ప్రభుత్వం 22 లక్షల ఇళ్లను మంజూరు చేసిందని, రూ. 33 వేల కోట్ల రూపాయలు మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో హ్యాబిటేట్ హ్యూమానిటీ ఇండియా నేషనల్ డైరెక్టర్ జేమ్స్ శామ్యూల్,రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ జాయింట్ మేనేజింగ్ మేనేజింగ్ డైరెక్టర్ శివ ప్రసాద్, రిటైర్డ్ ఐఏఎస్, విలేజ్ రీకన్‌స్ట్రక్షన్ ఆర్గనైజేషన్ గవర్నింగ్ బాడీ చైర్మన్ డి. చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు అంటేనే కుట్రలు, వెన్నుపోట్లు

వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ పోతుల సునీత



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పోతుల సునీత

ఒంగోలు: చంద్రబాబు పేరు వింటే ప్రజలకు గుర్తుకొచ్చేది కుట్రలు, దగా, వెన్నుపోట్లు మాత్రమేనని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ పోతుల సునీత ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు పాలనాకాలంలో ఆయన ఆస్తులు మాత్రమే పెరిగాయని, రాష్ట్రం, ప్రజల ఆస్తులు కాదని చెప్పారు. విభజన తర్వాత 2014–19 వరకు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు రాష్ట్ర సంపదను ఎందుకు పెంచలేదని ప్రశ్నించారు. ఇప్పుడు మళ్లీ తనను గెలిపిస్తే సంపదను సృష్టిస్తానని ప్రజలను మభ్య పెట్టేందుకు కల్లబొల్లి మాటలు చెబుతున్నారని మండిపడ్డారు. చంద్రబాబు 2014 ఎన్నికల సమయంలో 650కి పైగా హామీలు ఇచ్చి ఒక్కటీ సక్రమంగా నెరవేర్చలేదన్నారు. కేవలం తాము దోచుకున్న ఆస్తులను కాపాడుకునేందుకు చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేశ్ ఆరాటపడుతున్నారని, రాష్ట్రం అభివృద్ధిని ఏమాత్రం కాంక్షించడం లేదని ప్రజలు గమనించాలని కోరారు. సీఎం వైఎస్ జగన్ పేదల అభ్యున్నతే లక్ష్యంగా పాలన సాగిస్తున్నారని, మేనిఫెస్టోను 99.5శాతం అమలు చేశారని చెప్పారు. మోసపూరిత మాటలు, హామీలతో మరోసారి వంచించేందుకు ప్రయత్నిస్తున్న చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడుకి 2024 ఎన్నికల్లో తగినబుద్ధి చెప్పేందుకు ప్రజలు కంకణబద్ధులు కావాలన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు తమ్మినేని మాధవి, మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దారా పద్మజ, కార్యదర్శి బైరెడ్డి అరుణ, రీజనల్ కో–ఆర్డినేటర్ బడుగు ఇందిర తదితరులు పాల్గొన్నారు.

23న తిరుమలలో 'అఖండ పారాయణం'

తిరుమల: డిసెంబర్ 23న వైకుంఠ ఏకాదశి, గీతా జయంతిని పురస్కరించుకుని తిరుమల నాదనీరాజనం వేదికపై సంపూర్ణ భగవద్గీత అఖండ పారాయణం, శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి భగవద్గీతలోని 18 అధ్యాయాల్లో 700 శ్లోకాలను పారాయణం చేస్తారు. సాయంత్రం 6 గంటల నుంచి శ్రీ విష్ణు సహస్రనామ పారాయణం నిర్వహిస్తారు. ఇందులో ధర్మగిరి వేద పాఠశాల, ఎస్వీ వేద వర్సిటీ అధ్యాపకులు, ఎస్వీ ఉన్నత వేద అధ్యయన సంస్థకు చెందిన వేద పారాయణదారులు, రాష్ట్రీయ సంస్కృత వర్సిటీకి చెందిన శాస్త్రీయ పండితులు, టీటీడీ వేదపండితులు, శ్రీ అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారులు పాల్గొంటారు. ఈ కార్యక్రమాన్ని ఎస్వీబీసీ ప్రత్యక్ష ప్రసారం చేయనుంది.

పుత్తూరు మున్సిపాలిటీ 4వ వార్డు కౌన్సిలర్ ఎన్నిక రద్దు

పుత్తూరు సబ్ కోర్టు జడ్జి తీర్పు

పుత్తూరు(తిరుపతి జిల్లా): పుత్తూరు మున్సిపాలిటీలోని నాలుగో వార్డు నుంచి కౌన్సిలర్‌గా టీడీపీ తరఫున గెలుపొందిన కేశవాచారి ఎన్నికను రద్దు చేస్తూ స్థానిక సబ్ కోర్టు తీర్పునిచ్చింది. మళ్లీ వార్డు కౌన్సిలర్ పదవికి ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించింది. ఈ కేసు వివరాలు.. 2021 మార్చి 10వ తేదీన పుత్తూరు మున్సిపాలిటీ ఎన్నికలు జరిగాయి. మొత్తం 27 వార్డులు ఉండగా, 22 స్థానాల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధించింది. టీడీపీ ఐదు స్థానాలకు పరిమితమైంది. అయితే, నాలుగో వార్డు నుంచి గెలుపొందిన టీడీపీ అభ్యర్థి కేశవాచారికి ముగ్గురు పిల్లలు ఉన్నారని, కౌన్సిలర్ పదవికి ఆయన అనర్హుడని అదే వార్డులో వైఎస్సార్ సీపీ తరఫున పోటీ చేసిన పి.ఏకాంబరం 2021లోనే పుత్తూరు సబ్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ఎలక్షన్ ఓపీ 1/2021 నంబర్‌పై కేసు నమోదైంది. ఈ కేసు విచారణ అనంతరం కేశవాచారికి ముగ్గురు పిల్లలు ఉన్నందున మున్సిపల్ యాక్ట్ సెక్షన్ 13బీ ప్రకారం అతను కౌన్సిలర్ పదవికి అనర్హుడని, ఎన్నిక చెల్లదని బుధవారం సాయంత్రం స్థానిక సబ్ కోర్టు జడ్జి సీఎస్ రాఘవేంద్ర తీర్పు చెప్పారు. దీంతో పుత్తూరు మున్సిపాలిటీలో టీడీపీ సభ్యుల సంఖ్య నాలుగుకు తగ్గిపోయింది.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943